అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 04-10-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 | సంచిక : 276 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50

కులవివక్షకు స్వస్తి పలకాలి
జైళ్లలో ఖైదీలందరినీ సమానంగా చూడాలి

కులం ఆధారంగా పనుల కేటాయింపు అమానవీయం

జైలు మాన్యువల్స్‌లో నిబంధనలు తక్షణమే సవరించాలి

రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు

3లో..




మూసీ ముసుగెందుకు?
ఫాం హౌజ్‌లు కాపాడుకోవటానికే బీఆర్ఎస్ నేతల పాట్లు

మోడీ చేస్తే ఓకే...మేము చేస్తే తప్పా? : ఈటలకు సీఎం రేవంత్‌రెడ్డి సూటి ప్రశ్న

జవహర్‌నగర్‌లో భూములిచ్చేందుకైనా సిద్ధమే...

ఫ్యామిలీ ఐడీ, డిజిటల్ కార్డు పైలెట్ ప్రాజెక్ట్ ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి స్పష్టీకరణ



హైడ్రాపై అసెంబ్లీలో చర్చిస్తే మాట్లాడకుండా బీఆర్ఎస్ సభ్యులు పారిపోయారని సీఎం రేవంత్ రెడ్డి విమర్శించారు. కేవలం ఆ పార్టీ నాయకుల ఫాంహౌజ్‌లను కాపాడుకునేందుకే పేదలను ముందుకు నెట్టి మూసీ ముసుగేసుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలు నిరంతరం మూసీ కాలుష్యంతోనే బతకాలా? ఆత్మగౌరవంతో జీవించొద్దా? అని ప్రశ్నించారు. మూసీ పరివాహక ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆక్రమణలు చేసి 100 గజాలకు రూ.10 లక్షల చొప్పున అమ్మారనీ, ఇప్పుడు కొనుక్కున్న వారంతా వారి చొక్కాలు పట్టుకుంటారని భయపడుతున్నారని ఎద్దేవా చేశారు.

అక్రమ నిర్మాణాలు కూల్చాల్సిందే

బాధితులకు పరిహారంపై అఖిలపక్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆక్రమణలు తొలగించకుంటే ఏదో ఒక రోజు భారీ వరదలకు హైదరాబాద్ మునిగిపోదా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. హైదరాబాద్ నాశనం కావాలని కోరుకుంటున్నారా? అని ప్రశ్నించారు. పేదలకు మేలు చేసేందుకే తమ ప్రభుత్వం ఉందని స్పష్టం చేశారు. ఇండ్ల కూల్చివేతల్లో పేదలు, మధ్యతరగతి బాధలు ప్రభుత్వానికి తెలుసని చెప్పారు. అనుమతి లేకుండా ఆక్రమణదారుల చేతుల్లో మోసపోయిన వారికి న్యాయం చేయాల్సి ఉందని తెలిపారు. అదే విధంగా జవహర్ నగర్‌లో వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమి ఉందనీ, ఆ భూమిని పేదలకిద్దామా? అంటూ బీఆర్ఎస్ నాయకులకు ప్రశ్నలు వేశారు. హైదరాబాద్‌ను ప్రమాదం బారి నుంచి కాపాడేందుకే కూల్చివేతలను కొనసాగించి తీరుతామని స్పష్టం చేశారు. అదే సమయంలో నిర్వాసితులకు న్యాయం చేసేందుకు ఏం చేయాలో చర్చించేందుకు సిద్ధమన్నారు. అందు కోసం అఖిలపక్ష సమావేశం ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. సచివాలయానికి రావాలని బీఆర్ఎస్ నాయకులను ఆహ్వానించారు. నాలుగు రోజులైనా విరామం లేకుండా పరిష్కారం దొరికే వరకు కూర్చుని చర్చించేందుకు తాము సిద్ధమని తేల్చి చెప్పారు.


గురువారం హైదరాబాద్‌లోని సిక్ విలేజ్ హాకీగ్రౌండ్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఫ్యామిలీ ఐడీ, ఫ్యామిలీ డిజిటల్ కార్డుల పైలెట్ ప్రాజెక్టు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరదల నుంచి హైదరాబాద్‌ను కాపాడేందుకు తాము ప్రయత్నిస్తుంటే కిరాయి మనుషులతో బీఆర్ఎస్ అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. తొడుక్కునేందుకు చెప్పులు లేని దశ నుంచి బీఆర్ఎస్ తమ ఖాతాలో రూ.1,500 కోట్లకు ఎగబాకిందని తెలిపారు. పేదలపై నిజంగా ప్రేమ ఉంటే రూ.500 కోట్లు ఇవ్వాలన్నారు. మూసీ పరివాహక ప్రాంతంలో 12 వేల ఇండ్లుంటే 15 వేల మందికి ఇండ్లు, రూ.25 వేలు తక్షణ సాయం ఇచ్చేందుకు నిర్ణయించినట్టు తెలిపారు. డబుల్ బెడ్‌రూం కన్నా మంచిదేముంటదో చెప్పాలని బీఆర్ఎస్ నాయకులను ప్రశ్నించారు.

జన్వాడలో కేటీఆర్, అజీజ్‌నగర్‌లో హరీశ్‌రావు ఫాంహౌజ్‌లతో పాటు సబితా ఇంద్రారెడ్డి ముగ్గురు కుమారుల ఫాంహౌజ్‌లు, కేవీపీ రాంచందర్ రావు విల్లాలను కూలగొట్టొద్దా? నల్లచెరువు, సున్నం చెరువు, మూసీ పరివాహక ప్రాంతాల్లో బీఆర్ఎస్ నాయకులు ఆక్రమించుకుని అమ్ముకోలేదా? మూసీని అడ్డం పెట్టుకుని ఎక్కువ కాలం తప్పించుకోలేరని తెలిపారు. ఒక్కొక్కరి భరతం పడతానని హెచ్చరించారు. అడ్డుకునే వారికి సంచులొస్తాయే తప్ప ఆక్రమణలు తొలగించే వారికి కాదన్నారు.

మోడీ చేస్తే ఒకేనా.. మేం చేస్తే తప్పా?

గుజరాత్‌లో సబర్మతీ ప్రక్షాళన చేపట్టిన ...5లో

మత స్వేచ్ఛ క్షీణిస్తోంది
మైనారిటీలపై పెరుగుతున్న దాడులు, వేధింపులు



ఆజ్యం పోస్తున్న నేతల వ్యాఖ్యలు, ప్రభుత్వ విధానాలు

బుల్డోజర్ న్యాయాన్ని అనుసరిస్తున్న పాలకులు

భారత్‌పై అమెరికా కమిషన్ తాజా నివేదిక

న్యూఢిల్లీ : భారతదేశంలో మతపరమైన స్వేచ్ఛ క్షీణిస్తోందని అమెరికా ప్రతినిధుల సభకు చెందిన ద్వైపాక్షిక సలహా సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. అంతర్జాతీయ మత స్వేచ్ఛపై ఏర్పడిన అమెరికా కమిషన్ (యూఎస్‌సీఐఆర్‌ఎఫ్) గాంధీజీ జయంతి రోజున మన దేశానికి సంబంధించి తాజా నివేదికను విడుదల చేసింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో భారత్‌కు చెందిన ప్రముఖ నాయకులు రెచ్చగొట్టే ప్రసంగాలు చేశారని, ముస్లింలు, క్రైస్తవులపై దాడులు పెరగడానికి ప్రభుత్వ విధానాలు ఆజ్యం పోశాయని కమిషన్ వేలెత్తి చూపింది.

ముస్లింలు, క్రైస్తవులపై దాడులు

ఈ సంవత్సరం జనవరి-మార్చ్ నెలల మధ్యకాలంలో క్రైస్తవులపై 161 హింసాత్మక ఘటనలు జరిగాయని అమెరికా కమిషన్ తన నివేదికలో ప్రస్తావించింది. వీటిలో ఒక్క ఛత్తీస్‌గఢ్‌లోనే 47 సంఘటనలు చోటుచేసుకున్నాయని గుర్తు చేసింది. బలవంతపు మత మార్పిడులు చేస్తున్నారన్న ఆరోపణలపై ఉత్తరప్రదేశ్‌లో జూన్, జూలై ...13లో

ఐదేండ్లలో 200 రైలు ప్రమాదాలు



గాలిలో కలిసిన 351 మంది ప్రాణాలు

17 రైల్వే డివిజన్ల నుంచి సేకరణ : రైల్వేశాఖ నివేదిక

వివరాలు 3లో

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి
సన్న వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్

48 గంటల్లో రైతుల ఖాతాల్లో జమ 13లో..

రైతులను మోసం చేసే వారిపై కఠిన చర్యలు : జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

రైల్వే ఉద్యోగులకు బోనస్



చెన్నై మెట్రో ఫేజ్-2కు పచ్చజెండా

ఎడిబుల్ ఆయిల్స్, నూనెగింజల జాతీయ మిషన్‌కు ఆమోదం

ఐదు భాషలకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదా : కేంద్రమంత్రివర్గం ఆమోదం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రైల్వే ఉద్యోగులకు 78 రోజుల పాటు ఉత్పాదకత లింక్డ్ బోనస్ (పీఎల్బీ)ను కేంద్రమంత్రివర్గం ఆమోదించింది. రైల్వే సిబ్బంది అద్భుతమైన పని తీరుకు గుర్తింపుగా ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన గురువారం జరిగిన కేంద్ర మంత్రివర్గంలో 11,72,240 మంది రైల్వే ఉద్యోగులకు రూ.2028.57 కోట్లు చెల్లించేందుకు నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ ఏడాది అర్హత ఉన్న ఒక్కో రైల్వే ఉద్యోగికి గరిష్ఠంగా రూ.17,951 చెల్లించనున్నారు. ప్రతి సంవత్సరం దుర్గాపూజ, దసరా సెలవులకు ముందు అర్హులైన రైల్వే ఉద్యోగులకు పీఎల్బీని చెల్లిస్తారు.

2020-21 నుంచి 2025-26 వరకు మేజర్ పోర్ట్‌లు, డాక్ లేబర్ బోర్డ్ ఉద్యోగులు, వర్కర్ల కోసం ప్రస్తుతం ఉన్న ఉత్పాదకత లింక్డ్ రివార్డ్ ...5లో



పేదోళ్ల భూముల జోలికి రావొద్దు
నాడు పట్టాలిస్తామని హామీలిచ్చి.. నేడు ఉన్న భూమి గుంజుకుంటున్నరు

ఓట్లప్పుడు గల్లీ గల్లీ తిరిగినవ్..గద్దెనెక్కినాక ఢిల్లీలో కూర్చున్నవ్

రాహుల్ గాంధీ ఇప్పటికైనా స్పందించు 5లో..

ఫార్మాసిటీ పేరుతో భూములు గుంజుకుంటే ఊరుకోం

డప్పూర్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు

కేసీఆర్ బతికే ఉన్నారా ?
పదవీకాంక్షతో ఆయనను కేటీఆర్ ఏదో చేసే ఉంటారు



కేసీఆర్ కనిపించడం లేదంటూ గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తాం : గజ్వేల్ పర్యటనలో కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ మరోసారి సంచలన వ్యాఖ్యలు

నవతెలంగాణ- గజ్వేల్

"రాష్ట్ర ప్రతిపక్ష నేత కేసీఆర్ అసలు బతికే ఉన్నారా..? పదవీ కోసం పాకులాడుతున్న కేటీఆర్.. ఫామ్‌హౌస్‌లో ఆయనను ఏదో చేసే ఉంటారు.." అంటూ మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ మరోసారి కేటీఆర్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. గురువారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నూతన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి ఆమెతో పాటు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పదవుల కోసం కేటీఆర్, హరీశ్‌రావు ఏమైనా చేస్తారని అన్నారు. బడ్జెట్ రోజు అసెంబ్లీకి వచ్చిన కేసీఆర్ ఆ తర్వాత బయట కనిపించడం లేదని, ఫామ్‌హౌస్‌లో ఏం చేస్తున్నారో తెలియదని ...13లో

ఎవరిపైనా వ్యక్తిగత ద్వేషం లేదు 13లో..

మనోభావాలు దెబ్బ తీయడం మా ఉద్దేశం కాదు : మంత్రి కొండా సురేఖ

ఇజ్రాయిల్ మారణకాండను వ్యతిరేకిద్దాం
7న జిల్లా కేంద్రాల్లో వామపక్షాల నిరసన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గాజాలో ఇజ్రాయిల్ మారణకాండకు పాల్పడి ఈనెల ఏడో తేదీ నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా వామపక్ష పార్టీల రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆ రోజు నిరసన దినం పాటించాలని కేంద్ర వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. అందులో భాగంగా రాష్ట్రంలోని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని తెలంగాణ వామపక్ష పార్టీలు ప్రకటించాయి. ఈ మేరకు తమ్మినేని వీరభద్రం (సీపీఐ(ఎం)), కూనంనేని ...13లో

ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేయాలి
అలైన్‌మెంట్‌ను 40 కిలోమీటర్లకు మార్చాలి



సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి డిమాండ్

ఇందిరాపార్కు వద్ద భూనిర్వాసితుల ఐక్యవేదిక ధర్నా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాదు

ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ట్రిపుల్ ఆర్ భూనిర్వాసితుల ఐక్యవేదిక అధ్యక్షులు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రైతులు ధర్నా నిర్వహించారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రత్యామ్నాయంగా భూమితో పాటు ఆర్థిక ...6లో

దలాల్ స్ట్రీట్ పై బాంబు
రూ.11 లక్షల కోట్ల సంపద ఆవిరి

సెన్సెక్స్ 1800 పాయింట్ల మేర నష్టం

బేరుమన్న సెన్సెక్స్ - బోరుమన్న మదుపర్లు

ఎన్నికల తర్వాత అతిపెద్ద పతనం 6లో..



హక్కులపై ఉక్కుపాదం
మీడియాపై మోడీ సర్కార్ నిఘా

- పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కుల అణచివేత
- ఈ చర్యలకు వ్యతిరేకంగా ప్రతిఘటనను బలోపేతం చేయాలి : సీనియర్ జర్నలిస్టులు



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

మీడియా హక్కులను మోడీ సర్కార్ కాలరాస్తోందని సీనియర్ జర్నలిస్టులు విమర్శించారు. మీడియాను మోడీ ప్రభుత్వం వేటాడుతోందని, నిఘా పెంచిందని వివరించారు. మీడియా స్వేచ్ఛ, ప్రజాస్వామ్య హక్కులను అణచివేసే మోడీ ప్రభుత్వ విధానానికి వ్యతిరేకంగా ప్రతిఘటనను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సీనియర్ జర్నలిస్టు, న్యూస్ క్లిక్ చీఫ్ ఎడిటర్ ప్రబీర్ పుర్కాయస్థను అరెస్టు చేసి ఏడాది పూర్తైన సందర్భంగా గురువారం స్థానిక ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా (పీసీఐ)లో స్వతంత్ర జర్నలిజంపై దాడిని ఖండిస్తూ డీయూజే, పీసీఐ, ఐడబ్ల్యూపీసీ, ప్రెస్ అసోసియేషన్, కేయూడబ్ల్యూజే సంయుక్త ఆధ్వర్యంలో నిరసన సభ నిర్వహించారు. 'న్యూస్‌క్లిక్' పోర్టల్‌పై పుర్కాయస్థ అరెస్ట్, ప్రొసీడింగ్స్‌ను పాటించకుండా మీడియాపై మోడీ ప్రభుత్వం ప్రధాన దృష్టిని కేంద్రీకరించిందని 'ది వైర్' వ్యవస్థాపక ఎడిటర్ సిద్ధార్థ్ వరదరాజన్ అన్నారు. 2017లో ఎన్డీటీవీ ప్రమోటర్లపై సీబీఐ కేసుతో, మోడీ ప్రభుత్వం స్పష్టంగా మీడియా వేట ప్రారంభించిందని తెలిపారు. కేంద్ర విధానాలపై విమర్శించే సాహసం చేసిన ఏకైక జాతీయ ఛానల్ ఎన్డీటీవీ మాత్రమే అని అన్నారు. ఎన్డీటీవీని అదానీ తన సొంతం చేసుకున్న తరువాత సీబీఐ కేసును మూసివేసిందని ఆయన తెలిపారు. దారుణ సెక్షన్లతో కూడిన బ్రాడ్‌కాస్ట్ బిల్లును కేంద్రం ప్రస్తుతానికి ఉపసంహరించుకున్నప్పటికీ, దానిని తిరిగి తీసుకురావడానికి ఇంకా అవకాశం ఉందని అన్నారు.

'న్యూస్‌క్లిక్'లో ఢిల్లీ పోలీసులు జరిపిన దాడిలో స్వాధీనం చేసుకున్న వందలాది ఎలక్ట్రానిక్ మెటీరియల్స్ తిరిగి రాలేదని న్యూస్ క్లిక్ వ్యవస్థాపక చీఫ్ ఎడిటర్ ...13లో

ఢిల్లీలో దారుణం

- డాక్టర్‌ను కాల్చి చంపిన యువకులు

న్యూఢిల్లీ : దేశ రాజధాని న్యూఢిల్లీలో చికిత్స కోసం వెళ్లిన యువకులు డాక్టర్‌ను కాల్చి చంపారు. కలింది కుంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..జైత్‌పూర్‌లో ఉన్న నీమా ఆసుపత్రికి గాయాలతో ఇద్దరు వ్యక్తులు వెళ్లారు. డ్రెస్సింగ్ చేసిన తర్వాత డాక్టర్‌ను కలవాలని పట్టుబట్టారు. దీంతో ఆసుపత్రి సిబ్బంది నిందితులకు డాక్టర్ అప్పాయింట్‌మెంట్ ఇచ్చారు. ఆ వెంటనే క్యాబిన్‌లోకి వెళ్లిన దుండగులు డాక్టర్‌ను కాల్చి చంపారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. నిందితులు ఆసుపత్రి నుంచి బయటకు వెళ్తున్న దృశ్యాలు సిసిటివిలో రికార్డు అయినట్లు తెలిపారు. మరణించిన వైద్యుడిని యూనాని ప్రాక్టీషనర్ జావెద్ అక్తర్‌గా గుర్తించారు. నిందితులను గుర్తించేందుకు సిసిటివి ఫుటేజీని స్వాధీనం చేసుకొని పరిశీలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితులు చూడటానికి మైనర్లుగా కనిపిస్తున్నారని, వీరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశామని చెప్పారు. దీనిపై ఆమ్‌ఆద్మీ పార్టీ నేత, మంత్రి సౌరభ్ భరద్వాజ్ మాట్లాడుతూ లెఫ్టినెంట్ గవర్నరు ఎల్‌జి వికె సక్సేనా కారణంగానే ఢిల్లీలో నేరాలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ప్రాంతంలో శాంతిభద్రతలను పరిరక్షించడంలో సక్సేనా పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు.

మళ్లీ పెరిగిన వెల్లుల్లి ధర



చెన్నై : దిగుమతులు తగ్గడంతో వెల్లుల్లి ధరలు మళ్లీ పెరిగాయి. మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పంజాబ్, హర్యానా తదితర రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని దిండుగల్‌లో కొండ వెల్లుల్లి సాగు చేస్తుంటారు. ప్రతియేడాది ఖరీఫ్ సీజన్‌లో జూన్, జులైలో సాగు ప్రారంభించి సెప్టెంబరులో కోత చేపడుతుంటారు. ఈ నేపథ్యంలో, ఆయా రాష్ట్రాల్లో వర్షాలు, నీటి కొరత కారణంగా వెల్లుల్లి దిగుబడులు తగ్గాయి. దీంతో కోయంబేడు మార్కెట్‌కు వెల్లుల్లి దిగుమతి తగ్గడంతో మొదటి రకం వెల్లుల్లి కిలో రూ.350, రెండో రకం రూ.300, మూడో రకం కిలో రూ.260 ఉంది. విజయదశమి, దీపావళి పండగల నేపథ్యంలో, వీటి ధరలు మరింత పెరిగే అవకాశముందని వ్యాపారులు పేర్కొంటున్నారు.





ఏచూరి ఆశయ సాధనకు ఉద్యమిద్దాం


లెఫ్ట్‌ఫ్రంట్ ఘన నివాళి

కొల్‌కతా : కమ్యూనిస్టు యోధుడు, ఇటీవల కన్నుమూసిన సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరికి పశ్చిమ బెంగాల్‌లోని లెఫ్ట్‌ఫ్రంట్ ఆధ్వర్యంలో ప్రజానీకం గురువారం ఘన నివాళులర్పించింది. కొల్‌కతాలోని ప్రమోద్ దాస్‌గుప్తా భవన్‌లో లెఫ్ట్‌ఫ్రంట్ చైర్మెన్ బిమన్ బసు అధ్యక్షతన జరిగిన సంతాపం సభలో ఏచూరి సేవలను కొనియాడారు.

ఏచూరి నమ్మిన సిద్ధాంతం కోసం, ఆయన ఆశయ సాధన కోసం జీవితాంతం పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తామని ఈ సందర్భంగా సభకు హాజరైన వారు ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సమన్వయ కర్త ప్రకాష్ కరత్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎండి సలీం, వామపక్షాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ నోరు జారిన కంగనా రనౌత్

- జాతిపిత అంటూ ఎవరూ లేరని గాంధీ జయంతి రోజే ట్వీట్



న్యూఢిల్లీ : వివాదస్పద బిజెపి ఎంపి, నటి కంగనా రనౌత్ మరోమారు నోరు జారారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కొత్త వివాదాన్ని లేవదీశారు. లాల్ బహదూర్ శాస్త్రి 120వ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తూ, జాతిపితగా మహాత్ముని స్థాయిని కించపరిచేలా ఆమె పోస్టు పెట్టారు. "జాతిపిత అంటూ ఎవరూ లేరు, వున్నదల్లా పుత్రులే, వీరందరూ భరతమాత పుత్రులు' అని ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దేశంలో పరిశుభ్రతపై మహాత్ముని వారసత్వాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు తీసుకెళుతున్నారని ఆ తర్వాత మరో పోస్టులో పేర్కొన్నారు. కాగా, గాంధీపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలంటూ కంగనా పోస్టులపై కాంగ్రెస్ నేత సుప్రియా శ్రినెట్ తీవ్రంగా విమర్శించారు. 'గాడ్సే అభిమానులు బాపూ, శాస్త్రీజీల మధ్య తేడాల గురించి చెబుతున్నారు. ఈ కొత్త గాడ్సే భక్తురాలిని నరేంద్ర మోడీగా మనస్ఫూర్తిగా క్షమిస్తారా? జాతి పిత వున్నారు. పుత్రులు వున్నారు, అమరులు వున్నారు, ప్రతి ఒక్కరికీ గౌరవం దక్కాల్సిందే.' అని సుప్రియా శ్రినెట్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పంజాబ్‌కి చెందిన మరో సీనియర్ బిజెపి నేత మనోరంజన్ కలియా కూడా రనౌత్ తాజా వ్యాఖ్యలను విమర్శించారు. వివాదాస్పద ప్రకటనలు చేయడం ఆమెకు అలవాటుగా మారిందన్నారు.

బీరుట్ నడిబొడ్డున దాడి

- 9మంది మృతి, 14మందికి గాయాలు
- హిజ్బుల్లా ఇంటెలిజెన్స్ హెడ్‌క్వార్టర్స్‌పై దాడి చేశామన్న ఇజ్రాయిల్
- మరో దాడిలో ఇద్దరు లెబనాన్ సైనికులు మృతి
- దాడి చేస్తే చర్యలు తప్పవన్న ఇరాన్

బీరుట్, గాజా : సెంట్రల్ బీరుట్‌లో ఇజ్రాయిల్ జరిపిన వైమానిక దాడిలో గురువారం 9మంది మరణించారు. 14మంది గాయపడ్డారు. వీరందరూ ఆరోగ్య సహాయ కార్యకర్తలని అధికారులు తెలిపారు. గత 24గంటల్లో లెబనాన్‌లో మొత్తంగా 28మంది ఆరోగ్య సంరక్షణ కార్యకర్తలు మృతి చెందారని డబ్ల్యుహెచ్‌ఓ చీఫ్ గురువారం చెప్పారు. బాంబు దాడుల కారణంగా చాలామంది కార్యకర్తలు విధులకు హాజరు కాకుండా ఆ ప్రాంతాల నుండి పారిపోయారని డైరెక్టర్ జనరల్ టెడ్రోస్ అదనామ్ ఆన్‌లైన్ మీడియా సమావేశంలో చెప్పారు. గత మూడు రోజుల్లో ఇజ్రాయిల్ దాడుల్లో 40మందికి పైగా సహాయక సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది మరణించారని లెబనాన్ ఆరోగ్య మంత్రి చెప్పారు. బీరుట్‌లో హిజ్బుల్లా ఇంటెలిజెన్స్ ప్రధాన కార్యాలయంపై గురువారం దాడి చేసినట్లు ఇజ్రాయిల్ మిలటరీ తెలిపింది. కమాండ్ సెంటర్లు, తీవ్రవాద వసతులను నాశనం చేసినట్లు పేర్కొంది. హిజ్బుల్లా స్థావరాలు వున్నాయని అనుమానించిన చోటల్లా వరుసగా భూతల, వైమానిక దాడులకు దిగుతున్న ఇజ్రాయిల్ ఆర్మీ రాజధాని నట్టనడిబొడ్డున దాడి చేయడంతో లెబనాన్ ఆర్మీ తీవ్రంగా ప్రతిస్పందించింది. దక్షిణ లెబనాన్‌లో మిలటరీ పోస్ట్‌పై జరిగిన దాడిలో ఇద్దరు సైనికులు మరణించారని దాంతో మిగిలిన సైనికులు దీటుగా ఎదురు కాల్పులు జరిపారని తెలిపింది.

బిగ్ సిలో దసరా ధమాక ఆఫర్లు

నవ తెలంగాణ - బిజినెస్ బ్యూరో



తెలుగు రాష్ట్రాల్లో టాప్ మొబైల్ రిటైలర్ బిగ్ సి ప్రస్తుత దసరా పండుగ సందర్భంగా ధమాక ఆఫర్లను అందిస్తుందని ఆ సంస్థ ఫౌండర్, సిఎండి ఎం బాలు చౌదరి తెలిపారు. తమ స్టోర్‌లో మొబైల్ కొనుగోళ్లపై నాలుగు ఆకర్షణీయ ఆఫర్లను ఇస్తున్నామన్నారు. "ప్రతీ మొబైల్ కొనుగోలుపై రూ.10వేల వరకు విలువ గల మొబైల్ ప్రొటెక్షన్ ఉచితం. రూ.10వేల వరకు తక్షణ క్యాష్ బ్యాక్, రూ.5,999 విలువగల ఖచ్చితమైన బహుమతిని అందిస్తున్నాం. ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండానే మొబైల్ కొనుగోలు చేసే ఆకర్షణీయ సదుపాయాన్ని కల్పిస్తున్నాం." అని బాలు చౌదరి తెలిపారు. ఒప్పో మొబైల్ కొనుగోలుపై లక్కీ డ్రాలో రూ.10 లక్షల నగదు గెలుచుకోవచ్చన్నారు. వివో, రియల్‌మీ, ఎంఐ మొబైల్ కొనుగోళ్లపై అనేక బహుమతులు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. ఏటీఎం కార్డుతోనే మొబైల్, స్మార్ట్ టివి, ల్యాప్‌ట్యాప్, ఎయిర్ కండీషనర్‌లను ఎలాంటి వడ్డీ, డౌన్ పేమెంట్ లేకుండా కొనుగోలు చేయవచ్చన్నారు. ఈ ఆఫర్లను వినియోగదారులు ఉపయోగించుకోవాలని బాలు చౌదరి కోరారు.

కార్మిక వాణి పట్టని పార్టీలు

సంఘాలపై ఉదాసీనత •మ్యానిఫెస్టోల్లో కానరాని ప్రస్తావన

ప్రభుత్వాలు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా కార్మిక సంఘాలు అనేక సవాళ్లు ఎదుర్కొంటున్నాయి. వాటి సభ్యత్వాలు నానాటికీ తీసికట్టు అన్న చందంగా తగ్గిపోతున్నాయి. ఉదాహరణకు బ్రిటన్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల్లో కార్మిక సంఘాల్లో సభ్యత్వాలు కలిగిన వారు 2022లో కేవలం 22.3 శాతం మంది మాత్రమే. 1995 తర్వాత కార్మిక సంఘాల సభ్యత్వాలు ఇంతగా పడిపోవడం ఇదే మొదటిసారి అని బ్రిటన్ వ్యాపార, వాణిజ్య శాఖ తెలిపింది. అయినప్పటికీ అక్కడ కార్మిక సంఘాల ప్రభావం ఇంకా పూర్తిగా కనుమరుగు కాలేదు. రాజకీయ మద్దతు కారణంగా వారి గళానికి, నిరసనలకు ఇంకా గుర్తింపు లభిస్తూనే ఉంది.



న్యూఢిల్లీ :మన దేశంలో కూడా పాలకులు అనుసరిస్తున్న నయా ఉదారవాద విధానాలు కార్మిక సంఘాల ఉనికిని బలహీనం చేస్తున్నాయి. వాటి సభ్యత్వాలు కూడా తగ్గిపోతున్నాయి. మన దేశాన్ని సుదీర్ఘ కాలంగా పరిపాలిస్తున్న మితవాద ప్రభుత్వాలు కార్మిక సంఘాలకు, కార్మిక అనుకూల విధానాలకు పాతరేస్తున్నాయి. దేశంలోని అనేక కార్మిక సంఘాలు గతంలోలా కాక గత కొన్నేండ్లుగా వ్యూహాలను మార్చుకుంటున్నాయి.

రైతు ఉద్యమాలతో మమేకం

గత మూడేండ్లలో భారత కార్మిక సంఘాలు రైతు ఉద్యమాలతో మమేకం కావడం గమనార్హం. కులం, మతం వంటి విచ్ఛిన్నకర ధోరణులను తిప్పికొట్టాలంటే రైతులు, కార్మికులు సంఘటితంగా ఉండాలని అవి చెబుతున్నాయి. ఈ క్రమంలో కొన్ని ఫలితాలు కూడా సాధించాయి. రైతుల ప్రభావం అధికంగా ఉన్న ప్రాంతాల్లో కేంద్ర కార్మిక సంఘాలు బీజేపీకి వ్యతిరేకంగా నిర్విరామంగా ప్రచారం సాగించడంతో, ఆయా ప్రదేశాల్లో అధికార కాషాయ పార్టీకి ఎన్నికల్లో ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. అదే సమయంలో ప్రతిపక్షాలు బలం పుంజుకుంటున్నాయి.

చేయాల్సింది ఎంతో ఉంది

అయితే దేశంలోని మెజారిటీ కార్మికులకు ప్రాతినిధ్యం వహించాలంటే ఈ సంఘాలు చేయాల్సింది చాలానే ఉంది. ఎందుకంటే 90 శాతానికి పైగా కార్మికులు అసంఘటిత రంగంలోనే పనిచేస్తున్నారు. అసలు కార్మిక సంఘాల ప్రాధాన్యతను అనేక పాలక రాజకీయ పార్టీలు గుర్తించడం లేదు. ఎన్నికల ప్రణాళికలను పరిశీలిస్తే ఆయా పార్టీల వైఖరులు మనకు అర్థమవుతాయి.

పట్టించుకోని కాషాయ పార్టీ

మితవాద బీజేపీ ప్రణాళికలో కార్మికుల ప్రస్తావనే లేదు. అధికార పార్టీ మొదటి నుంచీ బడా కార్పొరేట్ శక్తులకే కొమ్ము కాస్తోంది. కార్మికుల హక్కులు, వారికి ఉన్న రక్షణలను నీరుకారుస్తోంది. గత దశాబ్ద కాలంగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కార్మిక సంఘాలు, కార్మికులు, సామాజిక ఉద్యమాలను శత్రువులుగా చూస్తోంది. లేబర్ కోడ్లు, పథకాలకు వ్యతిరేకంగా సంఘాలు, కార్మికులు నిరసన తెలుపుతున్నా, చెవిటి వాని ముందు శంఖం ఊదిన చందంగా తయారైంది.

నిస్సాక్షిక ప్రతిఫలం, సామాజిక భద్రత, మెరుగైన పని పరిస్థితులు కల్పించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకునే నాథుడే లేడు. ఉత్తరప్రదేశ్‌లోని లఖింపూర్ ఖేరీలో రైతుల నిరసన సందర్భంగా అప్పటి కేంద్ర మంత్రి అజయ్ మిశ్రా కుమారుడు అశిష్ మిశ్రా నలుగురు రైతులు, ఒక పాత్రికేయుడిని పాశవికంగా హత్య చేశాడు. ఇప్పటికీ అతనిపై చర్యల్లేవు.

ఈ పార్టీలదీ అదే దారి

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన మేనిఫెస్టో సామాజిక న్యాయానికి పెద్దపీట వేసింది. పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ భారత్ జోడో న్యాయ్ యాత్ర చేపట్టి పేదలు, కార్మికులు, మహిళలు, యువత, వెనుకబడిన తరగతులు, దళితులు, గిరిజనులు, మైనారిటీల సమస్యలు తెలుసుకున్నారు.

అయితే కార్మిక హక్కులను ఆ పార్టీ మేనిఫెస్టో కూడా ప్రస్తావించలేదు. ఆమ్‌ఆద్మీ, సమాజ్‌వాదీ, డీఎంకే, తృణమూల్ కాంగ్రెస్ వంటి పార్టీలు కూడా కార్మిక సంఘాల విషయంలో అలాంటి ఉదాసీనతే ప్రదర్శించాయి. వాటి అచరణ కూడా అలాగే ఉంది. సీపీఐ (ఎం) వంటి వామపక్ష పార్టీలు ఇందుకు మినహాయింపు.



ఐదేండ్లలో 200 రైలు ప్రమాదాలు

గాలిలో కలిసిన 351 మంది ప్రాణాలు

17 రైల్వే డివిజన్ల నుంచి సేకరణ..రైల్వేశాఖ నివేదిక

న్యూఢిల్లీ : గత ఐదు సంవత్సరాల కాలంలో దేశంలోని వివిధ ప్రాంతాలలో 200 భారీ రైలు ప్రమాదాలు జరిగాయి. వీటి కారణంగా 351 మంది ప్రాణాలు కోల్పోగా 970 మంది గాయపడ్డారు. దేశంలోని 17 రైల్వే జోన్ల నుంచి సేకరించిన ప్రమాదాల సమాచారాన్ని భారతీయ రైల్వేలు వెల్లడించాయి. కోల్‌కతాలోని ప్రభుత్వ రంగ సంస్థ బ్రెయిత్‌వెయిట్ అండ్ కంపెనీని తనిఖీ చేసిన అనంతరం రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ విలేకరులతో మాట్లాడుతూ పది సంవత్సరాల క్రితం సంవత్సరానికి 171 రైలు ప్రమాదాలు జరిగేవని, ఇప్పుడు వాటి సంఖ్య 40కి తగ్గిందని చెప్పారు.

2019-20 నుండి 2023-24 వరకూ...గత ఐదు సంవత్సరాలలో రైల్వే శాఖ రూ.32 కోట్ల నష్టపరిహారాన్ని చెల్లించింది. ఇందులో మృతుల కుటుంబాలకు రూ.26.83 కోట్లు, గాయపడిన వారికి రూ.7 కోట్లు అందించారు. దేశంలో రైలు ప్రమాదాలు నిత్యకృత్యంగా మారిపోయాయి. ప్రాణనష్టం జరగడం, వందలాది మంది గాయపడడం, రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడడం, రైల్వే ఆస్తులకు నష్టం జరగడం జరుగుతోంది. పట్టాలు తప్పడం, రైళ్లు పరస్పరం ఢీకొనడం, మంటలు వ్యాపించడం వంటివి రైలు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. ఆర్‌టీఐ కార్యకర్త వివేక్ పాండే దరఖాస్తుకు స్పందిస్తూ రైల్వే శాఖ ఈ సమాచారాన్ని అందించింది.

గత సంవత్సరం జూన్‌లో బాలాసోర్‌లో మూడు రైళ్లు ఢీకొన్న ఘటన సహా మొత్తం పది భారీ ప్రమాదాలలో 297 మంది చనిపోగా 637 మంది గాయపడ్డారు. ఈస్ట్ కోస్ట్ రైల్వే జోన్‌లో 12 ప్రమాదాలు జరగగా ఒకరు చనిపోయారు. తొమ్మిది మంది గాయపడ్డారు. ఈస్ట్ సెంట్రల్ జోన్‌లో 18 ప్రమాదాలు జరిగాయి. ఎనిమిది మంది చనిపోగా 33 మంది గాయపడ్డారు. నార్త్ సెంట్రల్ జోన్‌లో 21 ప్రమాదాలు జరగగా ఇద్దరు చనిపోయారు. 49 మందికి గాయాలయ్యాయి. నార్తరన్ రైల్వే జోన్‌లో 25 ప్రమాదాలు జరిగాయి. ఐదుగురు ప్రాణాలు కోల్పోగా అంతే సంఖ్యలో గాయపడ్డారు.

దక్షిణ మధ్య రైల్వేలో 12 ప్రమాదాలు జరిగాయి. ఒకరు చనిపోగా 26 మంది గాయపడ్డారు. సౌత్ ఈస్ట్ సెంట్రల్ జోన్‌లో తొమ్మిది ప్రమాదాలు జరిగాయి. ముగ్గురు ప్రాణాలు కోల్పోగా ఆరుగురు గాయపడ్డారు. నార్త్ ఈస్ట్ ఫ్రాంటియర్ రైల్వేలో తొమ్మిది ప్రమాదాలు జరిగాయి. తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోగా 45 మంది గాయాలపాలయ్యారు. నార్త్ వెస్ట్రన్ జోన్‌లో పది ప్రమాదాలు జరగగా 70 మంది గాయపడ్డారు. వెస్ట్ సెంట్రల్ జోన్‌లో ఏడు ప్రమాదాలు జరగగా ఒకరు చనిపోయారు. తొమ్మిది మంది గాయపడ్డారు. వెస్ట్రన్ జోన్‌లో 12 ప్రమాదాలు జరిగాయి. ముగ్గురు మరణించారు. నార్త్ ఈస్ట్రన్, కొంకణ్ రైల్వే, సౌత్ వెస్ట్రన్, సదరన్ రైల్వే జోన్లలో ప్రమాదాలు జరిగినప్పటికీ ఎవరూ మరణించలేదు.

కులవివక్షకు స్వస్తి పలకాలి

జైళ్లలో ఖైదీలందరినీ సమానంగా చూడాలి

- కులం ఆధారంగా పనుల కేటాయింపు అమానవీయం
- జైలు మాన్యువల్స్‌లో నిబంధనలు తక్షణమే సవరించాలి : రాష్ట్రాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు



న్యూఢిల్లీ : జైళ్లలో కుల ఆధారిత వివక్షను భారత సర్వోన్నత న్యాయస్థానం తప్పుబట్టింది. ఆ వివక్షకు ముగింపు పలకాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఖైదీలందరినీ సమానంగా చూడాలని వివరించింది. పలు రాష్ట్రాల జైలు మాన్యువల్స్‌లో వివక్షతో కూడిన నిబంధనలను తక్షణమే సవరించాలని ఓ తీర్పులో న్యాయస్థానం ఆదేశించింది. జైళ్లలో ఖైదీలను వారి కులంతో సంబంధం లేకుండా సమానంగా చూడాలనీ, కులం ఆధారంగా పనిని వేరు చేసే, కేటాయించే పద్ధతులను రద్దు చేయాలని తెలిపింది.

ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఖైదీలను కులం ఆధారంగా విభజించటం, కులాన్ని బట్టి పని పంపిణీ, వారికి వేర్వేరు వార్డుల కేటాయింపు పద్ధతిని తప్పుబట్టింది. అలాంటి పద్ధతులను తొలగించటానికి జైలు ప్రొటోకాల్‌లో తక్షణ మార్పులను తప్పనిసరి చేస్తూ న్యాయస్థానం రాష్ట్రాలకు ఆదేశాలు జారీ చేసింది. ఖైదీల పట్ల అసమానంగా ప్రవర్తించటానికి కులాన్ని కులాన్ని సమర్థించలేమని కోర్టు నొక్కి చెప్పింది. ఖైదీలందరికీ వారి కులాలతో సంబంధం లేకుండా, జైలు వ్యవస్థలో సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని ఆదేశించింది. మురుగు కాలువలు, ట్యాంకులు శుభ్రపర్చటం వంటి ప్రమాదకర పనులు చేయటానికి కొంత మంది ఖైదీలను వారి కులం కారణంగా అప్పగించటం అమానవీయం, అన్యాయమని వివరించింది. ఈ తీరును న్యాయస్థానం ఖండించింది. ఇలాంటి వివక్షాపూరిత పద్ధతులను కొనసాగించే రాష్ట్ర జైలు మాన్యువల్స్‌ను మూడు నెలల్లోగా సవరించాలని ధర్మాసనం తన ఉత్తర్వుల్లో పేర్కొన్నది. కులం ఆధారంగా స్వీపర్లను ఎంపిక చేయటం, శుభ్రపరిచే విధులను కేటాయించటాన్ని కూడా కోర్టు నిషేధించింది. ఇది వాస్తవ సమానత్వ ఉల్లంఘన అని వివరించింది. కాగా, జైళ్లలో కుల ఆధారిత వివక్షను పరిష్కరించటానికి పోలీసులు, జైలు అధికారులు చురుకుగా పని చేయాలనీ, ఇప్పటికే ఉన్న అసమానతలను సరిదిద్దటానికి వెంటనే చర్యలు తీసుకోవాలని కోర్టు ఆదేశించింది.

సామాజికవేత్తల హర్షం

కొన్ని రాష్ట్ర జైలు మాన్యువల్స్‌లో తీవ్రంగా ఉన్న కుల ఆధారిత వివక్షను ఎత్తి చూపుతూ మహారాష్ట్రలోని కళ్యాణ్ నివాసి సుకన్య శాంత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. దీనిపై ప్రతిస్పందనగా ధర్మాసనం ఈ తీర్పునిచ్చింది. జైలు వ్యవస్థలో కుల ఆధారిత వివక్షను నిర్మూలించటం, ఖైదీలందరి గౌరవం, హక్కులను నిర్ధారించటం కోసం ఈ తీర్పు ఒక ముఖ్య అడుగుగా పరిగణించబడుతుందని సామాజికవేత్తలు అంటున్నారు. కుల సమానత్వం, గౌరవం కోసం జరుగుతున్న పోరాటంలో ఈ తీర్పు ఒక ముఖ్య మైలురాయిని సూచిస్తుందనీ, ఏ వ్యక్తీ వివక్షకు గురి కాకూడదనే ఆలోచనను (ముఖ్యంగా జైలు వంటి ప్రభుత్వ సంస్థలలో) బలపర్చిందని చెప్తున్నారు.

కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీయటమే

యుద్ధోన్మాదుల కుట్ర

మెరుగైన బతుకు కోసం పోరాటాలు

శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తూనే ఉంటాం

అంతర్జాతీయ కార్మిక వర్గ పోరాట స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు

- 'అంతర్జాతీయ యాక్షన్ డే' కార్యక్రమంలో వక్తలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'యుద్ధం వద్దు, ప్రపంచ శాంతి ముద్దు'. 'యుద్ధోన్మాదుల్లారా.. కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీస్తారా? ఇక మీ ఆటలు సాగనివ్వం'. 'సామ్రాజ్యవాద యుద్ధ కాంక్ష నశించాలి. ప్రపంచ కార్మిక వర్గ ఐక్యత వర్ధిల్లాలి'. 'డౌన్ డౌన్ క్యాపిటలిజం' అంటూ కార్మిక సంఘాలు నినదించాయి. కార్మిక వర్గ ఐక్యతను దెబ్బతీయటమే యుద్ధోన్మాదుల కుట్ర అని సంఘాల నేతలు విమర్శించారు. కార్మికుల మెరుగైన, గౌరవ ప్రదమైన బతుకు కోసం పోరాటాలు నిర్వహిస్తూనే ఉంటామంటూ స్పష్టం చేశారు. శ్రమదోపిడీకి వ్యతిరేకంగా, అంతార్జాతీయ కార్మిక వర్గ పోరాట స్ఫూర్తితో ఐక్య ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐయూటీయుసీ ఆధ్వర్యంలో డబ్ల్యూఎఫ్‌టీయూ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా 'అంతర్జాతీయ యాక్షన్ డే'గా ఇచ్చిన పిలుపులో భాగంగా నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్వీ రమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ యూసఫ్ మాట్లాడుతూ పొద్దస్తమానం రెక్కలు ముక్కలు చేసుకుంటూ సంపదన ఉత్పత్తి చేస్తున్న కార్మిక వర్గానికి గౌరం లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్రమకు తగిన వేతనాలు రావటం లేదని చెప్పారు. తమ హక్కుల కోసం, గౌరవప్రదమైన బతుకు కోసం జరిగే పోరాటాలను నిర్వర్యం చేసేందుకు పెట్టుబడి దారులు ఎన్నో రకాల కుట్రలు చేస్తున్నారని వివరించారు. అంతర్జాతీయ కార్మిక వర్గ పోరాటాల స్ఫూర్తితో దేశంలో మోడీ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మికపోరాటాలు రాక తప్పవని అభిప్రాయం వ్యక్తం చేశారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్ మాట్లాడుతూ శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికవర్గం అంతర్జాతీయ స్ఫూర్తితో పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. పని భద్రత, జీవన పరిస్థితుల్లో మెరుగుదల సాధించేందుకు ఐక్యపోరాటాలు తప్పవని చెప్పారు. ప్రపంచంలో ఎక్కడైనా పాలకులు కార్మికుల కష్టాన్ని దోచుకోవటంలో తేడా లేదన్నారు. కార్మికుల శ్రమకు తగిన వేతనాన్ని ఇవ్వటం లేదని తెలిపారు. పోరాడి సాధించుకున్న చట్టాల జీవోలను కూడా అమలు చేయటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు తమ లాభాల కోసం, సామ్రాజ్యవాద సంఘాల ప్రయోజనాల కోసం, ప్రజల సంపదను లాక్కోవాలని, మార్కెట్లను విభజించి, ఇంధన మార్గాలను జయించాలని చూస్తున్నారన్నారు. సామ్రాజ్యవాదుల ఆధిపత్య కాంక్షతో జరిగే యుద్ధాలను, వాటి వల్ల ప్రజలకు, సమాజానికి జరిగే నష్టాన్ని కార్మిక వర్గం అర్థం చేసుకోవాలన్నారు. కార్మికవర్గం ఎదుర్కొనే వేతనాలు, పెన్షన్ పెంపు, ఉద్యోగ భద్రత, సరళీకృత ఆర్థిక విధానాల వల్ల నష్టాలు, ఆరోగ్య సంరక్షణ వంటి సమస్యలపై సమ్మెలు, ఉద్యమాలు జరుగుతూనే ఉన్నాయని తెలిపారు. దేశంలో పదేండ్ల మోడీ పాలనలో ద్రవ్యోల్బణం పెంచి, అధిక ధరలను నియంత్రించకుండా కార్మికవర్గంపై తీవ్ర భారాలు మోపిందని విమర్శించారు. బీజేపీ సంకీర్ణ ప్రభుత్వం 100 రోజుల ప్రణాళిక పేరుతో ప్రపంచీకరణ విధానాలను మరింత దూకుడుగా అమలు చేస్తున్నదని చెప్పారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించటంలో, పేదరికాన్ని నిర్మూలించడంలో, విపత్తులు సంభవించినప్పుడు ప్రజలకు అండగా నిలవటంలో కేంద్రం ఘోరంగా విఫలమైందని విమర్శించారు. ఈ నేపథ్యంలో కార్మికవర్గం ఐక్యంగా హక్కుల సాధన కోసం ఉద్యమించాల్సిన అవశ్యకత పెరిగిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఏఐయూటీయూసీ నాయకులు ఆంజనేయులు, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరి రాములు, ఉపాధ్యక్షులు వీఎస్ రావు, పద్మశ్రీ, కూరపాటి రమేష్, కుమార స్వామి, ఏఐటీయూసీ నాయకులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ నిర్ణయాలు నాణ్యమైన విద్యకు వ్యతిరేకం

పడిపోతున్న విద్యాప్రమాణాలు

- తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ అధ్యక్షులు చక్రధర్ రావు, ప్రొఫెసర్ హరగోపాల్

నవతెలంగాణ - ముషీరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు నాణ్యమైన విద్యకు వ్యతిరేకంగా ఉన్నాయని, రాష్ట్రంలో అభ్యాసనా సంక్షోభం రోజురోజుకూ తీవ్రమవుతోందని వక్తలు తెలిపారు. గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ అధ్యక్షులు చక్రధర్ రావు మాట్లాడుతూ.. కేంద్ర విద్యా శాఖ విడుదల చేసిన పర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ ప్రకారం 36 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తెలంగాణ విద్యాశాఖ ర్యాంక్ 32కు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా ప్రమాణాల విషయంలో 2017-18లో 12వ ర్యాంకు ఉంటే అది 2021-22లో 35కు పడిపోయిందన్నారు. 2014లో 5వ తరగతి విద్యార్థుల్లో 45 శాతం మంది రెండో తరగతి పుస్తకాన్ని చదివే సామర్థ్యం కలిగి ఉండగా, 2022-23లో 32 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఆ పుస్తకాన్ని చదవగలుగుతున్నారని తెలిపారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే కాలంలో తెలంగాణ సమాజం అజ్ఞాన సమాజంగా మారిపోతుందన్న ఆందోళన కలుగుతున్నదని తెలిపారు. హరగోపాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తమ మ్యానిఫెస్టోలో విద్యారంగానికి బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి 7.3 శాతం నిధులు మాత్రమే కేటాయించిందన్నారు. తమిళనాడులో 13.4 శాతం, కర్నాటకలో 12.9 శాతం, కేరళలో 14.8 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 12.6 శాతం నిధులు కేటాయించారని తెలిపారు. దేశవ్యాప్తంగా విద్యకు సగటున 15 శాతం నిధులు కేటాయించారన్నారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పాఠశాల విద్యలో బడుల మూసివేతలు నిరాటంకం గా కొనసాగుతున్నాయని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గిపోతుందనే విషయంపై లోతైన అధ్యయనం చేసి కారణాలను ఎందుకు కనుక్కోవడం లేదని ప్రశ్నించారు. విద్యార్థులు లేరనే సాకుతో టీచర్లను ఇవ్వకపోవడం దారుణమన్నారు. పీఎల్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త జిల్లాల్లో విద్యాశాఖ అధికారులే లేరన్నారు. ఇక ఉపాధ్యాయులను తయారు చేసే డైట్ కళాశాలలో 206 పోస్టులకు 108 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే గ్రామాలకు గ్రామాలే కాదు.. మండలాలకు మండలాల్లో కూడా ప్రభుత్వ పాఠశాలలు లేకుండా పోయే పరిస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు నాగిరెడ్డి, డీటీఎఫ్ నాయకులు లింగారెడ్డి, కృష్ణప్ప, వేణుగోపాల్, పీడీఎస్‌యూ నాయకులు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 28,29,30 తేదీల్లో

టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు

సంఘం బలోపేతానికి కృషి : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

నల్లగొండలో రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం కమిటీ ఎన్నిక



నవతెలంగాణ-ప్రాంతీయ ప్రతినిధి నల్లగొండ


డిసెంబర్ 28, 29, 30 తేదీల్లో నల్లగొండలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలు జరగనున్నాయని, వాటిని విజయవంతం చేయడానికి ఆహ్వాన సంఘం కమిటీని ఎన్నుకున్నట్టు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తెలిపారు. గురువారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఆర్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు ఎడ్ల సైదులు అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్ర మహాసభల నిర్వాహక ఆహ్వాన సంఘం ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబర్‌లో నల్లగొండ జిల్లా కేంద్రంలో జరగనున్న తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలను ఘనంగా నిర్వహించాలని, నల్లగొండ జిల్లా నాయకులు, కార్యకర్తలకు మార్గనిర్దేశం చేశారు. రాష్ట్ర మహాసభల నిర్వహణ ద్వారా సంఘం బలోపేతానికి ప్రణాళికలు రూపొందించుకోవాలని తెలిపారు. టీఎస్ యూటీఎఫ్.. ఉపాధ్యాయులందరిదీ అనే భావన వచ్చే విధంగా సంఘం నాయకులు, కార్యకర్తలు సేవా దృక్పథంతో పనిచేయాలని కోరారు. రాష్ట్ర అధ్యక్షులు జంగయ్య మాట్లాడుతూ.. ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడి 50 ఎండ్లు పూర్తయ్యాయని, సంఘం పూర్వ నాయకులు చెన్నుపాటి, ఏవీఎస్, రాంరెడ్డి లాంటి నాయకుల ఆశయాలకు అనుగుణంగా తామంతా పని చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ.. సంఘ ప్రతిష్ట మరింతగా పెరిగి విధంగా రాష్ట్ర ఆరో మహాసభలను విజయవంతంగా నిర్వహించాలని కోరారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్.రాములు మాట్లాడుతూ.. ఉమ్మడి రాష్ట్రంలో నల్లగొండ జిల్లాలో 2009లో రాష్ట్ర మహాసభలు నిర్వహించుకున్నామని, ఇప్పుడు మళ్లీ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు రాజశేఖర్‌రెడ్డి, నాగమణి, సీనియర్ నాయకులు మాణిక్‌రెడ్డి, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు తుమ్మలవీరారెడ్డి, కృష్ణమూర్తి, బంగారయ్య, టీఎస్ యూటీఎఫ్ సూర్యాపేట, యాదాద్రి జిల్లాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అనిల్‌కుమార్, సోంబాబు, ముక్కెర్ల యాదయ్య, దామోదర్, జేవీవీ, టాప్రా, పౌర స్పందన వేదిక నాయకులు తదితరులు పాల్గొన్నారు..

ఆహ్వాన సంఘం కమిటీ ఎన్నిక

చైర్మెన్‌గా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, కార్యనిర్వాహక చైర్మెన్‌గా ఎం.రాజశేఖర్‌రెడ్డి, కో చైర్మెన్లుగా సంఘం రాష్ట్ర కార్యదర్శి జి.నాగమణి, జిల్లా అధ్యక్షులు వై.సైదులు, ప్రధాన కార్యదర్శి పి.వెంకటేశం, కోశాధికారిగా నర్రా శేఖర్‌రెడ్డి, వైస్‌చైర్మెన్‌గా బి.శ్రీనివాస్‌చారి ఎన్నికయ్యారు.

అజారుద్దీన్‌కు ఈడీ సమన్లు

హెచ్‌సీఏ నిధులు దుర్వినియోగం చేసినట్టు ఆరోపణలు



హైదరాబాద్: భారత మాజీ కెప్టెన్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు మహ్మద్ అజారుద్దీన్‌కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ లో ఆర్థిక అవకతవకలకు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఈ చర్యలు తీసుకుంది. పలు ఆరోపణలపై గతేడాది నవంబర్‌లోనే ఈడీ సోదాలు నిర్వహించింది. మనీలాండరింగ్ కేసులో మూడు ఎఫ్‌ఐఆర్‌లు, రూ. 20 కోట్ల మేరకు హెచ్‌సీఏ నిధులను దుర్వినియోగం చేసినట్టు ఆరోపిస్తూ తెలంగాణ అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ) చార్జిషీట్లను దాఖలు చేసిన విషయం తెలిసిందే. అయితే అజారుద్దీన్‌కు సమన్లు పంపడం ఇదే తొలిసారి. దీంతో ఆయన దర్యాప్తు సంస్థ ముందు హాజరుకావాల్సి ఉంది.


నవతెలంగాణ

అహంకారం, క్రోధం అంతరించినపుడే
పరిపూర్ణమైన శాంతి నెలకొంటుంది - గౌతమ బుద్ధుడు

శుక్రవారం 4 అక్టోబరు 2024
www.navatelangana.com

సంపాదకీయం

డొంక తిరుగుడు...



నాటకాలాడే కాలు... రోలు కింద పెట్టినా ఆగదంట. ఇప్పుడవే నాటకాలు రాష్ట్రంలో కొనసాగు తున్నాయి. అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు రెండూ దీనికి మినహాయింపు కాదు. విధానాల పరంగా సూటిగా, సుత్తిలేకుండా మాట్లాడాల్సిన రాజకీయ నాయకులు... అడ్డదిడ్డంగా, వంకరటింకరగా మాట్లాడుతూ అసలు విషయాలను పక్కదోవ పట్టించేందుకు ప్రయత్నించటం వారి డొల్లతనానికి నిదర్శనం. గత నెలరోజులుగా, ఇంకా చెప్పాలంటే హైడ్రా అనే పేరు తెరమీదికొచ్చిన దగ్గర్నుంచి కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల నోళ్లకు హద్దే లేకుండా పోతోంది. విమర్శలు, ప్రతి విమర్శలు, తిట్ల పురాణాలతో మొదలైన ఈ ప్రహసనం... ఇప్పుడు సినీ రంగానికి చెందిన ఓ ప్రముఖ నటి వ్యక్తిగత జీవితంపై ప్రభుత్వంలోని వారు అభ్యంతరకర వ్యాఖ్యలు చేయటం, దాంతో దుమారం చెలరేగటంతో పరాకాష్టకు చేరింది. ఈ వ్యాఖ్యలను సినీ తారలందరూ మూకుమ్మడిగా ఖండించటం, సదరు అగ్రనటుడు కోర్టుకెక్కి, మంత్రిపై పరువు నష్టం దావా వేయటం... ఇప్పటి వరకూ కొనసాగిన ఎపిసోడ్ల పరంపర. ఇదే సమయంలో కార్మికులు, రైతులు, కౌలుదార్ల వంటి వారి సమస్యలపై ఈ రెండు పార్టీలూ ఏ ఒక్క రోజూ మాట్లాడవు. 'నువ్వు వెధవ అంటే నువ్వే వెధవ...'అనుకుంటూ ఒకరిపై మరొకరు అవినీతి ఆరోపణలు చేసుకోవటం తప్ప ప్రజల విషయాలు వాటికి పట్టనే పట్టడం లేదు.

> అప్పులు, ఆర్థిక ఇబ్బందుల మీద శ్వేతపత్రాలు ప్రకటించిన సర్కారు... పథకాలు, కార్యక్రమాలు, హామీల మీద అదే రకమైన వైట్ పేపర్లు విడుదల చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోగలదా? అనే సందేహం కలుగుతోంది. ప్రభుత్వంలోని ఏ ఒక్క మంత్రిగానీ, ప్రజా ప్రతినిధిగానీ ఇలాంటి అంశాలపై విస్పష్టమైన ప్రకటనేదీ విడుదల చేయకపోవటం ప్రభుత్వ విధానపర లోపాలను ఎత్తి చూపుతోంది. హైడ్రా, మూసీ సుందరీకరణ విషయాల్లోనూ ఇదే రకమైన అస్పష్టత కొనసాగుతుండటం కొసమెరుపు.

ఇది నాణేనికి ఒకవైపు. అదే నాణేనికి మరోవైపు తరచి చూస్తే, అనేక విషయాలు బోధపడక మానవు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ప్రతిపక్ష బీఆర్ఎస్... ప్రతీ అంశాన్ని భూతద్దంలో చూపటం మొదలు పెట్టింది. ఫామ్‌హౌజ్‌లో కలిసిన సొంతపార్టీ నేతలతో 'కాంగ్రెస్ సర్కార్ కూలిపోతుంది, మళ్లీ నేనే ముఖ్యమంత్రిని అవుతానంటూ' ఆ పార్టీ బాస్ ఓదార్పు మాటలు చెప్పినా గులాబీ దళాలు హస్తం గూటికి చేరువవుతూనే ఉన్నాయి. ఈ క్రమంలో ముఖ్యంగా హస్తం పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై బీఆర్ఎస్ నేతలు వాగ్బాణాలను ఎక్కుపెట్టారు. తద్వారా అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో కోల్పోయిన తమ ప్రాభవాన్ని తిరిగి తెచ్చుకోవటానికి అప్పటి నుంచి ఇప్పటివరకు నానా తంటాలు పడుతున్నారు. ప్రతిపక్ష నేత మాత్రం కిమ్మనకుండా ఫామ్‌హౌస్‌లో కూర్చోవటం వింతల్లో పెద్ద వింత.

అధికారంలో ఉన్నవారు ఎంతో ఓపికతో, మరెంతో సహనంతో వ్యవహరిస్తూ ప్రతిపక్షాలను కలుపుకుని పోవాలంటారు మన పెద్దలు. 'మాట'ల్లో ఆ ఓపికను, సహనాన్ని ప్రదర్శిస్తున్న అధికార పార్టీ.. చేతల్లో మాత్రం 'తనపనితాను' చేసుకుంటూ పోతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపుతామంటూ ప్రకటనలు గుప్పించిన సీఎం రేవంత్, మంత్రులు... ఆ తర్వాత వాటిని అమలు చేసి చూపటంలో ఇప్పటికీ కృతకృత్యులు కాలేకపోయారన్నది కాదనలేని వాస్తవం. ముఖ్యంగా గత ప్రభుత్వ హయాంలో నిరాటంకంగా కొనసాగిన రైతు బంధు (రైతు భరోసా) నేటికీ అమలు కాకపోవటం అన్నదాతల్లో ఆవేదనను మిగిల్చింది. ఇక నిర్దిష్ట పద్ధతుల్లో నిర్ణీత సమయంలో అమలు చేయకపోవటంతో రైతు రుణమాఫీ అనేది కాంగ్రెస్ సర్కారుకు అప్రదిష్టను మూటగట్టి పెట్టింది. ఆసరా పింఛన్ల పెంపు అటకెక్కిందనే గుసగుసలు వినబడుతుండగా, మహిళలు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు ఆర్థిక భరోసా అనేవి ఊసే లేకుండా పోయాయి. ఇవి ఇలా వెంటాడుతుండగానే గురుకులాల సమస్యలు, వైద్యారోగ్య శాఖలోని ఇక్కట్లు, సీజనల్ వ్యాధులు ముప్పిరిగొన్నాయి. రూ.500కే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్‌లాంటి పథకాలు ఎంతమందికి లబ్ధి చేకూరుస్తున్నాయో చెప్పలేని పరిస్థితి. అప్పులు, ఆర్థిక ఇబ్బందుల మీద శ్వేతపత్రాలు ప్రకటించిన సర్కారు... పథకాలు, కార్యక్రమాలు, హామీల మీద అదే రకమైన వైట్ పేపర్లు విడుదల చేసి తన చిత్తశుద్ధిని నిరూపించుకోగలదా? అనే సందేహం కలుగుతోంది. ప్రభుత్వంలోని ఏ ఒక్క మంత్రిగానీ, ప్రజా ప్రతినిధిగానీ ఇలా ంటి అంశాలపై విస్పష్టమైన ప్రకటనేదీ విడుదల చేయకపోవటం ప్రభుత్వ విధానపర లోపాలను ఎత్తి చూపుతోంది. హైడ్రా, మూసీ సుందరీకరణ విషయాల్లోనూ ఇదే రకమైన అస్పష్టత కొనసాగుతుండటం కొసమెరుపు.

ఇలాంటి విధానపర లోపాలకు, డొంక తిరుగుళ్లకు మూల కారణం 'ఆర్థికమే' అని చెప్పక తప్పదు. అధికారంలోకి వచ్చే ముందు గత ప్రభుత్వ అప్పులు, వడ్డీల గురించి తెలిసినా, హస్తం పార్టీ ఇబ్బడి ముబ్బడిగా హామీలిచ్చింది. వాటిని అమలు చేయలేక ఇప్పుడు చతికిలపడుతోంది. ఆ క్రమంలో కక్కలేక, మింగలేక అన్నట్టు అసలు విషయాలను చెప్పలేక, వాటిని పక్కదోవ పట్టిస్తోంది. ఇప్పటికే ఈ విషయంలో విమర్శల పాలవుతున్న కాంగ్రెస్ సర్కారు... ఇకనైనా కండ్లు తెరవాలి.

రాజ్యాంగ పునాదుల్ని కదిలిస్తున్న 'జమిలి'



ఎస్. వీరయ్య

జమిలి ఎన్నికలపైన కోవింద్ కమిటీ నివేదికకు మోడీ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. దేశానికి ఇప్పుడు జమిలి ఎన్నికలే తక్షణ అవసరమా? పదేపదే ఎన్నికలు ఖజానా మీద భారం మోపుతున్నాయని వీటిని సమర్థించేవారు అంటున్నారు. పదేపదే ఎన్నికల వల్ల అభివృద్ధిమీద, పాలనమీద ప్రభుత్వ కేంద్రీకరణకు ఆటంకాలు ఏర్పడుతున్నాయని వీరి వాదన. నెహ్రూ, అంబేద్కర్ లాంటి గొప్ప నాయకులున్నప్పుడే జమిలి ఎన్నికలు జరి గాయి కదా! ఇప్పుడెందుకొద్దు అంటున్నారు. అనేక రాజకీయ పార్టీలు, అసోచామ్, సీఐఐ లాంటి పారిశ్రామికవేత్తల సంఘాలు, కొందరు మాజీ న్యాయమూర్తులు కూడా సమర్థిస్తున్నారు కాబట్టి, జమిలి ఎన్నికలు సమర్థనీయమే అంటున్నారు. ప్రస్తుత ఎన్నికల విధానంలో పార్టీ ఫిరాయింపులు సర్వసాధారణమయ్యాయనీ, అస్థిర పాలనకు కారణమవుతున్నాయంటున్నారు. మోడీకి అనుకూల సమయంలో కోవింద్ కమిటీ రిపోర్టును తెప్పించుకున్నారనీ, క్యాబినెట్ ఆమో దం పొందారని జమిలి ఎన్నికలను వ్యతిరేకించే కొంతమంది వాదన. మోడీ పాలన స్థిరపరచుకునేందుకే ఈ ప్రయత్నమంతా అని వారి ఆరోపణ. ప్రతిపక్షం పాలించే రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అస్థిరపరిచేందుకు, కేంద్రం పట్టు బిగించేందుకు అవకాశాలు మరింత పెరుగుతాయనేది వీరి అభిప్రాయం. నిజానికి నివేదిక ఎప్పుడొచ్చింది, ఎప్పుడు ఆమోదించారన్నది ముఖ్యం కాదు. ఇది ప్రతిపక్ష పార్టీలు పరిపాలిస్తున్న రాష్ట్రాల సమస్య మాత్రమే కాదు. మోడీ లేదా బీజేపీ పాలన స్థిరపరచుకోవాలన్న లక్ష్యం మాత్రమే కూడా కారణం కాదు. వీటన్నింటికన్నా లోతైన సమస్య. భారతదేశ రాజ్యాంగం మౌలిక పునాదులనే కదిలించే సమస్య.

పదేపదే ఎన్నికలు జరగడం వల్ల ప్రభుత్వ ఖజానా మీద మోయలేని భారం పడుతుందన్న వాదన హాస్యాస్పదం. అధికారిక పరిమితిని మించి అనేకరెట్లు ఖర్చుపెడుతున్న వారే ఈ వాదన చేస్తున్నారు. ప్రజాస్వామ్యం పరిపుష్టం చేయాల్సిన బాధ్యతను డబ్బుతో ముడిపెట్టడం సరైందా? ప్రజాస్వామ్య మూలాలు మింగుడు పడనివారే వీటిని ఖర్చుతో ముడిపెడతారు. స్వాతంత్రోద్యమ వారస త్వాన్ని అందిపుచ్చుకునేవారు ప్రజాస్వామ్యం మరింత బలపడాలని కోరుకుంటారు. ఖర్చు తగ్గుతుందన్న గ్యారంటీ కూడా లేదు. ఒక రాష్ట్రప్రభుత్వం ఐదేండ్లు పూర్తికాకుండానే తొందరగా పడిపోతే మళ్లీ ఎన్నికలు నిర్వహించాలన్న ప్రతిపాదన ఉన్నది. కానీ ఈ ఎన్నిక జమిలి ఎన్నికలనాటి వరకే. ఐదేండ్ల కోసం కాదు. అంటే అదనంగా మరొకసారి ఎన్నికలు నిర్వహించడమే కదా! ఇప్పుడున్న పద్ధతి ప్రకారమైతే ఎన్నుకోబడిన నాటి నుండి ప్రభుత్వం ఐదేండ్లు కొనసాగుతుంది. మధ్యలో మరో ఎన్నిక అవసరం ఉండదు. అంతేకాదు, కేంద్రం నిరంకుశత్వం గ్యారంటీగా పెరుగుతుంది. ప్రజలముందుకు పోవడానికి వీరు భయపడుతున్నారు. ప్రజానుకూల విధానాలు అమలు జరిపితే భయమెందుకు? పైగా పాలకులు ఒళ్లు దగ్గరపెట్టుకోవడానికి ఈ ఎన్నికలు ఉపయోగ పడతాయి కదా! ఒకసారి ఎన్నికైతే ఐదేండ్లు అడిగేవారుండరన్న భరోసా ఏర్పడినప్పుడు ఈ పాలకులు ప్రజలను ఖాతరు చేయరు. పెట్టుబడిదారులకు, భూస్వాములకు అనుకూలంగా వ్యవహరించదలచినప్పుడే ప్రజల ముందుకు పోవడానికి భయాలు. పారిశ్రామికవేత్తల సంఘాలు పదేపదే ఎన్నికలు నివారించాలనడంలో సారాంశం ఇదే కదా! ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు. ప్రజాభిప్రాయానికి పరిమితులు విధించాలని కొన్ని పార్టీలు లేదా సంఘాలు, సంస్థలు, వ్యక్తులు చెబితే సరైందికాదు. అశేష ప్రజానీకానికి వీరు ప్రత్యామ్నాయం కాదు. రాచరికాల్లో, బ్రిటిష్ పాలనలో ప్రజాభిప్రాయానికి స్థానం లేదు. ఇందిరాగాంధీ విధించిన ఎమర్జెన్సీ కాలంలో ప్రజాభిప్రాయానికి పరిమితులు విధించారు. ఇప్పుడు మోడీ పాలనలో ప్రజాభిప్రాయానికి మరిన్ని పరిమితులు విధించి రాజదండం స్ఫూర్తితో కొరడా ఝులిపించాలని ప్రయత్నిస్తున్నారు. పార్టీ ఫిరాయింపులకు కూడా ఇది ప్రత్యామ్నాయం కాదు. ఇప్పుడున్న ఫిరాయింపుల నిరోధక చట్టంలో పటిష్టమైన సవరణలు చేయవచ్చు. దామాషా ఎన్నికల పద్ధతికి సిద్ధపడితే ఫిరాయింపుల సమస్యే ఉత్పన్నం కాదు. వీటి ఊసెత్తడానికే పాలకులు సిద్ధంగా లేరు.



> భిన్నమైన భాషలు, భిన్న సంస్కృతులు, భిన్న జాతుల సమాహారమే ఈ దేశం. వీరి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వీరందరి ప్రయోజనాలను కాపాడగలిగినప్పుడే ఒకే దేశంగా మనగలుగుతాము. లేనట్టయితే దేశ సమగ్రతకు, సమైక్యతకే ముప్పు ఏర్పడవచ్చు. సువిశాలమైన భారతదేశంలో తీవ్రమైన ప్రాంతీయ అసమానతలు ఉన్నాయి. అందుకు తగిన ప్రణాళికలు అవసరమవుతాయి. వివిధ ప్రాంతాల ప్రయోజనాలు, ప్రాధాన్యతలు వేర్వేరుగా ఉంటాయి. ఈ వైవిధ్యాన్ని గుర్తించకుండా కేంద్రం పెత్తనం చేస్తే ప్రజలు అంగీకరించరు. బలవంతంగా అమలు చేయడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకం. రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం.

నెహ్రూ, అంబేద్కర్ లాంటి నేతలు ఉన్నప్పుడే జమిలి ఎన్నికలు జరిగాయన్న వాదనకు పసలేదు. ఇక్కడ సమస్య జమిలి ఎన్నికలు కాదు. సహజ క్రమంలో యాధృచ్ఛికంగా అన్ని ఎన్నికలు ఒకేసారి వస్తే వచ్చే ప్రమాదమేమీ లేదు. 1951-62 మధ్య జరిగిన ఎన్నికలు అట్లా జరిగినవే. కేంద్ర పాలకులు రాజ్యాంగంలోని ఆర్టికల్ 356ను దుర్వినియోగం చేసి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చివేసారు. దాని ఫలితంగానే జమిలి ఎన్నికలకు అవకాశం లేకుండా పోయింది. ఆర్టికల్ 356ను రద్దు చేయడానికి మోడీ ప్రభుత్వం సిద్ధంగా లేదు. గత కాంగ్రెస్ బాటలోనే కేంద్ర బీజేపీ సర్కార్ కూడా 356వ అధికరణాన్ని దుర్వినియోగం చేయడం చూస్తూనే ఉన్నాం. యాధృచ్ఛికంగా ఒకేసారి ఎన్నికలు వస్తే శాంతిభద్రతల సమస్యలు, పోలీసు బలగాల అందుబాటు, తగినంత ప్రభుత్వ యంత్రాంగం లాంటి ఆచరణ సమస్యలే తప్ప, విధానపరమైన ఇబ్బందులు ఉండవు. ఒకేసారి ఎన్నికల కోసం రాజ్యాంగాన్ని సవరించడం, చట్టం చేయడమే ప్రమాదం. రాజ్యాంగాన్ని సవరిస్తే జమిలి ఎన్నికల కోసం కొన్ని శాసనసభల కాలం పూర్తికాకుండానే రద్దు చేయాలి. మరికొన్ని శాసనసభల కాల పరిమితిని పొడిగించాలి. ఈ రెండూ అప్రజాస్వామికమే. పొడిగించే బదులు గవర్నర్ లేదా రాష్ట్రపతి పాలన విధించడం మరింత అప్రజా స్వామికం. రాష్ట్రాల మీద కేంద్రం పెత్తనం చేయడమే. రాష్ట్రాల హక్కులను, అధికారాలను తృణీకరించడమే. ఐదేండ్లు పూర్తికాకుండానే ప్రభుత్వం కూలిపోతే మిగిలిన కాలానికి గవర్నర్ లేదా రాష్ట్రపతి పాలన కూడా అప్రజాస్వామికమే. ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికైన ప్రభుత్వం అసెంబ్లీని రద్దుచేసి మరోసారి ప్రజాభిప్రాయం కోరే అవకాశం ఉండదు. ప్రభుత్వం మెజారిటీ కోల్పోయి, ప్రత్యామ్నాయానికి అవకాశం లేనప్పుడు మళ్లీ ప్రజాతీర్పును కోరే అవకాశం కూడా లేదు. పైగా అవిశ్వాస తీర్మానం ప్రతిపాదించేవారు ప్రత్యామ్నాయ ప్రతిపాదన కూడా జోడించాలంటున్నారు. అంటే, అప్పటికే ఉన్న ప్రభుత్వాన్ని తొలగించే హక్కును హరించడమే. ఉన్న ప్రభుత్వాన్ని తొలగించే హక్కును ప్రత్యామ్నాయ సూచనకు లోబడి అమలు చేయాలనడం అప్రజాస్వామికం. పార్లమెంట్ విషయంలో కూడా ఇవే ప్రశ్నలు తలెత్తుతాయి. ఎన్నికైన ప్రభుత్వం మెజారిటీ కోల్పోతే రాష్ట్రపతి పాలన విధించినా లేక మైనారిటీ ప్రభుత్వమే ఐదేండ్లు పూర్తయ్యేదాకా పరిపాలించాలన్నా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. గవర్నర్ లేదా రాష్ట్రపతి పాలన ద్వారా రాష్ట్రాల మీద కేంద్రం పట్టుబిగించడం ఫెడరల్ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం. మన రాజ్యాంగం పీఠిక "భారతదేశ ప్రజలమైన మేము" అని ప్రారంభమవుతుంది. అంటే, ప్రజాభిప్రాయమే మన రాజ్యాంగం పునాది. ప్రజలే అంతిమ నిర్ణేతలు. జమిలి ఎన్నికల పేరుతో మన రాజ్యాంగంలోని ఈ పునాదులనే పెకిలించేం దుకు ప్రయత్నిస్తున్నారు.

భిన్నమైన భాషలు, భిన్న సంస్కృతులు, భిన్న జాతుల సమాహారమే ఈ దేశం. వీరి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ వీరందరి ప్రయోజనాలను కాపాడ గలిగినప్పుడే ఒకే దేశంగా మనగలుగుతాము. లేనట్టయితే దేశ సమగ్రతకు, సమైక్యతకే ముప్పు ఏర్పడవచ్చు. సువిశాలమైన భారతదేశంలో తీవ్రమైన ప్రాంతీయ అసమానతలు ఉన్నాయి. అందుకు తగిన ప్రణాళికలు అవసరమ వుతాయి. వివిధ ప్రాంతాల ప్రయోజనాలు, ప్రాధాన్యతలు వేర్వేరుగా ఉంటాయి. ఈ వైవిధ్యాన్ని గుర్తించకుండా కేంద్రం పెత్తనం చేస్తే ప్రజలు అంగీకరించరు. బలవంతంగా అమలు చేయడం ప్రజాస్వామ్యానికి, సమాఖ్య వ్యవస్థకు వ్యతిరేకం. రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధం. రవీంద్రుడు రచించిన జాతీయ గీతం స్ఫూర్తిని నీరుగార్చడమే. ఒకే దేశం, ఒకే ప్రజ, ఒకే ఎన్నిక, ఒకే సంస్కృతి పేరుతో చేస్తున్న ఈ ప్రయత్నాలన్నీ అధికారాలను కేంద్రం గుప్పిట్లో పెట్టుకోవడానికి, నియంతృత్వాన్ని స్థిరపర్చడం కోసమే.

జమిలి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి ఏకపక్షంగానే సాగుతున్నది. కోవింద్ కమిటీ సిఫార్సుల మేరకే ప్రక్రియ ప్రారంభించామనడం మోసపూరితం. జమిలి ఎన్నికలు నిర్వహించాలని ప్రధాని ముందుగానే నిర్ణయానికి వచ్చారు. కేవలం వాటి అమలుకు అవసరమైన పాలనాపరమైన, న్యాయ పరమైన అంశాలను పరిశీలించే బాధ్యత మాత్రమే కోవింద్ కమిటీకి అప్పగించారు. మోడీ ఏకపక్షంగా పోజాలడని, ప్రాంతీయ పార్టీలు మోడీని కట్టడి చేస్తాయని ఆశించిన వారికి నిరాశే మిగిలింది. ఈ టీడీపీ, జనసేనలాంటి పార్టీలు కేంద్రంతో లాలూచీకే ప్రాధాన్యత నిచ్చాయి తప్ప, ప్రజా ప్రయోజనాలను పట్టించుకోలేదు. ప్రజాస్వామ్య విలువల కోసం నిలబడలేదు. మంత్రి వర్గం ఆమోదం కూడా పొందిన నేపథ్యంలో ఇక ప్రజలు చేయ గలిగిందేమీ లేదా? కేంద్ర నియంతృత్వ పోకడలను భరించాల్సిందేనా? కానేకాదు. ఈ నిర్ణయాన్ని సగం రాష్ట్రాల శాసన సభలు ఆమోదించాలి. పార్లమెంట్ మూడింట రెండొంతుల మెజారిటీతో అంగీకరించాలి. ఈ ప్రక్రియ పూర్తికావడానికి చాలా సమయం పడుతుంది. ఈ కాలాన్ని ప్రజలు, ప్రజాతంత్ర వాదులు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలు సంఘటితం కావాలి. కేంద్ర పాలకులను నిలదీయాలి. ప్రతిపాదనను ఉపసంహరించుకునేంత వరకూ పోరాడాలి.

> దేశంలో మత ఉగ్రవాదం పెచ్చరిల్లిపోవడానికీ, దేశం ఆర్థికంగా దిగజారిపోవడానికీ, ఆర్థిక నేరగాళ్లు దేశం విడిచి పారిపోవడానికీ గత పదేండ్లుగా అధికారంలో ఉన్న మోడీ అహంకార ప్రభుత్వమే కారణం! ఉద్యమాలలో వందల సంఖ్యలో రైతులు ప్రాణత్యాగాలు చేస్తే స్పందన ఉండదు. తాము జరిపించిన మారణకాండలకు జవాబుదారీ తనం లేదు. ఇతర రాజకీయ పార్టీలు రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే ఓర్వలేని తనం. పార్టీలను చీల్చి, అవినీతిపరుల్ని తమ పార్టీలో చేర్చుకోవడం. మీడియాతో సహా వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేయడం. దేశంలో మోడీ ప్రభుత్వం సాధించినవి (అప)జయాలు! వీటన్నిటికి తోడుగా ఇప్పుడు న్యాయవ్యవస్థను లోబరుచుకోవడాన్ని ఈ దేశ ప్రజలు స్పష్టంగా గమనించారు. అర్థం చేసుకున్నారు.

ప్రధాని వెళ్లి, చీఫ్ జస్టిస్ ఇంట్లో పూజలు చేయడమా?



కుళ్ల బుద్ధి ఎంత తగ్గింది అనేదాన్ని బట్టి, వివేకం ఎంత పెరిగింది? - అనేది కొలవొచ్చు - బౌద్ధ ధమ్మం.

అన్నీ ఆ దేవుడే చూసుకుంటాడనే నమ్మకం ఉన్నవారు తమ నిజజీవితంలో లాలూచి పడటం, కాకా పట్టడం, లంచాలివ్వడం - తీసుకోవడం, గిమ్మిక్కులు చేయడం, అబద్ధాలు చెప్పడం, కుట్రలు, కుతంత్రాలు పన్నడం మొత్తానికి మొత్తంగా ఆపేయాలి కదా? పైపైకి ఎదగడానికి ఉన్న సిద్ధహస్తులని తెలిసినపుడు, చీఫ్ జస్టిస్‌గా ఉన్నవారు ఎంత జాగ్రత్తగా ఉండాలీ? తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులివ్వకుండా ఉంటే, భవిష్యత్తులో మంచి పదవి ఇస్తానని చెప్పడానికి మోడీయే గణేష్ పూజను అవకాశంగా తీసుకున్నారా? దేశ ప్రజలకు ఎన్నెన్నో అనుమానాలున్నాయి. జస్టిస్ చంద్ర చూడ్ పదవీ విరమణ చేయగానే ఆయనకు ఏ పదవి దక్కనుందో చూడాలి.



డాక్టర్ దేవరాజు మహారాజు

అవినీతి మార్గాలన్నీ మూసేసుకోవాలి కదా? ఎవరైనా అలా చేయగలుగుతున్నారా? అన్నీ ఆదేవుడే చూసుకునేట్లయితే వీళ్లు ఎందుకు తాపత్రయపడుతున్నారు మరీ? ఏ మతస్థుడైనా సరే-తాము నమ్ముకున్న ఆ దేవుడు తమకు ఎందుకు అన్నీ సమకూర్చడం లేదూ? ఒళ్లొంచి పనిచేస్తేనే కదా కూలి డబ్బులొస్తున్నాయి. నెలంతా బండచాకిరి చేస్తేనే కదా జీతమొస్తోంది? తెలివి ఉపయోగించి వ్యాపారం చేస్తేనే కదా లాభాలొచ్చేది? మనుషులుగా వాళ్లు తమ కృషిని తాము తక్కువగా అంచనా వేసుకుంటూ, ఎక్కడా లేని ఏదో శక్తి తమకు ఆధారమౌతోందనుకుంటే ఏమన్నమాట? దానికే 'భక్తి' అని పేరుపెట్టి, ఆత్మద్రోహం చేసుకుంటు న్నారన్న మాట! తమ కష్టార్జితం తమకు దక్కిందనే ఆత్మవిశ్వాసం వారికి ఉండటం లేదన్నమాట!

ఒక్కసారి చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా చంద్రచూడ్, భారత ప్రధాని నరేంద్రమోడీ కలిసి చేసిన ఇటీవలి గణేష్ పూజ గురించి ఆలోచిద్దాం! నిజంగానే వారికి ఆ దేవుడి మీద అంత భక్తి శ్రద్ధలున్నాయా? లేక వారి పూజ వెనక మరేదైనా ఉద్దేశం ఉందా? సామాన్యులైన సగటు మనుషుల్ని పక్కన పెడదాం. ఎందుకంటే వారు ఇతరులను ప్రభావితం చేయలేరు. కానీ, ఉన్నత విద్యావంతులు, వైజ్ఞానికులు, రాజ్యాంగ బద్ధమైన అత్యున్నత పదవుల్లో ఉన్నవారు, వారి విశ్వాసాల్ని ప్రజాజీవితంలో ప్రదర్శనకు పెట్టకుండా ఉంటే మంచిది. అలా ప్రదర్శించడం వల్ల సామాన్య ప్రజలు ప్రభావితులవుతారు. పైగా, జరిగే మేలుకంటే, సమాజానికి జరిగే కీడే ఎక్కువగా ఉంటుంది. రాకెట్ సైంటిస్ట్‌గా పేరు తెచ్చుకున్న అబ్దుల్ కలాం బాబాలు, స్వాముల కాళ్ల మీదపడి - తనను, తన పదవిని, దేశ రాజ్యాంగాన్ని, దేశ ప్రజల ఆత్మ గౌరవాన్ని...అన్నింటినీ దిగజార్చారు. ఇలాంటి ఉదాహరణలు దేశంలో ఎన్నయినా చెప్పుకోవచ్చు. మతాన్నీ, మనువాదాన్ని ఆయుధాలుగా చేసుకుని, దేశ ప్రజల్ని విభజించిన ప్రధాని మోడీ, అంతర్జాతీయ వేదికల మీద ఘోరంగా అవమానాలకు గురయ్యారు. తనకు తానై చీఫ్ జస్టిస్ చంద్రచూడ్ ఇంటికి వెళ్లి, ఆయన ఇంట్లో ఒక కుటుంబ సభ్యుడిగా గణపతి పూజ చేసి - ఈ దేశ ప్రజలకు ఏమి సందేశమిచ్చారూ? 'ఎంతటి వారినైనా సరే- నేను నా వలలో పడేసుకుంటాను' అని చెప్పదలిచారా? మతాన్ని, దేవుణ్ణీ-తన నీచ రాజకీయాలకు, సరైన సమయంలో సరైన విధంగా ఉపయోగించుకుంటాను- అని ప్రకటించారా?

దేశ ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారు. చీఫ్ జస్టిస్ చంద్రచూడ్‌కు ముందు 46వ చీఫ్ జస్టిస్‌గా పనిచేసిన రంజన్ గొగోయ్ బీజేపీ ప్రభుత్వంతో లాలూచీ పడి, ప్రభుత్వ పెద్దలు కోరుకున్న తీర్పునిచ్చారు. పదవిలో నుంచి దిగిపోగానే రాజ్యసభ సభ్యుడైపోయారు. దానితో ఆయనేమైనా సంతోషపడ్డారా? లేదే-ప్రభుత్వానికి అనుకూలంగా అంత పెద్ద తీర్పునిస్తే నాకు ఇంత చిన్న పదవి కట్టబెడతారా? అని అలిగి నోరు మూసుకుని కూర్చున్నారు. తప్పుడు పని ఎప్పుడైనా తప్పుడు పనే -బాబ్రీ మసీదు భూవివాదంలో "మసీదును కులగొట్టడం ఒక నేరం-ఘోర తప్పిదం" అని సుప్రీంకోర్టు తీర్పులో ఉంది. ఆ మాట అంత స్పష్టంగా రాసినా గొగోయ్ "నేరగాళ్ల"కు ఆ భూమిని కట్టబెట్టారు. అంటే బాబ్రీమసీదును కూలగొట్టిన దుండగులకే దాన్ని అప్పగించారు... కదా? అక్కడే మోడీ ప్రభుత్వం రామాలయం నిర్మించింది. ఇంత అక్రమమైన తీర్పు ప్రకటించిన గొగోయ్ న్యాయమూర్తుల బృందంలో డి.వై. చంద్రచూడ్ కూడా ఉన్నారు. ఆ తీర్పు మీద చంద్రచూడ్ సంతకం కూడా ఉంది. ఇప్పుడు మోడీ ఇంటికొస్తే అనుమతించి ఆయనతో తన ఇంట్లో గణపతి పూజ చేయించుకుంటారా? ఒక రాజకీయ నాయకుడు ఒక చీఫ్‌జస్టిస్ కలిసి పూజలు చేస్తుంటే ఈడి, సిబిఐ, ఐటి వ్యవస్థలతో పాటు దేశంలోని న్యాయవ్యవస్థ కూడా అమ్ముడైపోయిందన్న భావన దేశ ప్రజల్లో కలగదా? దేశ ప్రజలు ఇక న్యాయం కోసం ఎక్కడికి వెళ్లాలీ?

గొప్ప అజ్ఞానిగా మోడీ ప్రతిభ విశ్వవ్యాప్తమైనప్పుడు. ఆయనా, ఆయన పార్టీ, ఆరెస్సెస్ అంతా కలిసి దేశంలో మారణకాండలు సృష్టించడంలో సిద్ధహస్తులని...


దేశంలో మత ఉగ్రవాదం పెచ్చరిల్లి పోవడానికీ, దేశం ఆర్థికంగా దిగజారి పోవడానికీ, ఆర్థిక నేరగాళ్లు దేశం విడిచి పారిపోవడానికీ గత పదేండ్లుగా అధికారంలో ఉన్న మోడీ అహంకార ప్రభుత్వమే కారణం! ఉద్యమాలలో వందల సంఖ్యలో రైతులు ప్రాణత్యాగాలు చేస్తే స్పందన ఉండదు. తాము జరిపించిన మారణకాండలకు జవాబుదారీ తనం లేదు. ఇతర రాజకీయ పార్టీలు రాష్ట్రాల్లో అధికారంలో ఉంటే ఓర్వలేని తనం. పార్టీలను చీల్చి, అవినీతిపరుల్ని తమ పార్టీలో చేర్చుకోవడం. మీడియాతో సహా వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేయడం. దేశంలో మోడీ ప్రభుత్వం సాధించినవి (అప)జయాలు! వీటన్నిటికి తోడుగా ఇప్పుడు న్యాయవ్యవస్థను లోబరుచుకోవడాన్ని ఈ దేశ ప్రజలు స్పష్టంగా గమనించారు. అర్థం చేసుకున్నారు.

భక్తి దేశభక్తి వంటి మాటలతో జనాన్ని ఎంతకాలమైనా మోసం చేయగలమన్న భ్రమలో బీజేపీ వారున్నారు. సహజంగా ఈ దేశ ప్రజలకు సహనం ఎక్కువ. అది గనక కట్టలు తెంచుకుంటే దాన్ని అపేశక్తి ఎవరికీ ఉండదు. ఆ విషయం అధికారంలో ఉన్నవారు గ్రహించుకోవడం లేదు. 2007లో సంఝోతా ఎక్స్‌ప్రెస్‌లో బాంబుదాడులు చేసి, అరవై ఎనిమిది మంది మరణానికి కారణమైన కిరాతకుడు (స్వామి) అసీమానంద కారవాన్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అసలు విషయం ఒప్పుకున్నాడు. తాము ఆరెస్సెస్ అధినేత మోహన్‌భగవత్ అనుమతితోనే ఆ ఘాతుకానికి పాల్పడ్డామని చెప్పాడు. 2005లో సూరత్‌లో జరిగిన ఆరెస్సెస్ సమావేశాలలో మోహన్ భగవత్, ఇంద్రేష్‌కుమార్‌లు అసీమానంద్‌ను, అతని సహచరుడు సునీల్ జోషిని కలిసి - ముస్లింలపై బాంబుదాడులు చేసేందుకు పథకాలు అందించారు. ఇది ఒక చిన్న ఉదాహరణ! ఈ పదేండ్లలో ఇలాంటి సంఘటనలు మన దేశంలో లక్షల్లో జరిగి ఉంటాయి. ఇంతెందుకూ జస్టిస్ లోయను చంపించినవాడు దేశానికి హోంమంత్రి అవుతాడు. ఇదెక్కడి ధర్మం? ఇంకెక్కడి న్యాయం? మరి న్యాయమూర్తులు, న్యాయవ్యవస్థా ఏం చేసినట్టూ? 'హూకిల్డ్ జస్టిస్ లోయా?' అనే పుస్తకం ప్రకటించిన రచయిత అమెరికా వైట్ హౌస్ ముందే నిరసన తెలియజేస్తూ ప్రసంగించాడు కదా? ప్రపంచ మీడియా దాన్ని విశ్వవ్యాప్తం చేసింది కదా? నా అంతటివారు లేదని ఎవరి ఇంట్లో వారు, ఎవరి దేశంలో వారు విర్రవీగితే సరిపోదు. అంతర్జాతీయ స్థాయిలో దేశ ఔన్నత్యం ఎంత దిగజార్చారన్నది కూడా అంచనా వేసుకుంటూ ఉండాలి. "సెక్యులరిజం అనే భావన మనకు యూరోప్ నుండి వచ్చిందని, మనం దాన్ని అనుసరించవల్సిన అగత్యం లేదని" - తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి ప్రకటించారు. బీజేపీ హయాంలో ఆరెస్సెస్ కార్యకర్తలందరూ గవర్నర్లయి కూచు న్నందువల్ల - ఈ ప్రజాస్వామ్య దేశానికి ఈగతి పట్టింది. కోషియారీ, ఆరిఫ్ మహ్మద్ ఖాన్, జగదీప్ ధన్‌కర్ లాంటి వారంతా ప్రతిపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకు గవర్నర్లయి అక్కడి ప్రభుత్వాలను వేధించడమే కార్యక్రమంగా పెటుకున్నారు. రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉండి, రాజ్యాంగంలోని అంశాలను తప్పుపట్టేవారికి ఆ పదవుల్లో కొనసాగే అర్హతే ఉండదు కదా?

లోగడ మోడీ అమెరికా వెళ్లినపుడు 'క్రైమ్ మినిస్టర్ ఆఫ్ ఇండియా' అని అక్కడి ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. మన దేశంలో గోదీ మీడియా ఆ విషయం చూయించలేదు. క్వాడ్ (చతుష్టయం) సమావేశాల కోసం మోడీ ఇటీవల మళ్లీ అమెరికా వెళ్లినప్పుడు, స్వయాన అమెరికా అధ్యక్షుడు బైడెనే మోడీని అవమానించాడు. దేశం లోనే కాదు, అంతర్జాతీయంగా కూడా తనకు విలువ లేకుండా పోయిందన్న సంగతి ఆ పెద్దమనిషి ఆలోచించుకునే స్థితిలో ఉన్నట్టు లేదు. అధికారం కోసం తహతహలాడే రాజకీయ నాయకులు మతాన్ని, దేవుణ్ణి, సంప్రదాయాన్ని ఉపయోగించి సమాజ స్వరూపాన్ని మార్చేస్తున్నారు. స్థాయినే దిగజార్చుతున్నారు. ఇందులో భాగంగానే, ప్రధాని చీఫ్ జస్టిస్ ఇంటికెళ్లి పూజ చేశారు. దేశ ప్రజలకు అది అభ్యంతరకరమైన చర్యే - ఇప్పుడిక చీఫ్ జస్టిస్ చంద్రచూడ్, తన నిజాయితీ దేశ ప్రజల ముందు నిరూపించుకోవాల్సి ఉంది!

- సుప్రసిద్ధ సాహితీవేత్త, జీవశాస్త్రవేత్త (మెల్బోర్న్ నుంచి)

'హైడ్రా'తో లేక్‌సిటీ సాధ్యమా...?




నిసార్ అహ్మద్
780 101 9343

హైదరాబాద్‌ను లేక్‌సిటీగా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సర్కార్ చేపట్టిన 'హైడ్రా' ఆదిలోనే విమర్శల్ని మూటకట్టుకుం టోంది. దీనికి కారణం లేకపోలేదు. చెరువులున్న ప్రాంతాల్లో కబ్జాలకు పాల్పడి బడా బాబులు నిర్మించిన విల్లాలు, గెస్ట్‌హౌస్‌లు కూల్చినపుడు నగర ప్రజల నుంచి ప్రశంసలు రాగా, ఆ చర్యలు కాస్తా సామాన్యుల ఇండ్లను తాకడంతో ఆగ్రహావేశాలు వెల్లువెత్తాయి. ఇపుడు హైడ్రా అంటే కూల్చి వేతల డిపార్ట్‌మెంటు అన్నట్లుగా ప్రజల మదిలో నాటుకుపోయింది. వాస్తవానికి కాంగ్రెస్ సర్కార్ తీసుకొచ్చిన హైడ్రా ఉద్దేశాలను ఇక్కడ తప్పుపట్టలేం. కానీ స్పష్టమైన ప్రణాళిక, పేదల ఇండ్లకు ప్రత్యామ్నాయ చర్యలు, వారిని ఒప్పించే వంటి ప్రణాళికలతోపాటు అన్ని రాజకీయ పార్టీల ఏకాభిప్రాయంతో హైడ్రా చర్యలు చేపట్టివుంటే పరిస్థితి వేరేలా ఉండేది. లేక్‌సిటీ పేరును సార్థకం చేయాలంటే అక్రమ కట్టడాలను కూల్చాల్సిందే. కానీ ఈ కబ్జాలో వెలసిన అపార్ట్‌మెంట్లు, ఇండ్లలో సామాన్య ప్రజలు ఇది కబ్జా ప్రాంతమని తెలియకుండానే అక్కడ నివాస ముంటున్నారు. ఇప్పుడు కబ్జాల తొలగింపు పేరుతో హైడ్రా పెంచిన దూకుడుతో పేదలు కూడా రోడ్డుపాలవుతున్న పరిస్థితి. కబ్జాలను తొలగిం చాలంటే బాడా బాబులతోపాటు సామాన్య, మధ్య తరగతి ప్రజల వద్దకు వెళ్లాల్సి ఉంటుందన్న ముందుచూపు, ఆ ఆలోచన లేకపోవడంతో సర్కార్‌ను ఇప్పుడు సమాజం దోషిగా నిలబెట్టింది. కాస్తా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుని, ప్రణాళికతో ముందుకు సాగితే ప్రజల నుంచే మద్దతు లభించేదన్న వాదన వాస్తవం.

మనదేశంలోని జైపూర్ అంటే పింక్‌సిటీ.. లక్నో అంటే నవాబుల నగరం.. బెంగళూరు అంటే గార్డెన్ సిటీ.. మరి మన హైదరాబాద్..? అటు కుతుబ్ షాహీలు.. ఇటు అసఫ్ జాహీలు.. మధ్యలో మొఘులులు పాలించిన నేల. భారత దేశంలో రోజురోజుకూ ఎదుగుతున్న నగరం.. ఒకప్పుడు భాగ్యనగరంగా ప్రసిద్ధిచెందిన నగరం. కానీ, రానురానూ కాంక్రీట్ జంగిల్ అవుతుందనే ఆందోళన కలుగుతోంది. పెరిగిపోతున్న నగరీకరణతో చెరువులను మింగేస్తూ భారీ భవంతుల నిర్మాణాలు వెలిశాయి. అయితే ఒకప్పుడు హైదరాబాద్‌కు ఉన్న పేరేమిటో తెలుసా...? లేక్‌సిటీ(సరస్సుల నేల). చాలా సరస్సులు 16,17వ శతాబ్దాలలో కుతుబ్ షాహీల పాలనలో నిర్మితమయ్యాయి. ఇది చాలామందికి తెలిసి ఉండదు. ఇప్పుడంటే హైడ్రా కారణంగా అందరూ చెరువుల ఆక్రమణల గురించి మాట్లాడుతున్నారు. అయ్యో ఇన్ని చెరువులు ఆక్రమణకు గురయ్యాయా? అని నోరెళ్లబెడుతున్నారు. ఏ దిక్కున చూసిన సరస్సులతో అలరారేది భాగ్యనగరం. వీటిలో సహజమైనవి కాగా, నిర్మించినవీ కూడా ఉన్నాయి. కాలక్రమంలో ఈ సరస్సులలో చాలావరకు కనుమరుగయ్యాయి. మనుగడలో ఉన్నవి ఆక్రమణలతో కుంచించుకుపోయాయి. తీగల్ కుంట, సోమాజిగూడ ట్యాంక్, మీర్ జుమ్లా ట్యాంక్, పహార్ తీగల్ కుంట, కుంట భవానీ దాస్, నవాబ్ సాహెబ్ కుంట, అఫ్జల్‌సాగర్, నల్లకుంట, మసాబ్ ట్యాంక్ ఇలా హైదరాబాద్‌లో దాదాపు కనుమరుగైన కొన్ని సరస్సులు. నగరం చుట్టుపక్కల ప్రాంతాలలో 1970లలో వివిధ పరిమాణాల్లో ఉన్న వేలాది నీటి వనరులలో నేడు 70 నుంచి 500 వరకు మాత్రమే మనుగడలో ఉన్నాయంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఆక్రమణలు, రియల్ ఎస్టేట్, ప్రాజెక్టుల కోసం వీటిని చెరబట్టారు.

1575లో నిజాంలు నిర్మించిన హుస్సేన్‌సాగర్ 1930లలో హైదరాబాదీల తాగునీటి వనరు. అతిపెద్ద సరస్సు అయిన దీని వైశాల్యం 30 ఏళ్లలో 40శాతం కంటే ఎక్కువ (550 హెక్టార్ల నుంచి 349 హెక్టార్లకు) తగ్గిపోయింది. ఇక దుర్గం చెరువు వంటి పెద్ద చెరువులు పర్యాటక కేంద్రాలుగా మారగా చిన్నవాటిని పట్టించుకోవడం మానేశారు. హైదరాబాద్‌లో ఒకప్పుడు 250పైగా మానవ నిర్మిత సరస్సులు ఉండేవి. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం గతేడాది ఫిబ్రవరి నాటికి జీహెచ్ఎంసీలోని 185 సరస్సులలో 23 ఎండి పోయాయి. కుతుబ్ షాహీల అధీనంలో గోల్కొండ ప్రఖ్యాతి చెందింది. అయితే పెరుగుతున్న జనాభా కోసం 1589లో 5వ సుల్తాన్ మహ మ్మద్ కులీ కుతుబ్ షా కొత్త నగరాన్ని నిర్మించ తలపెట్టారు. మూసీ నది దక్షిణ ఒడ్డున గోల్కొండకు తూర్పు దిశలో నిర్మించాలని దీనికి ప్రదేశం నిర్ణయించారు. నిర్మాణం ప్రారంభం సందర్భంగా కులీ కుతుబ్ షా మూసీ ఒడ్డున ఏమని కోరుకున్నాడో తెలుసా? ఈ నదిలో చేప పిల్లల్లాగే "నా కొత్త నగరాన్ని ప్రజలతో నింపు" అని. ఆయన అనుకున్నట్టే హైదరాబాద్ ప్రజలతో నిండిపోయింది. కానీ.. నదులే కాలుష్య ప్రదేశాలుగా మారిపోయాయి. మళ్లీ ఇప్పుడు హైదరాబాద్ లేక్ సిటీగా మారాలంటే కచ్చితంగా హైడ్రా అవసరమే. కాకపోతే పేదలు, సామాన్యులు, మధ్య తరగతి వారికి వారు కట్టుకున్న ఇండ్ల విలువకు సమానమైన నివాస ప్రాంతాలు చూపాలి. వారికి అవగాహన కల్పించాలి. విపక్ష పార్టీలతో ముఖ్యమంత్రే స్వయంగా సమావేశం ఏర్పాటు చేసి ఏకాభిప్రాయాన్ని తీసుకురావాలి. అప్పుడే రేవంత్‌రెడ్డి సర్కార్ ఆశించిన హైడ్రా సంకల్పం నేరవేరుతుంది. లేదంటే ఇది భవిష్యత్తులో కాంగ్రెస్‌కు గుణపాఠం నేర్పుతుంది!





మూసీ ముసుగెందుకు?

(మొదటిపేజీ తరువాయి)

ప్రధాని మోడీకి ఊడిగం చేస్తున్న మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మూసీ ప్రక్షాళనను వ్యతిరేకిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మోడీ చేసింది కరెక్టైతే తాము చేసింది తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. కేంద్రం నుంచి నిధులు రాబట్టుకునేందుకు కలిసి రావాలని ఈటలకు సూచించారు. కేటీఆర్, హరీశ్‌రావు హైడ్రాను తప్పుబడుతూ మాట్లాడిన దాని జిరాక్స్ కాపీ తీసుకుని విమర్శించడం మానుకోవాలని హితవు పలికారు. నగరం చుట్టూ బీజేపీ ఎంపీలే గెలిచారనీ, కేంద్రం నుంచి రూ.25 వేల కోట్లు తెచ్చేందుకు ముందు నిలబడాలని సవాల్ చేశారు. కంటోన్మెంట్ పరిధిలో రక్షణశాఖ భూమిలో ఉన్న పేదల ఇండ్లకు పట్టాలివ్వనున్నట్టు తెలిపారు. దానికి బదులుగా ఇప్పటికే రక్షణశాఖకు భూమికి బదులుగా భూమిని ఇచ్చినట్టు తెలిపారు. కేంద్రం నుంచి కారిడార్‌ను సాధించినట్టు తెలిపారు.

ఒక రాష్ట్రం...ఒక కార్డు

ప్రజలకందించే సంక్షేమ కార్యక్రమాలను సులభంగా అందరికీ అందుబాటులోకి తెచ్చేందుకు వీలుగా ఫ్యామిలీ ఐడీ, హెల్త్ కార్డును తీసుకొస్తున్నట్టు సీఎం తెలిపారు. ఈ కార్డు ద్వారా ఎక్కడైనా రేషన్ తీసుకునే సౌకర్యం, అనారోగ్యం బారిన పడినప్పుడు ఒక్క క్లిక్‌తో పాత ఆరోగ్య చరిత్ర తెలిసి వేగంగా వైద్యమందడం, ఆరోగ్య శ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర సంక్షేమ పథకాలకు డిజిటల్ కార్డు ఎంతో ఉపయోగపడుతుందని వివరించారు. మళ్లీ మళ్లీ వైద్య పరీక్షలు చేయాల్సిన బాధ తప్పుతుందని చెప్పారు. రాష్ట్ర హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పైలెట్ ప్రాజెక్టును ఐదు రోజుల పాటు 119 నియోజకవర్గాల్లో నియోజవర్గానికి రెండు పాయింట్ల చొప్పున నిర్వహిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు, ప్రతిపక్షాలు, మేధావుల నుంచి వచ్చే సూచనలు, సలహాలు స్వీకరిస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ సర్కారు 1.33 లక్షల ఇండ్లకు టెండర్లు పిలిచి అందులో కేవలం 65 వేల ఇండ్లను మాత్రమే పూర్తి చేసిందనీ, మిగిలిన వాటి నిర్మాణాలను కాంగ్రెస్ పూర్తి చేసిందని తెలిపారు. దసరాలోపు అర్హులకు వాటిని అందజేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీగణేష్, ఎంఐఎం ఎమ్మెల్సీలు బేగ్, హుసేంఢీ, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీతోపాటు జేఎల్ నియామకాలు చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ అభ్యర్థులకు ఈ నెల తొమ్మిదో తేదీన ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలను అందిస్తామంటూ ప్రభుత్వం ప్రకటించడం పట్ల భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. డీఎస్సీ రాసిన అభ్యర్థులు, ప్రధానంగా మంచి ర్యాంకు పొంది ఉద్యోగం సాధించారని తెలిపారు. వారిలో కొందరు జూనియర్ లెక్చరర్ (జేఎల్) రాతపరీక్షల్లో కూడా మంచి ర్యాంకు సాధించారని పేర్కొన్నారు. దీని వల్ల డీఎస్సీలో ఉద్యోగం సాధించిన అభ్యర్థి జేఎల్ ఉద్యోగం సాధిస్తే ఆ తర్వాత ఉపాధ్యాయ పోస్టులను వదిలేసే అవకాశం ఉంటుందని వివరించారు. అందుకే జేఎల్ పోస్టుల తుది ఫలితాలను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ నియామకాలతో పాటు జేఎల్ నియామకాలను కూడా చేపడితే ఈ సమస్యలు తలెత్తే అవకాశం ఉండబోదని తెలిపారు. అభ్యర్థులకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయ ఖాళీలు మిగిలే అవకాశం ఉండబోదని వివరించారు.

సమంతపై కొండా సురేఖ వ్యాఖ్యలు సరికాదు

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ పూజ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

సినీ నటి సమంతపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు సరికాదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర గర్ల్స్ కన్వీనర్ మక్కపల్లి పూజ తెలిపారు. గౌరవప్రదమైన పదవిలో మహిళా మంత్రిగా ఉండి ఇంకో మహిళపైన అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయటం ఎంత వరకు సమంజసమని గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆమె తన రాజకీయ లబ్ది కోసం ఇతరుల వ్యక్తిగత విషయాలను లాగడం సరైంది కాదని తెలిపారు. మంత్రి పదవిలో ఉండి అమ్మాయిల రక్షణ కోసం ఆలోచించకుండా ఇష్టం వచ్చినట్టు కించపరిచేలా మాట్లాడ్డం ఏంటని ప్రశ్నించారు. సమంత రాజ్యాంగ బద్ధంగా తన భర్త నుంచి విడాకులు తీసుకున్నారనీ, దాన్ని రాజకీయం కోసం వాడుకోవడం సరైంది కాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, వాటిపై ప్రభుత్వం, మంత్రులు స్పందించాలని కోరారు. ఆడపిల్లలపై రోజూ లైంగిక దాడులు జరుగుతున్నాయనీ, వాటి గురించి మాట్లాడకుండా సినీనటుల వ్యక్తిగత అంశాలను మాట్లాడి రాజకీయ లబ్ది పొందాలని చూడొద్దని కోరారు.

పూర్తయిన లాసెట్ తుదివిడత కౌన్సెలింగ్

- 2,991 మందికి సీట్ల కేటాయింపు
- 7వ తేదీ వరకు కాలేజీల్లో చేరేందుకు అవకాశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ తుదివిడత ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియలో సీట్లు కేటాయించారు. ఈ మేరకు లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్ఎల్‌బీ తుదివిడత కౌన్సెలింగ్‌లో మూడేండ్ల లా కోర్సులో 2,030 సీట్లు, ఐదేండ్ల లా కోర్సులో 1,128 సీట్లు కలిపి మొత్తం 3,158 సీట్లు కన్వీనర్ కోటాలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 10,610 మంది వెబ్‌ఆప్షన్లు నమోదు చేశారని పేర్కొన్నారు. ఎల్ఎల్‌బీ మూడేండ్ల కోర్సులో 2,016 మంది, ఎల్ఎల్‌బీ ఐదేండ్ల కోర్సులో 975 మంది కలిపి మొత్తం 2,991 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని వివరించారు. లాసెట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 5,363వ మంది సీట్లు కేటాయిస్తే, 3,374 మంది కాలేజీల్లో రిపోర్టు చేశారని తెలిపారు. తుది విడత కౌన్సెలింగ్ సీట్లు కేటాయించిన అభ్యర్థులు ఈ నెల ఏడో తేదీ వరకు కాలేజీల్లో చేరాలని కోరారు.

సీఎం వ్యాఖ్యలపై నిరుద్యోగుల విస్మయం

- కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి హోదాలో ఉండి గ్రూపు-1 పరీక్షలు పూర్తికాకముందే ఫలితాలు అనటం రేవంత్‌రెడ్డికి తగదని బీఆర్ఎస్ నేత, కార్పొరేషన్ మాజీ చైర్మెన్ కేతిరెడ్డి వాసుదేవ రెడ్డి అన్నారు. ఆయన మాటలపై నిరుద్యోగులు విస్మయం వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎంకు ప్రసంగాలు రాసిచ్చేవారు సరిగ్గా లేనట్టుందని విమర్శించారు. నిరుద్యోగుల వ్యాట్సాప్ గ్రూపుల్లో మతిమరుపు సీఎం అని పోస్టులు చక్కర్లు కొడుతున్నాయన్నారు. మతిమరుపు సీఎంను మార్చాలని రాహుల్‌గాంధీని కోరారు. రెండు లక్షల ఉద్యోగాలని అధికారంలోకి వచ్చి పదినెలలు పూర్తవుతున్నా రెండువేల ఉద్యోగాలు కూడా భర్తీ చేయలేదని విమర్శించారు. అంబేద్కర్ యూనివర్సిటీకి పదెకరాలు ఇవ్వాలని ప్రతిపాదనలు సిద్ధమైనా ఎందుకు ఇవ్వడం లేదని, మాసబ్‌ట్యాంక్‌లోని ఫైన్ ఆర్ట్స్ కాలేజీని తరలించడం వెనుక ఉన్న మతలబు ఏంటని ప్రశ్నించారు. గురుకుల పాఠశాల ఉపాధ్యాయుల నియమాకాల్లో కూడా ఇష్టానుసారంగా వ్యవహరించారని విమర్శించారు. నియమితులైన కొత్త అభ్యర్థులకు వెంటనే వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యావ్యవస్థ గాడితప్పిందని, ఆ శాఖకు వెంటనే మంత్రిని నియమించాలని రాహుల్‌గాంధీని కోరారు.

జేఎల్ తుది ఫలితాలు విడుదలయ్యేలా చూడండి

టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు అభ్యర్థుల వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ లెక్చరర్ (జేఎల్) పోస్టులకు తుది ఫలితాలు త్వరగా విడుదలయ్యేలా చొరవ చూపాలని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ బి మహేష్‌కుమార్‌గౌడ్‌కు పలువురు అభ్యర్థులు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. పాఠశాలలతో పాటు, ప్రభుత్వ జూనియర్ కాలేజీలను కూడా బలోపేతం చేయాలంటే 1,392 జేఎల్ పోస్టులకు తుది ఫలితాలను ప్రకటించి నియామక పత్రాలను అందించాలని కోరారు. డీఎస్సీ అభ్యర్థులకు ఫలితాలు ప్రకటించి నియామకపత్రాలను ఈ నెల తొమ్మిదిన ఎల్బీ స్టేడియంలో అందిస్తామంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. అదే తరహాలో పెండింగ్‌లో ఉన్న జేఎల్ తుది ఫలితాలను కూడా ప్రకటించాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం కోసం చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. కాలేజీలను బలోపేతం చేయడంతో పాటు నాణ్యమైన విద్యను అందించేందుకు తమ వంతు కృషి చేస్తామని వివరించారు. దసరా పండుగలోపు జేఎల్ నియామకాలను చేపట్టాలని తెలిపారు. తమ ఆందోళనను అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సానుకూలంగా స్పందించిన మహేష్‌కుమార్ గౌడ్

దీనికి స్పందించిన మహేష్‌కుమార్‌గౌడ్ టీజీపీఎస్సీ చైర్మెన్‌కు ఫోన్ చేసి జేఎల్ ఫలితాలు త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అంతకుముందు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఆర్ట్స్ కళాశాల వద్ద, టీజీపీఎస్సీ కార్యాలయం వద్ద జేఎల్ అభ్యర్థులు శాంతియుతంగా నిరసన చేపట్టారు. 56 రోజుల్లో డీఎస్సీ ఫలితాలను ప్రకటించి 65 రోజుల్లోనే నియామకపత్రాలను ఉపాధ్యాయ అభ్యర్థులకు ఇవ్వడం సంతోషకరమని తెలిపారు. అయితే 2002లో టీజీపీఎస్సీ జేఎల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చిందనీ, అప్పటి నుంచి నియామక పత్రాల కోసం ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేఎల్ అభ్యర్థులు లింగనాయక్, వేణు, వీణ చారి, సతీష్ కుమార్, ప్రకాష్ నాయక్, చిదంబరం, శశికళ, చిత్ర దేవి, సాజిదా తదితరులు పాల్గొన్నారు.

పేదోళ్ల భూముల జోలికి రావొద్దు

నవతెలంగాణ-న్యాల్‌కల్



ప్రభుత్వ భూములకు పట్టాలిస్తామని వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్ గాంధీ ద్వారా ఆనాడు చెప్పించారని, అధికారంలోకి వచ్చాక పట్టాలిచ్చుడు దేవుడెరుగు, ఉన్న భూములను కూడా గుంజుకునే పరిస్థితిని సీఎం రేవంత్‌రెడ్డి తెచ్చారని, ఆయనకు మొట్టికాయలు వేస్తారో.. బుద్ధి చెప్తారో.. కానీ.. తమ పేదోళ్ల భూముల జోలికి రావొద్దంటూ రాహుల్ గాంధీని ఉద్దేశించి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఓట్లప్పుడు గల్లీ గల్లీ తిరిగి.. గద్దెనెక్కినాక ఢిల్లీలో కూర్చున్నారని, ఇప్పుడైనా ఆయన స్పందించాలని కోరారు. సంగారెడ్డి జిల్లా న్యాల్కల్ మండలంలోని డప్పూర్, వడ్డి, మల్గి గ్రామాల్లో ఫార్మాసిటీ పేరుతో ప్రభుత్వం 2000కుపైగా ఎకరాల భూములను సేకరిస్తున్న తరుణంలో దానికి నిరసనగా ఆయా గ్రామాలకు చెందిన రైతులు కొన్ని రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్న సంగతి తెలిసిందే. కాగా, గురువారం ఆ రైతులకు మద్దతుగా ఆయా గ్రామాల్లో హరీశ్‌రావు పర్యటించారు. డప్పూర్‌లో కాలినడకన వెళ్తూ పత్తి, పుదీనా లాంటి పంట పొలాలను పరిశీలించారు. ఈ క్రమంలో లక్ష్మి, లలితమ్మ అనే ఫార్మాసిటీ భూ బాధితులు ఆయనతో తమ గోడును వెల్లబోసుకున్నారు. మూడు పంటలు పండే భూములను గుంజుకుంటే తాము ఎలా బతకాలని వాపోయారు. తాత ముత్తాతల నుంచి సాగు చేస్తున్న భూములను గుంజుకోవాలను కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా డప్పూర్‌లో నిర్వహించిన సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, పిచ్చోడి చేతిలో రాయిలా రేవంత్‌రెడ్డి పాలన ఉన్నదని తీవ్ర విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో 15వేలకు పైగా ఫార్మా కంపెనీలుండగా.. ఆ కాలుష్యాన్ని ఇక్కడికి ఎందుకు తీసుకొస్తున్నారని సీఎంని ప్రశ్నించారు.

అక్కడ రియల్ ఎస్టేట్ చేసి.. ఇక్కడ పెట్టుబడులు పెడతావా అంటూ ఆరోపించారు. పచ్చని సాగుతో ఉన్న బంగారం లాంటి భూముల్లో ఫార్మా కంపెనీ ఏర్పాటు చేస్తే రైతుల బతుకులు ఆగమవుతాయన్నారు. మూడు పంటలు పండే భూములను గుంజుకునే ప్రయత్నం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఫార్మా పేర.. మంజీరా నీటిలో విషం కలుపుతారా? అంటూ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎట్టి పరిస్థితుల్లో ఇక్కడి భూములను ఫార్మాలకు ఇచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వం బుల్డోజర్లు, ప్రొక్లైనర్లు పంపినా వాటికి అడ్డు నిలబడుతామని తెలిపారు. రైతుల భూముల్లోకి వారు రావాలంటే తమపైనుంచే రావాలంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే రైతుల కోసం గ్రీన్ ట్రిబ్యునల్‌ను కూడా ఆశ్రయిస్తానన్నారు. ఎంతవరకైనా సిద్ధమేనని, ఎట్టి పరిస్థితుల్లో సాగు భూములిచ్చే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో పేదల ఇండ్లు కూల్చడం దుర్మార్గమన్నారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, మాజీ ఎమ్మెల్యేలు భూపాల్‌రెడ్డి, క్రాంతి కిరణ్, ముఖ్య నాయకులు మల్కాపురం శివకుమార్, దేవీప్రసాద్, యాదవ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రవీందర్, స్థానిక నాయకులు భాస్కర్, నరసింహారెడ్డి తదితరులు ఉన్నారు.

వికలాంగుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుంది

- టీవీసీసీ చైర్మెన్ ఎం వీరయ్య
- ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర మహాసభల లోగో ఆవిష్కరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని టీవీసీసీ చైర్మెన్, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘం చైర్మెన్ ఎం వీరయ్య తెలిపారు. గురువారం హైదరాబాద్ హయత్‌నగర్‌లోని చైర్మెన్ క్యాంపు కార్యాలయంలో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర 4వ మహాసభల లోగోను రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్, కార్యదర్శి ఎం అడివయ్య, రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె రాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు పి శశికల, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు చంద్రమోహన్‌లతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎం.వీరయ్య మాట్లాడుతూ.. వికలాంగుల సమస్యలపై ఎన్‌పీఆర్‌డీ అనేక పోరాటాలు చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వికలాంగుల వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్త ఉద్యమాలు చేస్తోన్నదని తెలిపారు. వికలాంగుల చట్టాలను మార్చాలని బీజేపీ ప్రభుత్వం చేసిన కుట్రలను సంఘం తిప్పికొట్టి, హక్కులను కాపాడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో వికలాంగులకు 5 శాతం రిజర్వేషన్, విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్ అమలుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పదేండ్లలో జరిగిన అన్యాయన్ని కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరగనివ్వబోమని అన్నారు.

మహాసభల్లో వికలాంగుల సంక్షేమం, అభివృద్ధికి తీసుకునే చర్యలను చర్చించాలన్నారు. ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు కె వెంకట్, ఎం. అడివయ్య మాట్లాడుతూ.. గ్రేటర్ హైదరాబాద్‌లో మొదటి సారిగా అక్టోబర్ 25-27 తేదీల్లో ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

మహాసభల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వికలాంగుల వ్యతిరేక విధానాలపై చర్చిస్తామన్నారు. మహాసభల సందర్భంగా వికలాంగుల సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సభలను ప్రారంభించేందుకు మంత్రి సీతక్కతో పాటు టీవీసీసీ చైర్మెన్ ఎం వీరయ్య, ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నంబూరాజన్, హెలెన్ కెల్లర్ విద్యా సంస్థల చైర్మెన్ పి ఉమర్ ఖాన్, సెయింట్ మేరీ విద్యా సంస్థల చైర్మన్ కేవీకే రావు, టీఎఎస్ఎల్‌పీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ నాగేందర్, డాక్టర్ ఇమద్ ఖాన్ రూమన్‌తో పాటు అధికారులు, ఎన్‌జీఓ ప్రతినిధులు, వికలాంగుల సంఘాల ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు.

రైల్వే ఉద్యోగులకు బోనస్

(మొదటిపేజీ తరువాయి)

(పీఎల్ఆర్) పథకాన్ని సవరించడానికి కేంద్రమంత్రివర్గం ఆమోదించింది. ఈ సవరించిన పీఎల్ఆర్ పథకం ద్వారా దాదాపు 20,704 మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరుతుంది. ఇందుకు దాదాపు రూ.200 కోట్ల వ్యయం అవుతుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

చెన్నై మెట్రో ఫేజ్-2కు పచ్చజెండా

మూడు కారిడార్‌లతో కూడిన చెన్నై మెట్రో రైలు ప్రాజెక్ట్ ఫేజ్-2 కోసం కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఆమోదించబడిన లైన్ల మొత్తాన్ని 118.9 కిలో మీటర్ల మేర పొడవు 128 స్టేషన్లతో నిర్మిస్తారు. ప్రాజెక్ట్ పూర్తి వ్యయం రూ.63,246 కోట్లు కాగా, 2027 నాటికి పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించారు. ఫేజ్-2 పూర్తి స్థాయిలో అమల్లోకి వచ్చిన తరువాత, చెన్నై నగరం మొత్తం 173 కిలో మీటర్ల మేర మెట్రో రైలు నెట్‌వర్క్‌ను కలిగి ఉంటుంది.

రెండు పథకాల కిందకు అన్ని పథకాలు

కేంద్ర వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కింద పని చేస్తున్న అన్ని కేంద్ర ప్రాయోజిత పథకాలను (సీఎస్ఎస్) రెండు పథకాల కిందకు మార్చాలని వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ప్రతిపాదనకు కేంద్ర మంత్రి వర్గం ఆమోదం తెలిపింది.

ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (పీఎం-ఆర్‌కేవీవై), క్రిషోన్నతి యోజన (కేవై) కిందకు ఈ పథకాలు రానున్నాయి. పీఎం-ఆర్‌కేవీవై స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తుందని, కెవై ఆహార భద్రత, వ్యవసాయ స్వయం సమృద్ధిని పరిష్కరిస్తుందని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ఈ రెండు పథకాల ప్రతిపాదిత వ్యయం రూ.1,01,321.61 కోట్లతో అమలు చేయబడుతుంది.

ఎడిబుల్ ఆయిల్స్, నూనెగింజల జాతీయ మిషన్‌కు ఆమోదం

దేశీయ నూనెగింజల ఉత్పత్తిని పెంపొందించడం, వంట నూనెలలో స్వావలంబన (ఆత్మనిర్భర్ భారత్) సాధించడం కోసం ఎడిబుల్ ఆయిల్స్ - నూనెగింజల జాతీయ మిషన్ (ఎన్ఎంఈఓ-నూనె గింజలు)కు ఆమోదం తెలిపింది. 2024-25 నుంచి 2030-31 వరకు ఏడేండ్ల వ్యవధిలో మిషన్ రూ.10,103 కోట్ల ఆర్థిక వ్యయంతో అమలు చేయబడుతుంది.

ఐదు భాషలకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదా

మరాఠీ, పాళీ, ప్రాకృతం, అస్సామీ, బెంగాలీ భాషలకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదా కల్పించేందుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సాంప్రదాయ భాషలు భారతదేశం లోతైన, ప్రాచీన సాంస్కృతిక వారసత్వానికి సంరక్షణగా పని చేస్తాయని, ప్రతి వర్గం చారిత్రక, సాంస్కృతిక మైలురాయి సారాంశాన్ని కలిగి ఉంటుందని పేర్కొంది.

ఇంటర్నేషనల్ ఎనర్జీ ఎఫిషియెన్సీ హబ్‌లో ఇండియా

'లెటర్ ఆఫ్ ఇంటెంట్'పై సంతకం చేయడాన్ని కేంద్ర మంత్రి వర్గం ఆమోదించింది. ఇండియా ఇంటర్నేషనల్ ఎనర్జీ ఎఫిషియెన్సీ హబ్‌లో చేరనుంది. ఇది సహకారాన్ని పెంపొందించడానికి, ప్రపంచ వ్యాప్తంగా ఇంధన సామర్థ్యాన్ని ప్రోత్సహించడానికి అంకితమైన ప్రపంచ వేదికని తెలిపింది.

దుబ్బాకలో పొలిటికల్ హీట్

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ కాన్వాయ్‌పై కోడిగుడ్లతో దాడి
- కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ పరస్పర నినాదాలు



నవతెలంగాణ-దుబ్బాక

సిద్దిపేట జిల్లా దుబ్బాకలో పొలిటికల్ హీట్ రాజుకుంది. ఇటీవలే ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కోసం దుబ్బాకకు వచ్చిన నాటి నుంచి ప్రతిరోజు కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకుల మధ్య సోషల్ మీడియా వార్ నడుస్తోంది. ఈ క్రమంలో గురువారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయంలో జరుగుతున్న కౌన్సిల్ సమావేశానికి హాజరయ్యేందుకు వస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డిని కాంగ్రెస్ నేతలు అడ్డుకునేందుకు యత్నించారు. మంత్రి కొండా సురేఖకు ఎమ్మెల్యే క్షమాపణ చెప్పాలంటూ పట్టణంలోని ఛత్రపతి శివాజీ విగ్రహ చౌరస్తా వద్ద అప్పటికే వేచి ఉన్న కాంగ్రెస్ నాయకులు ఆయన కాన్వాయ్‌పై కోడిగుడ్లను విసరగా, కొద్ది దూరంలో రోడ్డుపై పడ్డాయి. ఈ ఘటనతో ఆగ్రహించిన పలువురు బీఆర్ఎస్ శ్రేణులు.. తమ ఎమ్మెల్యేపై కోడిగుడ్లతో దాడి చేస్తారా అంటూ చెప్పులను చూపించారు. దాంతో ఎమ్మెల్యే డౌన్ డౌన్ అంటూ కాంగ్రెస్ నాయకులు, సీఎం డౌన్‌డౌన్ అంటూ బీఆర్ఎస్ నాయకులు పరస్పర నినాదాలు చేసుకోవడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీఐ పి.శ్రీనివాస్ నేతృత్వంలో దుబ్బాక, భూంపల్లి ఎస్ఐలు గంగరాజు, హరీష్ గౌడ్ తమ సిబ్బందితో కలిసి ఇరు పార్టీల గ్రూపులను నిలువరించి ఎమ్మెల్యేను అక్కడి నుంచి పంపించారు.

సీఎం మాట తీరు తెలంగాణ గమనిస్తున్నది

- మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుల ఫాంహౌజ్‌లు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయి. కూల్చాలా? వద్దా?' అంటూ సీఎం చేసిన వ్యాఖ్యలపై ఎక్స్ వేదికగా ఆమె స్పందించారు. "రేవంత్ రెడ్డి గారు ఆత్మాభిమానం కన్నా మించిన ఆస్తి లేదని నమ్ముతున్న వ్యక్తిని నేను. మీ ముందు కానీ, ఇంకెవరి ముందు కానీ పేద ఏడుపులు ఏడ్చిన సందర్భం నాకు ఆ దేవుడు కలిగించలేదు. మిమ్మల్ని, మీ మాట తీరును తెలంగాణ సమాజం గమనిస్తున్నది, మీ విజ్ఞతకే వదిలేస్తున్నా. మా అబ్బాయి కడుతున్న ఇల్లు మినహాయించి, మిగతా మూడు ఫామ్‌హౌజ్‌లు ఎక్కడున్నాయనే వివరాలు ప్రజల ముందు పెట్టండి. నన్ను వ్యక్తిగతంగా టార్గెట్ చేసినా ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటా" అంటూ సబితా ఇంద్రారెడ్డి సున్నితంగా హెచ్చరించారు.

వైవాహిక లైంగికదాడిని నేరంగా పరిగణించలేం

- 'సుప్రీం'కు కేంద్రం అఫిడవిట్ దాఖలు
- అలాంటి దారుణాలు చట్టబద్ధమైన అంశానికి మించినవి



న్యూఢిల్లీ: వైవాహిక లైంగికదాడిని నేరంగా పరిగణించాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం పేర్కొంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే తగిన శిక్షలు ఉన్నాయని వెల్లడించింది. ఇది చట్టబద్ధమైన అంశానికి మించిన సామాజిక సమస్య అని సమాజంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని తెలిపింది. అందుకే దీనిపై ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు భాగస్వామ్య పక్షాలతో విస్తృత సంప్రదింపులు జరపాల్సిన అవసరముందని స్పష్టం చేసింది. ఈ మేరకు సర్వోన్నత న్యాయస్థానంలో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది. వైవాహిక అఘాయిత్యాన్ని నేరంగా పరిగణించాలంటూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిని వ్యతిరేకించిన కేంద్ర ప్రభుత్వం.. మైనర్ కాని భార్యను లైంగికంగా బలవంతం చేస్తే లైంగికదాడిగా పరిగణించలేమని పేర్కొంది. ఒకవేళ అలా చేస్తే దాంపత్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వివాహ వ్యవస్థలోనూ తీవ్ర అవాంతరాలకు దారితీస్తుందని తెలిపింది. వైవాహిక లైంగికదాడిని నేరంగా పరిగణించే అంశం సుప్రీంకోర్టు పరిధిలోకి రాదని.. అన్ని రాష్ట్రాలు, భాగస్వామ్య పక్షాల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా దీనిపై ఓ నిర్ణయం తీసుకోలేమని వెల్లడించింది.

వివాహం చేసుకోవడం వల్ల మహిళ 'సమ్మతి' తొలగిపోయినట్టు కాదని, దాన్ని ఉల్లంఘిస్తే తగిన శిక్షలున్నాయని కేంద్రం ఉద్ఘాటించింది. వివాహిత సమ్మతిని రక్షించేందుకు చట్టపరమైన నిబంధనలు సహా ఇతర పరిష్కార మార్గాలను పార్లమెంట్ అందించిందని తెలిపింది. మహిళా స్వేచ్ఛ, గౌరవం, హక్కులను రక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని అఫిడవిట్‌లో స్పష్టం చేసింది.



విభిన్న రేడియోలతో గిన్నిస్‌లోకి...

- యూపీ వ్యక్తి ఘనత

లక్నో : యూపీలోని ఒక వ్యక్తి గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా గుర్తింపు పొందాలనే తన చిరకాల వాంఛను తీర్చుకున్నారు. అతిపెద్ద రేడియో సేకరణ ద్వారా ఆయన ఈ ఘనతను సాధించారు. 1,257 రకాల ప్రత్యేక రేడియోలను కలిగి ఉన్న రామ్ సింగ్ బౌద్ధ్ ఎట్టకేలకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్‌లో తన పేరును లిఖించుకున్నాడు. దాదాపు ఒక ఏడాది తర్వాత గిన్నిస్ రికార్డు కీపరుతీ విషయాన్ని ధృవీకరిచారు. అమ్రోహా జిల్లాలోని గజ్రౌలాకు చెందిన రామ్‌సింగ్.. వాస్తవానికి 1400 రేడియోలను కలిగి ఉన్నాడు. అయితే, గిన్నిస్ మార్గదర్శకాలు ప్రతి రేడియో ప్రత్యేకంగా ఉండాలని నిర్దేశించాయి. ఫలితంగా, 'డూప్లికేట్'లు మినహాయించబడ్డాయి. దీంతో ఆ సంఖ్య 1257కు పడిపోయినా.. రికార్డు మాత్రం రామ్ సింగ్‌కే స్వంతమైంది. 2005 జులైలో 625 విభిన్న రేడియోల సేకరణను చేసిన ఎం. ప్రకాశ్ రికార్డులోకెక్కారు. అయితే, ఇప్పుడు ఆయన పేరును రామ్ సింగ్ చెరిపేశారు. రామ్ సింగ్.. వేర్ హౌజ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో సూపర్‌వైజర్‌గా పదవీ విరమణ చేశారు. కాగా, ఇటీవలి విజయం.. తన స్వగ్రామంలో రేడియోలకు అంకితమైన మ్యూజియాన్ని స్థాపించాలనే ఆశను ఆయనలో రేకెత్తించింది. మ్యూజియం నిర్మించటానికి తన ప్రయత్నాలు భవిష్యత్ తరాలకు మన సమాజంపై రేడియో ప్రభావం గురించి తెలుసుకోవటానికి సహాయపడతాయని తాను ఆశిస్తున్నట్టు రామ్ సింగ్ చెప్పాడు. కాగా, రామ్ సింగ్ కలెక్షన్లలో పురాతనమైనది 1920కి చెందిన రేడియో కావటం విశేషం.

పేదల ఇండ్లపై ప్రతాపమొద్దు

- బడాబాబులు, రాజకీయ నేతల నిర్మాణాలపై చూపాలి : సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి సవాల్
- రాష్ట్రంలో ఆర్‌ఆర్, ఆర్జీ ట్యాక్స్‌ల వసూలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన ప్రతాపాన్ని పేదల ఇండ్లపై కాకుండా అనేక చెరువుల్లో రాజకీయ నేతలు, బడాబాబులు కబ్జా చేసి కట్టిన నిర్మాణాలపై చూపాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. పేదల ఇండ్లపై గడ్డపార పడితే ఈ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమని హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. హైడ్రా అంటే రేవంత్ రెడ్డేనని విమర్శించారు. ఫాతిమా కాలేజీని ఎందుకు కూల్చడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. పేదల ఇండ్లను కూలుస్తున్నారనీ, వారి పిల్లలకు విద్యా సంవత్సరం లేదా అని నిలదీశారు. అక్కడ చదువుకుంటున్న పిల్లలు ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. ప్రజల దృష్టిని పక్కదారి పట్టించేందుకు గతంలో కేసీఆర్ కూడా ఇలాగే వ్యవహరించారని విమర్శించారు. హిమాచల్ ప్రదేశ్ ఆర్థిక పరిస్థితే తెలంగాణలో రాబోతుందన్నారు. తెలంగాణలో ఆర్‌ఆర్, ఆర్జీ ట్యాక్స్‌లు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇందిరమ్మ రాజ్యం వస్తుందని రాహుల్ చెప్పారనీ, హైడ్రా కూల్చివేతలపై ఆయన ఇప్పుడు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. సమస్యలను పక్కదారి పట్టించేందుకు కుటుంబాలు, మహిళల గురించి మాట్లాడటం బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలకు అలవాటైపోయిందని విమర్శించారు. ఇలా మాట్లాడేవారిని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని మీడియా యాజమాన్యాలను కోరారు. కొందరు నేతల చౌకబారు వ్యాఖ్యలు రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ ఫోన్ ట్యాపింగ్‌తో అనేక కుటుంబాల అంతర్గత విషయాలు విన్నారని కోర్టులో అఫిడవిట్ వేశారని ఆయన గుర్తుచేశారు. తెలంగాణ ప్రజలు ఆ రెండు పార్టీలను బహిష్కరించాలని కోరారు.

మూసీ ప్రక్షాళనపై కేటీఆర్‌ది రెండు నాల్కల ధోరణి

- నదికి ఇరువైపులా 55 కి.మీటర్ల హద్దులు గీసింది మీరే కదా
- అజ్ఞానపూరితంగా అధికార పక్షాన్ని బద్‌నాం చేస్తారా? : టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మూసీనది ప్రక్షాళనపై మాజీ మంత్రి కేటీఆర్ రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తున్నారని టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ విమర్శించారు. ఇది ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మున్సిపల్ శాఖ మంత్రిగా కేటీఆర్ అధ్యక్షతన నానక్‌రామ్ గూడలోని హైదరాబాద్ గ్రోత్ కారిడర్ కార్యాలయంలో అప్పటి మూసీ రివర్ డెవలప్‌మెంట్ చైర్మెన్ సుధీర్‌రెడ్డి, స్పెషల్ సీఎస్ అర్విందకుమార్, ఎంఆర్‌డీసీఎల్ ఎండీ ఐపీఎస్ అధికారి విశ్వజిత్, ఆర్డీవోలు వెంకటేశ్వర్లు, చంద్రకళ, మాలతిలతో (2022, జనవరి) సమీక్షా సమావేశం నిర్వహించారని గుర్తు చేశారు. మూసీనది బఫర్ జోన్ పరిధి ఎడమ వైపు 55 కి.మీటర్లు, కుడి వైపు 55 కి.మీటర్లు హద్దులు నిర్ధారించాలని ఆదేశించింది మీరే కదా? అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి మూసీ ప్రక్షాళన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్‌తో ప్రజలను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఉస్మాన్‌సాగర్, హిమాయత్ సాగర్ జలాశయాలు కలుషితం కాకూడదనే ఉద్దేశంతో 84 గ్రామాల్లో క్యాచ్ మెంట్ ఏరియాను నిర్ధారిస్తూ 1996లో జీవో 111ను అప్పటి ప్రభుత్వం తీసుకొచ్చిందని గుర్తు చేశారు. కేవలం రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే మూసీపై కేటీఆర్ విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు. మూసీ నిర్వాసితులకు మెరుగైన నష్ట పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన వివరించారు.

6 నుంచి జూనియర్ కాలేజీలకు దసరా సెలవులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, గురుకుల జూనియర్ కాలేజీలకు ఈ నెల ఆరో తేదీ నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి శ్రీదేవసేన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 13 వరకు సెలవులుంటాయని తెలిపారు. 14న జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. డీఐఈవోలు అన్ని కాలేజీలు సెలవులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నిబంధనలను అన్ని జూనియర్ కాలేజీ యాజమాన్యాలు పాటించాలని కోరారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెండు నుంచి 14వ తేదీ వరకు రాష్ట్రంలోని పాఠశాలలకు దసరా సెలవులను ప్రకటించిన విషయం తెలిసిందే. 15న పాఠశాలల్లో తరగతులు ప్రారంభమవుతాయి.

పరిశుభ్రతను కాపాడుకోవాలి

- ఐసీఏఆర్ క్రీడా డైరెక్టర్ డాక్టర్ వీకే సింగ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మన పరిసర ప్రాంతాల్లో పరిశుభ్రతను కాపాడుకోవాలని ఐసీఏఆర్ క్రీడా డైరెక్టర్ డాక్టర్ వీకే సింగ్ సూచించారు. గురువారం హైదరాబాద్‌లోని సంతోష్‌నగర్‌లోని క్రీడా కార్యాలయంలో గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛ భారత్ దివస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుభ్రత డ్రైవ్‌లో భాగంగా పాత రికార్డులను తొలగించడం, పారవేయడం, సేంద్రియ వ్యర్థాలను కంపోస్ట్ ఉత్పత్తికి వినియోగించడం, డ్రెయినేజీ, నీటి మార్గాలను శుభ్రపరచడం, నీటి స్తబ్దతను తొలగించడం వంటి కార్యక్రమాలను చేయాలని కోరారు. సింగిల్ ప్లాస్టిక్ విధానాన్ని మానేసి, తిరిగి పదార్థాల కోసం వినియోగించడం, రీసైకిల్ చేయడం కోసం చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు.

ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సహకారాన్ని అందించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ట్రిపుల్ ఆర్ చుట్టుపక్కల భూములున్న రైతులంతా పెద్దసంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చెరుపల్లి మాట్లాడుతూ ఓఆర్‌ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు అన్ని భాగాల్లో 40 కిలోమీటర్లు అలైన్‌మెంట్ చేపట్టిన ప్రభుత్వం ఉత్తరభాగం చౌటుప్పల్‌లో మాత్రం 28 కిలోమీటర్ల పరిధిలో జంక్షన్ తీసుకోవడం వల్ల రైతులకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలకు లబ్ది చేకూర్చేందుకు అలైన్‌మెంట్‌ను మార్చారని విమర్శించారు. అక్కడి బాధిత రైతులందరికీ 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎనిమిది మంది ఎంపీలున్న బీజేపీ, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రైతులకు న్యాయం చేయాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ట్రిపుల్ ఆర్ రైతులకు న్యాయం చేస్తామని చెప్పిన కాంగ్రెస్ అధికారం చేపట్టిన తర్వాత మాట మార్చిందని అన్నారు. గతంలో బాధితులతో కలిసి అలైన్‌మెంట్ మార్చాలని ధర్నాలు చేసిన ఆ పార్టీ నేతలు అధికారం చేపట్టిన తర్వాత 28 కిలోమీటర్ల పరిధికి దాన్ని కుదించారని విమర్శించారు. భూములు కోల్పోతున్న రైతులకు మార్కెట్ ధరల ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ మాట్లాడుతూ చౌటుప్పల్ ప్రాంతంలో ఉన్న దివీస్‌తో పాటు పలు ఫార్మా కంపెనీల ఒత్తిడికి తలొగ్గిన



ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను కుదించిందని విమర్శించారు. ఫలితంగా ప్రభుత్వానికి అదనపు భారం పడటంతో పాటు రైతులు నష్టపోతున్నారని అన్నారు. తమిళనాడు లాంటి రాష్ట్రాల్లో పరిహారం రూ.రెండు కోట్ల వరకు చెల్లిస్తున్నారనీ, ఇక్కడ కూడా అదే పద్ధతిలో చెల్లించాలని డిమాండ్ చేశారు. మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ట్రిపుల్ ఆర్‌లో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు వెంటనే నష్టపరిహారం ఇవ్వాలనీ, లేదంటే భూమిని కేటాయించాలని డిమాండ్ చేశారు. లేదంటే భూ నిర్వాసితులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వస్తే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ దృష్టికి తీసుకెళ్లి రీజనల్ రింగ్ రోడ్డు భూ నిర్వాసితులకు తన వంతు న్యాయం చేస్తానని ఈటల హామీ ఇచ్చారు. మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ గత సర్కార్ హయాంలో ఓఆర్‌ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్ వరకు 40 కిలోమీటర్ల మేర అలైన్‌మెంట్ చేశామని చెప్పారు. ఆ తర్వాత కాంగ్రెస్ సర్కార్ కొంత మంది వ్యక్తులకు లబ్ది చేసేందుకు ఈ అలైన్‌మెంట్‌ను 28 కిలోమీటర్లకు కుదించిందని విమర్శిం చారు. చౌటుప్పల్ మధ్య నుంచి రోడ్డు వెళ్లడం వల్ల వేలాది మంది రైతులకు చెందిన వ్యవసాయ భూములతో పాటు ప్లాట్లు, ఇంటి స్థలాలు కనుమరుగు కానున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కాంగ్రెస్‌ను కోరారు. బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అలైన్‌మెంట్‌ను మార్చి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ప్రభాకర్‌రెడ్డి, పైలా శేఖర్‌రెడ్డి, బిక్షమయ్య, గ్యాదరి కిషోర్, బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, రైతు ఐక్యవేదిక నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆ చర్చకు ముగింపు పలకండి

- మంత్రి తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకున్నారు : సినీ ప్రముఖులకు టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ విజ్ఞప్తి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల నేపథ్యంలో ఆ చర్చకు ముగింపు పలకాలని టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ సినీ ప్రముఖులకు విజ్ఞప్తి చేశారు. మంత్రి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకున్నారని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇరువైపులా మహిళలున్నారనీ, కావున ఆ విషయాన్ని ఇంతటితో వదిలిపెట్టాలని విజ్ఞప్తి చేశారు. 'మహిళల మనోభావాలను కించపరచాలని ఆమె ఉద్దేశం కాదు. కొండా సురేఖ ట్వీట్‌లో వారు హీరోయిన్‌గా ఎదిగిన తీరు కేవలం అభిమానం మాత్రమే కాదు నాకు ఆదర్శం కూడా అని ట్వీట్ చేశారు. ఒక సోదరుడు సోదరికి నూలు దండ వేస్తే ఆమెపై సోషల్ మీడియాలో చేసిన ట్రోల్స్ చూశాం. సమాజంలో ఒకరి గురించి మరొకరు చెడుగా మాట్లాడకండి. మా కాంగ్రెస్ నాయకులు మంత్రులకు విజ్ఞప్తి చేస్తున్న. మాట్లాడేటప్పుడు జాగ్రత్తగా మాట్లాడండి' అని విజ్ఞప్తి చేశారు.

నేడు నిజామాబాద్‌కు మహేష్‌కుమార్‌గౌడ్

టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్‌గౌడ్ శుక్రవారం నిజామాబాద్ పర్యటకు వెళ్తున్నారు. పీసీసీ అధ్యక్షులయ్యాక మొదటిసారిగా తన సొంత జిల్లాకు వెళ్తున్న ఆయనకు డీసీసీ అధ్యక్షులు మోహన్ రెడ్డి భారీ స్వాగత ఏర్పాట్లు, భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. పట్టణంలోని మాధవనగర్ సాయిబాబా గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అక్కడి నుంచి ర్యాలీగా బయలుదేరి ఓల్డ్ కలెక్టరేట్ మైదానంలో జరగనున్న భారీ బహిరంగ సభాస్థలికి చేరుకుంటారు. సభలో మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు పాల్గొంటారు.

మంత్రుల ముఖాముఖి శనివారానికి వాయిదా

గాంధీభవన్‌లో ప్రతి శుక్రవారం పార్టీ నిర్వహిస్తున్న మంత్రుల ముఖాముఖి శనివారానికి వాయిదా వేసినట్టు మహేష్‌కుమార్‌గౌడ్ వెల్లడించారు. అనివార్య కారణాల వల్ల తేదీ మారిందనీ, ఈ విషయాన్ని గమనించాలని పార్టీ కార్యకర్తలకు, శ్రేణులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

దలాల్ స్ట్రీట్ పై బాంబు

ముంబయి : ఊహించినట్లుగానే దలాల్ స్ట్రీట్‌లో యుద్ధ కల్లోలం చోటు చేసుకుంది. ఇజ్రాయిల్-ఇరాన్ మధ్య నెలకొన్న తీవ్ర ఘర్షణ వాతావరణం ఇన్వెస్టర్లను తీవ్ర ఆందోళనకు గురి చేసింది.ఈ నేపథ్యంలోనే గురువారం బీఎస్ఈ సెన్సెక్స్ దాదాపు 1800 పాయింట్లు మేర పతనమయ్యింది. ఉదయం నష్టాల్లో మొదలైన సూచీల పతనం ఏ దశలోనూ ఆగకుండా మదుపర్లకు కన్నీళ్లను మిగిల్చింది. దీంతో ఈ ఏడాదిలోనే మార్కెట్లలో మూడో అతిపెద్ద నష్టం వాటిల్లింది. సెన్సెక్స్ ఇంట్రాడేలో 82,449 కనిష్టాన్ని తాకడంతో రూ.11 లక్షల కోట్ల మేర సంపద ఆవిరయ్యింది.

ప్రతికూల సంకేతాలతో 83,002 వద్ద నష్టాల్లో ప్రారంభమైన సెన్సెక్స్ సూచీ రోజంతా క్షీణిస్తూనే ఉంది. ఏ దశలోనూ ఉపశమనం లభించకపోవడంతో తుదకు 1,769 పాయింట్లు లేదా 2 శాతం పతనమై 82,497కు పడిపోయింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 547 పాయింట్లు లేదా 2.12 శాతం క్షీణించి 25,250 వద్ద ముగిసింది. మదుపర్ల సంపద రూ.9.7 లక్షల కోట్లు హరించుకుపోయింది. దీంతో బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్ రూ.474 లక్షల కోట్ల నుంచి రూ.465 లక్షల కోట్లకు పడిపోయింది.

ఇంతక్రితం సార్వత్రిక ఎన్నికల ఫలితాల సమయంలో జూన్ 4న సెన్సెక్స్ అత్యధికంగా 4,390 పాయింట్లు పతనమయ్యింది. ఆగస్టు 5న మరో 2,223 పాయింట్లు కోల్పోయింది. ఆ తర్వాత ఇదే అతిపెద్ద నష్టం కావడంతో మదుపర్లు బోరుమంటున్నారు.

తేదీ	2024లో పతనం
జూన్ 4	4390
ఆగస్టు 5	2223
అక్టోబర్ 3	1832
జనవరి 17	1628
సెప్టెంబర్ 30	1272
మే 9	1062
జనవరి 23	1053
సెప్టెంబర్ 6	1017

అన్ని రంగాలు నేల చూపులు..

సెన్సెక్స్-30లో జేఎస్‌డబ్ల్యూ సూచీ మాత్రమే 1.18 శాతం రాణించింది. మిగిలిన 29 సూచీలు ప్రతికూలతను ఎదుర్కొన్నాయి. నిఫ్టీ 50లో జేఎస్‌డబ్ల్యూ స్టీల్, ఓఎన్‌జీసీ స్టాక్స్ మాత్రమే లాభపడ్డాయి. ప్రధానంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రిలయన్స్ ఇండస్ట్రీస్, లర్సన్ అండ్ టర్బో, యాక్సిస్ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు భారీగా పడిపోవడంతో మార్కెట్లపై అధిక ఒత్తిడి చోటు చేసుకుంది. బీఎస్ఈలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 2.27 శాతం, 1.84 శాతం చొప్పున నష్టపోయాయి. నిఫ్టీలు అన్ని రంగాలు నేల చూపులు చూశాయి. రియాల్టీ అత్యధికంగా 4.36 శాతం కోల్పోగా.. ఆటోమొబైల్ 2.88 శాతం, ఫైనాన్షియల్ 2.43 శాతం, బ్యాంకింగ్ 2.04 శాతం, ఐటీ 1.58 శాతం చొప్పున క్షీణించాయి.

ప్రధాన కారణాలు..

పశ్చిమాసియాలో ఇరాన్- ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు మరింత పెరగొచ్చన్న అంచనాలు మదపర్లను కలవరానికి గురి చేశాయి. ఈ ఘర్షణలో అమెరికా తలదూర్చడంతో మార్కెట్ల భవిష్యత్తుపై ఇన్వెస్టర్లలో మరింత భయాలు నెలకొన్నాయి. ఈ ఉద్రిక్తలు ముడి చమురు ధరలకు అజ్యం పోస్తున్నాయి. వారం క్రితం వరకు 70-71 డాలర్లుగా పలికిన బ్యారెల్ ధర.. ప్రస్తుతం పరిస్థితులు అదుపుతప్పడంతో రెండు రోజుల్లోనే 75 డాలర్లకు చేరింది. ఇది 85 డాలర్లకు చేరొచ్చనే అంచనాలు మరింత ఆందోళన కలిగించాయి. ఇరాన్ చమురు క్షేత్రాలు యుద్ధ టార్గెట్‌కు గురై అయితే.. భారత్ లాంటి అతిపెద్ద చమురు దిగుమతిదారుపై ప్రభావం పడనుందనే భయాలు ఇన్వెస్టర్లలో నెలకొన్నాయి. సెబీ ఎఫ్‌అండ్‌ఓ ట్రేడింగ్ నిబంధనలను కఠినతరం చేయడం కొంత ప్రతికూల ప్రభావం చూపింది. మరోవైపు అమెరికా మార్కెట్లలో మిశ్రమ ఫలితాలు చోటు చేసుకోగా.. మరోవైపు జపాన్, చైనా మార్కెట్లు దూసుకుపోవడం విశేషం. చైనా ప్రభుత్వం ప్రకటించిన భారీ ఉద్దీపన చర్యలతో విదేశీ సంస్థాగత పెట్టుబడులు పొరుగు దేశం మార్కెట్లకు తరలిపోయాయి. గడిచిన ఒక్క వారంలోనే షాంగై కంపోజిట్ ఇండెక్స్ (ఎస్-ఎస్ఈ) 15 శాతం పెరిగింది.

సెర్చ్ కమిటీల భేటీ షురూ

- ఓయూ, పీయూ, తెలుగు వర్సిటీల సమావేశాలు పూర్తి
- నేడు జేఎన్టీయూ, కేయూ, టీయూ, ఎస్‌యూ సమావేశాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో విశ్వవిద్యాలయల ఉపకులపతుల (వీసీ) నియామకం ప్రక్రియకు సంబంధించి గురువారం నుంచి సెర్చ్ కమిటీల సమావేశాలు ప్రారంభమయ్యాయి. గురువారం రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఓయూ) సెర్చ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఓయూ వీసీగా ఆర్ లింబాద్రి, ప్రతాప్‌రెడ్డి, జీబీ రెడ్డి, సిహెచ్ గోపాల్‌రెడ్డి, రవీందర్ యాదవ్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. వారిలో ఒకరిని వీసీ పదవి వరించే అవకాశమున్నది. ఓయూతో పాటు పాలమూరు విశ్వవిద్యాలయం (పీయూ), పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సెర్చ్ కమిటీల సమావేశాలూ జరిగాయి. గురువారం జరగాల్సిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బీఆర్ఏఓయూ) సెర్చ్ కమిటీ సమావేశం వాయిదా పడింది. సెర్చ్ కమిటీ యూజీసీ నామినీ విదేశాల్లో ఉండడమే ఇందుకు కారణమని అధికారులు చెప్తున్నారు. ఈ సమావేశాన్ని తిరిగి ఎప్పుడు నిర్వహిస్తారన్నది ప్రస్తుతానికి ఖరారు కాలేదు. ఓయూ, పీయూ, తెలుగు వర్సిటీల వీసీలకు సంబంధించి ముగ్గురి పేర్లతో కూడిన నివేదికను సెర్చ్ కమిటీలు ఖరారు చేశాయి. శుక్రవారం జేఎన్టీయూ హైదరాబాద్, కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ), తెలంగాణ విశ్వవిద్యాలయం (టీయూ), శాతవాహన విశ్వవిద్యాలయం (టీయూ) సెర్చ్ కమిటీల సమావేశాలు జరుగుతాయి. జేఎన్ఏఎఫ్ఏయూ సెర్చ్ కమిటీ సభ్యుల్లో ఒకరు విదేశాల్లో ఉన్న కారణంగా ఆ వర్సిటీ సెర్చ్ కమిటీ సమావేశం కూడా వాయిదా పడింది. అయితే రాష్ట్రంలోని పది విశ్వవిద్యాలయాల సెర్చ్ కమిటీల సమావేశాలు పూర్తయ్యాకే అన్నింటికీ ఒకేసారి వీసీల పేర్లను ప్రభుత్వం ప్రకటించే అవకాశమున్నట్టు తెలిసింది. వాటితో పాటు తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం, ఆర్జీయూకేటీ బాసరకు కూడా కొత్త వీసీలను ప్రభుత్వం ప్రకటిస్తుందని విశ్వసనీయంగా తెలిసింది. సెర్చ్ కమిటీల భేటీ పూర్తయ్యాక ఒక్కో విశ్వవిద్యాలయానికి సంబంధించి ముగ్గురు పేర్ల ప్రతిపాదనలతో రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేస్తాయి. వాటిని న్యాయ శాఖ పరిశీలించిన తర్వాత గవర్నర్ ఆమోదానికి ప్రభుత్వం పంపిస్తుంది. ముగ్గురు పేర్లలో ఒకరిని గవర్నర్ ఆమోదించిన తర్వాత వీసీల నియామకానికి సంబంధించిన ఉత్తర్వులు వెలువడతాయి. రెండు విశ్వవిద్యాలయాల సెర్చ్ కమిటీలు వాయిదా పడడంతో ఈ ప్రక్రియ పూర్తి కావడానికి కొంత సమయం పట్టే అవకాశమున్నట్టు సమాచారం. దసరా తర్వాతే కొత్త వీసీల నియామకం ఉంటుందని అధికార వర్గాలు భావిస్తున్నాయి.

7న గెజిటెడ్ భవన్‌లో బతుకమ్మ

- పోస్టర్‌ను ఆవిష్కరించిన టీజీవో నేతలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గెజిటెడ్ భవన్‌లో తెలంగాణ గెజిటెడ్ అధికారుల (టీజీవో) సంఘం ఆధ్వర్యంలో ఈ నెల ఏడో తేదీన నిర్వహించనున్న బతుకమ్మ పండుగ పోస్టర్‌ను ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి ఎ సత్యనారాయణ, మహిళా అధ్యక్షులు జి దీపారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బతుకమ్మ పండుగలో అందరూ పాల్గొనాలని కోరారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలను చాటాలని చెప్పారు. బతుకమ్మ అంటేనే పచ్చని పాడిపంటలు, ప్రజలంతా సుఖసంతోషాలతో కులమతాలకు అతీతంగా కలిసిమెలిసి జీవించడమని అన్నారు. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా అత్యంత ఉత్సాహంతో ఈ పండుగను మహిళలు జరుపుతారని వివరించారు. పూలను పూజించి భక్తి శ్రద్ధలతో ఆడిపాడటమే బతుకమ్మ అని చెప్పారు. సమాజ శ్రేయస్సును కోరుకుంటుందన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో మహిళా ఉద్యోగులందరూ బతుకమ్మ పండుగను నిర్వహించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీజీవో నాయకులు శిరీష, లావణ్య, సుజాత, పూనమ్, జయశ్రీ, రేవతి, చైతన్య, సునీత, మహేశ్వరి, విజయలక్ష్మి, వసుంధర, లలిత, అలివేలు పాల్గొన్నారు.



లఖింపూర్ ఖేరి అమరుల స్ఫూర్తితో రైతాంగ ఉద్యమాలు

- సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు
- సుందరయ్య పార్క్ వద్ద కొవ్వొత్తుల ప్రదర్శన

నవతెలంగాణ - ముషీరాబాద్

లఖింపూర్ ఖేరి అమరుల స్ఫూర్తితో దేశవ్యాప్తంగా రైతాంగ ఐక్య ఉద్యమాలకు సన్నద్ధం కావాలని సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పిలుపునిచ్చారు. గురువారం రాత్రి హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్క్ వద్ద లఖింపూర్ ఖేరి అమరులకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని, కనీస మద్దతు ధరల చట్టం, రుణమాఫీ చేయాలని, ఎరువుల సబ్సిడీకి కోత విధించడాన్ని ఆపాలని, ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలని, పరిశోధనా రంగాన్ని కార్పొరేట్ విత్తన కంపెనీలకు అప్పగించొద్దని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్ టి.సాగర్ మాట్లాడుతూ.. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా శాంతియుతంగా ఆందోళన నిర్వహిస్తున్న రైతులపైకి నాటి హోం శాఖ సహాయ మంత్రి అజయ్ కుమార్ మిశ్రా కుమారుడు ఆశిష్ కుమార్ మిశ్రా తన వాహనాన్ని ఎక్కించి నలుగురు రైతులు, ఒక విలేకరి మరణానికి కారణమయ్యారని గుర్తుచేశారు. అతన్ని శిక్షించాలని ఆందోళనలు నిర్వహించినా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దాంతో ప్రజలే ఆయన్ను ఎన్నికల్లో ఓడించారని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడి వ్యవసాయ రంగాన్ని, రైతాంగాన్ని కాపాడేందుకు చర్యలు చేపట్టాలన్నారు.

ఎస్‌కేఎం కన్వీనర్ పశ్య పద్మ మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్.. రైతులను, వ్యవసాయరంగాన్ని పూర్తిగా మోసం చేసిందన్నారు. రైతాంగానికి కేంద్రం రాతపూర్వకంగా ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చేందుకు పూనుకోలేదని, పైగా ఎరువులకు ఇస్తున్న సబ్సిడీలో కోత పెట్టేందుకు సిద్ధమైందని ఆరోపించారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50 శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించి, కొనుగోలుకు చట్టబద్ధత కల్పించాలని, కానీ ధరల స్థిరీకరణ నిధిలో కోత పెట్టిందని విమర్శించారు. ఎరువుల సబ్సిడీకి కేటాయించాల్సిన పద్దుకు కోత విధించిందన్నారు. కన్వీనర్లు శంకర్, ఆర్ వెంకట్రాములు మాట్లాడుతూ.. కార్పొరేట్లకు లక్షల కోట్లు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నిధులు కేటాయించేందుకు కూడా సిద్ధం కావడం లేదన్నారు. రుణమాఫీ ప్రస్తావనే తీసుకురాలేదని, సహకార రంగాన్ని బడా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు పూనుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోటార్లకు మీటర్లు పెడితే తప్పేముందని మాట్లాడుతున్నారంటే, రైతులకు ఉచిత విద్యుత్‌ను వ్యతిరేకిస్తున్నారని స్పష్టమౌతున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం తన విధానాలు మార్చుకోకపోతే దేశవ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి. జంగారెడ్డి, మూడ్ శోభన్, కిషోర్, బొప్పని పద్మ, అరుణ, మురళీధర్ రెడ్డి, కొండా రెడ్డి, పులి కల్పన తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వంతో సివిల్ సప్లైయీస్, జీసీసీ హమాలీ కార్మికుల చర్చలు సఫలం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వంతో సివిల్ సప్లైయీస్, జీసీసీ హమాలీ కార్మికుల చర్చలు విజయవంతమయ్యాయి. గురువారం హైదరాబాద్‌లో సివిల్ సప్లై కార్పొరేషన్ కమిషనర్ డీఎస్.చౌహాన్, కార్పొరేషన్ పీడీఎస్ జనరల్ మేనేజర్‌తో జరిగిన చర్చల్లో తెలంగాణ సివిల్ సప్లైయీస్, జీసీసీ హమాలీ వర్కర్స్ జేఏసీ నాయకులు ఎస్.బాల్‌రాజ్, ఎన్.శ్రీనివాస్, వై.ఓమయ్య (ఏఐటీయూసీ), వంగూరు రాములు, పాలడుగు సుధాకర్, బి.మొగిలి, ఎస్.బాలయ్య (సీఐటీయూ), కె.సూర్యం (ఐఎఫ్టీయూ), శ్రీనివాస్ (బీఆర్టీయూ తదితరులు పాల్గొన్నారు. ఎగుమతి-దిగుమతి నూతన రేట్లను ప్రస్తుతం ఉన్న రూ.26 నుంచి రూ.29కు పెంచి ఈ రేట్లను 2024 జనవరి నుంచి అమలు చేసేందుకు అంగీకరించారు. మహిళా స్వీపర్లకు గోదాముల సామర్థ్యాన్ని బట్టి ప్రస్తుతం చెల్లిస్తున్న వేతనాలపై రూ.1,000 అదనంగా పెంచారు. హమాలీ కార్మికులు పొందుతున్న బోనస్, యూనిఫాం తదితర సౌకర్యాలు వీరికి వర్తింపజేసేందుకు ఒకే చెప్పారు. బోనస్‌ను రూ.6,500 నుంచి రూ.7,500కు, యూనిఫాం టైలరింగ్ చార్జీలను రూ.1,300 నుంచి రూ.1,600కు, దసరా పండుగ సందర్భంగా ఇచ్చే స్వీట్ బాక్స్‌కు రూ.800 నుంచి రూ.900కు పెంచారు.

హమాలీల హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కోసం తక్షణ చర్యలు తీసుకోనున్నట్టు అధికారులు హామీ ఇచ్చారు. అదనంగా పెరిగిన పనుల కోసం పెట్టుకున్న హమాలీలకు, పాత హమాలీలకు వర్తించే సౌకర్యాలు కల్పించేందుకు అంగీకరించారు. పెరిగిన రేట్లను గిరిజన కార్పొరేషన్ గోదాముల్లో పని చేసే హమాలీ కార్మికులకు యధావిధిగా అమలు చేస్తామనీ, సివిల్ సప్లయీస్ హమాలీల వలే పీఎఫ్ సౌకర్యం అమలు చేసేందుకు అధికారులు అంగీకరిస్తూ హామీనిచ్చారు.

హుజూర్‌నగర్‌కు ఐటీఐ మంజూరు

- భవన నిర్మాణానికి రూ.14.35 కోట్ల నిధులు
- ఐదు కోర్సుల్లో 216 మందికి అవకాశం
- ప్రిన్సిపాల్‌తో సహా 8 పోస్టులకు గ్రీన్ సిగ్నల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

హుజూర్‌నగర్‌కు ఐటీఐ మంజూరైంది. ప్రిన్సిపాల్‌తో సహా 8 పోస్టుల మంజూరుకు రాష్ట్ర సర్కారు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. భవన నిర్మాణానికి రూ.14.35 కోట్ల నిధులను ప్రకటించింది. దీంతో ఐదు కోర్సుల్లో 216 మంది విద్యార్థులకు అవకాశం కలగనున్నది. హుజూర్‌నగర్ నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి కెప్టెన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మరోమారు తన మార్కు చూపెట్టినట్టయింది. అక్కడ ఐటీఐ ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నది. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్ మెన్, డీజిల్ మెకానిక్‌లతో పాటు వెల్డర్ కోర్సుల్లో శిక్షణ నిమిత్తం ప్రారంభిస్తున్న ఈ నూతన ఐటీఐతో ఈ ప్రాంత నిరుద్యోగులకు ప్రయోజనకారిగా మారనుంది. గతంలో తాను మంజూరు చేయించిన అడ్వాన్స్ ట్రెనింగ్ సెంటర్ సమీపంలో రామస్వామి గుట్ట వద్ద కొత్తగా మంజూరు అయిన పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐ.టి.ఐ)ను నెలకొల్పనున్నట్టు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

షరతుల్లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

- సీఎం రేవంత్‌రెడ్డికి చాడ లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని రైతులకు ఎలాంటి షరతుల్లేకుండా రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గురువారం ఆయన లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం పెడుతున్న ఆంక్షల వల్ల రుణమాఫీ పూర్తిస్థాయిలో రైతులందరికీ వర్తించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికి మాత్రమే రుణమాఫీ చేస్తామనే నిబంధన వల్ల అనేక మంది రైతులకు రుణాలు మాఫీ కాలేదని తెలిపారు. దీంతో వారంతా నిరాశానిస్పృహలో ఉన్నారనీ, ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తున్నదని వెల్లడించారు. తెలంగాణ ఏర్పడినప్పటి నుంచి తెల్ల రేషన్‌కార్డుల ప్రక్రియను చేపట్టలేదని గుర్తు చేశారు. ఒకే కార్డు మీద తండ్రి, కుమారుల పేర్లున్నాయని వివరించారు. కుటుంబాల వారీగా భూములను పంచుకున్నారని తెలిపారు. కానీ తెల్లరేషన్‌కార్డు ఆధారంగా రుణమాఫీ చేయడం వల్ల కుటుంబం నుంచి వేరుపడ్డ కుమారులకు వర్తించడం లేదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం జిల్లాల్లో కమిటీలు వేసి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి కుటుంబం రేషన్‌కార్డు ప్రాతిపదికన కాకుండా బ్యాంకు, వ్యవసాయ అధికారులతో పంట రుణాలపై అధ్యయనం చేసి రుణమాఫీ చేయాలని కోరారు.

నవతెలంగాణ
ఎల్బీనగర్ - మహేశ్వరం
శుక్రవారం | అక్టోబర్ 04, 2024 | www.navatelangana.com

మర్రి వెంకటమ్మ దశదిన కర్మలో కేఎల్ఆర్



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం నాదర్‌గుల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ మర్రి హనుమంతరెడ్డి తల్లి మర్రి వెంకటమ్మ దశదిన కర్మను నాదర్‌గుల్ గ్రామంలోని తోట యట్టారెడ్డి ఫంక్షన్ హాల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కిచ్చేన్నగారి లక్ష్మారెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మర్రి లింగారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, పుట్టగళ్ల జగన్, పెత్తుల ఆనందరెడ్డి, బంగారు అశోక్, శేఖర్, వెంకటేష్ గౌడ్, భూపాల్ రెడ్డి, సామ వరుణ్ రెడ్డి, సుభాన్ యాదవ్, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బొంతు రామ్మోహన్‌ను పరామర్శించిన ఉప్పల



నవతెలంగాణ-నాగోల్

హైదరాబాద్ నగర మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ మాతృమూర్తి బొంతు కమలమ్మ మృతి చెందారు. ఈ మేరకు గురువారం టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షులు ఉప్పల శ్రీనివాస్ గప్త చర్లపల్లిలోని బొంతు రామ్మోహన్ నివాసానికి వెళ్లి కమలమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యువజన కోశాధికారి నరేష్ గుప్తా, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



నవతెలంగాణ-వనస్థలిపురం

సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అధికారులతో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. వనస్థలిపురం రైతు బజార్ వద్ద పూలు, పండ్లు, తదితర వ్యాపారం చేసుకునే వర్తకులు గురువారం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మేము దాదాపు 30 సంవత్సరాలుగా అక్కడే వ్యాపారం చేసుకుంటున్నామని చెప్పారు. మూడు రోజుల కిందట అధికారులు వచ్చి మా షాప్‌లను కూల్చివేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మా డబ్బాలు, షాప్‌లు, తోపుడు బండ్లు కూలగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు మా బతుకులు రోడ్డు మీద పడ్డాయని రోధించారు. స్పందించిన సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తను గత మూడు నెలల నుంచి అస్వస్థతకు గురై హాస్పిటల్‌లో చేరడం వలన మీ దగ్గరికి రాలేకపోయాను అని అన్నారు. మీ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్, చిరంజీవి, సత్తిరెడ్డి, సతీష్ గౌడ్, చిరు వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.



మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి



మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

ప్రజల మౌలిక సదుపాయాల కల్పన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని మేయర్ పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో 19వ డివిజన్ సాయినగర్ కాలనీలో చేపట్టిన బీటీ రోడ్డు నిర్మాణ పనులను గురువారం కార్పొరేటర్ రామోజీ అమిత శ్రీశైలంచారితో కలిసి మేయర్ ప్రారంభించారు. తర్వాత 23వ డివిజన్ కాశీ బుగ్గ దేవాలయంలో అయ్యప్పస్వాముల సన్నిదాన నిర్మాణం పనులను స్థానిక కార్పొరేటర్ రాళ్ళగూడం సంతోషి శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్‌తో కలసి మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల సంక్షేమం కోసం కోట్లాది రూపాయల నిధులతో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడం కోసం ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, సుర్ణగంటి అర్జున్, రామోజీ అమిత శ్రీశైలం చారి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, పెద్దబావి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు లిక్కి కృష్ణ రెడ్డి, భీమిడి జంగారెడ్డి, బంగారు ప్రభాకర్, చిత్రం శ్రీను, పలు కాలనీల ప్రజలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ- బడంగ్‌పేట్

నేటి సమాజంలో విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని నాదర్ గుల్ గ్రామం ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో తెలంగాణ హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మల్కా యశస్వి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి 38వ సబ్ జూనియర్ బాయ్స్ నేషనల్ హ్యాండ్ బాల్ ఛాంపియన్షిప్ 2024 ప్రారంభోత్సవ వేడుకలను చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని, దేశ సేవలో మన వంతు పాత్ర ఉండాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. క్రీడల్లో రాణించిన విద్యార్థులకు మానసిక ఉల్లాసంతో పాటు మనోధైర్యం కలుగుతుందని, అంతేకాకుండా వారికి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు వస్తుందని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల్ భవిష్యత్ కోసం ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఎంతో అలరించాయి. ఈ కార్యక్రమంలో మహేశ్వరం అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, రామోజీ అమితా శ్రీశైలం చారి, తుక్కుగూడ మున్సిపల్ అధ్యక్షులు రచ్చ లక్ష్మణ్, బీజేవైఎం అధ్యక్షులు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, అరేందర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పెద్ద అంబర్‌పేట్ మున్సిపాలిటీ చైర్ పర్సన్‌గా జయశ్రీ



నవతెలంగాణ - పెద్దఅంబర్‌పేట

పెద్ద అంబర్‌పేట మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా 8వ వార్డు కౌన్సిలర్ పందు గల జయశ్రీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పలువురు కౌన్సిలర్లు మాజీ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానంలో గత నెల 13న ఎన్నిక నిర్వహించారు. ఖాళీ అయిన చైర్‌పర్సన్ పీఠానికి ఈ నెల మూడో తేదీన ఖరారు చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ ఎన్నిక కోసం ప్రత్యేక అధికారిగా చేవెళ్ల ఆర్డిఓ సాయిరాం ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ రవీందర్ రెడ్డి సహా హాజరై గురువారం మున్సిపాలిటీ పరిధిలోని తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో ఎన్నికల నియామక ప్రక్రియ మొదలుపెట్టారు. ఈ ప్రక్రియలో మున్సిపాలిటీలో 24 మంది కౌన్సిలర్‌లకు గాను 21 మంది కౌన్సిలర్స్ తమ పూర్తి మద్దతును పార్టీలకతీతంగా తెలపడంతో మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా పందుగల జయశ్రీ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశ అనంతరం స్పెషల్ ఆఫీసర్ సాయిరాం చైర్ పర్సన్ గా ఎన్నికైన జయశ్రీకి నియామక పత్రం అందజేశారు. తర్వాత చైర్‌పర్సన్ జయశ్రీ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే రంగారెడ్డితో పాటు స్థానిక కౌన్సిలర్లకు, నాయకులకు, ప్రజాప్రతినిధులకు ధన్యవాదాలు తెలియజేవారు.



హయత్‌నగర్‌లో పెరుగుతున్న పారిశుధ్య సమస్య

కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి



నవతెలంగాణ - వనస్థలిపురం

హయత్‌నగర్ డివిజన్‌లో పారిశుధ్య సమస్య రోజురోజుకూ పెరిగిపోతుందని కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్ నగర్ డివిజన్ భాగ్యలతలోని భారత్ పెట్రోల్ పంపు వద్ద చెత్త పరిస్థితిని డిప్యూటీ కమిషనర్ యాదయ్యతో కలసి కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంకీ సిబ్బంది డంపింగ్ యార్డ్ ల వద్ద చెత్తను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో కాలనీలలో విపరీతమైన దుర్వాసన, దోమలతో ప్రజలు అనారోగ్య పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలక్రమేనా డివిజన్‌లో కొత్తగా నూతన కాలనీలు ఏర్పడుతుండడంతో ప్రస్తుతం ఉన్న పారిశుధ్య కార్మికులు సరిపోవడం లేదన్నారు. ఉన్నత అధికారులతో సమీక్షించి నూతన పారిశుధ్య కార్మికులను విధుల్లోకి తీసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు. ఈ పరిశీలనలో జవాన్ యాదయ్య, పారిశుధ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహేష్ కుమార్ గౌడ్‌కు ఘన సన్మానం



నవతెలంగాణ-నాగోల్

టీపీసీసీ అధ్యక్షుడిగా నూతనంగా నియామకమైన మహేష్ కుమార్ గౌడ్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందని టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాసగుప్త అన్నారు. నూతన టీపీసీసీ అధ్యక్షుడుగా పదవీ బాధ్యతలు చేపట్టిన మహేష్ కుమార్ గౌడ్‌ను ఓల్డ్ ఎమ్మెల్యే క్వాటర్స్‌లో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉప్పల శ్రీనివాస్ గుప్త.. మహేష్ కుమార్ గౌడ్‌ను శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు.

అనంతరం శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలకు అవగాహన కల్పించి..రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం యాదవ్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు భూపతి రెడ్డి గాలి అనిల్ కుమార్, నరేష్ గుప్త, శ్రీధర్ గుప్త, యాదవ సంఘం నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాక్సో కేసులో నిందితుడికి పదేండ్ల జైలు శిక్ష

నవతెలంగాణ-హయత్ నగర్

పాక్సో కేసులో ఓ నిందితుడికి 10సంవత్సరాలు జైలు శిక్షను కోర్టు విధించింది. రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు తెలిపిన వివరాల ప్రకారం.. సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో కొత్తపేటలో ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర హాస్టల్‌లో హౌజ్ కీపర్‌గా పనిచేసేవాడు. ఇతను ప్రస్తుతం ఫలక్‌నుమాలో నివాసం ఉంటున్నాడు. మైనర్ బాలికపై అత్యాచారం చేయగా వారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేస్ నమోదు చేసిన సరూర్ నగర్ పోలీసులు కోర్ట్ ముందు సరైన ఆధారాలు సమర్పించగా.. గురువారం ఎల్బీనగర్ ఫాస్ట్ ట్రాక్ కోర్ట్ నిందితుడిని దోషిగా నిర్ధారించింది. అతనికి 10సంవత్సరాలు కఠిన కారాగార శిక్షతో పాటుగా 16వేల రూపాయలు జరిమానా విధించింది. బాధితురాలికి కోర్ట్ నుండి 5లక్షల రూపాయలు చెల్లించిందని సీపీ వెల్లడించారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ పరిధిలోని సంతోషి మాత కాలనీ వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అన్నదానం చేసినట్టు డివిజన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు నీల మధుసూధన్ గుప్త తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అమావాస్య రోజున తమ సంఘం నుండి అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమానికి దాతలుగా కటకం కృష్ణయ్య లక్ష్మీ జ్యోతి దంపతులు సహకరించారని తెలిపారు.

గాంధీ జయంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బిజ్జల వేణు గుప్తా, ట్రెజరర్ బండారు సుధాకర్ గుప్తా, గౌరవ అధ్యక్షుడు కాసుల శ్రీనివాసులు గుప్తా, ఉపాధ్యక్షుడు శివ యాదగిరి గుప్తా, సంయుక్త కార్యదర్శి ఎర్రం భాస్కర్ గుప్తా, వై. రవీందర్ గుప్తా, సుభాష్, వేణు, శ్రీనివాస్, సముద్రాల ఆంజనేయులు, రమేష్, మరియాల రాజు, నాగ బండి శ్రీను, యువజన సంఘం అధ్యక్షులు గణేష్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



'కాలనీ అభివృద్ధే తమ లక్ష్యం'



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి రాగన్నగూడలోని లక్ష్మిమెగా టౌన్‌షిప్ కాలనీని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని కాలనీ నూతన కార్యవర్గం పేర్కొంది. ఈ మేరకు గురువారం కాలనీ నూతన అధ్యక్షుడిగా నక్కనబోయిన అంజనేయులు, ఉపాధ్యక్షుడిగా మెండే కొండల్, కార్యదర్శిగా పెద్దపల్లి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా ఎస్. వెంకటేశ్వరరావు, కోశాధికారిగా టి. శివ శంకర్ రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక రాజకీయ నాయకులు, అధికారుల సహకారంతో కాలనీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని అన్నారు. సమస్యల పరిష్కారానికి నూతన కార్యవర్గం పనిచేస్తుందన్నారు.

కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ ప్రసాద్ రెడ్డి, బారు శ్రీనివాస రావు, ఎస్వీఎస్ రెడ్డి, బాబురావు, సందీప్ రెడ్డి, నరేందర్ రావు, ప్రభాకర్ రెడ్డి, జంగయ్య యాదవ్, గోవింద్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ కార్మిక సంఘాల

అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం



నవతెలంగాణ- వనస్థలిపురం

వనస్థలిపురం ఆటోనగర్‌లో ప్రపంచ కార్మిక సంఘాల అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవాన్ని సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు కీసరి నర్సిరెడ్డి మాట్లాడుతూ.. నూతన ఆర్థిక, పారిశ్రామిక విధానాలు వచ్చిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గంపై దోపిడీ తీవ్రతరమైందని అన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కోవడంలో కార్మిక వర్గము మిలిటెంట్ పోరాటాలను నిర్వహించారని పేర్కొన్నారు. అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా పాలకవర్గాలు కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తే చట్టాలను రద్దు చేయాలని పోరాటాలను ఉధృతం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా నాయకులు ఎల్లయ్య, వీరయ్య, వెంకన్న, మెట్టు లింగం, చంద్రశేఖర్, లింగస్వామి, కాసం శివ, భాస్కర్, నరేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ- నాగోల్

నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు వచ్చిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గంపై దోపిడీ తీవ్రతరం అయిందని, ఈ పరిస్థితులు ఎదుర్కోవడంలో కార్మిక వర్గం మిలిటెంట్ పోరాటాలు నిర్వహించాలని సీఐటీయూ నాయకులు మల్లెపాక వీరయ్య అన్నారు. గురువారం సరూర్‌నగర్ సర్కిల్ ప్రాంతంలో చైతన్యపురి డివిజన్లోని పెయింటర్స్ అడ్డా మీద భవన నిర్మాణ కార్మిక యూనియన్ మరియు సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక సంఘాల అంతర్జాతీయ కార్యాచరణ దినోత్సవం సందర్భంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ సర్కిల్ సీఐటీయూ నాయకులు మల్లెపాక వీరయ్య మాట్లాడుతూ నూతన ఆర్థిక పారిశ్రామిక విధానాలు వచ్చిన తర్వాత ప్రపంచవ్యాప్తంగా కార్మిక వర్గంపై దోపిడీ తీవ్రతరమైందని అన్నారు. ఈ పరిస్థితులను ఎదుర్కోవడంలో కార్మిక వర్గము మిలిటెంట్ పోరాటాల నిర్వహించారని, అందులో భాగంగానే తెలంగాణ రాష్ట్రంలో కూడా పాలకవర్గాలు కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకువస్తే చట్టాలను రద్దు చేయాలని పోరాటాలను ఉధృతం చేసిందన్నారు. పెట్టుబడిదారి వర్గం వరస సంక్షోభాలతో కొత్త మార్కెట్ కోసం సామ్రాజ్యవాద దేశాల మధ్యన తీవ్రమైన పోటీ ఏర్పడిందని, వారి పోటీని తట్టుకొనుటకు మార్కెట్ కోసం దేశాల మధ్యన యుద్ధాలు సృష్టిస్తున్నదన్నారు. సామ్రాజవాదానికి వ్యతిరేకంగా యుద్ధోన్మాదానికి వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాడవలసిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ పెయింటర్ అడ్డా భవన నిర్మాణ కార్మిక యూనియన్ సీఐటీయూ నాయకులు సిహెచ్ వెంకన్న, డి మల్లేష్, డి. వీరేష్, పి పాండు తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదులో భాగస్వాములు కావాలి



ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ- బడంగ్‌పేట్

పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు భాగస్వాములు కావాలని చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న నాదర్‌గుల్ గ్రామంలోని 18వ డివిజన్ కార్పొరేటర్ గూడెపు ఇంద్రసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్, దేవేందర్ రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు ధీటుగా అన్ని రంగాల్లో దేశం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి గత ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు తోట శ్రీధర్ రెడ్డి, నిమ్మల సునీత శ్రీకాంత్ గౌడ్, అమిత శ్రీశైలం చారి, పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పలు చోట్ల బతుకమ్మ సంబరాలు

వేద పాఠశాలలో..



హస్తినాపురం డివిజన్ పరిధిలోని హస్తినాపురం డివిజన్ పరిధిలోని బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించినట్టు పాఠశాల కరస్పాండెంట్ సంకల్ప్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా వేడుకలలో పాల్గొని, నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దీప, అధ్యాపకులు సురేష్, కృష్ణ, ప్రియాంక, సిబ్బంది బృందం తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - హస్తినాపురం



హస్తినాపురం డివిజన్ పరిధిలోని డీఆర్‌డీఎల్ కాలనీలో దసరా నవరాత్రుల్లో భాగంగా నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఎల్బీనగర్ శాసన సభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఆందోజ్ సత్యం చారి, వర్కింగ్ ప్రెసిడెంట్ మేరెడ్డి ఉదయ్ కుమార్ రెడ్డి, డీఆర్‌డీఎల్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు రాంప్రసాద్ రావు, కార్యదర్శి ఎస్. కరుణాకర్ రెడ్డి, కాలనీ ప్రతినిధులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - మలక్‌పేట్

మలక్‌పేట నియోజకవర్గం పరిధి ఆనంద్ నగర్‌లోని పల్టన్ చౌరస్తాలో బతుకమ్మ వేడుకలు..









మీర్ పేట హౌసింగ్ బోర్డు కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన SUPRISE Studio ను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.వ్యాపార రంగంలో రాణించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్ రెడ్డి, జంపాల్ రెడ్డి, శంకర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కాప్రా



మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ తల్లి బొంతు కమలమ్మ ఇటీవల కన్నుమూసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు మేయర్ గద్వాల్ విజయ లక్ష్మి ,డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి వారి నివాసానికి చేరుకుని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ని,కార్పొరేటర్ శ్రీదేవి యాదవ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. నవతెలంగాణ-కాప్రా

మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన ఏఎస్ రావు

- విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి రమేష్
- డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన ఉత్సవాలు



నవతెలంగాణ-కాప్రా

మూఢనమ్మకాలు వ్యతిరేకంగా ఏఎస్ రావు పోరాడారనివిజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి.రమేష్ అన్నారు. తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ ఏఎస్ రావు విజ్ఞాన ఉత్సవాలు చర్లపల్లి ఇండస్ట్రియల్ ఏరియా వివేకానంద కాలనీలో నిర్వహించారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ దక్పథం కలిగించడం కోసం ఈ విజ్ఞాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూపు బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విజ్ఞాన దర్శిని వ్యవస్థాపకులు టి రమేష్ హాజరై ప్రసంగించారు. డాక్టర్ ఏ ఎస్ రావు కడు పేదరికంలో పుట్టినప్పటికీ చదువు కోసం తపనకు గురై డబ్బులు లేకపోయినా, పుస్తకాలు లేకపోయినా, బాగా చదువుకొని పేరు ప్రఖ్యాతలు సాధించారని చెప్పారు. ఆనాడే అమెరికాలో ఉన్నత ఉద్యోగాలకు అవకాశం ఉన్నప్పటికీ భారతదేశానికి వచ్చి దేశ స్వావలంబన కోసం కృషి చేశారని చెప్పారు. మన ప్రాంతంలో ఈసీఐఎల్ పరిశ్రమను ఏర్పాటు చేసి వేలాదిమందికి ఉపాధి, లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు, కోట్లాదిమందికి స్ఫూర్తిదాయకంగా ఉన్నారని చెప్పారు. నేడు భారతదేశంలో మూఢనమ్మకాలు పెంచి పోషిస్తున్నారని దానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళంలో గొప్ప పోరాటం చేసిన చౌదరి తేజేశ్వర రావు మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడ్డారని అంతేకా కుండా తనను ఆయన ఎంతో ప్రోత్సహించారని రమేష్ అన్నారు.ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు జి శ్రీనివాసులు మాట్లాడుతూ వివేకానంద కాలనీ ప్రజలందరూ మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా నిలబడాలని కోరారు. అనంతరం డాక్టర్ ఏ ఎస్ రావు జీవితంపై డాక్యుమెంటరీ ఫిలంను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ప్రసాద్, భుజంగరావు, మన్మధరావు, లక్ష్మణరావు, రాంబాబు, కాలనీవాసులు పాల్గొన్నారు.



బోడుప్పల్ అభివృద్ధికి ప్రత్యేక నిధులివ్వండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన మేయర్ అజయ్ యాదవ్

నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ కార్పొరేషన్ అభివద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని మేయర్ తోటకూర అజయ్ యాదవ్ సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కోరారు. గురువారం ముఖ్య మంత్రిని వారి నివాసంలో శాసన మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డిలతో కలిసి బోడుప్పల్ కార్పొరేషన్ అభివద్ధి కోసం కావాల్సిన నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. బోడుప్పల్ కార్పొరేషన్‌లో ప్రధాన సమస్యలైన ఎస్ఎన్‌డీపీ ప్రాజెక్టును పూర్తి చేసి ముంపు ప్రాంతాల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. అదే విధంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దళితులకు చెందిన అసైన్ భూములకు పరిష్కారం చూపి వారికి న్యాయం చేసేలా చోరవ చూపాలని కోరినట్టు ఆయన తెలిపారు. అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా బోడుప్పల్ 10 వేల కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన వక్ఫ్ భూమి సమస్యకు పరిష్కారం చూపి అక్కడి ప్రజలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.పై విజ్ఞప్తులకు సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి కార్పొరేషన్ అభివద్ధి కోసం తనవంతు సహకారం ఉంటుందని తెలిపినట్టు మేయర్ అన్నారు. అదే విధంగా ప్రజాపాలనలో ప్రజలకు అందాల్సిన సంక్షేమ పథకాలపై ఎప్పటి కప్పుడు ప్రజలతో కలిసి వారికి కావాల్సిన సదుపాయాలపై అడిగి తెలుసుకోవాలని సూచించినట్టు తెలిపారు.త్వరలోనే పై సమస్యలకు పరిష్కారం చూపేందుకు అధికార యంత్రాంగాన్ని ఆదేశిస్తామని తెలిపారు.

సీసీ కెమెరాల నిర్వహణపై అధికారులకు రిపోర్ట్ ఇవ్వాలి



- నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి
- దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : కీసర సీఐ వెంకటయ్య

నవతెలంగాణ-కీసర

సీసీ కెమెరాల నిర్వహణ పై అధికారులకు రిపోర్ట్ ఇవ్వాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం నాగారం పురపాలక సంఘం కార్యాలయంలో చైర్మెన్ అధ్యకతన సీసీ కెమెరాల నిర్వహణ పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీసీ కెమెరాల నిర్వహణ చేసిన ఏజెన్సీతో మాట్లాడి పనులు చేయించాలన్నారు. దొంగతనాల నివారణకు ఆయా కాలనీ లో ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కీసర సీఐ వెంకటయ్య సూచించారు. ప్రతి వారం సీసీ కెమెరాలకు సంబంధించిన రిపోర్టు సంబంధిత అధికారులకు ఇవ్వాలని ఇలా చేస్తే దొంగతనాలు అరికట్టవచ్చని సీఐ తెలిపారు. కమిషనర్ ఏ.నాగమణి , డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సుధర్శనం రఘు , మేనేజర్ చంద్ర శేఖర్ పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాల గోడపత్రిక ఆవిష్కరణ



నవతెలంగాణ-కాప్రా

జనవిజ్ఞాన వేదిక కాప్రా మండల కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు పురస్కరించుకొని ఆడపిల్లను పుట్టనిస్తాం, బతకనిద్దాం, చదవనిద్దాం, ఎదగనిద్దాం, ఆడపిల్ల దేశానికి గర్వకారణం అనే నినాదాలతో కూడిన బతకమ్మ ఉత్సవాల గోడపత్రికను కాప్రా మండల కార్యాలయంలో మండల తాసిల్దార్ సుచరిత చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ ఆధునిక సమాజంలో మనం ఉన్నాగాని మహిళల పట్ల వివక్షత కొనసాగుతున్నదని తెలిపారు. తల్లి గర్భం నుంచి ఆడపిల్లల పట్ల వివక్షత మొదలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మనమందరం జనవిజ్ఞాన వేదిక ఇచ్చిన నినాదాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. దేశ జనాభాలో మహిళల శాతం రోజురోజుకు తగ్గుతున్నదని, సమాజ హితం కాదని, ఇప్పటికైనా మనమందరం కలిసి సమాజాన్ని చైతన్య పరిచేదిశగా కషి చేయాలనికోరారు. జె.వి.వి రాష్ట్ర కోశాధికారి పెట్టల నాగరాజు మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక నేటి సమాజంలో మహిళల పట్ల జరుగుతున్న అన్యాయాలను ఎత్తిచూపుతూ వాటిని అరికట్టే దిశగా ప్రచారం చేస్తున్నామన్నారు. అందులో భాగంగా మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా 5000 గోడ పత్రికలతో విస్తతంగా ప్రచారం చేస్తున్నామని, నేటి ఆధునిక సమాజ తల్లిదండ్రులు, తమ ఆడ పిల్లలు తమ ఇంటికి, దేశానికి గర్వకారణంగా భావించాలని, వారికి అన్ని రంగాల్లో ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్లేందుకు తల్లిదండ్రులుగా తమ బాధ్యత నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక నాయకులు శివ ప్రసాద్, దుర్గా చారి, రామ్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

పాత దేవుని చిత్ర పటాలను సేకరించిన కార్పొరేటర్



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మల్కాజిగిరి జీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం గురువారం సర్దార్ పటేల్ నగర్‌లో చేపట్టిన ఇంటింటికి తిరిగి పాత దేవుని చిత్రపటాలను సేకరించే కార్యక్రమం లో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అధికారులతో కలిసి పాల్గొన్నారు. కార్పొరేటర్ మాట్లాడుతూ మన దేవుళ్లను మనం గౌరవించుకోవలిసిన అవసరం ఉందని, వాటిని చెరువుపైన, చెత్త పక్కన, రోడ్ల పైన, గుడుల ముందు వదిలేయడం అగౌరవ పరిచడమేనన్నారు. అంతే కాకుండా అది శానిటైజేషన్ సమస్యలకు దారి తీస్తుందని, వీటిని సేకరించి శాస్త్రోక్తంగా రీసైకిల్ చేస్తామన్నారు. ఇంట్లోని చెత్తను స్వచ్ఛ ఆటోలలో మాత్రమే వెయ్యడం ద్వారా నగరాన్ని శుభ్రంగా ఉంచుకోవచ్చని తెలిపారు. ప్లాస్టిక్ కప్పులలో చాయ్ మానాలని చాయ్ బండ్ల వారిని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటైజేషన్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, గిరి, బాలమణి, రవి, రాజు, నందు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- గాయత్రి మహాక్షేత్రంలో బాలత్రిపురసుందరి దేవి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



నవతెలంగాణ -శామీర్ పేట

తూంకుంట మున్సిపాలిటీ కేంద్రంలోని శ్రీ గాయత్రి మహాక్షేత్రంలో గురువారం వేద పండితుల మంత్రో చ్చారణల మధ్య అంగరంగ వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అమ్మవారిని బాలత్రిపుర సుందరి దేవిగా అలంకరించారు. ఆలయ వ్యవస్థాపకులు, వాక్ బ్రహ్మ శిష్య జనోద్ధారక డాక్టర్ ఎస్.వి.ఎల్.ఎన్ మూర్తి ఆధ్వర్యంలో శ్రీకాంత్ శర్మ వేద పండితుల బందం మంత్రోచ్చరణల మధ్య శరత్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్వీఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ ఈనెల 3 నుంచి12వ తేదీ శనివారం వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని, వివిధ రూపాల్లో అమ్మవారి అలంకార సేవలు ఉంటాయని తెలిపారు. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపురసుందరి దేవిగా , రెండోరోజు కంచి కామాక్షి దేవిగా, మూడవరోజు మధుర మీనాక్షి దేవిగా, నాలుగో రోజు మహాలక్ష్మి దేవిగా, ఐదో రోజు వనదుర్గదేవిగా, ఆరో రోజు అన్నపూర్ణ దేవి గా, ఏడో రోజు సరస్వతి దేవిగా,ఎనిమిదో రోజు కనకదుర్గ దేవిగా, తొమ్మిదో రోజు రాజరాజేశ్వరి దేవిగా, 12న శనివారం చివరి రోజు అమ్మ వారి నిజరూపంలో భక్తులకు దర్శనం కల్పించనున్నట్టు ఆయన తెలిపారు. ఈనెల 3 నుండి అక్టోబర్ 12వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం శ్రీగాయత్రీ అమ్మవారికి ఉపనిషత్పూర్వక అభిషేకం, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం 3.30 గంటల నుండి చండీ హెూమము,సాయంత్రం శ్రీలలితా సహస్రనామస్తోత్ర పారాయణం, శ్రీసూక్త పారాయణం, వేద సస్త్రి, దేవిభాగవత ప్రవచనాలు ఇత్యాది కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ నెల 12న విజయ దశమి సందర్భంగా అమ్మవారికి అభిషేకం,నిజరూపదర్శనం, వాహన పూజలు, శమీ పూజ నిర్వహించనున్నట్టు చెప్పారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకోవాలని కోరారు.



జవహర్ నగర్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తాం

- మేయర్ శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్
- రూ. 8 లక్షలతో డ్రయినేజీ పనులు ప్రారంభం.

నవతెలంగాణ - జవహర్ నగర్

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జవహర్ నగర్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని మేయర్ దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. గురువారం 21వ డివిజన్ పరిధిలోని దేవేందర్ నగర్ కాలనీ, బీజేఆర్ నగర్ ఫేస్ టు కాలనీలలో మున్సిపల్ సాధారణ నిధులు 8 లక్షల రూపాయలతో చేపట్టిన అండర్ గ్రౌండ్ డ్రయినేజీ పనులను కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి డివిజన్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామని చెప్పారు. కోఆప్షన్ సభ్యులు భూమ పోలు, గుండ్ల నగేష్, రవి, వెంకటేష్, గడిపే సునీల్ కుమార్, సాంబయ్య, మహమ్మద్ ఉమర్, ఓబుల్ రెడ్డి, రూబేన్, వాహెబ్, దుర్గయ్య రుక్మద్దీన్, యాకూబ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

'అక్రమ కట్టడాలను నిలిపివేయాలి'

నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ మండలం పూడూరు గ్రామంలోని సర్వే నంబర్ 626లో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను ఆపివేయాలని కోరుతూ గ్రామస్తురాలు మండల నాగమణి జిల్లా కలెక్టర్,మున్సిపల్ కమిషనర్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా మీడియాతో ఆమె మాట్లాడుతూ గ్రామ పరిధిలో సర్వే నంబర్ 626లో ఒక ఎకరా 35గుంటల భూమి ఉందని తెలిపారు.ఈ స్థలంపై కోర్టులో కేసు నడుస్తున్నదన్నారు.అయినప్పటికీ ఈ స్థలంలో సమద్ధి ఫుడ్ గ్రోసరీస్ ప్రతినిధి అలమలకల విష్ణుమూర్తి,వెలిచాల రాజశ్రీ లు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వెల్లడించారు. ఈ అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థల వివాదం కోర్టు కేసు పెండింగ్ ఉండగా నిర్మాణాలు చేపట్టడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమ్మరి రాములు అనే వ్యక్తి నకిలీ పత్రాలను సష్టించి వెలుచల రాజశ్రీకి 1.35 గుంటల స్థలాన్ని విక్రయించారని తెలియజేశారు. ఈ స్థలంలో నుండి వెలిచల రాజశ్రీ 1500 గజాలు అలమలకల విష్ణుమూర్తి కొనుగోలు చేశారని తెలిపారు. ఈ విషయంలో రెవెన్యూ,మున్సిపల్ అధికారులు సమగ్ర విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.



కేశవరంలో మెగా వైద్యశిబిరం

నవతెలంగాణ-శామీర్ పేట

మెడిసిటీ హాస్పిటల్ మేడ్చల్ వారి ఆధ్వర్యంలో గురువారం మూడుచింతలపల్లి మండలం కేశవరం గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్ కంటి, తదితర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 122మందికి షుగర్, బీపీ, టెస్టులు చేశారు. ఆపరేషన్ అవసరమున్న 22 మందిని మెడిసిటి హాస్పిటల్ కి రిఫర్ చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఒమార్, జాహ్నవి, అజయ్, సాహితి,జయతి, మార్కెటింగ్ ఇన్‌చార్జి కుమారస్వామి, శేఖర్ బాబు ,రఘు , సాయి,హన్న, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

- సినీ నిర్మాత సీఎస్ అవధాని
- బ్లూమ్ డెల్ గేటెడ్ కమ్యూనిటీలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ -శామీర్ పేట

బతుకమ్మ తెలంగాణ సంస్కృతి కి ప్రతీక అని సినీ నిర్మాత సీఎస్ అవధాని అన్నారు. తుంకుంట మున్సిపాలిటీ శామీర్ పేటలోని బ్లూమ్ డెల్ గేటెడ్ కమ్యూనిటీలో సీఎస్ అవధాని ఆధ్వర్యంలో బుధవారం రాత్రి బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మను రంగు రంగుల పూలతో అలంకరించి అందరూ ఒక చోట పెట్టి సంతోషకరమైన వాతావరణంలో ఆట పాటలతో అలరించారు. బ్లూమ్ డెల్ రెసిడెంట్స్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, సిన్హా, ఉదయ్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు అటుకుల బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ - జవహర్ నగర్



తెలంగాణ సంస్కృతికి అస్తిత్వానికి ప్రతీకగా పూలనే దేవతగా కొలిచే బతుకమ్మ పండుగ నిలిచింది. రెండో రోజు గురువారం అటుకుల బతుకమ్మ వేడుకలు జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయిబాబా నగర్ కాలనీలో బతుకమ్మ పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. తీరొక్క పువ్వులతో బతుకమ్మను అలంకరించి కాలనీలోని ప్రధాన కూడలిలో ఆటపాటలతో పిల్లా పాపలు అందరూ కలిసి ఘనంగా నిర్వహించారు. అనంతరం బతుకమ్మలను నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు భవాని, స్వాతి, నీరూప, పావని, అరుణ, లక్ష్మీబాయి, పద్మ, శ్రీలత, సుజాత, హర్షిత, తదితరులు పాల్గొన్నారు.

చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి కృషి

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధికి కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.గురువారం చర్లపల్లి డివిజన్ లోని సిరి గార్డెన్ లో కాప్రా స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి టీజీఐఐసీసీ చైర్మెన్ నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరై నూతన సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు. ఇండస్ట్రియల్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి తప్పకుండా కషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సోమ శేఖర్ రెడ్డి మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు,పావని రెడ్డి, టీఐఎఫ్ ప్రెసిడెంట్ సుధీర్ రెడ్డి, గోపాల్ రావు ఐఏఐఏ కమిషనర్ ప్రభాకర్ , స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ నూతన అధ్యక్షుడు యాదయ్య, ఉపాధ్యక్షుడు మచ్చ అశోక్ గౌడ్, ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్, దామోదర్ చారి కమిటీ సభ్యులు పార్టీ నాయకులు మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠ ధామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట



- కార్పొరేటర్ బన్నాల

నవతెలంగాణ-ఉప్పల్

చిల్కానగర్ డివిజన్‌లోని శ్రీనగర్ కాలనీలో గౌడ కులస్తుల స్మశాన వాటికలో నూతనంగా మంచినీటి బోర్‌ను కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్ ప్రారంభించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజన్‌లోని అన్ని కులాల వారి స్మశాన వాటికల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి సహకారంతో, వారి ప్రత్యేక చొరవతో నిధులు పెద్ద ఎత్తున సమకూర్చడం జరుగుతున్నదన్నారు. అదేవిధంగా గౌడ కులస్తుల స్మశాన వాటిక స్థలంలో ప్రహరీ గోడ, గేటు, నూతన స్నానాల గదులు మొదలగు వసతులకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, కోకొండ జగన్, గౌడ సంఘం సభ్యులు బజారు జగన్నాథ గౌడ్ బజార్ మురళి గౌడ్, బూత్కూరు నవీన్ గౌడ్, పండ్ల కిషన్ గౌడ్, పంజాల శ్రవణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పండుగకు ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త

- శామీర్ పేట సీఐ శ్రీనాథ్



నవతెలంగాణ-శామీర్ పేట

దసరా పండుగకి ఊరెళ్తున్నారా.. తస్మాత్ జాగ్రత్త అని పోలీసుల పలు సూచనలు , హెచ్చరికలు జారీ చేస్తున్నారు. స్వగ్రామాలకు వెళ్లేవారు తప్పనిసరిగా పలు జాగ్రత్తలు తీసుకోవాలని శామీర్ పేట సీఐ శ్రీనాథ్ ప్రజలకు సూచిం చారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఎవరూ లేకుండా అందరూ కలిసి ఊరెళితే వారి విలువైన ఆభరణా లను, సొమ్మును జాగ్రత్తగా భద్రపరచుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాధారణ రోజుల కంటే ఇలాంటి సందర్భాల్లో అధికంగా దొంగతనాలు జరుగుతాయని తెలిపారు. దొంగలు నిఘా పెట్టి నగదు, బంగారు నగలు ఎత్తుకెళ్తారని హెచ్చరించారు. ఇంటికి తాళాలు వేసి ఊరు వెళ్లాల్సి వస్తే తగిన ఏర్పాట్లు చేసుకున్న తర్వాతే వెళ్లాలని చెప్పారు. లేదంటే తిరిగి వచ్చే లోపు దోపిడీకి గురయ్యే అవకాశం ఉందని, విలువైన వస్తువులు ఉంటాయో లేదో గ్యారెంటీ ఉండదని పోలీసులు పలు కీలక సూచనలు చేశారు.

ముఖ్య సూచనలు..

1. "దసరా పండగ సెలవులకు ఊరు వెళ్లాల్సి వస్తే విలువైన బంగారు, వెండి, ఆభరణాలు, డబ్బులు, బ్యాంకు లాకర్లలో భద్రపర్చుకోవాలి. లేదంటే ఇంట్లోనే రహస్య ప్రదేశంలో దాచుకోవాలి.
2. సెలవుల్లో బయటకు వెళ్తున్నప్పుడు సెక్యూరిటీ అలారం, మోషన్ సెన్సార్ ఏర్పాటు చేసుకోవడం మంచిది. మీ ఇంటికి సెంట్రల్ లాక్ సిస్టమ్ ఉన్న తాళాలు అమర్చుకోవడం ఉత్తమం. తాళం వేసి ఊరికి వెళ్లాల్సి వస్తే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.
3. కాలనీలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి. లేకుంటే డయల్ 100కు ఫోన్ చేయాలి.
4. వాహనాలను ఇంటి ఆవరణలోనే పార్కు చేసుకోవాలి. ద్విచక్రవాహనాలకు తాళాలు వేయడం మర్చిపోవద్దు. వీలైతే చక్రాలను ఇనుప గొలుసుతో లాక్ వేయడం మంచిది.
5. నమ్మకమైన వాచ్‌మెన్లను మాత్రమే సెక్యూరిటీ గార్డులుగా నియమించుకోవాలి.
6. ఇంట్లో అమర్చిన సీసీ కెమెరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో చూసుకుంటూ ఉండాలి.
7. మీరు ఇంట్లో లేనప్పుడు ఇంటి ముందు చెత్తా చెదారం, వార్తా పత్రికలు, పాలప్యాకెట్లు లేకుండా చూసుకోవాలి. ఎందుకంటే అవి ఉంటే మీరు ఇంట్లో లేరనే సమాచారం దొంగలకు తెలిసిపోతుంది. వాటిని గమనించి దుండగులు దోపిడీకి పాల్పడుతుంటారు.
8. మెయిన్ డోర్‌కు తాళం కప్ప వేసినప్పటికీ అది కనిపించకుండా కర్టెన్స్‌తో కవర్ చేయాలి.
9. బయటకు వెళ్లేటప్పుడు ఇంటి లోపల, బయట కొన్ని లైట్లు వేసి ఉంటే మంచిది. అలా చేస్తే ఇంట్లో మనుషులు ఉన్నారనుకుని దొంగలు రాకుండా ఉంటారు.
10. ఇంటి చుట్టుపక్కల నమ్మకమైన ఇరుగు పొరుగు వారిని మీ ఇంటి గమనిస్తూ ఉండమని చెప్పడం మంచిది.
11. మీ ఇంటికి వచ్చే, వెళ్లేదారులు, ఇంటి లోపల సీసీ కెమెరాలు అమర్చుకుని డీవీఆర్ కనపడకుండా ఇంటి లోపల రహస్య ప్రదేశంలో పెట్టుకోవాలి. అల్మారా, కబోర్డ్స్‌కు సంబంధించిన తాళాలు కామన్ ఏరియాలైన చెప్పుల స్టాండ్, పరుపులు, దిండ్ల కింద, అల్మారాపైన, డ్రెస్సింగ్ టేబుల్‌లో ఉంచకుండా సీక్రెట్ ఏరియాలో దాయాలి.
12. బంగారు ఆభరణాలు వేసుకుని ఫంక్షన్లకు వెళ్లేటప్పుడు జాగ్రతలు తీసుకోవాలి.
13. సోషల్ మీడియాలో మీరు బయటికి వెళ్లే విషయాన్ని ఇతరులకు షేర్ చేయడం మంచిది కాదు.
14. కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలు నిర్వహించుకోవాలి.
15. ఎవరిమీదైనా అనుమానం వస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100, సైబరాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ 9490617100 లేదా వాట్సాప్ నంబర్ 9490617444, శామీర్ పేట పోలీస్ స్టేషన్ నెంబర్లు 9490617142, 9490617231 లేదా 100 నెంబరుకు డయల్ చేయాలని సీఐ సూచించారు.

కోర్టు విధులను బహిష్కరించిన న్యాయవాదులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

నాంపల్లి క్రిమినల్ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాది ఎంఏ.కలీమ్ పై పోలీసులు జరిపిన దాడికి నిరసనగా న్యాయవాదుల సంఘాల సమాఖ్య గురువారం కోర్టు విధులకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్టు కో-ఆపరేటివ్ ట్రిబ్యునల్ అడ్వకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్ దివాకర్ తెలిపారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే తమ లక్ష్యమని...ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గురువారం నియోజకవర్గానికి చెందిన పలు కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, ప్రజలు మాజీ ఎమ్మెల్యేని షాపూర్ నగర్‌లని తన నివాసం వద్ద కలిసి, దేవి శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలు అందజేశారు. పలువురు తమ కాలనీలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. పలు వినతులు స్వీకరించిన మాజీ ఎమ్మెల్యే వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్

శుక్రవారం | అక్టోబర్ 04, 2024 | www.navatelangana.com

దుర్గామాత విగ్రహాలను ప్రతిష్టించే భక్తులు వివరాలు నమోదు చేయాలి..

బాచుపల్లి పీఎస్

నవతెలంగాణ-దుండిగల్

దుర్గామాత నవరాత్రి ఉత్సవాలకు సంబంధించి దుర్గా మాత విగ్రహాలను ప్రతిష్టించాలనుకున్న భక్తులు.. మండపాల నిర్వాహకులు ఈ లింకు https://policeportal.tspolice.gov.in/index.htm ద్వారా వారి వివరాలను నమోదు చేసుకొని జియో ట్యాగ్ చేసుకోవాలని కూకట్‌పల్లి డివిజన్ ఏసీపీ శ్రీనివాసరావు తెలిపారు. కూకట్‌పల్లి డివిజన్ పరిధి లోని కూకట్‌పల్లి కేపీహెచ్‌బీ అల్లాపూర్, బాచుపల్లి, పోలీస్ స్టేషన్ల పరిధిలో.. దుర్గామాత నవరాత్రి ఉత్సవాలను నిర్వహించే నిర్వాహకులు క్రింద ఇవ్వబడిన సైబరాబాద్ పోలీస్ ఆదేశాల మేరకు కింద లింకు ద్వారా వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎన్నికల హామీలను అమలు చేయాలి



● సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. గురువారం సీపీఎం సూరారం డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో .. గాజులరామారం సర్కిల్ డీఈని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్, శాఖ కార్యదర్శులు, పసుల అంజయ్య, రావుల స్వాతి పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను పారదర్శకంగా పరిశీలించి వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్లను, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అర్హులకు అందించాలన్నారు. లేనిపక్షంలో పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. డివిజన్ పరిధిలో వర్షాకాలం సీజనల్ వ్యాధులు వలన చాలామంది ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. చికెన్ గున్యా, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి కేసులు ప్రబలుతున్నాయని పేర్కొన్నారు. పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వెంటనే ప్రభుత్వం ఉచిత మొబైల్ వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సంజీవరాజు, అంబయ్య కృష్ణ, లక్ష్మి, దుర్గానాయక్ యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శక్తి వంచన లేకుండా పనిచేయాలి..!

- అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి సూచన
- 90 రోజులు కష్టపడితే అద్భుత ఫలితాలుంటాయని వ్యాఖ్య
- క్షేత్ర స్థాయిలో పలు పనుల పరిశీలన





నవతెలంగాణ-సిటీబ్యూరో

సీవరేజ్ ఓవర్ ఫ్లోపై జలమండలి చేపట్టిన స్పెషల్ డ్రైవ్ పై ఎండీ అశోక్ రెడ్డి దష్టి సారించారు. స్పెషల్ డ్రైవ్ ప్రారంభించిన రెండో రోజే క్షేత స్థాయిలో పర్యటించారు. జలమండలి ఓ అండ్ ఎం కూకట్ పల్లి డివిజన్‌లోని కేపీహెచ్ బీ, ఫేజ్-15 కైత్లాపూర్ తదితర ప్రాంతాల్లో గురువారం ఆయన పర్యటించారు. మొదటగా హౌజింగ్ బోర్డు ప్రాంతానికి ఎండీ వెళ్లారు. అక్కడ సీవరేజ్ డీసిల్టింగ్ పనులను పరిశీలించారు. జీహెచ్ఎంసీ సీవరేజ్ నిర్వహణను జలమండలికి అప్పగించిన సమయంలో మ్యాన్ హెూళ్లు రోడ్డుకు సమాంతరంగా నిర్మించే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించకుండా కేవలం సిమెంట్ ఇటుకలతో వాటి ఎత్తును పెంచి, ప్లాస్టరింగ్ పనులు పూర్తి చేయలేదని దాంతో ఆ మ్యాన్ హెూళ్లలో కంకర, ఇసుక లాంటివి చేరి సీవరేజ్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. 20 రోజులకోసారి వస్తున్న ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారుల్ని ఎండీ ఆదేశించారు. ధ్వంసమైన మ్యాన్ హెూళ్లను గుర్తించి, వాటి స్థానంలో వెంటనే కొత్త వాటి నిర్మాణం చేపట్టాలని సూచించారు. అలాగే హౌజింగ్ బోర్డు కాలనీలో బ్లాకులను గుర్తించి, 6 ప్లాట్లకు ఒక కమ్యూనిటీ సిల్ట్ ఛాంబర్‌ను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అక్కడ సిల్ట్ కార్టింగ్ వాహనాల కార్మికులతో ఎండీ మాట్లాడారు. వాహనాల్లో పనిచేసే సిబ్బంది వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారికి ఏవైనా సమస్యలున్నాయా అని వాకబు చేశారు. పనిచేస్తున్న సమయంలో రక్షణ పరికరాలు ఉపయోగించాలని చెప్పారు. అనంతరం ఫేజ్-15 కైత్లాపూర్‌కు ఎండీ వెళ్లారు. అక్కడ స్థానిక కార్పొరేటర్, కాలనీ వాసులు సీవరేజ్ ఔట్ లెట్ లేక రహదారులపై మురుగు పొంగుతుందని విన్నవించుకున్నారు. దీంతో ఈ సమస్యను పరిశీలించి ఔట్ లెట్ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని అధికారులను ఆదేశించారు. ఆ తర్వాత స్థానిక డబుల్ బెడ్ రూమ్ కమ్యూనిటీ ప్రాంగణంలో పర్యటించారు. అక్కడ అపరిశుభ్రంగా ఉన్న సంపును పరిశీలించి సంపును వినియోగానికి వీలుగా సిద్ధం చేయాలని జీహెచ్ఎంసీ, హౌజింగ్ అధికారులకు సూచించారు. తాము నీటి సరఫరా ఏర్పాట్లు చేస్తామని వివరించారు. నగరంలో సీవరేజ్ సమస్యల్ని 30 శాతానికి తగ్గించాలనే ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ప్రారంభించిన ఈ కార్యక్రమాన్ని ప్రతిష్మాత్మకంగా తీసుకుని పనిచేయాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులకు పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్‌లో దీర్ఘకాలికంగా, తరచూ వచ్చే సీవరేజ్ ఫిర్యాదులను శాశ్వతంగా పరిష్కరించడానికి అంచనాలు రూపొందించుకోవాలని సూచించారు. ఈ 90 రోజులు శక్తివంచన లేకుండా పనిచేస్తే అద్భుత ఫలితాలు రాబట్టొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

సీఎంఆర్ఎఫ్ చెక్కులు కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పంపిణీ చేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు.. ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న 39 మంది లబ్ధిదారులకు నిధులు మంజూరయ్యాయి. రూ. 16 లక్షల 94 వేల ఐదు వందల రూపాయల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ..

రోడ్డు పనులను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. గురువారం నియోజకవర్గ పరిధిలోని, కూకట్‌పల్లి డివిజన్ విజ్ఞానపురి కాలనీ వాసులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. నూతనంగా వేసిన రోడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, సంతోష్, ప్రభాకర్, ఈ.ఈ.గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ శాసమండలి చీఫ్ విప్‌గా

ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్/దుండిగల్

తెలంగాణ రాష్ట్ర మాజీ మంత్రివర్యులు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి తెలంగాణ శాసమండలి చీఫ్ విప్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డిని కలసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, మేడ్చల్ మాజీ ఎమ్మెల్యే ఎం.సుధీర్ రెడ్డి, మేడ్చల్ ఇన్‌చార్జి వజ్రాష్ యాదవ్, ఉప్పల్ నియోజకవర్గం ఇన్‌చార్జి పరమేశ్వర్ రెడ్డి, అంబర్ పేట్ నియోజకవర్గ ఇన్‌చార్జి రోహిన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టు పనుల్లో కాలయాపన ఎందుకు?





నవతెలంగాణ-కూకట్‌పల్లి

శేరిలింగంపల్లి నియోజకవర్గం వివేకానందనగర్ డివిజన్ కూకట్‌పల్లి సర్కిల్లోని వడ్డేపల్లి ఎంక్లెవ్ నుంచి మాధవరం నగర్ కాలని హైటెన్షన్ లైన్ కింద నాలాపై రూ. 90 లక్షలు నిధుల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న కల్వర్టు పనుల్లో అధికారులు కాలయాపన చేస్తున్నారు.

గత ఫిబ్రవరి నెలలో స్థానిక ఎమ్మెల్యే అరేకెపూడి గాంధీ, కార్పొరేటర్ మాధవరం రోజదేవి రంగారావు, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. కల్వర్టు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఎన్నో ఏండ్ల సమస్య తీరిపోయి ప్రజలకు ఊరట లభిస్తుందని ఎమ్మెల్యే గాంధీ తెలియజేసినప్పటికి.. కల్వర్టు పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉండిపోయాయి. కల్వర్టు పనుల్లో కాలయాపనతో వాహన దారులు మాత్రం అదే ట్రాఫిక్ సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ కల్వర్టు పనులు పూర్తయితే హైటెన్షన్ లైన్ కింద నుంచి నేరుగా ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సులువుగా ప్రయాణం చేయవచ్చని ఆశిస్తున్న వాహనదారులకు.. కల్వర్టు నిర్మాణం జాప్యం వల్ల, ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తుస్తున్నారు.

కల్వర్టు కాలయాపనపై ఇంజినీరింగ్ అధికారి గోవర్ధన్ గౌడ్‌ను వివరణ కోరాగా..

ఈ విషయంపై కూకట్‌పల్లి ఈ ఈ.గోవర్ధన్ గౌడ్ ను ఫోన్‌లో సంప్రదించగా.. కల్వర్టు నిర్మాణ పని మా దృష్టిలో ఉందని, నాలాకు ఓ వైపున రిటర్నింగ్ వాల్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉంది. రిటర్నింగ్ వాల్ నిర్మాణం పూర్తి కాగానే కల్వర్టు నిర్మాణం పనులు పూర్తి చేయడం జరుగుతుందని, త్వరలోనే కల్వర్టు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చూసామని కూకట్‌పల్లి సర్కిల్ ఈ ఈ.గోవర్ధన్ తెలిపారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో గురువారం సీఎం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించగా.. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నుంచి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర రోడ్లు, భవనాలు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ గౌతం హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం ధాన్యం కొనుగోలు, డీఎస్సీ నియామకాలపై మాట్లాడారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను సీఎం ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుంచి డీసీపీ సురేష్, అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్ఓ హరిప్రియ, డీఈఓ విజయకుమారి, వ్యవసాయ, పౌర సరఫరా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

డ్రయినేజీ సమస్యపై పర్యటన



● అధికారులు, మాజీ కార్పొరేటర్..

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ 15వ ఫేజ్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న డ్రయినేజీ సమస్యలపై గురువారం హెచ్ఎండబ్ల్యుఎస్ అండ్ ఎస్బి ఎండి.అశోక్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ బాబురావులు పర్యటించారు. ఈ సందర్భంగా వారు డ్రయినేజీ వ్యవస్థను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జీఎం ప్రభాకర్, డీజీఎం శిరీష, మేనేజర్ సలోమి, వినయ్, స్థానికులు జీవ, సత్యనారాయణ, కృష్ణా నాయక్, భాస్కర్ రావు, ఆనంద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'మొబైల్ యాక్సెసరీస్ పార్క్'ను ప్రారంభించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

132 - జీడిమెట్ల డివిజన్ అంగడిపేటలో హరీష్ అండ్ ప్రకాష్‌ల ఆధ్వర్యంలో.. గురువారం నూతనంగా ఏర్పాటు చేసిన "మొబైల్ యాక్సెసరీస్ పార్క్" ను ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఉద్యోగాన్వేషణ కాకుండా సొంత వ్యాపారాలు స్థాపించే విధంగా అభివృద్ధి చెందాలని అన్నారు. మొబైల్ రంగంలో హరీష్ వ్యాపారం ప్రారంభించిన అనతి కాలంలోనే నాలుగవ బ్రాంచ్ ఏర్పాటు చేయడం వ్యాపారం పట్ల వారి నిబద్ధతను చాటుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుంట సిద్ధి రాములు, నరేందర్ రెడ్డి, మల్లేష్ గౌడ్, సుధాకర్ గౌడ్, సమ్మయ్య నేత, కాలే గణేష్, నదీమ్ రాయ్, పులి మహేష్ పాల్గొన్నారు.

యువత పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ వెటరన్ అథ్లెట్, ఎంఎల్ఆర్ఐటీ చైర్మెన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి గచ్చిబౌలి స్టేడియంలో సిటీ టూ కోస్ట్ 1200 కిలోమీటర్ల సైకల్ యాత్రను జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సైకిల్ యాత్రలో 35 మంది పురుషులు, ఒక మహిళ పాల్గొన్నారు. హైదరాబాద్ నుంచి గోవా వరకు 1200 కిలోమీటర్లు 90 గంటల సమయంలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న వారందరినీ మర్రి లక్ష్మణ్ రెడ్డి అభినందించారు. ఇలాంటి వాటిని స్ఫూర్తిగా తీసుకుని యువత సైకిల్ వాడకాన్ని పెంచి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

వీధి కుక్కల పట్ల ఇబ్బందులు తలెత్తితే..

● మున్సిపల్‌కు సమాచారం అందించండి

నవతెలంగాణ-దుండిగల్

దుండిగల్ మున్సిపాలిటీలోని మల్లంపేట్ కేవీఆర్ వ్యాలీ, బౌరంపేట వార్డు పరిధిలోని 9 వీధి కుక్కలను, మున్సిపల్ కమిషనర్ కే.సత్యనారా యణరావు బ్లూ కాస్ సొసైటీ వారికి పట్టించడం జరిగింది. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ.. ఆ కుక్కలకు పిల్లలు పుట్టకుండా స్టెరైజేషన్ చేయటం, యాంటీ రేబిస్ టీకా వేయించడం జరుగుతుందని వివరించారు. అదేవిధంగా దుండిగల్ మున్సిపల్ పరిధిలో.. వీధి కుక్కలు ఎక్కడున్నా వెంటనే మామున్సిపల్ నెంబర్‌కు 9542715377, 9030095839, ఫోన్ చేసి సమాచారం ఇచ్చిన ఎడల వెంటనే వాటిని తీసుకెళ్లి బ్లూ క్రాస్ సొసైటీకి అప్పగించడం జరుగుతుందని కమిషనర్ తెలిపారు. కుక్కలు ఆహారము, మంచినీరు అందని యెడల వింతగా ప్రవర్తిస్తాయని, కావున జంతు ప్రేమికులు ఎవరైనా వాటికి ఆహారం అందించాలంటే జనసంచారం లేని ప్రదేశంలో ముఖ్యంగా.. చిన్న పిల్లలు తిరగని ప్లేసులలో వాటికి ఆహారము మంచినీళ్లు ఇవ్వాలని సూచించారు. ప్రస్తుతము అన్ని స్కూళ్లలో పిల్లలకు వీధి కుక్కల పైన అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు.



మహిళల ఆత్మగౌరవానికి ప్రతిబింబం బతుకమ్మ



● బాపూజీ పాఠశాల చైర్మెన్ నవ్వా ప్రభాకర్ రావు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మహిళల ఆత్మగౌరవానికి ప్రతిబింబం బతుకమ్మ పండుగ అని సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని బాపూజీ హై స్కూల్ చైర్మెన్ కరస్పాండెంట్ నవ్వా ప్రభాకర్ రావు అన్నారు. బతుకమ్మ వేడుకల్లో భాగంగా గురువారం జగద్గిరిగుట్ట పరిధి వెంకటేశ్వర నగర్‌లోని బాపూజీ హై స్కూల్‌లో బతుకమ్మ సంబరాలు విద్యార్థినిలు, ఉపాధ్యాయురాళ్ళు సందడిగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు, యువతులు చిన్నారి విద్యార్థినులు తొమ్మిది రోజులపాటు ఎంతో సంబరంగా జరుపుకునే అత్యంత ప్రతిష్టాత్మకమైన పండుగ బతుకమ్మ అన్నారు. విద్యార్థులకు ప్రతి పండగ విశిష్టత తెలియజేసేలా పాఠశాలలో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బతుకమ్మ దసరా పండుగ ప్రాధాన్యత విద్యార్థులకు తెలియజేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఫతేనగర్ లో అత్యంత వైభవంగా బతుకమ్మ వేడుకలు ..

బాలానగర్ : కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ 118 కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ ఆధ్వర్యంలో.. ఓల్డ్ ఎయిర్ పోర్ట్ రోడ్డులోని బతుకమ్మ బ్రిడ్జిపై వేలాదిమంది మహిళా మణులతో ఏర్పాటు చేసిన బతుకమ్మ వేడులకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఆడపడుచులు ఆడపడుచులు ఆటపాటలతో అత్యంత వైభవంగా నిర్వహింకున్నారు. బతుకమ్మ పండుగ స్థానిక మహిళలను విశేషంగా ఆటకు ఆకట్టుకున్నాయి. ప్రకృతిని ఆరాధియుద్దిస్తూ పువ్వుల పండుగను మహిళలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రియతమ శాసనసభ్యులు అన్న మాధవరం కృష్ణారావు హాజరై మహిళల ఉద్దేశించి ప్రసంగించి.. మహిళలతో కోలాటం ఆడి పాడి వారిని ఉత్తేజపరిచారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కంచి బిక్షపతి, రాము గౌడ్, సంధ్యారాణి, శిల్పా గౌడ్, జ్యోతి గౌడ్, కుమారి, బాలమణి, వడ్ల శేఖర్ పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్
శుక్రవారం | అక్టోబర్ 04, 2024 | www.navatelangana.com

డీఎస్సీ అభ్యర్థుల సర్టిఫికేట్ పరిశీలనకు పొడిగింపు ఉండదు

- డీఈవో రోహిణీ

నవతెలంగాణ-సిటీబ్యూరో

డీఎస్సీ ఫలితాల్లో క్వాలిఫై అయిన అభ్యర్థులు 1:3 ప్రకారం అభ్యర్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు కావాలని, ఆ తర్వాత ఎటువంటి పొడిగింపు ఉండదని హైదరాబాద్ జిల్లా విద్యాశాఖాధిరిణి ఆర్. రోహిణి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 5వ తేదీ లోపు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వెరిఫికేషన్ పూర్తిచేయించుకోవాలని ఆమె సూచించారు. 1:3 ప్రకారం క్వాలిఫై అయిన అభ్యర్థుల జాబితా ఇప్పటికే http://dcebhyderabad.webnode.in వెబ్‌సైట్‌లో పొందుపర్చామని చెప్పారు. స్కూల్ అసిస్టెంట్స్(ఆల్ మీడియా), భాషా పండితులు గవర్నమెంట్ మోడల్ ఆలియా హైస్కూల్, నాంపల్లి, ఎదురుగా ఎల్బీ స్టేడియం నందు, సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఆల్ మీడియా), ఫిజికల్ ఎడ్యుకేషనల్ టీచర్స్.. గవర్నమెంట్ గర్ల్స్ హైస్కూల్ మహబూబియా, లేపాక్షి ఎదురుగా, అబిడ్స్ నందు హాజరుకాలని డీఈవో తెలిపారు. 1:3 జాబితాలోని ప్రతి అభ్యర్థి ఈనెల 5వ తేదీ సాయంత్రం 5గంటలలోపు సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తి చేయించుకోవాలని డీఈవో రోహిణి సూచించారు.

మంత్రి కొండా సురేఖ పై బీఆర్ఎస్ కార్పొరేటర్ల ఫిర్యాదు



నవతెలంగాణ - బంజారాహిల్స్

మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ కార్పొరేటర్లు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బంజారా హిల్స్ ఏసీపీ వెంకటరెడ్డి, సీఐ రాఘవేందర్‌లకు వేరువేరుగా ఫిర్యాదు కాపీలను వెంకటేశ్వర నగర్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి, వెంగళరావు నగర్ డివిజన్ కార్పొరేటర్ దేదీప్యతో పాటు నగరంలోని వివిధ డివిజన్లకు చెందిన కార్పొరేటర్లు వేర్వేరుగా అందజేశారు.

మూసి ప్రక్షాళన పేరుతో సరికొత్త మోసం



- మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరిన ఎంపీ

నవతెలంగాణ-కంటోన్మెంట్

మూసి ప్రక్షాళన పేరుతో రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త మోసానికి తెరలేపిందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. గురువారం కంటోన్మెంట్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూసీ నిర్వాసితుల ఇండ్లను కూల్చివేస్తూ వారిని ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. భద్రత లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తాను మూసీ నిర్వాసితుల వద్దకు వెళ్దామని, రాష్ట్ర ప్రభుత్వం మంచి చేస్తుందని మూసినిర్వాసితులు చెప్తే రాజకీయాల నుంచి తప్పుకొని ముక్కు నేలకు రాస్తానని సవాల్ విసిరారు. హరీశ్ రావు రాసిస్తే తాను మాట్లాడుతున్నానని రేవంత్ రెడ్డి మాట్లాడడం ఆయన అవగాహన రహిత్యానికి నిదర్శనమన్నారు. మోసానికి అబద్ధాలకు మారుపేరుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మారిపోయారని దుయ్యబట్టారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రస్తుతం భూమిపైన లేరని, ఆయన మాట్లాడే మాటలు జుగుప్సకరంగా ఉన్నాయని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి స్థాయి దిగజారి మాట్లాడుతూ పిట్టలదొరలగా, బ్రోకర్‌లాగా వ్యవహరిస్తున్నారని మండి పడ్డారు. అహ్మదాబాద్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్‌కు రూ. 1400 కోట్లు, గంగా నది ప్రక్షాళనకు రూ. 20 వేల కోట్ల నిధులు మాత్రమే ఖర్చయితే మూసి ప్రక్షాళన కోసం 1,50,000 కోట్ల నిధులు ఏ రకంగా ఖర్చు చేస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం దగ్గర నిధుల కొరత ఉన్నప్పటికీ మూసి ప్రక్షాళనకు నిధులు ఎక్కడినుండి తీసుకొస్తారని అన్నారు. తన విద్యాభ్యాసం అంతా హైదరాబాద్‌లోనే గడిచిందని బతకడానికి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడే చౌకబారు మాటలు మానుకోవాలని హితవు పలికారు. బీజేపీ సీనియర్ నాయకులు భానుక మల్లికార్జున్, అధికార ప్రతినిధి బి.ఎన్. శ్రీనివాస్, వంశి తిలక్ తదితరులు పాల్గొన్నారు.

దేశంలోనే మొట్టమొదటిసారిగా..
ఉస్మానియాలో పీడియాట్రిక్ డెర్మటాలజీ శిక్షణా చికిత్స కేంద్రం..

- మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నరేంద్ర కుమార్ ఆరే..

నవతెలంగాణ - ధూల్ పేట్



భారతదేశంలోనే మొట్టమొదటిసారిగా పీడియాట్రిక్ డెర్మటాలజీ శిక్షణా చికిత్స కేంద్రం ఉస్మానియా ఆస్పత్రిలో ఏర్పాటు చేసినట్టు ఉస్మానియ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. నరేంద్ర కుమార్ ఆరే అన్నారు. ఆస్పత్రిలో డెర్మటాలజీ, వెనిరియాలజీ, లెప్రాలజీ(డీవీఎల్) విభాగం హెచ్ఓడీ, పీడీటీసీ ప్రొఫెసర్ డాక్టర్ భూమేష్ కుమార్ కటకం, ప్రోగ్రామ్ డైరెక్టర్, ఐఏడీవీఎల్ సెక్రటరీ జనరల్ సెక్రటరీ జనరల్ (జాతీయ) మార్గదర్శకత్వంలో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ డెర్మటాలజిస్ట్స్, వెనిరియాలజిస్ట్స్, లెప్రోలాజిస్ట్స్ (ఐఏడీవీఎల్) తో కలిసి ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్ సహయ్, హెచ్ఓడీ డాక్టర్ భూమేష్ కుమార్ కటకంలతో కలిసి ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ కేంద్రం పీడియాట్రిక్ డెర్మటాలజీని పరిష్కరించడంలో ప్రాముఖ్యతను సంతరించుకుంటుందన్నారు. చర్మ సమస్యతో ప్రస్తుత జనాభాలో 30 నుండి 40శాతం బాధపడుతున్నారన్నారు. ముందస్తు రోగనిర్ధారణ, చికిత్సను సులభతరం చేయదానికి ఎంతో దోహద పడుతుందన్నారు. శరీర ఆరోగ్యానికి అవసరమైన చికిత్సలతో పాటు చర్మ ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చర్మ సంబంధిత పరిస్థితులతో బాధపడుతున్న పిల్లలకు సమస్యలను తగ్గిస్తుందాన్నారు. డీవీఎల్ ఫలితాలను మెరుగుపరచడంలో కేంద్రం సహాయపడుతుందన్నారు.

పీడియాట్రిక్ డెర్మటాలజీని అభివృద్ధి చేయడంలో అంకిత భావంతో డిపార్ట్‌మెంట్‌లోని పోస్ట్‌గ్రాడ్యుయేట్లు, ట్రైనీలతో సహ పాల్గొనే వారందరికీ అభినందనలు తెలిపారు. పీడియాట్రిక్ డెర్మటాలజీ ట్రైనింగ్ సెంటర్ ఉస్మానియా ఆస్పత్రికి మాత్రమే కాకుండా, దేశవ్యాప్తంగా ఉన్న యువ రోగులకు సంరక్షణను కల్పిస్తుందని ఆస్పత్రి సూపరింటెండెంట్ అన్నారు. అనంతరం అతితు లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏడీవీఎల్ కోశాధికారి డాక్టర్.ఎస్.బి. కవిత, డీవీఎల్ మాజీ హెచ్ఓడీ డాక్టర్ టి రాజీవ్ సింగ్, ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సుదీర్, ఆర్ఎంఓ - 1 డాక్టర్ జయకృష్ణ, ఆర్ఎంఓ డాక్టర్ రఫీ, పీడియాట్రిక్ డెర్మటాలజీ ట్రైనింగ్ సెంటర్ (పీడీటీసీ) అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు, సీనియర్ రెసిడెంట్‌లు, ట్రైనీలు తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



నవతెలంగాణ-బేగంపేట్

ప్రజలు అంతా సుఖ సంతోషాలతో జీవించేలా అమ్మవారి ఆశీస్సులు ఉండాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆకాంక్షించారు. దేవీ నవరాత్రుల సందర్భంగా గురువారం సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారిని ఎమ్మెల్యే దర్శించుకున్నారు. ముందుగా ఆలయ పండితులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం దేవీ నవరాత్రులలో భాగంగా తొలిరోజు బాలాత్రిపురసుందరిదేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఈఓ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఎమ్మెల్యేకు ప్రసాదాలను అందజేసి వేద మంత్రాలతో ఆశీర్వచనం చేశారు. ఎమ్మెల్యే వెంట మాజీ కార్పొరేటర్ లు అత్తిలి మల్లిఖార్జున్ గౌడ్, అత్తిలి అరుణ గౌడ్, కిరణ్మయి, ఆలయ ట్రస్టీ కామేష్, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్ గౌడ్, నాయకులు కిషోర్, నాగులు, మహేందర్, ఆనంద్ పాటిల్, చంద్రప్రకాష్, అరుణ్ భట్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ తర్వాతే ఉద్యోగ నియామకాలు చేపట్టాలి



- ఎంఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు ఎల్. నాగరాజు

నవతెలంగాణ-ఓయూ

ఎస్సీ వర్గీకరణ పూర్తిచేసిన తర్వాతనే రాష్ట్రంలో ఆయా ఉద్యోగ నోటిఫికేషన్ల భర్తీ చేపట్టాలని మాదిగ విద్యార్థి సమాఖ్య ఓయూ అధ్యక్షులు, పరిశోధక విద్యార్థి ఎల్.నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాల నుంచి ఎమ్మార్పీఎస్ చేసిన పోరాటాలు,అమరుల ప్రాణ త్యాగాల వల్లనే సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ న్యాయమైన డిమాండ్ అని , ఎస్సీ వర్గీకరణ ఆయా రాష్ట్రాలు చేపట్టుకోవచ్చని తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ పై సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చిన రోజే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చేపడతామని మాట్లాడారని తెలిపారు. అయితే తీర్పు వచ్చి 2 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు కేవలం ఒక కమిటీ వేయడం జరిగింది తప్ప వర్గీకరణపై ఎటువంటి పురోగతిలేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. ఒక పక్క రాష్ట్ర ప్రభుత్వం ఆయా ఉద్యోగ నోటిఫికేషన్ల ఫలితాలు ఇస్తున్నారని.. నియమాల ప్రక్రియ వేగవంతం చేస్తున్నారని.. కానీ వర్గీకరణ పై ఒక అడుగుకూడ ముందుకుపడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణ చేపట్టకుండా రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ చేపడితే మాదిగ మాదిగ ఉపకులాలకు తీవ్ర అన్యాయం చేసిన వారవుతారని అన్నారు. గతంలో ఇచ్చిన నోటిఫికేషన్లకు ఎగ్జామ్ నిర్వహించి, ఫలితాలు ప్రకటించి నియామకాలు చేపట్టకుండా ఉన్న ప్రతి ఉద్యోగ నోటిఫికేషన్లలో ఎస్సీ వర్గీకరణ అమలయ్యే విధంగా ఆర్డినెన్సు తీసుకొచ్చి విధంగా సాధ్యాసాధ్యాలను చూడాలని కోరారు. లేకుంటే ఆయా నోటిఫికేషన్‌ను రద్దు చేసి రీనోటిఫికేషన్ ఇవ్వాలని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనకున్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని కోరారు. లేకుంటే మరో యుద్ధం తప్పదని హెచ్చరించారు.

గాంధీ శిల్పం గీసిన వెంకన్న

నవతెలంగాణ-ఓయూ



సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ సముద్ర తీర ప్రాంతాలలో స్వతంత్ర సమరయోధుల శిల్పాలు ఇసుకతో తయారు చేస్తే , ఓయూ లైబ్రరీ కాంటాక్ట్ ఎంప్లాయ్, ఇస్లావత్ వెంకట్ నాయక్ భారత జాతిపిత గాంధీజీ జయంతిని పురస్కరించుకొని కాకినాడ ఉప్పాడ బీచ్‌లో ఒక బండరాయి మీద గాంధీజీ చిత్రం ఆర్ట్ గిశారు. ఈ సందర్భంగా సముద్ర తీర ప్రాంతాలలో స్వచ్ఛ సేవ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సముద్రంలో ఉన్న కొన్ని జీవరాశుల చిత్రాలు వేస్తూ పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కొన్ని ముఖ్యమైన సందేశాలు బండరాళ్ళ మీద రాసినట్టు వెంకట్ తెలిపారు. ఇలాంటి సందేశాలు సముద్ర తీర ప్రాంతాలలో బండరాళ్ళ మీద రాస్తూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడు తెలుసుకొనే బాధ్యత ఎంతైనా ఉందని తెలియజేశారు.

పార్ట్ టైం లెక్చరర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించండి.

- టీజీ ఆప్ట

నవతెలంగాణ-ఓయూ



పార్ట్ టైం లెక్చరర్ల కార్యచరణలో భాగంగా గురువారం రాష్ట్ర గ్రంధాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రియాజ్ ను కలిసి రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చరర్ల సమస్యలు టీజి ఆప్ట కార్యవర్గ సభ్యులు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న పార్ట్ టైం లెక్చరర్ల కు అందరికీ ఒకే విధంగా క్లాస్ లతో సంబంధం లేకుండా 50000 నెలకు ,12 నెలలు ఇవ్వాలని, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టో తక్షణమే అమలు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన చైర్మన్ డా. రియాజ్ మీ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని, మీకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారని చెప్పారు.ఈ కార్యక్రమంలో టీజీ ఆప్ట గౌరవ అధ్యక్షులు డా. రవీందర్ గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. ఎర్రం నాగేంద్రం, వర్కింగ్ ప్రెసిడెంట్ డా. ఎం కుమార స్వామి , డా.పి. శ్రీ లక్ష్మీ రెడ్డి , డా. మంచాల లింగస్వామి, డా కంచి రాజేష్, డా.భిక్షపతి, డా. శ్రీనివాస్, డా ఏడు కొండల్ డా. శంకర్, డా. రాము.డా. భీం రావు డా విఠల్,డా మాధవి,డా. పల్లవి, డా.శ్రీ వైష్ణవ వేణుగోపాల్, డా. గంగాధర్, డా.శేఖర్,డా. పి మహేందర్,డా.లలిత, డా.యుగంధర్, డా రంజిత్, డా శారీన్, డా.రమేష్, పాల్గొన్నారు.

బీఎడ్ ఫోర్త్ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేయాలి



- ఓయు రిజిస్ట్రార్‌కు డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థుల వినతి పత్రం

నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా పరిధిలో బి.ఎడ్ ఫోర్త్ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసి తమకు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు మార్గం సుగమం చేయాలని ఓయు రిజిస్ట్రార్ ప్రో.లక్ష్మీ నారాయణను డి.ఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులు కోరారు. అభ్యర్థులు గురువారం ఓయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్రప్రభుత్వం ఇటీవల డీఎస్సీ ఫలితాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. డి.ఎస్సీ క్వాలిఫై అయిన అభ్యర్థులకు సర్టిఫికెట్ వెరిఫికేషన్ షెడ్యూలు విడుదల నేపథ్యంలో ఓయూ పరిధిలో బి.ఎడ్ ఫోర్త్ సెమిస్టర్ రిజల్ట్స్ కోసం విద్యార్థులు ఎదురుచూసే పరిస్థితి ఏంటి అంటూ ప్రశ్నించారు. త్వరితగతిన ఫలితాలు విడుదల చేసి న్యాయం చేయాలని క్వాలిఫైడ్ అభ్యర్థులు జి.ప్రవీణ్, సి.యచ్.సవిత, కె.రాము, కె.కోటేశ్వర్ కోరారు.



ఆర్‌పీఐ క్రిస్టియన్ సెల్ జాతీయ అధ్యక్షుడిగా జాన్ మాస్క్

నవతెలంగాణ-బంజారాహిల్స్

రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా క్రిస్టియన్ సెల్ జాతీయ అధ్యక్షుడిగా నగరానికి చెందిన జాన్ మాస్క్‌ను నియమిస్తూ ఆ పార్టీ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాందాస్ అతువాలె గురువారం నియామక పత్రం అందజేశారు. దేశంలోని 29 రాష్ట్రాల్లో ఉన్న దళిత క్రైస్తవుల హక్కులతో పాటు వారికి చేరాల్సిన పథకాలపై కృషి చేస్తారని తెలిపారు. అనంతరం జాన్ మాస్క్ మాట్లాడుతూ..

దళిత క్రైస్తవుల సమస్యలపై,హక్కులకై పోరాడేందుకు ఆర్‌పీఐ తరపున తనను జాతీయ అధ్యక్షుడిగా నియమించినందుకు కతజ్ఞతలు చెప్పుకుంటున్నానన్నారు. దళిత క్రైస్తవులను ఎస్సీల్లో చేర్చడంపై ఎన్డీఏ కూటమి ద్వారా అన్ని రాష్ట్రాల నాయకులను కలుస్తామని అన్నారు. డిసెంబర్ 3న ఆర్‌పీఐ తరపున భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈశాన్య రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ప్రధాని మోడీ కూడా కేంద్ర మంత్రి రాందాస్ అతువాలే సారథ్యంలో ఆహ్వానించబోతున్నట్టు తెలిపారు. క్రైస్తవులపై చేస్తున్న దాడులను వ్యతిరేకించడంతో పాటు దాడికి పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా కృషి చేస్తామని చెప్పారు.తెలుగు రాష్ట్రాలలో ఉన్న దళిత క్రైస్తవులకు కూడా అండగా నిలుస్తామని తనపై నమ్మకం ఉంచి ఇంత పెద్ద బాధ్యతను అప్పగించడం ఆనందంగా ఉందని అన్నారు.

సంస్కృత అకాడమీలో ముగిసిన వంద వేద ఉపన్యాసాల పరంపర



నవతెలంగాణ-ఓయూ

భారతీయవిజ్ఞాన పరంపరను ఆధునికులకు సులభమైన మార్గాల్లో అందజేయాలన్న తపనతో ఉజ్జయినీలోని మహర్షి సాందీపని వేద విద్యా ప్రతిష్ఠాన్ వారి ఆర్థికసహాయంతో సంస్కృత అకాడమీ వేద విజ్ఞాన శత వ్యాఖ్యాన మాలికా అనే పేరుతో వంద వేద ఉపన్యాసాల కార్యక్రమన్ని నిర్వహించారు. సుమారుగా ఒకటిన్నర సంవత్సరం నుంచి ఆయా శాస్త్రాలలో కృషి చేసిన పండితులను సంప్రదించి ఆన్ లైన్ మాధ్యమం ద్వారా వంద ఉపన్యాసాలను నిర్వహించామని అకాడమీ డైరెక్టర్ ఆచార్య నీలకంఠం తెలిపారు. వేదాలు, వేదాంగాలు, ఉపనిషత్తులు, పురాణాలు, కావ్యాలు మొదలగు వివిధ విషయాలపైన చర్చించి ఈనాటి విద్యార్థులకు భారతీయ జ్ఞానపరంపర వైశిష్ట్యాన్ని తెలిపేందుకు ప్రయత్నించామని ఆచార్య నీలకంఠం తెలిపారు. సంస్కృత అకాడమీలో సహాయకాచార్యుడైన డాక్టర్ సంతోష్ జోషి ఈ కార్యక్రమాన్ని అలుపెరుగకుండా నిర్వహించారని, పండితులను సంప్రదించి వారికి యోగ్యమైన సమయాన్ని నిర్ణయించడం, శ్రోతలందరికి తెలుపడం వంటి క్లిష్టమైన పనులన్ని శ్రద్ధతో సహనంతో నిర్వహించారని సమాపనోత్సవంలో పాల్గొన్న వక్తలందరూ ప్రశంసించారని తెలిపారు. మరల ఇటువంటి ఉపయోగకరమైన ఉపన్యాసపరంపరని నిర్వహించాలని సభలో శ్రోతలు అనేకమంది ఆచార్య నీలకంఠంను కోరారు. భారతదేశంలో ఋగ్వేదపండితులలో అత్యంత ప్రసిద్ధులైన ఆచార్య నరేంద్ర కాప్రే ఘనపాఠి, మహామహోపాధ్యాయులు న్యాయశాస్త్రనిష్ణాతులు నల్లగొండ పురుషోత్తమ శర్మ, వేదాల్లో సాంకేతికవిజ్ఞానం పై కృషి చేసిన ఆచార్య శివరామకృష్ణ, తెలంగాణా సంస్కృతభారతీ పూర్వాధ్యక్షులు శ్రీమాన్ లక్ష్మీనాథాచార్యులు ఇంకా అనేక మంది విద్వాంసులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. నిరంతరం సంస్కృత అకాడమీ చేస్తున్న సేవ అనితర సాధ్యమని, విశ్వవిద్యాలయాల్లో కూడా ఈ విధంగా కార్యక్రమాలు జరగట్లేదని, అతిథులందరూ నీలకంఠంను ప్రశంసించారు. సంస్కృత అకాడమీకి ఇంకా విస్తతంగా నిధులు కేటాయించాలని విశ్వవిద్యాలయాలను, ప్రభుత్వాలను వేడుకున్నారు.

యూట్యూబర్, గాయని, నటి బేబక్కకు నారీ శక్తి పురస్కారం



నవతెలంగాణ-కల్చరల్

యూ ట్యూబ్ లో వంటలు పాటలు తో తెలుగు రాష్ట్రాలలో పేరుగాంచిన బెజవాడ బేబక్కను ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా నిలయం నిర్వహణలో శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై సత్కరించి నరీ శక్తి దసరా పురస్కారం బహుకరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు మాట్లాడుతూ సామాజిక మాధ్యమాల కాలంలో సినిమాలు టీ వీ ఛానెల్స్ కు ధీటుగా యు ట్యూబ్‌లో పలు విభిన్న అంశాలుతో కళాకారులు ప్రేక్షక ప్రశంస పొందుత ఎన్నారన్నారు. బెబక్క గాయనిగా నటి గానే కాక పలు రకాల వంటలు తయారీని తన యు ట్యూబ్‌లో చూపుతూ వంటలక్క గా పేరు తెచ్చుకున్నారని కొనియాడారు. బేబక్క మాట్లాడుతూ సృజన శక్తి వుంటే స్త్రీలు అబలలు కారని ఇంటికే పరిమితం కారనీ నిరూపించవచ్చు అన్నారు. సామాజిక మాధ్యమాలు అందుబాటు లోకి వచ్చిన తరువాత ప్రతి స్త్రీకీ తమ ప్రతిభ ప్రదర్శనకు అవకాశాలు ఉ న్నాయని వివరించారు. చందు ఆంజనేయులు, సినీ నిర్మాత మురళీధర్ తదితరులు పాల్గొన్న సభలో సంస్థ కార్యదర్శి సురేందర్ స్వాగతం పలికారు. అధ్యక్షురాలు పుష్ప వందన సమర్పణ చేశారు తొలుత పలువురు నాట్య గురువుల శిష్యులు విభిన్న నాట్య ప్రక్రియలు నర్తించి ఆకట్టుకున్నారు



చేనేత వస్త్ర వినియోగం.. చేనేతకారులను ప్రోత్సహించడమే..

- నటి వాణ్య అగర్వాల్

నవతెలంగాణ - బంజారాహిల్స్

చేనేత వస్త్ర వినియోగం చేనేతకారులను ప్రోత్సహించడమేనని నటి వాణ్య అగర్వాల్ అన్నారు. శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్య సాయి నిగమాగమంలో ఏర్పాటైన జాతీయ చేనేత పట్టు వస్త్ర ప్రదర్శన గురువారం టాలీవుడ్ వర్ధమాన నటి వాణ్య అగర్వాల్ ప్రారంభించి మాట్లాడారు. భారతీయ సంస్కతిలో పట్టు, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందని తెలిపారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె తగ్గలెదన్నారు. నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారని, ప్రతి ఒక్కరూ చేనేతను మరింత ఆదరించి చేనేత వస్త్రాల వాడకంపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని తెలిపారు నిర్వాహకులు జయేష్ కుమార్ గుప్తా మాట్లాడుతూ, ఈ నెల 8వ తేదీ వరకు కొనసాగనున్న ప్రదర్శనలో దేశం లోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటీరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు.

చాదర్ సమర్పించిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ



హైదరాబాద్ నాంపల్లి లోని ప్రాచీన హజ్రత్ యూసూఫెయిన్ షెర్ శరీఫెయిన్ దర్గా వద్ద బుధవారం డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డితో కలిసి చాదర్ సమర్పించి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని,సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మంచి పాలన అందించాలని ప్రార్థించినట్టు తెలిపారు. అలాగే రైతులకు మేలు కలిగేలా పంటలు పండాలని ప్రార్థనలు చేసినట్టు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో దర్గా ప్రముఖులు ఖాజా పాషా, యాకూబ్ షరీఫ్, ముజాహిద్, స్థానిక నాయకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. దర్గా కమిటీ సభ్యులు డిప్యూటీ మేయర్ దంపతులకు స్వాగతం పలికారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు.



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆదేశాల మేరకు బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్, జిల్లా జనరల్ సెక్రటరీ మేకుల సారంగపాణి ఆశీర్వాదంతో సికింద్రాబాద్ మహంకాళి జిల్లా కార్యదర్శిగా ఎం. శ్యాంసుందర్‌ను నియమించారు. ఈ మేరకు శ్యామ్ సుందర్ నియామక పత్రం అందుకున్నారు.ఇచ్చిన బాధ్యతను పార్టీ అభివద్ధి కోసం, పార్టీ కార్యకర్తల కోసం పనిచేస్తానని అన్నారు. పలువురు శ్యామ్ సుందర్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

నవతెలంగాణ-ఓయూ

ఆక్రమణలకు గురైన భూముల వివరాలు తెలియజేయాలి

- అధికారులను కోరిన ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని చెరువులు, కుంటల పూర్తి విస్తీర్ణం, ఆక్రమణలకు గురైన భూముల వివరాలను తెలియజేయాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తహశీల్దార్‌లకు, ఇరిగేషన్ అధికారులకు, కలెక్టర్‌కి దరకాస్తు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని చెరువుల్లోని ప్రభుత్వ షికం భూముల విస్తీరణం ఎంత..? ప్రయివేటు పట్టా భూముల విస్తీర్ణం ఎంత..? అక్రమణకు గురైన భూములు పట్టా భూములా లేక ప్రభుత్వ భూములా.. ఏ ఏ సంవత్సరాలలో ఎన్ని ఏండ్ల కిందట చెరువులు, కుంటలు ఆక్రమణకు గురయ్యాయో తెలపాలన్నారు. పూర్తి వివరాలు చెరువుల వారీగా సమాచార హక్కు చట్టం ప్రకారం అందజేయాలని కోరారు.

పలు ప్రాంతాల్లో ఈడీ పర్యటన



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి ఓ అండ్ ఎం డివిజన్ 7 పరిధిలోని శ్రీనివాస్ నగర్, నల్లగుట్ట ప్రాంతాల్లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మయాంక్ మిట్టల్ గురువారం పర్యటించారు. ఆ ప్రాంతంలోని తాగునీటి సరఫరా, నీటి నాణ్యత, సప్లై లెవల్స్, మురుగు నీటి నిర్వహణ తదితర పనుల్ని పరిశీలించారు. ప్రజలకు ఇబ్బంది లేకుండా ఫిర్యాదులను సాధ్యమైన త్వరగా పరిష్కరించాలన్నారు. ఈడీ వెంట డైరెక్టర్ ఆపరేషన్స్-1 విజయరావు, జీఎం, డీజీఎం, మేనేజర్ తదితరులున్నారు.

భద్రతా నియమాలకు కట్టుబడి ఉన్నాం





- మెట్రో రైలు భద్రత సెమినార్‌లో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ మెట్రో రైలు భద్రతా నియమాలకు కట్టుబడి ఉందని హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి అన్నారు. ఉప్పల్ మెట్రో రైల్ డిపోలోని అడ్మినిస్ట్రేటివ్ భవనంలో గురువారం ఎల్అండ్‌టీఎమ్ఆర్‌హెచ్ఎల్ నిర్వహించిన తమ తొలి భద్రత సెమినార్‌ను గురువారం విజయవంతంగా ముగించింది. ఈ సెమినార్‌లో భాగంగా భద్రతపై చర్చించడంతో పాటు ఉత్తమ పద్ధతులను పంచుకోవడం, మెట్రో, రైల్వే పరిశ్రమలోని క్లిష్టమైన సంఘటనల నుంచి నేర్చుకునేందుకు హెచ్ఎంఆర్ఎల్, ఎల్ అండ్‌టీఎమ్ఆర్‌హెచ్ఎల్, కియోలిస్ హైదరాబాద్ ఉన్నతాధికారులు, భద్రతా నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకు ముందు ఈ సెమినార్ హైదరాబాద్ మెట్రో వర్క్‌షాప్‌లో సేఫ్టీ వాక్‌తో ప్రారంభించారు. అంతర్గతంగా అభివృద్ధి చేసిన భద్రతా పద్ధతులను బృందాలు ప్రదర్శించడం, భద్రతా నియమాలకు కట్టుబడి ఉండటం తమ ప్రాముఖ్యతను తెలిపాయి. ఇదే సమయంలో సరైన భద్రతా విధానాలను అనుసరించడం, అభివృద్ధి చేయాల్సిన ప్రాంతాలను గుర్తించడంలో ఉద్యోగులకు మార్గ నిర్దేశం చేసేందుకు రూపొందించిన హ్యాండ్‌బుక్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఆర్ఎల్ ఎండీ మాట్లాడుతూ మెట్రో ప్రాజెక్ట్ నిర్మాణం, నిర్వహణలో భద్రత ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. హైదరాబాద్ మెట్రో నిర్మాణ సమయంలో జీరో-ఫాటాలిటీ రికార్డును సాధించడంతో పాటుగా అనేక భద్రతా అవార్డులను గురించి ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. నిరంతరం అభివృద్ధి చెందాల్సిన అవసరాన్ని, నూతన లక్ష్యాల ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు. ఎల్అండ్‌టీఎమ్ఆర్‌హెచ్ఎల్ సీఎండీ కేవీబీ రెడ్డి మాట్లాడుతూ భద్రత పట్ల హైదరాబాద్ మెట్రో తిరుగులేని నిబద్ధతను పునరుద్ఘాటించారు. భద్రతకు ప్రాధాన్యతనిస్తూ, మెరుగైన చర్యలను తీసుకువచ్చేం దుకు మెట్రో వ్యవస్థ కొనసాగుతుందని ప్రయాణికులు, సిబ్బందికి హామీ ఇచ్చారు. ఎల్అండ్‌టీఎమ్ఆర్‌హెచ్ఎల్ సీవోవో సుధీర్ చిప్లుంకర్ మాట్లాడుతూ భద్రత అనేది భాగస్వామ్య బాధ్యత అన్నారు. తాము తమ ప్రయాణీకులను భద్రతా చార్టర్ ను చదవాలని, వారి స్వంత భద్రత, ఇతరుల భద్రతను నిర్ధారిం చడానికి మార్గదర్శకాలను అనుసరించాలని కోరుతున్నామని ఆయన తెలిపారు.

హెచ్ఎంటీ ఖాళీ స్థలంలో

ఆర్టీసీ డిపోను ఏర్పాటు చేయాలి



- సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్
- రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతి

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట సమీపంలోని హెచ్ఎంటీ ఖాళీ స్థలంలో బస్ డిపో ఏర్పాటు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఈ.ఉమామహేష్ కోరారు.ఈ మేరకు గురువారం సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి సహకారంతో కలిసి రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సచివాలయంలో సీపీఐ శ్రేణులతో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర జిల్లాలకు చెందిన సుమారు 50 బస్సులు ప్రతి రోజు రాత్రి నిలిపిఉంటాయని అలాగే నిత్యం వందలాదిమంది ప్రయాణికులు ప్రయాణం కొనసాగిస్తుంటారని ప్రయాణికుల సౌకర్యార్థం జగద్గిరిగుట్టలో బస్ డిపోను తప్పనిసరిగా ఏర్పాటు చెయ్యాలని వినతిలో కోరారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలో నూతన బస్ డిపోలను ఏర్పాటు చేసే ఉద్దేశ్యం ప్రభుత్వానికి ఉందని అందులో జగద్గిరిగుట్టకు కూడా ఉండేలా చూస్తామని సీపీఐ నేతలకు మంత్రి హామీ ఇచ్చారు. సీపీఐ ఆధ్వర్యంలో గత కొద్ది సంవత్సరాలుగా అనేక సార్లు బస్ డిపో కోసం పోరాటాలు చేశామని, అనేక సార్లు వినతిపత్రాలు కూడా ఇచ్చామని, కలెక్టర్‌కు కూడా సర్వే చెయ్యమని చెప్పామని, మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. బస్ డిపో ఏర్పడటం వల్ల ట్రాఫిక్ రద్దీ తీరుతుందని, ఇతర జిల్లాల నుండి వచ్చి ఆగే బస్ డిపోలకు చెందిన సిబ్బంది విశ్రాంతి తీసుకోవచ్చని, ప్రజలకు ఉపాధి లభిస్తుందని అందుకు కచ్చితంగా బస్ డిపో ఏర్పాటు కొరకు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈ.టీ నర్సింహ, రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నం, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు హరినాథ్ రావ్, వంగాల శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

మొబైల్ ఐసీటీసీ వ్యాన్ ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్ ప్రాంగణంలో గురువారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాధికా గుప్త మొబైల్ ఐసీటీసీ వ్యాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్ఏసీఓ మార్గదర్శకాల ప్రకారం, టీఎస్ఏసీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొబైల్ ఐసీటీసీ వ్యాన్‌లను అందజేసినట్టు తెలిపారు. ఇది నేషనల్ ఎయిడ్స్, ఎస్టీడీ కంట్రోల్ ప్రోగ్రామ్ (ఎన్ఏసీపీ)లో భాగంగా, కొత్త హెచ్ఐవీ ఇన్ఫెక్షన్లు, ఎయిడ్స్ సంబంధిత మరణాల సంఖ్యను తగ్గించడమే లక్ష్యంగా ఉంటుందని తెలిపారు. ఈ వ్యాన్‌లు తాత్కాలిక క్లినిక్‌లుగా పనిచేసి వైద్య సేవలను అందిస్తాయనీ, తద్వారా ఎస్టీడీ చికిత్సలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు, సంప్రదింపులు, రక్త నమూనాల సేకరణ నిర్వహించడానికి ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ టి.రఘునాథ్ స్వామి, జిల్లా కార్యక్రమ అధికారి డాక్టర్ శ్రీదేవి(ఎయిడ్స్, కుష్ఠవ్యాధి), డిషా బృందం, డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాంపల్లిలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు





నవతెలంగాణ-కీసర

నాగారం మున్సిపాలిటీ, రాంపల్లి గ్రామంలోని మహంకాళి అమ్మవారి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం వైభవంగా ప్రారంభ మయ్యాయి. వేదపండితులు గణపతి పూజ, పుణ్యాహవచనం, నవగ్రహ పూజ, కలశ స్థాపన పూజలను ఘనంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. కీసర ఎస్ఐ హరి ప్రసాద్ అమ్మవారిని దర్శించుకోవడం తో ఆలయ చైర్మెన్ ఎలాసాని భూమయ్య యాదవ్ ,వైస్ చైర్మన్ మంచాల మహేందర్,ఆలయ కమిటీ సభ్యులు శాలువా తో ఘనంగా సన్మానించారు.



నవతెలంగాణ-ఉప్పల్

దేవేందర్ నగర్ కాలనీలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు జీ భీష్మ చారి, ఐద్వా నాయకులు వినోద, జి ప్రపూర్ణ,కాలనీ అధ్యక్షులు ఏ కన్నయ్య పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

నవతెలంగాణ
మనుగు తెలుగు దినపత్రిక
హైదరాబాద్
శుక్రవారం అక్టోబర్ 04, 2024 www.navatelangana.com

డ్రయినేజీ పైపు లైన్ పనుల పరిశీలన



నవతెలంగాణ-నేరేడ్ మెట్

మల్కాజిగిరి డివిజన్ ఎస్పీ నగర్ రైల్వే ట్రాక్ పక్కన ఉన్న సాయిబాబా గుడి వద్ద నుండి హైదర్ నగర్ మెయిన్ డ్రయినేజీ పైపు లైన్ కనెక్షన్ చేయడానికి 70 మీటర్ల పొడవుతో కొనసాగుతున్న పనులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ఆదేశాల మేరకు గురువారం మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనసాగుతున్న డ్రయినేజీ పనులను పొడిగించాలని స్థానికులు తన దృష్టికి తీసుకురాగా, వెంటనే ఎమ్మెల్యేతో మాట్లాడానని.. స్పందించిన ఎమ్మెల్యే డ్రయినేజీ పైపు లైన్‌ను పొడిగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్టు తెలిపారు. అనంతరం స్థానిక కాలనీవాసులు మాట్లాడుతూ కాలనీ అభివృద్ధికి మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ చేస్తున్న కృషి అభినందనీయమని, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు.

బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో కనకాల కట్ట మైసమ్మ



నవతెలంగాణ - ముషీరాబాద్

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత ఘనంగా మొదలయ్యాయి. మొదటి రోజు బాల త్రిపుర సుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు కనకాల కట్ట మైసమ్మ ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ చైర్మెన్ గౌతమ్ కుమార్, కార్యనిర్వాహక అధికారి సాంబశివరావు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం
వివరాలు పక్కాగా సేకరించాలి



- అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం కుటుంబ వివరాలు పక్కాగా సేకరించాలని అడిషనల్ కమిషనర్ స్నేహ శబరీష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల్లో ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, తహసీల్దార్లు, ఏఎంసీలు, డీపీఓలు, సీఓలు, తదితరులకు ఫ్యామిలీ డిజిటల్ కార్డుల కోసం సేకరించాల్సిన వివరాలు, ఫార్మేట్స్ తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా స్నేహ శబరీష్ మాట్లాడుతూ బుధవారం 3 నుంచి ఫ్యామిలీ డిజిటల్ కార్డు కోసం పైలట్ ప్రాజెక్టు కింద జీహెచ్ఎంసీ పరిధిలోని ప్రతి నియోజకవర్గంలో రెండు కాలనీలను ఎంపిక చేశామని, ఆయా పైలెట్ కాలనీలలో కుటుంబాల వివరాలు ఇంటింటికీ తిరిగి సేకరించాలని, ఒక్కో టీమ్ ప్రతి రోజు కనీసం 40 ఇండ్లను సర్వే చేయాలని సూచించారు. సంబంధిత ఫార్మాట్‌లలో అప్డేట్ డీటెయిల్స్ నింపాలని తెలిపారు. ఐదు రోజుల్లోగా ఇంటింటి సర్వే పూర్తి చేయాలని తెలిపారు. దీని పర్యవేక్షణకు ప్రతి నియోజకవరానికి ఒక నోడల్ ఆఫీసర్ ఉంటారని తెలిపారు. సర్వే సందర్భంగా ఆయా కుటుంబాల్లో పుట్టిన, మరణించిన వారి వివరాలు, కొత్త ఫ్యామిలీ, మైగ్రేషన్, పర్మినెంట్ గా విదేశాలకు వెళ్లిన వారి వివరాలు తీసుకొని ఎంట్రీ చేయాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 8వ తేదీ వరకు ఇది పూర్తి చేయాలని, 9వ తేదీ స్క్రూటినీ ఉంటుందని, 10వ తేదీన ప్రభుత్వానికి నివేదిక పంపాలని ఆమె తెలిపారు. ఒక కుటుంబానికి ఒక్క కార్డు మాత్రమే ఉంటుందని, ఈ ప్రాజెక్టులో ఒక కుటుంబాన్ని ఒక యూనిట్‌గా గుర్తించి ఐడి కార్డు ఇస్తారని అన్నారు. హెడ్ ఆఫ్ ది ఫ్యామిలీ గా కుటుంబంలోని సీనియర్ మహిళను తీసుకోవాలని తెలిపారు. ఒక కుటుంబం ఒక చోట మాత్రమే నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈ పైలెట్ ప్రాజెక్టు అనంతరం మిగతా అన్ని కాలనీలలో సర్వే కొనసాగుతుందని తెలిపారు. నిర్దేశిత సమయంలోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సర్వే విషయమై పలువురు అధికారుల సందేహాలకు ఆమె నివృత్తి చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో పిఓలు, తహసీల్దార్లు, ఏఎంసీలు, డీపీఓలు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, సి.ఓ .లు, పి.ఓ.లు తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా పేరిట పేదల నివాసాలను కూల్చొద్దు

- కబ్జాదారుల నుండి చెరువులు, కుంటలను కాపాడాలి
- సీపీఐ(ఎం-ఎల్) న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు



నవతెలంగాణ - ముషీరాబాద్

హైడ్రా పేరిట పేదల నివాసాలను కూల్చ వద్దని, కబ్జాదారుల నుండి చెరువులు, కుంటలను కాపాడాలి అని సీపీఐ (ఎం-ఎల్)న్యూ డెమోక్రసీ రాష్ట్ర సహాయ కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం విద్యా నగర్‌లోని చంద్ర పుల్లారెడ్డి భవన్‌లో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సాదినేని వెంకటేశ్వరరావు హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరాన్ని కబ్జాల నుండి, దురాక్రమణల నుండి రక్షించడానికి రూపొందించిన "హైడ్రా"ను నిరుపేదలపై, బస్తీ వాసులపై ప్రయోగించి వారికి ఆవాసాలు, జీవనోపాధి లేకుండా చేసే విధానాలను తక్షణం నిలిపివేయాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాలు అనుసరించిన దివాళాకోరు విధానాల వలన ప్రత్యేకించి హైదరాబాద్ మహానగరంలోని వందలాది చెరువులు, కుంటలు దురాక్రమణలకు, కబ్జాలకు గురయ్యాయని, సహజసిద్ధ నీటి వనరులు రియల్ ఎస్టేట్ వ్యాపారుల పరమయ్యాయని ఆరోపించారు. ఫిరంగి నాలా మొదలుకుని అన్ని చెరువులు, కుంటలకు వచ్చే నీటి ప్రవాహానికి అడ్డంగా శాశ్వత కట్టడాలు కట్టిన ఫలితంగా హైదరాబాద్ నగరంలో వర్షాలు భారీగా వచ్చిన ప్రతి సందర్భంలోనూ వందలాది కాలనీలు, బస్తీలు నీటి ప్రవాహంలో రోజుల తరబడి చిక్కుకుని పేద, మధ్యతరగతి ప్రజానీకం పడుతున్న బాధలు అంతా యింతా కాదు అని వివరించారు. హైదరాబాద్ నగరంలోని చెరువులు, కుంటలను రక్షించాలని ప్రజలు మనసారా కోరుకున్నారు కానీ, మూసీ సుందరీకరణ పేరిట నిరుపేదలకు మరేయితర ఆధారం లేకుండా మూసీ నది ఒడ్డున గత మూడు నాలుగు దశాబ్దాలుగా నివాసం వుంటున్న పూరిళ్లను, పెంకుటిళ్లను ఏ ప్రత్యామ్నాయమూ చూపకుండా కూల్చివేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామ న్నారు. వారికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసిన తర్వాతనే అక్కడి నుంచి తొలగించాలని కోరారు.

ఆగస్టు15 నాటికి రెండు లక్షల రూపాయల వరకు పూర్తిగా రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం, యింకాను సగం మంది రైతులకు రకరకాల కారణాలతో రుణ మాఫీ చేయకుండా జాప్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే ప్రభుత్వం హామీ యిచ్చిన వాగ్దానాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అలాగే రైతు భరోసాను కూడా వెంటనే ప్రారంభించి, రైతులను ఆదుకోవాలి అని డిమాండ్ చేశారు.దామగుండం రాడార్ కేంద్రం ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి అని అన్నారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర నాయకులు కె. గోవర్దన్., వి. సంధ్య(POW), జి. అనురాధ(IFTU), మంద నవీన్(PDSU) పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖకు
కేటీఆర్ క్షమాపణ చెప్పి వివాదానికి స్వస్తి పలకాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ

నవతెలంగాణ - ముషీరాబాద్

బడుగు, బలహీన వర్గాల నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి కొండా సురేఖకు మాజీ మంత్రి కేటీఆర్ బహిరంగ క్షమాపణ చెప్పి వివాదానికి ముగింపు పలకాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు. మంత్రి కొండా సురేఖ తనపై సోషల్ మీడియాలో వస్తున్న ట్రోలింగ్‌ని చూసి వ్యక్తిగత హనన ద్వారా అసహనంతో చేసిన వాక్యాల్లో కఠినత్వాన్ని గుర్తించి ఉపసంహరించుకున్నప్పటికీ స్త్రీ ఔన్నత్యాన్ని ఎన్నడూ గుర్తించని కొంతమంది సెలబ్రిటీలు ప్రేరేపిత చర్యల ద్వారా మానసిక దాడులకు దాడులకు పూనుకుంటే తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కొండా సురేఖపై జరుగుతున్న ముప్పేట దాడిని రక్షణ కవచంగా నిలబడాల్సిందిగా తమ పరిధిలోని కార్యాచరణకు పూనుకోవాల్సిందిగా బీసీ శ్రేణులకు బడుగులకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఆమెకు ఈ దశలో ఇచ్చే నైతిక ధైర్యం మహిళా శక్తిని బడుగుల బలాన్ని తెలియజేస్తుందని కోరారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు
ఇంగ్లీష్‌లో మాట్లాడేలా చేయడమే లక్ష్యం



అర్రా రామేశ్వర్ గౌడ్

నవతెలంగాణ-ముషీరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు తెలుగు మాట్లాడినట్లుగా ఇంగ్లీష్‌లో కూడా అనర్గళంగా మాట్లాడేలా చేయడమే తమ లక్ష్యం అని విల్ టూ కెన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్, స్పోకెన్ ఇంగ్లీష్, కమ్యూనికేషన్ స్కిల్ డెవలపర్ అర్రా రామేశ్వర్ గౌడ్ అన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర పరిశోధన విద్యా సంస్థ సహకారంతో హైదరాబాద్ జిల్లా ప్రభుత్వ ఉపాధ్యాయులకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రామేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ.. గత 40 రోజులుగా ప్రభుత్వ పాఠశాలలో బోధించే ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్లైన్లో ఆంగ్ల బోధన తరగతులు నిర్వహిస్తున్నామని, నేడు ఫిజికల్ క్లాసులు నిర్వహించినట్టు తెలిపారు. ఈ కార్యక్రమానికి సుమారుగా 500ల మంది ఉపాధ్యాయులు పాల్గొనడం గొప్ప పరిణామం అన్నారు. ఇప్పటివరకు తెలంగాణలో 33 జిల్లాల్లో 53వేల మంది ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్లైన్ తరగతులు నిర్వహించామని తెలిపారు. ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి మాట్లాడుతూ.., ఇంగ్లీష్ అనేది గ్లోబల్ లాంగ్వేజ్ అని, తప్పు ఒప్పులను చూడకుండా నిరంతరం మాట్లాడితేనే ఆ భాషపట్ల పట్టు ఉంటుందన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంతో ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. బేసిక్ నుంచే ఆంగ్లం నేర్చుకున్నవారికి తిరుగు ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

'డ్రగ్స్ తీసుకోకపోతే కేటీఆర్‌కు భయమెందుకు..?

- ఎమ్మెల్యే కేటీఆర్ తన బ్లడ్, గోర్లు, వెంట్రుకల శాంపిల్ ఇవ్వాలి
- అప్పుడే ప్రజలకు బహిర్గతం అవుతుంది
- దళిత వర్గాలకు కేటీఆర్ క్షమాపణలు చెప్పాలి
- తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి చకులేకర్ శ్రీనివాస్
- బషీర్ బాగ్ చౌరస్తాలో ఎమ్మెల్యే కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

మంత్రి కొండా సురేఖ వ్యాఖ్యల్లో నిజం లేకపోతే ఎమ్మెల్యే కేటీఆర్ డ్రగ్స్ తీసుకోకపోతే తన బ్లడ్, గోర్లు, వెంట్రుకల శాంపిల్స్ ఇవ్వాలని, అప్పుడే అసలు నిజం బయటపడుతుందని, తెలంగాణ ప్రజలకు వాస్తవం బహిర్గతం అవుతుందని తెలంగాణ పీసీసీ ప్రధాన కార్యదర్శి చకులేకర్ శ్రీనివాస్ అన్నారు. గతంలో మహిళలపై ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు, బీఆర్ఎస్ సోషల్ మీడియాలో మంత్రి కొండా సురేఖపై ట్రోలింగ్ చేస్తున్నారని మండిపడుతూ కాంగ్రెస్ నేతలు, మహిళా నేతలు కలిసి గురువారం బషీర్ బాగ్ చౌరస్తాలో కేటీఆర్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ దహనం చేశారు. ఈ సందర్భంగా చకులేకర్ శ్రీనివాస్ మాట్లాడుతూ మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ పార్టీకి సంబంధించిన వ్యక్తులు పోస్ట్ పెట్టారని, నూలు పోగు దండ వేసిన విధానాన్ని సోషల్ మీడియాలో ట్రోల్ చేశారని, దీన్ని సినీ ప్రముఖులు చూసి ఉండొచ్చునని, దీంతో ఆ మహిళా ఎంత బాధపడి ఉంటారో ఓసారి అర్థం చేసుకోవాలన్నారు. బీఆర్ఎస్ సోషల్ మీడియా ద్వారా కాంగ్రెస్ పార్టీ నాయకులను, సీఎం ఎ.రేవంత్ రెడ్డిని తీవ్ర స్థాయిలో ట్రోల్ చేస్తున్నారని ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. దళిత, బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళా నేతలపై కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు బాధాకరమన్నారు. మహిళలంటే కేటీఆర్‌కు అంత చిన్నచూపా అని ఆయన ప్రశ్నించారు. దళిత వర్గాలకు కేటీఆర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని, లేకపోతే మహిళలు చెప్పులతో సమాధానం చెప్తారని హెచ్చరించారు .డ్రగ్స్ తీసుకోకపోతే కేటీఆర్‌కు ఎందుకు అంత భయమని, ప్రజల సమక్షంలో బ్లడ్ శాంపిల్ ఇవ్వవచ్చు అప్పుడే ప్రజలు హర్షిస్తారని, నిజం బహిర్గతం అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు భాస్కర్, రాహుల్, షకీల్, సి.హెచ్.మహేష్, బషీర్ ఖాన్, రిత్విక్, రాజిరెడ్డి, పింకీ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ నేషనల్
కరాటే చాంపియన్‌షిప్-2024 బ్రోచర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-అంబర్‌పేట

జీవీఆర్ కరాటే అకాడమీ ఆధ్వర్యంలో నవంబర్ 3న హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియం, యూసఫ్‌గూడ వద్ద 19వ ఓపెన్ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్-2024 పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జీఎస్ గోపాల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అకాడమీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో రవీంద్ర భారతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ మణి, జోనల్ ఇంచార్జ్ బాపురావు, అసిస్టెంట్ జోనల్ ఇంచార్జ్ కిషోర్, డివిజనల్ ఇంచార్జ్ దయాకర్ పాల్గొని పోటీల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం రవీంద్ర భారతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ మణి మాట్లాడుతూ "క్రీడలు మన శారీరక, మానసిక ఆరోగ్యానికి కీలకమని, కరాటే వంటి క్రీడలు ఆత్మరక్షణతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని" పేర్కొన్నారు. "క్రీడలు పిల్లలను ఒత్తిడి నుంచి విముక్తులను చేయడమే కాకుండా, జీవితంలో ఎలాంటి సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని అందిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి ఇలాంటి పోటీల్లో పాల్గొని తన ప్రతిభను నిరూపించుకోవాలని కోరుకుంటున్నాను" అని ఆయన అన్నారు. ఈ కరాటే పోటీల్లో పాల్గొనదలచిన వారు తమ వివరాల కోసం సెల్: 9494112424 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రజలను ప్రలోభ పెట్టినా నమ్మరు



కాంగ్రెస్ బహదూర్‌పురా నియోజకవర్గం ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్

నవతెలంగాణ - ధూల్ పేట్

మూసీపై ప్రతిపక్షాలు ప్రజలను ప్రలోభ పెట్టినా వారు నమ్మరని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ ఇంచార్జి పులిపాటి రాజేష్ కుమార్ అన్నారు. బహదూర్‌పురా తహసీల్దార్‌తో గురువారం ఆయన కాంగ్రెస్ నాయకులతో కలిసి భేటీ అయ్యారు. మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్టులో భాగంగా బహదూర్‌పురా నియోజకవర్గంలోని మూసీ ప్రవాహిక ప్రాంతంలోని ఇళ్లకు RB-X అని మార్క్ చేసిన వివరాలను తహసీల్దార్ చంద్ర శేఖర్‌ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో మొత్తం 354 ఇల్లున్నాయని, వాటికి మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ కింద మార్క్ చెయ్యడం జరిగిందన్నారు. ఆ ఇళ్లపై RB-X (బెడ్ రివర్ ఎగ్జిక్యూషన్) అని మార్క్ చేసిన వారందరికీ ప్రస్తుతం జంగమ్మెట్‌లోని 180 డబల్ బెడ్ రూమ్ ఇళ్లను రెవెన్యూ అధికారులతో ఆలొట్ చేస్తున్నామని చెప్పారు. మిగితా వారికి కొల్లూరు లేక జియాగూడలోని డబల్ బెడ్ రూమ్ ఇళ్లని ఇస్తామన్నారు. ఈ ప్రక్రియ మొదలు కాకముందే డబల్ బెడ్ రూమ్ ఇళ్ళలో ఎలక్ట్రిసిటీ, వాటర్ కనెక్షన్స్, అన్ని మరమ్మతులతో పాటు అన్ని వసతులు ఏర్పాటు చేసేశామని తెలిపారు. ఈ 354 ఇళ్లను ప్రజలకు లాటరీ ద్వారా ఆలొట్ అయిన వారు డబల్ బెడ్ రూమ్ ఇళ్లకు తరలి వెళ్లాలని కోరారు. వారికి ప్రభుత్వం డబల్ బెడ్ రూమ్ ఇల్లు తో పాటు రూ.25వేలు నగదును కూడా అందిస్తుందని చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. కానీ ఇతర పార్టీ నాయకుల రాజకీయ కుట్రలతో ప్రజల్ని పక్కతోవ పట్టించేందుకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారని అన్నారు. ఈ మభ్య మాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గత ప్రభుత్వం ఏమి చేసిందో ప్రజలకు తెలుసని, మభ్యపెట్టే మాటలతో మోసం చేయలేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నమ్మి వారు స్వచ్ఛందంగా ఖాళీ చేస్తున్నారన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ లో భాగంగా వస్తున్న ఇళ్లను ఖాళీ చేసి అన్ని సౌకర్యాలతో ఉన్న డబల్ బెడ్ రూమ్ ఇల్లుల్లోకి వెళ్లాలని ప్రజలను కోరారు. ఈ భేటీ లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మహమ్మద్ ఇక్బాల్, జబ్బార్, అబేద్ అలీ, బారి, జాకేర్ హుస్సేన్, సీదేశ్వర్ పాల్గొన్నారు.

నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో
వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ టాక్



నవతెలంగాణ - ధూల్‌పేట్

వన్యప్రాణి వారోత్సవాలలో భాగంగా నెహ్రూ జూలాజికల్ పార్క్‌లో వైల్డ్‌లైఫ్ ఎక్స్‌పర్ట్ టాక్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జూ మాజీ క్యూరేటర్ రిటైర్డ్ డీఎఫ్ఓ కె.శేఖర్ రెడ్డి పాల్గొని వన్యప్రాణుల సంరక్షణ, పెంపకం ప్రాముఖ్యమన్నారు. విధ్యలో ప్రత్యేకించి ఎన్‌క్లోజర్ మెయింటెనెన్స్, ప్రొఫైలాక్టిక్ కేర్, స్టడీపై వివరించారు. జూలోని వన్యప్రాణుల డాక్యుమెంటేషన్‌లో జూ పాత్రపై సంక్షిప్త ఉపన్యాసం ఇచ్చారు. ఆయన విధులు నిర్వర్తించే సమయంలో కొన్ని జంతువుల ఎన్‌క్లోజర్‌లో తీసుకోవలసిన కొన్ని ముఖ్యమైన ముందు జాగ్రత్త చర్యలను గుర్తు చేశారు. ఈ వైల్డ్ లైఫ్ ఎక్స్‌పర్ట్ టాక్ ప్రోగ్రామ్‌లో డిప్యూటీ క్యురేటర్ ఎం బర్నోభ, వెట్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎం ఎ హకీం, అసిస్టెంట్ క్యురేటర్ - 2 అమృత, పీఆర్ఓ హనిఫుల్లా, ఈఓ దీపక్ తరుణ్, యానిమల్ కీపర్స్, గార్డెన్ మాలిస్, సెక్యూరిటీ సెక్షన్ వింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కిషన్ రెడ్డికి
బాలాపూర్ లడ్డూ ప్రసాదం అందజేత



నవతెలంగాణ- బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన లడ్డూ ప్రసాదాన్ని గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర బీజేపీ కార్యాలయములో కేంద్ర మైనింగ్, బొగ్గు గనుల శాఖ మంత్రి జీ.కిషన్ రెడ్డికి రాష్ట్ర నాయకులు, బాలాపూర్ రైతు సహకార సంఘం బ్యాంకు మాజీ చైర్మెన్ కొలన్ శంకర్ రెడ్డి అందజేశారు. తర్వాత పూల మాలలు వేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జీ.కిషన్ రెడ్డి లడ్డూ విజేత కొలన్ శంకర్ రెడ్డిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాలాపూర్ లడ్డూ ప్రసాదం వేలం పాటలో దక్కించుకున్న వారికి జీవితంలో అనుకున్న కోరికలు నెరవేరుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూర్య ప్రకాష్, గోవర్ధన్ రెడ్డి, సుధాకర్ ఇతరులు పాల్గొన్నారు.

'అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో
డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి కమలా హ్యారిస్ విజయం సాధిస్తారు'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

త్వరలో జరుగనున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థి, అమెరికా వైస్ ప్రెసిడెంట్ కమలా హ్యారిస్ విజయం సాధిస్తారని చంద్రాయణగుట్టకు చెందిన సోషల్ వర్కర్ రఫిక్ లాలా జోస్యం చెప్పారు. గురువారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాబానగర్‌లోని తన నివాసంలో ప్రతిరోజు అల్లాను ప్రార్థించి, తాను చెప్పిన పార్టీలు పశ్చిమ బెంగాల్, ఏపీ, కర్ణాటక, తెలంగాణతో పాటు తదితర రాష్ట్రాలలో విజయం సాధించాయని తెలిపారు. ఈసారి తాను గత నెల రోజులుగా డెమొక్రటిక్ పార్టీ గెలుపు కోసం తెల్లవారుజామున 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రార్థనలు చేస్తున్నానని ఆయన తెలిపారు.

ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు వెదుకుతూ...

పిల్లలకు పుష్టికరమైన ఆహారం పెట్టాలని ప్రతి తల్లీ భావిస్తుంది. కానీ నోటికి రుచిగా లేకపోతే పిల్లలు వాటిని ఇష్టపడరు. అలాంటి వారి కోసం ఆరోగ్యకరమైన చిరుతిళ్లను అందిస్తున్నారు దివ్య అరోరా. రాగులు, జొన్నలు, మఖానా, క్వినోవా, చిక్‌పాలతో తయారు చేసిన స్నాక్స్‌ను అందుబాటులో ఉంచారు. ప్రిజర్వేటింగ్ లేని అధిక పోషకాహార పదార్థాలతో వ్యాపారం మొదలుపెట్టి లక్షలు సంపాదిస్తున్న ఆమె పరిచయం నేటి మానవిలో...







కరోనాకంటే ముందు దివ్య అరోరా తన కార్పొరేట్ ఉద్యోగాన్ని విడిచిపెట్టి కుటుంబ వ్యాపారంలోకి అడుగుపెట్టారు. దీనికోసం పశ్చిమ బెంగాల్‌లోని తన భర్త స్వస్థలమైన మాల్దాకు వెళ్లారు. వీరిద్దరూ ఎంబీఏ చదువుతున్నప్పుడు ఐఎంటీ ఘజియాబాద్‌లో కలుసుకున్నారు. 2019లో వివాహం చేసుకున్నారు. ఆ సమయంలో దివ్య డెలాయిట్‌లో పనిచేస్తున్నారు.

ఢిల్లీలో పుట్టి పెరిగిన దివ్య ఒక చిన్న పట్టణంలో నివసించడం ఇదే తొలిసారి. 'ఇది పూర్తి మార్పుతో కూడుకున్నది. ఇంటి నుండి పని చేసే ఉద్యోగం కోసం కొన్ని నెలల పాటు ప్రయత్నించాను. కానీ ఎక్కడా అవకాశం రాలేదు. దాంతో కోల్‌కతా లేదా ఢిల్లీకి వెళ్లాలని ప్లాన్ చేశాను. నా భర్త తరచుగా మాల్దాకు వెళ్తుంటాడు' అంటూ ఆమె పంచుకున్నారు.

మంచి రంగంగా...

కోవిడ్-19 మహమ్మారి సమయంలో ఈమె ఎక్కువ కాలం మాల్దాలోనే ఉన్నారు. ఇంటి నుండి పని చేయడం కొనసాగించారు. అయితే 2020 ప్రారంభంలో సొంతంగా ఏదైనా చేయాలనే కోరిక ఆమెలో మొదలయింది. 2021 డిసెంబర్‌లో స్నాక్ బ్రాండ్ 'హేకా బైట్స్‌'ను ప్రారంభించడానికి తన ఉద్యోగాన్ని విడిచిపెట్టింది. వ్యవసాయ పద్ధతులు, పంట ఉత్పత్తి గురించి తెలుసుకునేందుకు తమకు దగ్గరలోని పట్టణాలకు వెళ్లడం ప్రారంభించింది. అతి తక్కువ సమయంలోనే మంచి అధ్యయనం చేసింది. 'మాల్దా భారతదేశంలోని మఖానా-ఉత్పత్తి బెల్ట్‌కు సమీపంలో ఉంది. ఇక్కడ దేశంలోని 80శాతం మఖానా (ఫాక్స్ నట్స్) ఉత్పత్తి అవుతుంది. మా ఇంటికి చాలా దగ్గరలో ఈ ఉత్పత్తి ఉండటంతో ఒక గొప్ప అవకాశంగా దీన్ని నేను భావించాను. అలాగే కరోనా తర్వాత తినే తిండి విషయంలో ప్రజలు పూర్తి అవగాహనతో ఉన్నారు. అందుకే ఇది నాకు మంచి రంగంగా అనిపించింది' ఆమె వివరించారు.

బ్రాండ్‌లు వస్తున్నప్పటికీ...

ముసాడి పదోతరగతిలో ఉన్నప్పుడే అధిక కొలెస్ట్రాల్, రక్తపోటు వంటి ఆరోగ్య సమస్యలను ఎదుర్కోవడం ప్రారంభించింది. మహమ్మారి సమయంలో ఆమెను కొన్ని భయాలు వెంటాడాయి. అప్పుడు సాంప్రదాయ ఆహార పదార్థాల నుండి తయారు చేయబడిన ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాల కోసం వెతకడం ప్రారంభించింది. ఇలాంటి వారి కోసం దివ్య కొత్త ప్రయోగాలు మొదలుపెట్టారు. 'ఆరోగ్యకరమైన చిరుతిండి విభాగంలో చాలా బ్రాండ్‌లు వస్తున్నప్పటికీ, అవి ఏ రకంగా ఉన్నాయో తెలుసుకోవడానికి నేను వివిధ ప్రాంతాలలో ప్రయాణించాను. జోవర్, మఖానాతో పాటు చాలా మంది ఇతర ఉత్పత్తులను ఇష్టపడతారు. అందుకే వివిధ పంపిణీదారులతో, రిటైలర్లకు నమూనాలను పంపమని అడిగాను' అంటూ పంచుకున్నారు.

మసాలాలు జోడించి

ఇండియన్ చాట్, చాట్ మసాలా, పుదీనాతో పాటు ఇతర పదార్థాల మిశ్రమం, మెజెస్టిక్ మసాలా, జోవర్ పఫ్‌పై మసాలా, చీజీ సల్సా, టమోటా చీజ్ మిశ్రమం వంటి వాటితో వివిధ రుచులను సమ్మిళితం చేశారు. 'రుచికరమైన ఆహారం లేదా మీరు ఇష్టపడే వాటిని తినడం మానేయమని మేము మీకు చెప్పడం లేదు. నేను మీకు ఇష్టమైన మసాలాను అందిస్తాను. ఆలూ, మొక్కజొన్న, జొన్న, మఖానా, చిక్‌పా, క్వినోవాకు రుచిని లేదా బేస్‌ని మారుస్తున్నాను. అయితే నేను వేయించడం కాకుండా కాల్చుతాను. అందరూ వీటిని సంతోషంగా తినేలా అందుబాటులో ఉంచుతాను' అని దివ్య అంటున్నారు. స్నాక్స్‌లో 100 కంటే తక్కువ కేలరీలు ఉంటాయి. హేకా బైట్స్‌లోని బృందం రాగి (మిల్లెట్)ను కూడా ఒక ఎంపికగా పరిశోధిస్తోంది.

మహిళల బృందం

ప్రస్తుతం హేకా బైట్స్ స్నాక్స్, ట్రైల్ మిక్స్‌లు, నట్ మిక్స్‌లను కలిగి ఉన్న 20 రకాల స్నాక్‌లను అందిస్తోంది. గుమ్మడికాయ గింజలు, చియా గింజలు, మఖానా వంటి ముడి, ప్రాసెస్ చేయని విత్తనాలు కూడా ఉన్నాయి. ఉత్పత్తుల ధర రూ.30 నుండి రూ.500 మధ్య ఉంటుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే ఈ వెంచర్ మొదట్లో ముగ్గురు మహిళా ఉద్యోగులతో ప్రారంభించబడింది. ఇప్పుడు 35 మంది మహిళలతో కూడిన టీమ్‌గా ఎదిగింది. హేకా బైట్స్ ఉత్పత్తులు మొదట అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లలో ప్రారంభించబడ్డాయి. ఏడాదిలోనే వారు స్పెన్సర్స్, నేచర్స్ బాస్కెట్ వంటి ఆఫ్‌లైన్ స్టోర్‌కు కూడా చేరుకున్నారు.

అవగాహన కల్పించడం

హేకా బైట్స్ ఖరీదు కాస్త ఎక్కువగా ఉండడంతో ఆఫ్‌లైన్ స్టోర్లలో అమ్ముడు పోవడం కాస్త కష్టమే అని దివ్య గ్రహించారు. అందుకే ఆన్‌లైన్, శీఘ్ర వాణిజ్యంపై దృష్టి పెట్టారు. 'Zepto, Instamartతో త్వరిత వాణిజ్యం మాకు బాగా పనిచేసింది. మూడేండ్లలో మేము 10 రెట్లు వృద్ధిని సాధించా. గత ఆర్థిక ఏడాదిలో రూ.3 కోట్ల నికర ఆదాయాన్ని చూశాము' అని ఆమె అంటున్నారు. హేకా బైట్స్ తాను లక్ష్యంగా పెట్టుకున్న ప్రేక్షకులను చేరుకునేందుకు అనేక మార్గాలను వెదుకుతుంది. 'తల్లులు తమ పిల్లల కోసం ప్రత్యామ్నాయ స్నాక్స్ కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పుడు మా ఉత్పత్తుల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం చాలా అవసరం. ఈ అవగాహన కల్పించడమే మేము ఎదుర్కొంటున్న ప్రస్తుత సవాలు' అని ఆమె పంచుకున్నారు. భౌతిక దుకాణాల్లో కూడా వీటిని అందుబాటులో ఉంచాలని భావిస్తున్నారు. తన కోరికను అనుసరించిన వ్యక్తిగా, మహిళలు తమ మార్గంలో ఎదురయ్యే సవాళ్లతో సంబంధం లేకుండా తమ కలలను ఎల్లప్పుడూ వెంబడించాలని దివ్య నమ్ముతుంది. ■






రామ్మా గౌరమ్మ

పల్లవి : రామ్మా గౌరమ్మా పూవుల స్వాగతమే ఇస్తాం
పూవుల దండలో పసుపు ముద్దగనే పెడుతాం
(కోరస్)
ఎన్నో యుగాల ఆవల పార్వతి
పూవులపైన ముచ్చట పడెనట

అన్న చేతిలో ప్రాణం పోయిన చెల్లినే బతికించిందట
ఏటేటా బతుకమ్మను చేసి ఆట
ఆడమని ఆజ్ఞ ఇచ్చెనట
ఎంగిలి బతుకమ్మా నీవే సద్దులు బతుకమ్మా
వరాలు ఇవ్వమ్మా స్త్రీలకి పండగలివ్వమ్మా (కోరస్)



అనుపల్లవి: పొద్దు పొద్దున లేచి దొరవారి చేను కెళ్లి
ఒక్కొక్క పువ్వు తెచ్చి ఒడిలోన దాచుకున్నా
బంతిపువ్వును తెంచి గునుగూ పువ్వును గుంజి
నిలకడగా ఉన్న నీట తామర పూలు కోసి

చరణం : మబ్బులే గుమ్మిగూడి వచ్చేనట నీ ఆటలే
చూసి కురుసునట
పువ్వులోని రంగులన్నీ చూసి హరివిల్లు
చిన్నబోయెనట
పువ్వుల బతుకమ్మ పున్నమి వెన్నెల నీవమ్మా
బతుకుని ఇవ్వమ్మా మంచి భవితని ఇవ్వమ్మా
పసుపు గౌరమ్మ...
పసుపు కుంకుమలు ఇవ్వమ్మా
మా పచ్చని కాపురమే నీవు మెచ్చిన కైలాసం

చరణం : మీ అండనే మాకు ఉండగా
దిగులింకా మాకు లేదులే
భక్తి శ్రద్ధల గౌరమ్మను పూజించి
ఏటేటా బతుకమ్మ చేస్తాములే
ఊరిని కాపాడు. వృద్ధుల, పిల్లల కాపాడు
పాడి పంటలని నీవు పచ్చగా కాపాడు
మగ మృగాలనీ చంపి ఆడపిల్లల కాపాడు
అడుగడుగున తోడుండీ
నీవే పండగ మాకివ్వూ

రామ్మా గౌరమ్మ పువ్వుల స్వాగతమే ఇస్తాం
పువ్వుల దండల్లో పసుపు ముద్దగా నిను పెడతాం
(2)

- ఇ. నిర్మల

కేసీఆర్ బతికే ఉన్నారా ?

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు. నియోజకవర్గంలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం చెక్కులు 850 వరకు ఉన్నాయని, ఎమ్మెల్యే ఉంటేనే వాటిని పంపిణీ చేయాలనే నిబంధనను కాంగ్రెస్ ప్రభుత్వం పాటిస్తోందని అన్నారు. కాబట్టి, గజ్వేల్ నియోజకవర్గ ప్రజలకు ప్రాతినిధ్యం వహించే కేసీఆర్ కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయాలని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నర్సారెడ్డితో పాటు క్యాడర్‌కు ఆమె పిలుపునిచ్చారు.

ఇష్టానుసారంగా మాట్లాడితే తాట తీస్తా

ఇటీవల సోషల్ మీడియాలో కేటీఆర్ ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, అలా మాట్లాడితే ఆయన తాట తీస్తానని మంత్రి కొండా సురేఖ ఆగ్రహం వ్యక్తం చేశారు. పదవుల కోసం కేసీఆర్ కుటుంబం ఏమైనా చేస్తుందని ఆరోపించారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోవడానికి ప్రధాన కారణం కేటీఆరేనని, పదవిలో ఉన్నప్పుడు సీఎం స్థాయిలో ఇష్టం వచ్చినట్టు నిర్ణయాలు తీసుకున్నారని అన్నారు. ఇప్పుడు పదవి పోయేసరికి ఏం చేయాలో అర్థంకాక ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నారని, సోషల్ మీడియాను అడ్డంపెట్టుకొని తనపై పిచ్చి రాతలు రాయిస్తున్నారని మండిపడ్డారు. కూతురు కవిత బెయిల్ కోసం కేసీఆర్ రాష్ట్ర ప్రజల గొంతు కోశారని, మెదక్ పార్లమెంట్ స్థానాన్ని బీజేపీకి కట్టబెట్టేలా ప్రధాని, అమిత్‌షాతో మాట్లాడి చీకటి ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. అందుకే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి బీజేపీకి క్రాస్ ఓటింగ్ జరిగిందని ఆరోపించారు.

ఎవరిపైనా వ్యక్తిగత ద్వేషం లేదు

మనోభావాలు దెబ్బ తీయడం మా ఉద్దేశం కాదు :మంత్రి కొండా సురేఖ

నవతెలంగాణ-వరంగల్

కేటీఆర్‌ను విమర్శించే క్రమంలో సినీ ఇండస్ట్రీ గురించి తాను చేసిన వ్యాఖ్యలకు ఎవరైనా మనస్తాపానికి గురైతే వాటిని బేషరతుగా వెనక్కు తీసుకుంటున్నట్టు మంత్రి కొండా సురేఖ తెలిపారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తనపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతోనే భావోద్వేగానికి గురై మాట్లాడానని, ఆయనపై విమర్శలు చేసే క్రమంలో సినీ ఇండస్ట్రీలోని ఓ కుటుంబాన్ని ప్రస్తావించినట్టు ఆమె చెప్పారు. కాగా, మంత్రి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో పెద్ద దుమారాన్ని రేపిన సంగతి తెలిసిందే. దాంతో ఆమె స్పందించి.. తన వ్యాఖ్యలను ఉపసంహ రించుకుంటున్నట్టు ప్రకటించారు. హన్మకొండలో ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మీడియాతో మాట్లాడారు. మహిళల పట్ల ఒక నాయకుడి చిన్న చూపు ధోరణిని ప్రశ్నించడమే తన ఉద్దేశమని, కానీ భావోద్వేగంతో మరో మహిళపై తాను వ్యాఖ్యలు చేశానని, వారి మనోభావాలు దెబ్బతీయడం తన అభిమతం కాదంటూ వివరణ ఇచ్చారు. నటి సమంత స్వయంకృషితో ఎదిగారని, ఆమెపై తనకు వ్యక్తిగత ద్వేషాలు లేవని, పైగా తాను సమంతకి అభిమానినని తెలిపారు. ఏ విషయంలో అయితే తాను బాధపడ్డానో, అదే విషయంలో మరొకరిని నొప్పించానని తెలిసి బాధపడ్డానని, తనలా వారు బాధపడకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఎక్స్ వేదికగా ఆమె పోస్ట్ చేశారు.

హక్కులపై ఉక్కుపాదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రబీర్ పుర్కాయస్థ అన్నారు. న్యూస్‌క్లిక్‌కు సహకరించిన వారి పరిశోధనా పత్రాలు పోలీసుల వద్ద ఉన్నాయని, ఆదాయపన్ను శాఖ చర్యకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చినా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. సామాన్య ప్రజల నుంచి వస్తున్న ఆదరణకు కృతజ్ఞతలు తెలిపారు. జర్నలిస్ట్ నీలు వ్యాస్ థామస్ మాట్లాడుతూ ప్రభుత్వం, ఏజెన్సీల వేధింపులు జర్నలిస్టుల కుటుంబ సభ్యులపై ప్రభావం చూపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ పాత్రికేయులు ఎన్. రామ్, పి. సాయినాథ్ వీడియో సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టికె రాజలక్ష్మి, ఎస్ కె పాండే, జైశంకర్, ధనసుమోద్ తదితరులు మాట్లాడారు. సుజాత మధోక్ అధ్యక్షత వహించారు.

మత స్వేచ్ఛ క్షీణిస్తోంది

(మొదటిపేజీ తరువాయి)

నెలలలో 20 మంది క్రైస్తవులను అరెస్ట్ చేశారని తెలిపింది. సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ప్రకటించిన తర్వాత ముస్లింలను లక్ష్యంగా చేసుకొని దేశంలో కనీసం 28 దాడులు జరిగాయని చెప్పింది. ఎన్నికల ప్రచారం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ చేసిన ప్రసంగాలు ముస్లిం వ్యతిరేక దాడులకు పురిగొల్పాయని తెలియజేసింది.

నేతల ప్రసంగాలలో విద్వేషం...వివక్ష

'లోక్‌సభ ఎన్నికల ప్రచారం సమయంలో భారత రాజకీయ నాయకులు ముస్లింలు, ఇతర మత మైనారిటీలకు వ్యతిరేకంగా విద్వేషపూరితమైన, వివక్షాపూరితమైన ప్రసంగాలు చేశారు. ప్రతిపక్షాలకు ఓటేస్తే హిందూ విశ్వాసాలను మంటగలుపుతాయని ప్రధాని మోడీ హెచ్చరించా రు. ప్రతిపక్షాలకు అధికారం ఇస్తే షరియా చట్టాన్ని విధిస్తాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు' అని అమెరికా కమిషన్ వివరించింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మైనారిటీలపై హింస, నేరాలు పెరగడంపై అమెరికా నిపుణుల బృందం ఆందోళన వ్యక్తం చేసిన విషయాన్ని నివేదిక గుర్తు చేసింది.

మైనారిటీలపై నిఘా పెట్టి హింసించారని, వారిని లక్ష్యంగా చేసుకొని హత్యాకాండ సాగించారని, వారి ఆస్తులు ధ్వంసం చేశారని, వారిని వేధింపులకు గురి చేశారని తెలిపింది. 'ప్రభుత్వంలోని పెద్దలు తప్పుడు సమా చారం అందిస్తూ దుష్ప్రచారం సాగించారు. విద్వేష ప్రసంగాలు చేశారు. గో సంరక్షణ పేరుతో మైనారిటీలపై దాడులను ప్రేరేపించారు. జనవరిలో అయోధ్యలో రామ మందిరాన్ని ప్రారంభించిన తర్వా త ముంబయిలోని మిరా రోడ్డులో ముస్లింలపై దాడులు జరిగాయి. మతోన్మాదాన్ని రెచ్చగొట్టేలా బీజేపీ ఎమ్మెల్యేలు నితీష్ రాణే, గీతా జైన్ చేసిన ప్రసంగాలే ఈ దాడులకు ప్రేరణ ఇచ్చాయి. ఇది ఓ ఉదాహరణ మాత్రమే' అని కమిషన్ తన నివేదికలో తెలిపింది.

బుల్డోజర్ న్యాయం

మైనారిటీలపై దాడులకు పురిగొల్పడమే కాకుండా ప్రభుత్వంలోని పెద్దలు 'బుల్డోజర్ న్యాయాన్ని' పాటించారని కమిషన్ విమర్శించింది. అక్రమ నిర్మాణాల పేరుతో ముస్లింల ఆస్తులను ధ్వంసం చేశారని అంటూ ఎలాంటి ముందస్తు నోటీసు ఇవ్వకుండా ఢిల్లీలోని ఆరు వందల సంవత్సరాల నాటి మసీదును కూల్చివేశారని, దీనిపై పెద్ద ఎత్తున ప్రజాగ్రహం పెల్లుబికిందని చెప్పింది. వక్ఫ్ ఆస్తులపై ప్రభుత్వ నియంత్రణకు అవకాశం కల్పించే వక్ఫ్ సవరణ బిల్లును నివేదిక తప్పుపట్టింది. ఈ బిల్లులోని నిబంధనల కారణంగా ముస్లిం సమాజం తన మత సంస్థలపై స్వయం ప్రతిపత్తిని కోల్పోతుందని తెలిపింది. 'భారతదేశంలోని ముస్లిం సమాజాలకు సంపద పంపిణీ అంటూ దుష్ప్రచారాన్ని వ్యాపింపజేసిన తర్వాత ఈ బిల్లును తీసుకొచ్చారు. ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోడీ కూడా అవమానకరంగా వ్యాఖ్యానించారు' అని ప్రస్తావించింది.

నిరసన గళాల అణచివేత

మత మార్పిడుల నిరోధక చట్టాలు, గోవధ చట్టాలు, ఉగ్రవాద వ్యతిరేక చట్టాలు వంటి వివక్షాపూరిత చట్టాలను అమలు చేయడం ద్వారా భారత ప్రభుత్వం మత సమాజాలను అణచివేస్తోందని, నియంత్రిస్తోందని అమెరికా కమిషన్ విమర్శించింది.

మత స్వేచ్ఛ ఉల్లంఘనకు గురవుతోందంటూ మత నాయకులు, పాత్రికేయులు, మానవ హక్కుల కార్యకర్తలు సహ పలువురు గళం విప్పుతుంటే ఎలాంటి చట్టపరమైన ప్రక్రియలు పాటించకుండా వారిని అరెస్ట్ చేస్తున్నారని, కొన్ని కేసులలో సంవత్సరాల తరబడి కారాగారాలలో ఉంచుతున్నారని మండిపడింది.

మేలోనూ నివేదిక

ఈ ఏడాది మేలో కూడా భారత్‌ను 'ప్రత్యేక ఆందోళనకరమైన' దేశంగా పరిగణించాలని యూఎస్‌సీఐఆర్ఎఫ్ సిఫార్సు చేసింది. వాస్తవానికి 2020 నుండి కమిషన్ అమెరికా ప్రభుత్వానికి పదే పదే ఈ సిఫార్సు చేస్తోంది.

అయితే దానిని ఇప్పటి వరకూ ఆ ప్రభుత్వం పట్టించుకోలేదు. కమిషన్ నివేదికపై విదేశాంగ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ స్పందిస్తూ భారత ఎన్నికల ప్రక్రియలో యూఎస్‌సీఐఆర్ఎఫ్ జోక్యం చేసుకుంటోందని ఆరోపించారు. 'అమెరికా కమిషన్ పక్షపాతపూరితంగా వ్యవహరించే సంస్థ. దానికి రాజకీయ ఎజెండా ఉంది. వార్షిక నివేదిక ముసుగులో భారత్ వ్యతిరేక ప్రచారాన్ని కొనసాగిస్తోంది. మన వైవిధ్యభరితమైన, ప్రజాస్వామిక నీతి నియమాలను అర్థం చేసుకునేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తుందని మేము అనుకోవడం లేదు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామిక ఎన్నికల ప్రక్రియలో జోక్యం చేసుకునేందుకు వారు చేసే ప్రయత్నాలు ఫలించవు' అని ఆయన అప్పట్లో విమర్శించారు.

ఇజ్రాయిల్ మారణకాండను వ్యతిరేకిద్దాం

(మొదటిపేజీ తరువాయి)

సాంబశివరావు (సీపీఐ), పోటు రంగారావు (సీపీఐఎంఎల్ మాస్‌లైన్), సాధినేని వెంకటేశ్వరరావు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), జెవి చలపతిరావు (సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ), గాదగోని రవి (ఎంసీపీఐయూ), సీహెచ్ మురహరి (ఎస్‌యూసీఐసీ), ప్రసాదన్న (సీపీఐఎంఎల్), జానకి రాములు (ఆరెస్పీ), బి సురేందర్‌రెడ్డి (ఫార్వర్డ్‌బ్లాక్), ఎం రమేష్ రాజా (సీపీఐఎంఎల్ లిబరేషన్) సంయుక్తంగా గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. సామ్రాజ్యవాద అమెరికా అండదండలతో ఇజ్రాయిల్ చేస్తున్న దురాక్రమణపూరిత యుద్ధ దాడులతో పాలస్తీనా అతలాకుతలమైందని విమర్శించారు. ఉద్దేశపూర్వకంగానే పాఠశాలలు, ఆస్పత్రులను లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయిల్ ఈ దాడులకు పాల్పడిందని తెలిపారు. ఈ అత్యంత క్రూరమైన యుద్ధం వల్ల దాదాపు 41 వేల మంది పాలస్తీనియన్లు మరణించారని ఆందోళన వ్యక్తం చేశారు. వారిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలే సమిధలయ్యారని వివరించారు. వారే కాకుండా భవనాలు, పాఠశాలల కింద మరో 10 వేల మంది సమాధి అయ్యారని పేర్కొన్నారు. ఇజ్రాయిల్ పౌరులు హత్యలు, లైంగిక దాడులు, ఇతర దాడులు, కిడ్నాప్‌లు వంటి అత్యంత హింసాత్మక చర్యలకు పాల్పడ్డారని తెలిపారు. అంతర్జాతీయ న్యాయస్థానం దాడులు ఆపాలని కోరినప్పటికీ ఇజ్రాయిల్ పెడచెవిన పెట్టిందని పేర్కొన్నారు. ఈ దుశ్చర్యకు వ్యతిరేకంగా పాలస్తీనాకు సంఘీభావంగా రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో ఈనెల ఏడో తేదీన నిరసన కార్యక్రమాలు నిర్వహించాలనీ, జయప్రదం చేయాలని కోరారు.

'హేమ కమిటీ' పిటిషన్లపై నేడు కేరళ హైకోర్టు పరిశీలన

కొచ్చి: సినీ పరిశ్రమలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేసిన హేమా కమిటీ నివేదికపై దాఖలైన పిటిషన్లను హైకోర్టు నేడు పరిశీలించనుంది. జస్టిస్ ఏకే జయశంకరన్ నంబియార్, జస్టిస్ సీఎస్ సుధలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ పిటిషన్లను పరిశీలించనున్నారు. నివేదిక పూర్తి రూపాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీల్డ్ కవరులో హైకోర్టుకు అందజేసింది. నివేదిక యొక్క ట్రాన్స్క్రిప్ట్, ప్రభుత్వం తీసుకున్న చర్యలు, ప్రత్యేక దర్యాప్తు బందం మరియు కేసుల గురించి కెమారా వివరణాత్మక సమాచారాన్ని కలిగి ఉంది. అనంతరం కోర్టు సూచనల మేరకు నివేదికను సిట్‌కు అందజేశారు.

ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అన్ని జిల్లాల్లోనూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ సాఫీగా సాగేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రైతులకిచ్చిన హామీ మేరకు ఈ సీజన్ నుంచే సన్నాలకు ఎమ్మెస్పీకి అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తామని స్పష్టం చేశారు. గత సీజన్‌లో ధాన్యం అమ్మిన రైతులకు మూడ్రోజుల్లో డబ్బులు వేశామని గుర్తు చేశారు. ఈసారి 48 గంటల్లోపే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రయత్నించాలని సూచించారు. గురువారం సచివాలయం నుంచి కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్‌రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అందులో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సివిల్ సప్లయిస్ ఎమ్‌డీ డీఎస్ చౌహాన్, వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి రఘునందన్‌రావు, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..ఈసారి ఏడు వేలకుపైగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ఎక్కడైనా అవసరమైతే కొత్త కేంద్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్లకు సూచించారు. వ్యవసాయ శాఖ అంచనా ప్రకారం వానాకాలంలో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగైందనీ, రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చే అవకాశం ఉందని వివరించారు. సన్న వడ్లకు బోనస్ ఇవ్వడంలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.



అదే విధంగా సన్నవడ్లకు వేర్వేరు కాంటాలు ఏర్పాటు చేయాలన్నారు. నిర్దేశిత ప్రమాణాల ప్రకారం సన్న రకాలను ధ్రువీకరించే యంత్రాలను, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతి కేంద్రానికీ ఒక నెంబర్ కేటాయించాలనీ, కొనుగోలు చేసే ధాన్యం బస్తాలపై ఆ నెంబర్ కచ్చితంగా వేయాలని సూచించారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి ధాన్యం రాష్ట్రంలోకి రాకుండా అన్ని మార్గాల్లోనూ పకడ్బందీగా నిఘా ఉంచాలనీ, చెక్‌పోస్టుల వద్ద నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసే వారిని సహించొద్దనీ, అవసరమైతే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు. రైతులు ఎక్కడా దోపిడీకి గురి కాకూడదనీ, రైతుల నుంచి వచ్చే ప్రతి ఫిర్యాదునూ కలెక్టర్లు బాధ్యతగా స్వీకరించాలని ఆదేశించారు. గోనె సంచులు, టార్పాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడ్ క్లీనర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేలా లారీలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. ప్రతి గంటకోసారి కొనుగోలు కేంద్రాలకు వాతావరణ శాఖ సూచనలను చేరవేయాలనీ, దానికి అనుగుణంగా కేంద్రాల్లో ధాన్యం తడవకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియను సమీక్షించాలనీ, ప్రతి రోజూ ఉదయం నేరుగా క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి కేంద్రాలను పరిశీలించాలని ఆదేశించారు. పాత పది జిల్లాలకు నియమించిన ప్రత్యేకాధికారులు ధాన్యం సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. సమస్యల పరిష్కారం కోసం సివిల్ సప్లయిస్ విభాగంలో 24 గంటలూ అందుబాటులో ఉండేలా కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. దొడ్డు వడ్లకు మార్కెట్‌లో డిమాండ్ లేదనీ, ఎఫ్‌సీఐ వద్ద భారీగా నిల్వలున్నాయని సీఎం చెప్పారు. సన్నాలను ప్రోత్సహించేందుకే బోనస్‌ను తీసుకొచ్చామన్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో వరి విస్తీర్ణంలో 58 శాతం సన్న రకాలనే సాగు చేశారనీ, ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకంతో వచ్చే ఏడాది నుంచి మరింత దిగుబడి పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఈసారి దిగుబడి అయ్యే 146 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో ట్రేడర్లు, మిల్లర్లు, కొనుగోలు చేసే ధాన్యం, రైతులు తమ అవసరాలకు ఉంచుకునే నిల్వలు పక్కనపెడితే.. 91 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందని అంచనా వేశారు. అందులో 44 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు రకాలు, 47 లక్షల మెట్రిక్ టన్నుల సన్న రకాలు ఉంటాయని చెప్పారు. గతంలో వరుసగా బకాయి పడ్డ డిఫాల్టర్ మిల్లర్లకు ధాన్యం ఇవ్వొద్దని ఆదేశించారు. మిగతా మిల్లర్లకు కూడా బ్యాంకు గ్యారంటీ తీసుకొని ధాన్యం ఇవ్వాలని సూచించారు.

5లోగా డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన

ఈ నెల ఐదో తేదీలోగా అన్ని జిల్లాల్లో డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలనను పూర్తి చేయాలని కలెక్టర్లను సీఎం ఆదేశించారు. మొత్తంగా ఎంపికైన 11062 మంది అభ్యర్థులకు దసరా పండుగలోపు నియామక పత్రాలను అందిస్తామని ప్రకటించారు. అక్టోబర్ 9న ఎల్బీ స్టేడియంలో నియామక పత్రాలు అందించేందుకు వీలుగా జిల్లాల్లో వేగంగా ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 9090 మంది అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిందని విద్యాశాఖ అధికారులు సీఎంకు వివరించారు.

డ్రగ్స్ వద్దు స్పోర్ట్స్ ముద్దు

యువతకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు



సీఎం కప్ 2024 పోటీల లోగో, మస్కట్ (పాలపిట్ట-నీలమణి) ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారు జితేందర్ రెడ్డి, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, శాట్ చైర్మన్ కే.శివసేనా రెడ్డి తదితరులు

- జాతీయ జూనియర్ సాకర్ జట్టు దత్తత
- సీఎం కప్ లోగో, మస్కట్ ఆవిష్కరణ

నవతెలంగాణ-హైదరాబాద్

యువత వ్యసనాలను వీడి.. మైదానాల వెంట పరుగులు పెట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. యువత క్రీడల్లో రాణించటంపై దృష్టి సారించాలని, రాష్ట్ర ప్రభుత్వం నుంచి అథ్లెట్లకు పూర్తి సహకారం అందించేందుకు సిద్ధంగా ఉన్నామని రేవంత్ రెడ్డి భరోసా అందించారు. గురువారం ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం కప్ 2024 లోగో, మస్కట్‌ను ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఎమ్మెల్యే జి. వివేక్ వెంకటస్వామి, ఎంపీలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్ సహా రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు జితేందర్‌రెడ్డి, తెలంగాణ క్రీడాప్రాధికార సంస్థ (శాట్) చైర్మన్ కే. శివసేనా రెడ్డి, శాట్ ఉన్నతాధికారులు, క్రీడాకారులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



దేశం గర్వపడేలా చేయాలి

గత పదేండ్లలో తెలంగాణలో క్రీడాభివృద్ధి కుంటుపడింది. గతంలో ప్రతిష్టాత్మక అంతర్జాతీయ క్రీడలకు వేదికగా నిలిచిన హైదరాబాద్‌ను పదేండ్లలో నిర్లక్ష్యం చేశారు. తెలంగాణ నుంచి ఒలింపిక్ చాంపియన్లను తయారు చేయటమే లక్ష్యంగా పెట్టుకున్నాం. దక్షిణ కొరియాలోని స్పోర్ట్స్ యూనివర్శిటీతో సంప్రదింపులు జరిపి.. వారి సహకారంతో రాష్ట్రంలో త్వరలోనే క్రీడా విశ్వవిద్యాలయం స్థాపించబోతున్నాం. యువత వ్యసనాలకు (డ్రగ్స్, మద్యపానం) బానిస కావద్దు. కుటుంబాన్ని, తల్లిదండ్రులను ఆగం చేయవద్దు. క్రమశిక్షణ, పట్టుదలతో క్రీడల్లో రాణిస్తే.. తల్లిదండ్రులతో పాటు రాష్ట్రం, దేశం గర్వపడుతుంది. క్రీడాకారులకు తెలంగాణ ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని రేవంత్ రెడ్డి అన్నారు.

జాతీయ జట్టు దత్తత

ఫుట్‌బాల్‌కు హైదరాబాద్ చిరునామాగా ఉండేది. జాతీయ స్థాయిలో ఫుట్‌బాల్ క్రీడకు వన్నె తీసుకొచ్చేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందు కొచ్చింది. జాతీయ జూనియర్ (అండర్-17) జట్టును తెలంగాణ ప్రభుత్వం దత్తత తీసుకుంటుంది. జూనియర్ జట్టు ఇక నుంచి హైదరాబాద్ వేదికగా సాధన చేయనుంది. జాతీయ జూనియర్ సాకర్ జట్టును ఇక నుంచి తెలంగాణ ప్రభుత్వమే చూసు కోనుంది. తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను ఇది మరింత వ్యాపించజేయనుందని రేవంత్ రెడ్డి తెలిపారు.

ఓటమితో కుంగిపోవద్దు

లక్ష్యసాధనలో ఓటమికి యువత కుంగిపోవద్దు. నేను 2019లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలయ్యాను. ఆ తర్వాత అత్యధిక ఓట్లు కలిగిన పార్లమెంట్ స్థానం మల్కాజ్‌గిరి నుంచి ఎంపీగా విజయం సాధించాను. ఇప్పుడు మళ్లీ ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశాను. యువత ఓ లక్ష్యం నిర్దేశించుకుని ముందుకెళ్లాలి. ఆ దారిలో ఓటమికి నిరాశకు గురికావద్దు. క్రీడాకారులకు గెలుపోటములు సహజం. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని.. విజయం వైపు అడుగులు వేయాలని సీఎం ఆకాంక్షించారు.

నిఖత్ జరీన్ ఆదర్శం

మధ్యతరగతి కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన నిఖత్ జరీన్ ప్రపంచ చాంపియన్‌గా ఎదిగింది. ప్రపంచ బాక్సింగ్ చాంపియన్ నిఖత్‌ను తెలంగాణ ప్రభుత్వం డిఎస్పీగా నియమించింది. రూల్స్‌ను సడలించి క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు సైతం ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చాం. ప్రధాని మోడీ, నేను సైతం మధ్యతరగతి కుటుంబాల నుంచి వచ్చినవాళ్లమే. ఇప్పుడు ఇద్దరం ఉన్నత స్థానాల్లో ఉన్నాం. యువత నిఖత్ జరీన్‌ను స్ఫూర్తిగా తీసుకుని ముందుకు సాగాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా నిఖత్ జరీన్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అధికారికంగా ర్యాంక్‌లు ప్రదానం చేశారు.

మస్కట్, లోగో ఆవిష్కరణ

సీఎం కప్ పోటీలను పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్నాం. పల్లెల నుంచి ప్రపంచ చాంపియన్లను తయారు చేయాలనే లక్ష్యంగా పని చేస్తున్నాం. గ్రామీణ క్రీడాకారులు సీఎం కప్ పోటీల్లో సత్తా చాటుతారని ఆశిస్తున్నాను. ఇక నుంచి ప్రతి ఏడాది సీఎం కప్ పోటీలను నిర్వహిస్తాం. తొలిసారి పారా క్రీడల్లోనూ సీఎం కప్ పోటీలు జరుగుతాయని రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా సీఎం కప్ లోగో, మస్కట్ (పాలపిట్ట-నీలమణి)లను ఆవిష్కరించారు.

ప్రైజ్‌మనీ అందజేత

గోవా జాతీయ క్రీడల్లో పతకాలు సాధించిన తెలంగాణ క్రీడాకారులకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నగదు ప్రోత్సాహకాలు అందజేశారు. ఇటీవల బీసీ రాయ్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన తెలంగాణ జూనియర్ సాకర్ జట్టుకు సైతం నగదు బహుమతి అందజేశారు. ఎన్‌సీసీలో ప్రతిభ చూపిన క్యాడెట్లను ఈ సందర్భంగా సీఎం అభినందించారు.

24 నుంచి సీఎం కప్

సీఎం కప్ పోటీలను ఈ ఏడాది నాలుగు అంచెల్లో నిర్వహిస్తున్నట్టు క్రీడాశాఖ ముఖ్యకార్యదర్శి వాణి ప్రసాద్ వెల్లడించారు. ఈ నెల 24 నుంచి గ్రామ స్థాయి పోటీలతో సీఎం కప్ షురూ కానుందని ప్రకటించారు. మండల స్థాయి పోటీలు 26 నుంచి 30 వరకు, జిల్లా స్థాయి పోటీలు నవంబర్ 8 నుంచి 13 వరకు, రాష్ట్ర స్థాయి పోటీలు నవంబర్ 24 నుంచి డిసెంబర్ 5 వరకు నిర్వహించనున్నారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు నవంబర్ 16 నుంచి 26 వరకు 11 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నారు. సీఎం కప్ పోటీల నిర్వహణకు రూ.6 కోట్లు, రానున్న జాతీయ క్రీడలకు ఎంపికైన క్రీడాకారులు సహా పలు జాతీయ టోర్నమెంట్లలో పోటీపడే అథ్లెట్ల శిక్షణ శిబిరాలకు మరో రూ.12 కోట్ల నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిందని ఆమె వెల్లడించారు.



క్రీడా జ్యోతి వెలిగించిన సీఎం

సీఎం కప్ 2024 పోటీల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎల్బీ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి క్రీడా జ్యోతి వెలిగించారు. క్రీడా జ్యోతి రిలే ఎల్బీ స్టేడియం నుంచి వికారాబాద్ వరకు సాగనుంది. అక్కడ్నుంచి 16 రోజుల పాటు 33 జిల్లా కేంద్రాలకు వెళ్లనుంది. ఈ నెల 18న తిరిగి టార్చ్ రిలే ఎల్బీ స్టేడియంకు చేరుకోనుంది.



అమ్మాయిలకు తొలి పరీక్ష

- నేడు న్యూజిలాండ్‌తో భారత్ ఢీ
- ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్

దుబాయ్ (యుఏఈ) : ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా తొలి పరీక్షకు సిద్ధమైంది. గ్రూప్-ఏలో భాగంగా నేడు న్యూజిలాండ్‌తో భారత మహిళల జట్టు తలపడనుంది. తొలిసారి పొట్టి ప్రపంచకప్ సొంతం చేసుకోవాలనే తపనతో యుఏఈలో అడుగుపెట్టిన హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. నేడు కివీస్‌తో మ్యాచ్‌లో ఫేవరేట్‌గా బరిలోకి దిగుతోంది. భారత్, న్యూజిలాండ్ మ్యాచ్ దుబాయ్ వేదికగా జరుగనుండగా.. రాత్రి 7.30 గంటలకు ఆరంభం కానుంది. నేడు మరో మ్యాచ్‌లో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా ఢీకొట్టనున్నాయి. ఆదివారం ప్రియ ప్రత్యర్థి పాకిస్థాన్‌తో మ్యాచ్ ముంగిట.. తొలి పరీక్షలో న్యూజిలాండ్‌పై మెరుపు విజయం సాధించేందుకు అమ్మాయిలు సిద్ధమవుతున్నారు.

జోరు చూపిస్తారా? : టీమ్ ఇండియా అమ్మాయిలు జోరు మీదున్నారు. ప్రపంచకప్ వార్మప్ మ్యాచుల్లో సాధికారిక విజయాలు నమోదు చేశారు. వెస్టిండీస్‌పై 20 పరుగుల తేడాతో గెలుపొందిన అమ్మాయిలు.. దక్షిణాఫ్రికాను 28 పరుగుల తేడాతో చిత్తు చేసింది. మరోవైపు న్యూజిలాండ్ అమ్మాయిలు వార్మప్‌లో ఓ మ్యాచ్‌లో ఓటమి పాలై.. మరో మ్యాచ్‌లో విజయం సాధించారు. భారత జట్టులో ఆల్‌రౌండర్ శ్రేయాంక పాటిల్, వికెట్ కీపర్ యస్తికా భాటియా ఫిట్‌నెస్‌పై అనుమానాలు ఉన్నాయి. ప్రాక్టీస్ మ్యాచుల్లో రాణించినా.. నేడు తుది జట్టులో నిలిచేది అనుమానమే. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ బ్యాటింగ్ లైనప్‌లో ముందుగా రానుంది. నం.3 స్థానంలో క్రీజులోకి రానున్న హర్మన్‌ప్రీత్ కౌర్ స్కోరు వేగం పెంచే ప్రణాళికలో ధనాధన్ మోత మోగించే అవకాశం కనిపిస్తుంది. స్మృతీ మంధాన, షెఫాలీ వర్మ సహా జెమీమా రొడ్రిగస్, రిచా ఘోష్‌లు భారత్‌కు కీలకం కానున్నారు. న్యూజిలాండ్ జట్టులో స్టార్స్‌కు కొదవ లేదు. సోఫీ డివైన్ సహా సుజీ బేట్స్, మ్యాడీ గ్రీన్, అమేలీ ఖేర్‌లకు భారత్‌పై మంచి రికార్డుంది. మంచు ప్రభావం కనిపించే దుబాయ్‌లో ఇరు జట్ల స్పిన్నర్లు మ్యాచ్ ఫలితాన్ని శాసించే అవకాశం కనిపిస్తుంది.

బంగ్లాదేశ్ ఎట్టకేలకు..!

స్కాట్లాండ్‌పై ఘన విజయం
ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్



షార్జా (యుఏఈ) : ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్‌లో బంగ్లాదేశ్ ఎట్టకేలకు ఓ విజయం సాధించింది. 2014 నుంచి పొట్టి ప్రపంచకప్‌లో గెలుపు రుచి కోసం ఎదురుచూస్తున్న బంగ్లాదేశ్.. గురువారం షార్జా వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ ఆరంభ మ్యాచ్‌లో స్కాట్లాండ్‌పై 16 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 119 పరుగులు చేసింది. శోభన (36, 38 బంతుల్లో 2 ఫోర్లు), శాతి రాణి (29, 32 బంతుల్లో 3 ఫోర్లు), నిగర్ సుల్తానా (18, 18 బంతుల్లో 1 ఫోర్), ఫహిమ ఖాన్ (10 నాటౌట్, 5 బంతుల్లో 2 ఫోర్లు) రాణించారు. ఛేదనలో స్కాట్లాండ్ చతికిల పడింది. 20 ఓవర్లలో 7 వికెట్లకు 103 పరుగులే చేసింది. ఓపెనర్ సారా (49 నాటౌట్, 52 బంతుల్లో 1 ఫోర్) ఒంటరి పోరాటం చేసినా... ఆమెకు మరో ఎండ్ నుంచి మద్దతు లభించలేదు. అలీసా (11), బ్రైస్ (11) మినహా మరో బ్యాటర్ స్కాట్లాండ్ నుంచి రెండెంకల స్కోరు చేయలేదు.



ఈశ్వరన్ అజేయ సెంచరీ

రెస్టాఫ్ ఇండియా 289/4

లక్నో (ఉత్తరప్రదేశ్): ఇరానీ కప్ పోరు రసవత్తరంగా సాగుతోంది. ముంబయి బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ డబుల్ సెంచరీతో ఆ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 537 పరుగులు చేయగా.. రెస్టాఫ్ ఇండియా సైతం దీటుగా స్పందిస్తోంది. ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ (151 నాటౌట్, 212 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్)తో అభిమన్యు అదరగొట్టాడు. రుతురాజ్ గైక్వాడ్ (9), సాయి సుదర్శన్ (32), దేవదత్ పడిక్కల్ (16), ఇషాన్ కిషన్ (38) అంచనాలను అందుకోలేదు. కానీ ఓ ఎండ్‌లో నిలబడిన అభిమన్యు ఈశ్వరన్ అజేయ సెంచరీతో కదం తొక్కాడు. ధ్రువ్ జురెల్ (30 నాటౌట్, 41 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) అజేయ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. మూడో రోజు ఆట ముగిసే సమయానికి రెస్టాఫ్ ఇండియా 74 ఓవర్లలో 289/4 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో మరో 248 పరుగుల వెనుకంజలో కొనసాగుతుంది. నేడు నాల్గో రోజు ఆటలో అభిమన్యు, ధ్రువ్ జురెల్ జోడీ మెరిస్తేనే రెస్టాఫ్ ఇండియా గట్టెక్కగలదు.



చిరంజీవి, వెంకటేష్, మహేష్‌బాబు, ఎన్టీఆర్

నవచిత్రం

మంచి కంటెంట్‌తో కలి



యువ హీరోలు ప్రిన్స్, నరేష్ అగస్త్య నటించిన సినిమా 'కలి'. ఈ చిత్రాన్ని కథా రచయిత కె.రాఘవేంద్ర రెడ్డి సమర్పణలో రుద్ర క్రియేషన్స్ సంస్థ నిర్మించింది. శివ శేషు దర్శకుడు. లీలా గౌతమ్ వర్మ నిర్మాత.
సైకలాజికల్ థ్రిల్లర్ కథతో తెరకెక్కిన ఈ సినిమా నేడు (శుక్రవారం) రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిత్ర సమర్పకులు కె రాఘవేంద్ర రెడ్డి మాట్లాడుతూ, 'ఈ రోజు సమాజాన్ని పట్టి పీడిస్తున్న జాఢ్యం ఆత్మహత్యలు. ఆత్మహత్యకు పురికొల్పే ఆలోచలను కొద్ది సేపు నియంత్రించుకుంటే ఎన్నో ప్రాణాలు నిలుస్తాయి. ఈ పాయింట్‌తో సినిమాను నిర్మించాం' అని తెలిపారు.
'మా మూవీ టీజర్ రిలీజ్ చేసి సపోర్ట్ అందించిన నాగ్ అశ్విన్‌కి, సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ప్రభాస్‌కు, ట్రైలర్ రిలీజ్ చేసిన ప్రశాంత్ వర్మకు థ్యాంక్స్' అని నిర్మాత లీలా గౌతమ్ వర్మ చెప్పారు.
దర్శకుడు శివ శేషు మాట్లాడుతూ, 'మనం పడితే ఆ బాధ మనకు మాత్రమే తెలుస్తుంది. మనం తిరిగి నిలబడి ఎదిగితే అది పదిమందికి తెలుస్తుంది. అదే ఈ సినిమా కాన్సెప్ట్' అని తెలిపారు. హీరో ప్రిన్స్ మాట్లాడుతూ, 'నా క్లోజ్ ఫ్రెండ్ ఉదయ్‌కిరణ్ ఆత్మహత్య చేసుకోవడం నన్నెంతో బాధించింది. ఆత్మహత్యల నివారణ కోసం ఈసినిమా చేశాను. ఈ సినిమా మిమ్మల్ని బాధ పెట్టేలా ఉండదు. ఇందులో థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. మంచి మ్యూజిక్ ఉంటుంది. మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేసే క్యారెక్టర్స్ ఉంటాయి' అని అన్నారు.



సుహాస్, సంగీర్తన

జనక అయితే గనక

దసరా కానుకగా రిలీజ్

సుహాస్, సంగీర్తన హీరో, హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'జనక అయితే గనక'. శిరీష్ సమర్పణలో దిల్‌రాజు ప్రొడక్షన్స్ పతాకంపై హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. సందీప్ రెడ్డి బండ్ల డైరెక్ట్ చేశారు. ఈ సినిమా దసరా సందర్భంగా ఈనెల 12న విడుదల కానుంది.
ఈ నేపథ్యంలో దిల్ రాజు మాట్లాడుతూ, 'ఈనెల 6న విజయవాడలో పబ్లిక్ షో వేస్తున్నాం. 8వ తేదీన తిరుపతిలో షో వేస్తున్నాం. హ్యాపీ డేస్, శతమానం భవతి చిత్రాలు ఓవర్సీస్‌లో ముందుగా రిలీజ్ చేశాను. ఆ సెంటిమెంట్‌తోనే ఇప్పుడు కూడా ఈ మూవీని ముందుగా అంటే ఈనెల 10న ఓవర్సీస్‌లో రిలీజ్ చేస్తున్నాను. 11న ఇక్కడ ప్రీమియర్లు వేసి.. 12న గ్రాండ్‌గా రిలీజ్ చేయనున్నాం. నాన్ థియేట్రికల్ బిజినెస్ పూర్తయింది. డిజిటల్, హిందీ డబ్బింగ్, ఓటీటీ ఇలా అన్నీ కూడా పూర్తయ్యాయి. మా సినిమా పూర్తి వినోదాత్మకంగా సాగుతుంది' అని అన్నారు. 'ఏ ఒక్కర్నీ కూడా ఈ సినిమా నిరాశ పర్చదు. ఇప్పటి వరకు సినిమా చూసిన వాళ్లంతా కూడా బాగుందని చెబుతున్నారు' అని హీరో సుహాస్ చెప్పారు.
హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ, 'ఈ చిత్రం మాకు చాలా స్పెషల్. ఐడియాలజీని నమ్మి ముందుకు వెళ్లండని సాయి దుర్గ తేజ్ చెబుతుంటారు. మా సినిమా అంతా కూడా ఐడియాలజీల మీదే ప్రయాణం ఉంటుంది. ఫాదర్, గ్రాండ్ మదర్, వైఫ్, హజ్బెండ్ ఇలా అందరి కోణంలోనూ ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు. డైరెక్టర్ సందీప్ రెడ్డి బండ్ల మాట్లాడుతూ, 'నా ఫేవరేట్ నా పెళ్లాం పాట బాగా వైరల్ అయింది. సుమ, రాజీవ్ కనకాల, ఆట సందీప్ రీల్స్ చేశాక మరింత వైరల్ అయింది. సినిమా కూడా అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నాను' అని చెప్పారు.

చిత్ర పరిశ్రమ ఇలాంటివి సహించదు

రాజకీయ లబ్ది కోసం చిత్ర పరిశ్రమకి చెందిన వ్యక్తులపై, వారి జీవితాలపై ఎలాంటి ఆధారాలు లేకుండా వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే ఇకపై సహించేది లేదని తెలుగు చిత్ర పరిశ్రమ స్పష్టం చేసింది.
భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను ఉద్దేశించి విమర్శలు చేసే క్రమంలో అక్కినేని కుటుంబం, సమంత, రకుల్‌ప్రీత్‌సింగ్ గురించి తెలంగాణ మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై తెలుగు చిత్ర పరిశ్రమ ప్రముఖులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫిల్మ్ ఇండస్ట్రీ విల్ నాట్ టోలరేట్ అనే హ్యాష్‌ట్యాగ్‌తో సోషల్ మీడియా వేదికగా తమ అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు.



త్వరితగతిన వార్తల్లో వైరల్ అయ్యేందుకు సినీ పరిశ్రమ సభ్యులను సాఫ్ట్ టార్గెట్‌గా చేసి మాట్లాడటం సిగ్గు చేటు. మా సభ్యులపై ఇలాంటి దుర్మార్గపు మాటలతో దాడులు చేయడం చిత్ర పరిశ్రమ నుంచి ఏకతాటిపై వ్యతిరేకిస్తున్నాం.
- చిరంజీవి

రాజకీయాల్లోకి ఇతరుల వ్యక్తిగత జీవితాలను తీసుకురావడం వల్ల ఎవరికీ ఉపయోగం ఉండదు. ఇందులో భాగమైన వారి కుటుంబానికి బాధ మాత్రమే ఉంటుంది.
- వెంకటేష్

మహిళా మంత్రి చేసిన వ్యాఖ్యలు నన్నెంతో బాధించాయి. నాకు రాజకీయాలతో ఎటువంటి సంబంధం లేదు. నా పేరును హానికరమైన రీతిలో మీ రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం వదిలేయాలని కోరుతున్నాను.
కళాకారులను, సృజనాత్మక వ్యక్తులను రాజకీయ కోణం నుండి దూరంగా ఉంచాలి. రాజకీయ విమర్శల కోసం, న్యూస్ హెడ్‌లైన్‌ల కోసం అర్థం లేని అంశాలలోకి మమ్మల్ని లాగకండి.
- రకుల్ ప్రీత్‌సింగ్

ఒక కుమార్తెకు తండ్రిగా, ఒక భార్యకు భర్తగా, ఒక తల్లికి కుమారుడిగా ఒక మహిళా మంత్రి మరో మహిళపై చేసిన ఆమోదయోగ్యం కాని వ్యాఖ్యలు తీవ్రంగా కలచివేశాయి. **- మహేష్‌బాబు**

వ్యక్తిగత జీవితాలను బయటకు లాగడం దిగజారుడు రాజకీయాలకు పరాకాష్ఠ. బాధ్యతా రాహిత్యంగా చిత్ర పరిశ్రమపై నిరాధార ప్రకటనలు చేయడం నిజంగా బాధాకరం. **- ఎన్టీఆర్**

ఇది అవమానకర చర్య. తమ రాజకీయ శత్రుత్వాల్లోకి అమాయక వ్యక్తులను, ముఖ్యంగా మహిళలను లాగకూడదు. **- రవితేజ**

సినీ ప్రముఖులు, వారి కుటుంబాలపై చేసిన నిరాధారమైన, కించపరిచే వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. **- అల్లు అర్జున్**

హుందాతనాన్ని నిలబెట్టుకోండి. గౌరవప్రదంగా వ్యవహరించండి. నిరాధార ఆరోపణలు సహించ లేనివి.
- దర్శకుడు రాజమౌళి

ఒక కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవడం, ముఖ్యంగా ఒక మహిళ గురించి చెడుగా మాట్లాడటం ఆమోదయోగ్యం కానిది. సినీ కుటుంబానికి చెందిన వ్యక్తిగా ఇలాంటి ప్రవర్తనను మేం సహించం. **- వరుణ్‌తేజ్**

ఆద్యంతం వినోదాత్మకం

చంద్రహాస్ హీరోగా నటిస్తున్న సినిమా 'రామ్ నగర్ బన్నీ'. విస్మయ శ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రితూ మంత్ర హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని దివిజ ప్రభాకర్ సమర్పణలో మలయజ ప్రభాకర్, ప్రభాకర్ పొడకండ నిర్మించారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వం వహించారు. నేడు (శుక్రవారం) ఈ సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో హీరో చంద్రహాస్ మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.



చంద్రహాస్

- ఈ సినిమా కంప్లీట్ ఎంటర్‌టైనర్. ఈ సినిమాను ప్రతి ఒక్కరూ బాగా ఎంజాయ్ చేస్తారు. అన్ని ఎలిమెంట్స్ ఉన్న సినిమా నా తొలి సినిమా కావడం సంతోషంగా ఉంది. ఇలాంటి ఎంట్రీ మరొకరికి దొరుకుతుందని అనుకోను. సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తుందనే కాన్ఫిడెన్స్ మా టీమ్ అందరిలో ఉంది.
- ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రామ్ గోపాల్ వర్మ నా గురించి హీరో క్వాలిటీస్ అన్నీ ఉన్నాయని చెప్పడం సంతోషంగా ఉంది. అలాగే మా సినిమా చూసి మీకు నచ్చకుంటే నాకు మీ టికెట్ ఫొటోతో ఇన్ స్టా ద్వారా చెప్పండి మీ డబ్బులు తిరిగి ఇచ్చేస్తా అని చెప్పాను. సినిమా మీద నమ్మకంతోనే అలా అన్నాను.
- ఈ సినిమాలో నేను సూపర్ హీరోలా కనిపించను. ఒక సాధారణ యువకుడిగానే కనిపిస్తా. నేను తిట్లు తింటాను, అవమానాలు ఎదుర్కొంటాను. రకరకాల జాబ్స్ చేస్తాను. కొన్నిసార్లు జాబ్ లెస్‌గా ఉంటాను. అన్ని రకాల ఎమోషన్స్ చేసే అవకాశం ఈ చిత్రంలో కలిగింది.
- సకుటుంబంగా ఫ్యామిలీ ఆడియెన్స్ వెళ్లి ఈ సినిమాని చూడొచ్చు. నాన్న(ప్రభాకర్) ఈ సినిమాలో ఓ చిన్న రోల్ చేశారు. దర్శకుడు శ్రీనివాస్ మహత్ నన్ను స్క్రీన్ మీద బాగా ప్రెజెంట్ చేశాడు. ఈ సినిమా తర్వాత నేను అన్ని ఎమోషన్స్, అన్ని జోనర్స్ చేయగలను అనే పేరొస్తుంది. ఈ సినిమా తప్పకుండా మంచి విజయాన్ని అందిస్తుందని ఆశిస్తున్నాను.

సరికొత్త వీక్షణం



రామ్‌కార్తీక్, కశ్వి

రామ్ కార్తీక్, కశ్వి హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా 'వీక్షణం'. పద్మనాభ సినీ ఆర్ట్స్ బ్యానర్‌పై పి. పద్మనాభ రెడ్డి, అశోక్ రెడ్డి నిర్మిస్తున్నారు. కామెడీ మిస్టరీ థ్రిల్లర్ కథతో దర్శకుడు మనోజ్ పల్లేటి రూపొంది స్తున్నారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ సినిమా ఈ నెల 18న థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో గురువారం దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ ఈ చిత్ర టీజర్‌ను రిలీజ్ చేశారు.
ఈ సందర్భంగా నిర్మాత పి.పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ, 'టీజర్ మీకు నచ్చిందని ఆశిస్తున్నాం. ఈనెల 18న థియేటర్స్‌లోకి వస్తున్న మూవీని కూడా ఇలాగే సపోర్ట్ చేస్తారని కోరుకుంటున్నా' అని అన్నారు. 'ఎక్కడా ల్యాగ్ లేకుండా మిమ్మల్ని ఎంగేజ్ చేసే చిత్రమిది. ఫన్, లవ్, సస్పెన్స్, మిస్టరీ వంటి అన్ని ఎలిమెంట్స్ మా సినిమాలో అలరిస్తాయి' అని మరో నిర్మాత అశోక్ రెడ్డి చెప్పారు. 'హీరో వెంకటేష్ ఒక మాట చెప్పారు. ఈ ప్రపంచంలో అత్యంత కష్టమైన పని ఏంటంటే మన పని మనం చూసు కోవడం. ఆయన చెప్పిన ఆ మాటే మా సినిమాకు కథా నేపథ్యం. మా చిత్రంలో హీరో ఎప్పుడూ పక్కోడి లైఫ్‌లో ఏం జరుగుతుందో చూడాలనే ఉత్సాహంలో ఉంటాడు. ఆ ఉత్సాహం వల్ల అతనికి జీవితంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయి అనేది సినిమాలో ఆసక్తికరంగా చూపిస్తున్నాం' అని దర్శకుడు మనోజ్ పల్లేటి చెప్పారు. హీరో రామ్ కార్తీక్ మాట్లాడుతూ, 'ఈ సినిమా ప్రేక్షకులతో పాటు చిత్ర పరిశ్రమలోనూ మా అందరికీ మంచి గుర్తింపు తెస్తుంది' అని అన్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

హైదరాబాద్ రియాల్టీకి డోకా లేదు

- బెంగళూరు మార్కెట్లోకి పౌలోమి ఎస్టేట్స్
- రూ.800 కోట్లతో హైరైజ్ నివాస ప్రాజెక్టు
- డైరెక్టర్ ప్రశాంత్ రావు వెల్లడి



నవ తెలంగాణ - హైదరాబాద్

ప్రీమియం రియాల్టీ కంపెనీ పౌలోమి ఎస్టేట్స్ బెంగళూరు మార్కెట్లోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. అక్కడ రూ.800 కోట్లతో 35 అంతస్తుల్లో 850 నివాసాలను అందుబాటులోకి తేనున్నామని పౌలోమి ఎస్టేట్స్ డైరెక్టర్ ప్రశాంత్ రావు వెల్లడించారు. గురువారం హైదరాబాద్‌లో ఆ సంస్థ స్ట్రాటజీ వైస్ ప్రెసిడెంట్ ఎం మారుతి రావుతో కలిసి ప్రశాంత్ రావు మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్‌లో తాము ఎనిమిది ప్రాజెక్టులను చేపట్టామని.. ప్రస్తుతం కోకాపేటలో రెండింటి నిర్మాణం కొనసాగుతుందన్నారు. తాజాగా ఉత్తర బెంగళూరులోని తనిసంద్రలో 18 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నూతన ప్రాజెక్టును చేపడుతున్నామని తెలిపారు. వచ్చే ఐదేళ్లలో రెండు దశల్లో దీన్ని పూర్తి చేయనున్నామన్నారు. ఫ్లాట్ కనీస ధరను రూ.1.4 కోట్లుగా ఉండొచ్చన్నారు. 1450-2550 చదరపు అడుగుల విస్తీర్ణంలో నివాసాలు ఉంటాయన్నారు. హైదరాబాద్ రియల్ ఎస్టేట్‌కు డోకా లేదన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు సాధారణంగానే రియాల్టీ కొనుగోళ్ల పట్ల వినియోగదారులు వేచి చూసే ధోరణితో వ్యవహరిస్తారన్నారు. దీంతో గడిచిన ఆరు నెలలుగా కొంత తగ్గినట్లుగా కనిపిస్తున్నప్పటికీ.. మళ్లీ పుంజుకోనుందన్నారు. మౌలిక వసతుల కల్పన పెంచడం ద్వారా కాలక్రమేణ రియాల్టీకి మరింత డిమాండ్ పెంచొచ్చన్నారు. గత నాలుగైదు ఏళ్లుగా నిర్మాణ వ్యయం 35 శాతం మేర పెరిగిందన్నారు. ఇప్పటికే భారీగా పెరిగిన భూముల ధరల వల్ల నివాసాల ధరలు పెరిగాయన్నారు. హైదరాబాద్‌లో తమ సంస్థ 22.5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆరు నివాస ప్రాజెక్టులు, 10 లక్షల చదరపు అడుగుల్లో రెండు వాణిజ్య ప్రాజెక్టులను చేపట్టామన్నారు. కోకాపేటలో చేపడుతున్న ఇన్ఫినిట్ ప్రాజెక్టు వచ్చే ఏడాది జులై కల్లా పూర్తి కానుందన్నారు. ఇందులో ఇప్పటికే 75 శాతం విక్రయాలు పూర్తి అయ్యాయని తెలిపారు. హైదరాబాద్‌లోని విజయాలను బెంగళూరులో పునరావృతం చేయగలమని ప్రశాంత్ రావు విశ్వాసం వ్యక్తం చేశారు.

సిమెంట్ ధరలు ప్రియం

హైదరాబాద్ : సిమెంట్ ధరల్లో పెరుగుదల చోటు చేసుకుంది. ధరలు పెంచిన వాటిలో అల్ట్రాటెక్, ఇండియా సిమెంట్స్, దాల్మియా భారత్, రామ్‌కో, ఎసిసి, ఇండియా సిమెంట్స్ సహా ప్రధాన సిమెంట్ కంపెనీలు ఉన్నాయి. పెంచిన ధరలు గురువారం నుంచే అమల్లోకి వచ్చాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోనూ ఈ పెరుగుదల చోటు చేసుకుంది. తెలుగు రాష్ట్రాల్లో 50 కిలోల సిమెంట్ బస్తాపై రూ.20-30 మేర ధర పెరిగిందని సమాచారం. ముడిసరుకులు, పెరుగుతున్న రవాణా ఖర్చుల్ని తగ్గించుకోవడంలో భాగంగా ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.

భారత మార్కెట్లోకి రేంజ్ రోవర్ ఎస్‌వి రణ్ తంబోర్ ఎడిషన్

న్యూఢిల్లీ : ఎస్‌వి బెస్పోక్ ద్వారా రూపొందించిన సరికొత్త రేంజ్ రోవర్ ఎస్వీ రణ్ తంబోర్ ఎడిషన్‌ను భారత మార్కెట్లోకి విడుదల చేసినట్లు జెల్ఆర్ ఇండియా ఎండి రాజన్ అంబా తెలిపారు. ఎక్స్‌షోరూం వద్ద దీని ధరను రూ.4.98 కోట్లుగా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇందులో కేవలం 12 యూనిట్లను మాత్రమే తయారు చేస్తున్నట్లు తెలిపారు. 3.0 లీటర్ పెట్రోల్ ఇంజిన్‌తో అందుబాటులోకి తెచ్చిన ఈ వాహనాన్ని తమ తెలివైన గల క్లయింట్‌ల కోసం రూపొందించబడిందన్నారు.

సుదర్శన్ ఫార్మా 1:10 షేర్ల విభజన

హైదరాబాద్ : సుదర్శన్ ఫార్మా ఇండస్ట్రీస్ తమ షేర్లను 1:10గా (ఒక్కటికి పదిగా) విభజించడానికి కంపెనీ బోర్డు ఆమోదం తెలిపింది. రూ.10 ముఖ విలువ కలిగిన ఈ షేర్ మంగళవారం 4.74 శాతం పెరిగి రూ.431.90 వద్ద ముగిసింది. షేర్ల విభజన వాటాదారులు, రెగ్యూలేటరీ సంస్థల ఆమోదానికి లోబడి ఉంటుందని పేర్కొంది. ఇటీవలే ఈ కంపెనీ సుదర్శన్ మావెన్ ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో అనుబంధ సంస్థను ఏర్పాటు చేసింది.

పిసి జ్యువెలర్ ఒటిఎస్‌కు బిఒఐ ఆమోదం

హైదరాబాద్ : ప్రముఖ అభరణాల రిటైల్ చెయిన్ పిసి జ్యువెల్లర్స్ తమ రుణాల వన్ టైం సెటిల్‌మెంట్ (ఒటిఎస్) కోసం పెట్టుకున్న ప్రతిపాదనకు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపిందని పేర్కొంది. ఢిల్లీ కేంద్రంగా పని చేస్తోన్న ఈ సంస్థ బకాయిల పరిష్కారానికి బిఒఐ ముందుకు వచ్చిందని పేర్కొంది. ఇంతక్రితం 14 విత్త సంస్థల కన్సోరియం పిసి జ్యువెల్స్ ఒటిఎస్ ప్రతిపాదనలకు అంగీకరించాయి. అదే విధంగా ఆగస్టు 8న కంపెనీ బోర్డు సమావేశం జరిగిందని తెలిపింది. ఇందులో సంస్థ షేర్లను 1:10 విభజనకు ఆమోదం లభించిందని తెలిపింది.

బ్యాటరీ స్మార్ట్‌తో వారివో మోటర్ భాగస్వామ్యం

న్యూఢిల్లీ : బ్యాటరీ మార్పిడి నెట్‌వర్క్ అయిన బ్యాటరీ స్మార్ట్‌తో ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ వారివో మోటార్ ఇండియా భాగస్వామ్యం కుదర్చుకుంది. ఇటీవల తాము ఆవిష్కరించిన హైస్పీడ్ ఎలక్ట్రిక్ స్కూటర్ సిఆర్ఎక్స్ ఆ తర్వాత వాహనాల కోసం బ్యాటరీని డి కప్లింగ్ చేయడం ద్వారా వాహన ఆపరేటర్లకు ముందస్తు ఖర్చులను తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. పూర్తిగా క్షీణించిన బ్యాటరీలను త్వరగా మార్పిడి చేయడానికి అనుమతించడం ద్వారా, సౌకర్యవంతమైన సేవ, డెలివరీ, లాజిస్టిక్స్ కార్యకలాపాలలో అధిక సామర్థ్యాన్ని నిర్ధారించడం ద్వారా సమయాన్ని ఆదా చేస్తుందని పేర్కొంది.



మత్స్యకారులకు అండగా ప్రభుత్వం

- మంత్రి పొన్నం ప్రభాకర్
- లోయర్ మానేరు డ్యామ్‌లో చేప పిల్లలు విడుదల

నవతెలంగాణ - కరీంనగర్

మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం ఉంటుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని లోయర్ మానేరు డ్యామ్‌లో గురువారం ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మెన్ మెట్టు సాయికుమార్ అధ్యక్షతన 100శాతం సబ్సిడీతో చేప పిల్లల విడుదల కార్యక్రమం నిర్వహించారు. డ్యామ్ వద్ద గంగమ్మ తల్లికి మంత్రి పూజలు చేసి చేప పిల్లలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చేప పిల్లల పంపిణీ కొంత జాప్యం జరిగిన మాట వాస్తవమని, కొన్నేండ్లుగా చేప పిల్లలు పంపిణీ చేసిన వారికి బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిపారు. పరస్పర ఫిర్యాదులు విచారణ జరుగుతుండటం, పాత బకాయిలు న్యాయబద్ధంగా రావాల్సినవి ఇప్పించడం, ఇప్పుడు సప్లరు చేసిన వారికి కూడా బిల్లులు త్వరగా చెల్లించాలని ముఖ్యమంత్రి చెప్పడంతోనే పంపిణీ కార్యక్రమం ఆలస్యమయినట్టు చెప్పారు. కులవృత్తులు ఉపాధి పొందాలన్న సీఎం పట్టుదల, కృషితోనే ఈ కార్యక్రమాన్ని ప్రారంభించుకు న్నామన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడ్జెట్ సమీక్షా సమావేశాల సందర్భంగా మత్స్యశాఖ చెల్లించాల్సిన బిల్లులు రూ.40వేల కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, రూ.75 వేల కోట్ల పనులు శాంక్షన్ చేసి పెండింగ్ పెట్టారని తెలిపారు. ఎంఎస్ఎంఈ పాలసీలో తెలంగాణలోని అన్ని కుల వృత్తులను పెడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మేయర్ సునీల్‌రావు, ఫిషరీస్ కమిషనర్ ప్రియాంక ఆలా, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మత్స్య పారిశ్రామిక సంఘం జిల్లా చైర్మెన్ పిట్టల రవీందర్, పాల్గొన్నారు.

గిరిజనుల ఆరోగ్యంపై సర్కార్ ఫోకస్

- ఐటీడీఏల పరిధిలో కొత్త ఆస్పత్రుల ఏర్పాటుకు నిర్ణయం
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు మంత్రి దామోదర ఆదేశం
- అరగంట లోపలే చేరుకునేలా నెట్‌వర్క్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలనీ, ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు అరగంట లోపలే చేరుకునేలా ఐటీడీఏల పరిధిలో ప్రభుత్వ హాస్పిటళ్ల నెట్‌వర్క్ ఉండాలని స్పష్టం చేశారు. అందుకనుగుణంగా కొత్తగా సబ్ సెంటర్లు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్ల ఏర్పాటుకు ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించాలని వైద్యారోగ్యశాఖ అధికారులు, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లకు మంత్రి సూచించారు. ఈ మేరకు రాష్ట్రంలోని మన్ననూరు, భద్రాచలం, ఏటూరు నాగారం, ఉట్నూరు ఐటీడీఏల పరిధిలో ఉన్న ఆస్పత్రులు, వైద్య సౌకర్యాలు, తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం సమీక్షించారు. హైదరాబాద్‌లోని ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసులో జరిగిన ఈ సమావేశంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా, ట్రైబల్ వెల్ఫేర్ సెక్రటరీ శరత్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ కర్ణన్, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్లు, ఆరోగ్యశాఖ, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనుల ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఐటీడీఏల పరిధిలో నివసిస్తున్న ప్రజలు తమ ఆవాసాల నుంచి అరగంట లోపలే చేరుకునేలా హాస్పిటల్స్ నెట్‌వర్క్ ఉండాలనీ, కొత్తగా సబ్ సెంటర్లు, పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఐటీడీఏల ప్రాజెక్ట్ ఆఫీసర్లను ఆదేశించారు. అవసరానికి అనుగుణంగా ఎన్ని దవాఖానలైనా మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

స్పెషల్ వార్డులు

ఐటీడీఏ పరిధిలో ఉన్న జిల్లా, ఏరియా హాస్పిటల్స్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో డాక్టర్లు, సిబ్బంది కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌ను మంత్రి ఆదేశించారు. అటవీ ప్రాంతాలు, రోడ్ కనెక్టివిటీ సరిగా లేని ప్రాంతాల్లో నివసిస్తున్న గర్భిణుల విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని మంత్రి సూచించారు. ఎస్టిమేటెడ్ డెలివరీ డేట్(ఈడీడీ) కంటే ముందే గర్భిణులను హాస్పిటల్స్‌కు తరలించి, బర్త్ వెయిటింగ్ రూమ్స్‌లో వారికి అడ్మిషన్ ఇవ్వాలన్నారు. ట్రైబల్ ఏరియాలో ఉన్న అన్ని హాస్పిటల్స్‌లో బర్త్ వెయిటింగ్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. గర్భిణి, ఆమెతోపాటు వచ్చిన కుటుంబ సభ్యులకు భోజనం, మంచినీరు ఇతర వసతులు కల్పించాలన్నారు. 108 అంబులెన్స్‌లు వెళ్లలేని ప్రాంతాల్లో బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేస్తామని మంత్రి తెలిపారు. వీటి కోసం జనాభా ప్రాతిపదికన ప్రతిపాదనలు అందజేయాలని పీవోలను మంత్రి ఆదేశించారు. అంబులెన్స్‌లు వెళ్లలేని ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ప్రాథమిక చికిత్సపై ట్రైనింగ్ ఇవ్వాలని మంత్రి సూచించారు. ప్రతి గ్రామం లేదా ఆవాసంలో ఆసక్తి ఉన్న కనీసం ఇద్దరిని గుర్తించి వారికి ప్రథమ చికిత్స, ఇతర అవసరమైన విషయాల్లో శిక్షణ ఇప్పించాలన్నారు. వారికి సమీపంలోని మెడికల్ ఆఫీసర్లు అందుబాటులో ఉండాలని సూచించారు. గిరిజన తండాలు, చెంచు పెంటలను క్షేత్రస్థాయి ఆరోగ్య కార్యకర్తలు కనీసం వారానికి ఒకసారి విజిట్ చేయాలని, మెడికల్ ఆఫీసర్లు కనీసం నెలకోసారి వెళ్లాలని మంత్రి ఆదేశించారు. ఐటీడీఏ పరిధిలో నివసిస్తున్న ప్రిమిటివ్ ట్రైబ్స్ కోసం ఆదిలాబాద్ రిమ్స్ వంటి పెద్ద దవాఖానల్లో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేయాలని ఆరోగ్యశాఖ అధికారులను మంత్రి ఆదేశించారు. వారి భాషలో మాట్లాడగలిగే మెడికల్ స్టాఫ్‌ను ఆ వార్డుల్లో నియమించాలని సూచించారు.

గతేడాది కంటే తక్కువే

సీజనల్ డిసీజ్‌ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు మంత్రి సూచించారు. పబ్లిక్ రిలేషన్స్, పంచాయతీరాజ్, ట్రైబల్ వెల్ఫేర్, హెల్త్ డిపార్ట్‌మెంట్ అధికారులు సమన్వయంతో పని చేయాలని మంత్రి సూచించారు. వర్షకాలం రావడానికి ముందే గ్రామాలు, తండాల్లో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గతేడాదికంటే ఈసారి డెంగ్యూ, వైరల్ ఫీవర్ కేసులు తక్కువగా నమోదయ్యాయని ఐటీడీఏ పీవోలు మంత్రికి తెలిపారు. ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ఇలాంటి ఒక సమావేశం నిర్వహించడం ఇదే తొలిసారి అని గిరిజన సంక్షేమ శాఖ సెక్రటరీ శరత్ అన్నారు. ఐటీడీఏల పరిధిలో ఉన్న అన్ని హాస్పిటళ్లలో అవసరమైన సౌకర్యాల కల్పిస్తున్న మంత్రి దామోదరకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

సెల్‌టవర్ ఎక్కి విద్యార్థుల హల్‌చల్

- పీహెచ్‌డీ ప్రవేశాల్లో న్యాయం చేయాలంటూ నిరసన
- పురుగుల మందు తాగేందుకు యత్నం



నవతెలంగాణ-హనుమకొండ చౌరస్తా

కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశాల్లో కేటగిరి-2 సెకండ్ లిస్ట్‌లో తమకు న్యాయం చేయాలని విద్యార్థులు మందా సరేష్, బొట్ల మనోహర్, బందీగా రాకేశ్, తిరుపతి నాయక్, సారుపాక అనిల్.. సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ సృష్టించారు. గురువారం హనుమకొండ జిల్లా కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశ విద్యార్థులు మధ్యాహ్నం 3 గంటలకు యూనివర్సిటీలోని సెల్‌టవర్ ఎక్కి పురుగుల మందు బాటిళ్లతో తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమకు న్యాయం చేయాలని అనేకసార్లు ఇన్‌చార్జి వైస్ ఛాన్సలర్ వాకాటి కరుణ, మంత్రులకు విన్నవించుకున్నప్పటికీ స్పందించడం లేదన్నారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి ఇన్‌చార్జి వీసీకి తమపై తప్పుడు సమాచారం ఇచ్చి తప్పుదోవ పట్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పీహెచ్‌డీ ప్రవేశాల్లో అవకతవకలపై పోరాటం చేసి ప్రభుత్వం ప్రవేశాలకు అనుమతి ఇచ్చేలా ఒత్తిడి తెచ్చింది తామేనని, కానీ ఇప్పుడు తమకు అన్యాయం జరిగిందని వాపోయారు. పీహెచ్‌డీ సీట్ల పెంపు బాధ్యత రిజిస్ట్రార్‌కు అప్పగిస్తే, ఆ పని చేయకపోగా.. విద్యార్థులను మానసికంగా వేధిస్తూ గందరగోళం సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంతంగా ఉన్న యూనివర్సిటీలో గొడవలకు దారితీసేలా ప్రవర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా రిజిస్ట్రార్ పనిచేస్తున్నారని తెలిపారు. తమకు సీటు ఇచ్చి న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యమని వాపోయారు. ప్రవేశాలు కల్పించే వరకు పోరాడుతామని రిజిస్ట్రార్ మల్లారెడ్డిని హెచ్చరించారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ మనోహర్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సురేష్ లాలూ, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజులు వచ్చి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో విద్యార్థులు టవర్ దిగారు.

సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా సీఎం రేవంత్‌రెడ్డి

- ఎస్సీ వర్గీకరణ అమలుపై మందకృష్ణ మాదిగ వ్యాఖ్యలు
- ఈ నెల 9న నల్ల జెండాలతో నిరసనలు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎస్సీవర్గీకరణపై ఆగస్టు ఒకటో తేదీన సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ విమర్శించారు. ఎస్సీ వర్గీకరణ చేసే హక్కు రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని సుప్రీంకోర్టు చెప్పిందని తెలిపారు. ఆ తీర్పు వెలువడిన వెంటనే అందరికంటే ముందుగా సీఎం స్పందించి, తీర్పును స్వాగతించారని గుర్తుచేశారు. గురువారం ఈ విషయంపై హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. డీఎస్సీ ఫలితాలు విడుదల చేశారని, నియామక పత్రాలు ఇస్తామన్నారన్నారు. డీఎస్సీ ఫలితాలు ప్రకటించారని, వర్గీకరణ విషయంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు. చట్టసభల్లో ఇచ్చిన మాటకు విరుద్ధంగా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పు అనంతరం పంజాబ్, తమిళనాడు ఎస్సీ వర్గీకరణను అమలు చేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గ ఉప సంఘం వేసి అనంతరం అమలు చేస్తామని రేవంత్ చెప్పారని, ఇప్పటి వరకు ఈ విషయంపై ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అధిష్టానం ఒత్తిడి ఒకవైపు, ఇంకోవైపు రాష్ట్రంలో మాలల ఒత్తిడి వల్ల వర్గీకరణ అమల్లో వెనుకాడుతున్నారా అని ప్రశ్నించారు.

డిజిటల్ మీడియాను గుర్తించాలి

ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పి.ఆనందం, టీడబ్ల్యూజేఎఫ్ అధ్యక్షులు ఎం.సోమయ్య



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

దేశవ్యాప్తంగా డిజిటల్ మీడియా విస్తరించిన నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మీడియా రంగాన్ని వెంటనే గుర్తించాలని ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టు (ఐఎఫ్‌డబ్ల్యూజే) డిమాండ్ చేసింది. ఉత్తరప్రదేశ్‌లోని మధుర (బందావన్)లో జరిగిన సమావేశాల్లో ఆమోదించిన పలు తీర్మానాలను ఐఎఫ్‌డబ్ల్యూజే జాతీయ కార్యదర్శి పులిపలుపుల ఆనందం, నేషనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు మామిడి సోమయ్య హైదరాబాద్‌లో మీడియాకు వెల్లడించారు. డిజిటల్ మీడియాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించి అందులో పనిచేస్తున్న పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు, ఇతర సదుపాయాలు కల్పించాలని కోరామన్నారు. హింస, విద్వేషం, అశ్లీలత, పిల్లలపై జరిగే అమానవీయ సంఘటనలు వంటి వార్తలను ప్రసారం చేయకుండా స్వీయ నియంత్రణ పాటించాలని తీర్మానించామన్నారు. డిజిటల్ వినియోగదారుల హక్కులు, సమస్యలు, ఫిర్యాదుల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశామన్నారు. సోషల్ మీడియా, వీడియో ఆధారిత మల్టీ మీడియా, కంప్యూటర్ జనరేటెడ్ న్యూస్ వెబ్ సైట్లు, న్యూస్ యాప్‌లలో పనిచేస్తున్న జర్నలిస్టులందరినీ ప్రభుత్వాలు గుర్తించాలని విజ్ఞప్తి చేశామన్నారు. కేరళ, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాలు ఆన్ లైన్ జర్నలిస్టులకు గుర్తింపు ఇవ్వడం, జర్నలిస్టులకు అధికారిక ప్రెస్ అక్రిడిటేషన్, సమావేశాల్లోకి ప్రవేశం వంటి సదుపాయాలు కల్పించడాన్ని స్వాగతించామన్నారు. దేశవ్యాప్తంగా ఈ సౌకర్యాలను కల్పించాలని కేంద్రాన్ని కోరామన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్థానంలో మీడియా కౌన్సిల్ ఆఫ్ ఇండియా ను ఏర్పాటు చేసి, డిజిటల్, వెబ్ మీడియా జర్నలిస్టులను అందులో చేర్చాలని డిమాండ్ చేశామన్నారు.

ఏఎంఆర్ కార్యాచరణను అమలు చేస్తాం

- మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని మూడు రోజుల జి-సార్క్ -2024 సమావేశాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంఆర్ యాక్షన్ ప్లాన్‌ను విడుదల చేశారు. ఈ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేసిన మొదటి రాష్ట్రం కేరళ అనీ, ఆ తర్వాత మరో ఐదు రాష్ట్రాలు అనుసరించాయని తెలిపారు. తెలంగాణ ఏడవ రాష్ట్రంగా దీన్ని అమలు చేయనున్నదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జి.స్పార్క్ కో చైర్మెన్ డాక్టర్ గురు ఎన్.రెడ్డి, వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తూ, ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ఆఫ్రికా నెట్‌వర్క్ చైర్ పర్సన్ ప్రొఫెసర్ చెడ్డీ అజ్జాజ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇండియా కార్యాలయ ప్రతినిధి డాక్టర్ అనుజ్ శర్మ, జి-స్పార్క్ చైర్మెన్ డాక్టర్ రంగారెడ్డి బుర్రి తదితరులు పాల్గొన్నారు. జి-స్పార్క్ కోసం 25 ప్రి వర్క్ షాప్‌లను నిర్వహించారు. ప్రధాన కార్యక్రమానికి 4,000 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అక్టోబర్ 5న ముగింపు సమావేశానికి రాష్ట్ర ఐటీశాఖ మంత్రి శ్రీధర్ బాబు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

తిరుపతి లడ్డూపై విచారణ నేటికి వాయిదా

నవతెలంగాణ - న్యూఢిల్లీ బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) మహా ప్రసాదం లడ్డూ కల్తీపై దేశ అత్యున్నత న్యాయస్థానం విచారణను నేటికి వాయిదా వేసింది. కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అభ్యర్థనతో చివరి నిమిషంలో సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారణను శుక్రవారం కొనసాగించనున్నట్టు వెల్లడించారు. లడ్డూ వివాదంపై కోర్టు పర్యవేక్షణలో, లేదా సీబీఐ విచారణ జరిపించాలని వైసీపీ ఎంపీ, టీటీడీ మాజీ చైర్మెన్ వైవీ సుబ్బారెడ్డి, బీజేపీ సీనియర్ నాయకుడు సుబ్రమణ్యస్వామి, చరిత్రకారుడు విక్రమ్ సంపత్, ఆధ్యాత్మిక ఉపన్యాసకులు దుష్యంత్ శ్రీధర్, సుదర్శన్ న్యూస్ యాంకర్ సురేష్ చవాన్కే దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ద్విసభ్య ధర్మాసనం గురువారం విచారించింది. గత విచారణ సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు కొనసాగించాలా? లేక స్వతంత్ర సంస్థతో దర్యాప్తు జరిపించాలా? అనే అంశంపై కోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని అడగాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. అంతేకాదు గురువారం లోపు వారి అభిప్రాయం చెప్పమని ఆయనను కోరింది. అయితే విచారణ సమయానికి సొలిటర్ జనరల్ తుషార్ మెహతా వేరే కోర్టులో ఉండటంతో నేడు మొదటి కేసుగా ఈ పిటిషన్లను విచారించాలని ఆయన తరపు న్యాయవాదులు అభ్యర్థించారు. అందుకు ధర్మాసనం అంగీకరించి విచారణను వాయిదా వేసింది.

ఇజ్రాయిల్‌తో విసుగుచెందిన బైడెన్

- పొలిటికో



ఇజ్రాయిల్ సైనిక ప్రవర్తనను తాను ప్రభావితం చేయలేని స్థితిలో ఉన్నానని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కోపంగా అన్నట్టు పేరు తెలియని ఇద్దరు వైట్ హౌస్ అధికారులను ఉటంకిస్తూ పొలిటికో బుధవారం రాసింది. బైడెన్, అతని సహాయకులు గాజాలో ఇజ్రాయిల్ యుద్ధంతో "పదేపదే విసుగు చెందారు" అని, ముఖ్యంగా పాలస్తీనా పౌరులలో పెద్ద సంఖ్యలో మరణించిన వారి సంఖ్య వారిని కలవరపెడుతోందని పొలిటికో పేర్కొంది. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా సలహాను పట్టించుకోవటంలేదని రాసింది. "నెతన్యాహుపై అతని ప్రభావం తగ్గిపోవడంతో, అధ్యక్షుడి కోపం పెరిగింది" అని పొలిటికో చెబుతోంది. బైడెన్, నెతన్యాహు మధ్య నడుస్తున్న ఫోన్ సంభాషణలు "అరుపుల మ్యాచ్‌లుగా మారాయి" అని పేరులేని అధికారులను పొలిటికో ఉదహరించింది.

మధ్యప్రాచ్యంలో "ప్రాంతీయ యుద్ధాన్ని" బైడెన్ నిరోధించలేడనే విషయం అర్థమౌతోందని ఆ పత్రిక తెలిపింది. దక్షిణ లెబనాన్‌లోని హిజ్బుల్లాపై ఇజ్రాయిల్ భూతల దాడులు ప్రారంభించిన ఒక రోజు తర్వాత ఈ నివేదిక వెలువడింది. తీవ్రమైన వైమానిక దాడులతో కూడిన ఆపరేషన్, హిజ్బుల్లాచే క్రాస్-బోర్డర్ రాకెట్, మోర్టార్ దాడులను ఆపడానికి లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. బుధవారం ఇరాన్ ఇజ్రాయిల్‌పై దాదాపు 200 క్షిపణులను ప్రయోగించింది. ఇది గాజా, లెబనాన్‌లలో ఇజ్రాయిల్ చేస్తున్న మారణహోమాన్ని, అలాగే హమాస్ రాజకీయ చీఫ్ ఇస్మాయిల్ హనియే, హిజ్బుల్లా నాయకుడు హసన్ నస్రుల్లాతో సహా సీనియర్ "పాలస్తీనా ప్రతిఘటన" వ్యక్తుల హత్యలకు ప్రతిస్పందన అని ఇరాన్ నొక్కి చెప్పింది.

ఇరాన్, హమాస్, హిజ్బుల్లాలపై ప్రతీకారం తీర్చుకునేటప్పుడు సంయమనం పాటించాలని కోరుతూ, తనను తాను రక్షించుకునే హక్కు ఇజ్రాయిల్‌కు ఉందని అమెరికా మద్దతు పలికింది. ఇజ్రాయిల్ సైన్యం పౌరులపై విచక్షణారహితంగా దాడులు చేసిందని ఐక్యరాజ్య సమితి పదేపదే ఆరోపించిన తర్వాత కూడా, ఇజ్రాయిల్‌కు ఆయుధాలను సరఫరా చేయడాన్ని ఆపాలని పాలస్తీనా అనుకూల సమూహాలు, అమెరికాలో కొంతమంది డెమోక్రాట్ల నుంచి వచ్చిన పిలుపులను బైడెన్ తిరస్కరించాడు. ఇంతలో ఇజ్రాయిల్, గాజా మధ్య కాల్పుల విరమణకు మధ్యవర్తిత్వం వహించడానికి వాషింగ్టన్ చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. హిజ్బుల్లాతో కాల్పుల విరమణ చేయాలని ఇజ్రాయిల్‌ని బహిరంగంగా కోరినప్పటికీ, లెబనాన్‌లో ఇజ్రాయిల్ సైనిక దాడులను అమెరికా రహస్యంగా ఆమోదించిందని పొలిటికో ప్రారంభంలో రాసింది. అయితే, బుధవారం తరువాత రాసిన దానిలో ఇజ్రాయిల్ తన దాడుల తీరు గురించి అమెరికాకు ముందుగా తెలపకపోవటంతో అమెరికా అధ్యక్షుడికి కోపం వచ్చిందని పొలిటికో పేర్కొంది.

ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయిల్ దాడులకు తాను మద్దతు ఇవ్వబోనని బైడెన్ బుధవారం విలేకరులతో అన్నాడు. ఇజ్రాయిల్ దాని ప్రణాళికాబద్ధమైన ప్రతీకార స్వభావాన్ని లేదా పరిధిని బహిర్గతం చేయలేదు. అయితే మాజీ ప్రధాన మంత్రి నఫ్తాలి బెన్నెట్‌తో సహా కొంతమంది అతివాదులు ఇరాన్ అణు కార్యక్రమాన్ని లక్ష్యంగా చేసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మధ్యప్రాచ్యంలో అమెరికా వైఖరిని రష్యా తీవ్రంగా విమర్శించింది. "సంక్షోభాలను పరిష్కరించడంలో అమెరికా అసమర్థతను" ఇది తెలియజేస్తుందని రష్యా విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి మరియా జఖరోవా మీడియాతో మాట్లాడుతూ చెప్పింది.

రష్యన్ మిలిటరీ గురించి పశ్చిమ దేశాల 'ఆందోళన'

- సీనియర్ అమెరికన్ దౌత్యవేత్త



రష్యా సైన్యం అత్యంత వేగంగా "పునర్నిర్మించబడటం" గురించి అమెరికా చాలా ఆందోళన చెందుతోంది. దీనికి కారణం చైనాతో మాస్కో కున్న "బలమైన" స్నేహ సంబంధం అని అమెరికా భావిస్తున్నట్టు అమెరికన్ డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్ కర్ట్ కాంప్‌బెల్ చెప్పాడు. యకార్నెగీ ఎండోమెంట్ ఫర్ ఇంటర్నేషనల్ పీస్ అనే వాషింగ్టన్‌కు చెందిన థింక్ ట్యాంక్ బుధవారం నిర్వహించిన ఒక ఇంటర్వ్యూలో ఉక్రెయిన్ వివాదం గురించి చర్చిస్తూ క్యాంప్‌బెల్ ఇలా పేర్కొన్నాడు: "గత రెండేండ్లుగా మనం చూస్తున్నది ఒక వేగవంతమైన, దృఢ సంకల్పంతో జరుగుతున్న రష్యా సైన్యం పునర్నిర్మాణం. ఇది పశ్చిమ దేశాలకు నిజమైన ఆందోళన కలిగించే అంశం" అని అతను ఒప్పుకున్నాడు.

కీవ్‌కు సైనిక సామర్థ్యాలను అందించడంలో అమెరికా చాలా జాగ్రత్తగా ఉందా అని క్యాంప్‌బెల్‌ను అడిగినప్పుడు ఆయన అమెరికా "ఉక్రెయిన్‌కు చాలా పెద్ద సహాయాన్ని అందించేది" అని ప్రతిస్పందించాడు. రష్యాలో సైనిక ఉత్పత్తిని పెంచడానికి విదేశీ సహాయం, ముఖ్యంగా చైనాతో సహకారం కారణంగా అని ఆ దౌత్యవేత్త పేర్కొన్నాడు. రెండు దేశాల మధ్య భాగస్వామ్యం ఏ స్థాయిలో సన్నిహితంగా ఉందనే విషయాన్ని విదేశాంగ శాఖ తక్కువగా అంచనా వేసిందని క్యాంప్‌బెల్ పేర్కొన్నాడు. బీజింగ్, మాస్కో మధ్య సంబంధం "బహుశా ప్రపంచవ్యాప్తంగా అత్యంత బలీయమైన, ముఖ్యమైన ద్వైపాక్షిక సంబంధమని మనం గమనించాలి. అందుకు తగిన విధంగా ప్రతిస్పందించాలి" అని ఆయన వాదించాడు.

ఉక్రెయిన్ సంఘర్షణను పరిష్కరించడానికి రష్యాతో దౌత్యపరమైన సంపర్కం తక్షణం అవసరమని పశ్చిమ దేశాలు భావిస్తున్నాయని, అయితే అందుకు అమెరికాకు కొన్ని అభ్యంతరాలు ఉన్నట్టు కాంప్‌బెల్ పేర్కొన్నాడు. "అటువంటి స్థితిలో మేము కోల్పోయేది చాలా ఎక్కువగా ఉంటుంది. ఈ రకమైన అనుభవాన్ని మరెక్కడా పునరావతం చేయాలనే ఆలోచన నుంచి రష్యా లేదా చైనా దూరంగా వచ్చేంత వరకు ఇటువంటి ఫలితాలను మేము అంగీకరించలేము" అని డిప్యూటీ సెక్రటరీ చెప్పాడు. ఉక్రెయిన్‌ను దాని సైనిక బలంపై పరిమితులతో కూడిన తటస్థ దేశంగా మార్చడం, కీవ్ ద్వారా జాతి రష్యన్‌లపై వివక్షాపూరిత విధానాలను తిప్పికొట్టడం, రాడికల్ ఉక్రేనియన్ జాతీయవాదులను అధికార స్థానాల నుంచి తొలగించడం మాస్కో లక్ష్యాలుగా ఉన్నాయి. అంతేకాకుండా రష్యా ఐదు ఉక్రేనియన్ ప్రాంతాలపై సార్వభౌమాధికారాన్ని వదులుకోవాలని డిమాండ్ చేస్తోంది.

జర్నలిస్టు చిలుక ప్రవీణ్‌పై దాడిని ఖండిస్తున్నాం : కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

జర్నలిస్టు చిలుక ప్రవీణ్‌పై కాంగ్రెస్ గూండాలు చేసిన దాడిని ఖండిస్తున్నట్టు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కె.తారకరామారావు గురువారం ట్వీట్ చేశారు. 'ఇదేమి రాజ్యం? ఇదేమి దౌర్జన్యం? ప్రజాపాలన అంటే ప్రశ్నించేవారిపై దాడి చేయడమేనా? ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే భౌతిక దాడులకు పాల్పడుతారా? ప్రజాప్రతినిధులు, జర్నలిస్టులు, విద్యార్థులు, ప్రజలు, ఇలా ఎవ్వరు ప్రశ్నించినా ఎందుకింత అసహనం?' అంటూ ఎక్స్‌వేదికగా ట్వీట్ చేశారు. చిలుక ప్రవీణ్‌పై దాడి చేసిన కాంగ్రెస్ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

మంత్రి కొండా సురేఖపై జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నిరాధారమైన ఆరోపణలు చేసిన మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు గురువారం ఫిర్యాదు చేశారు. కొండా సురేఖ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సనాతన ధర్మం కోసం చట్టం

- తిరుపతి వారాహి సభలో పవన్‌కల్యాణ్
- విద్వేష, వివాదాస్పద వ్యాఖ్యలు

తిరుపతి : సనాతన ధర్మం కోసం దేశమంతా అమలయ్యేలా బలమైన చట్టాన్ని తీసుకురావాలని జనసేన అధినేత, రాష్ట్ర డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అన్నారు. తిరుమల శ్రీవారి దర్శనానంతరం గురువారం తిరుపతి బాలాజీ కాలనీలో జరిగిన వారాహి సభలో ఆయన వారాహి డిక్లరేషన్ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం వివాదాస్పదంగా మారింది. 'ఎవరి మతం వారికి గొప్ప' .. 'నా జీవితంలో ఇలా మాట్లాడే రోజు వస్తుందనుకోలేదు' అని అంటూనే పవన్ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. తిరుమల ప్రసాదంపై అత్యున్నత న్యాయస్థానంలో విచారణ జరుగుతున్న సమయంలోనే కోర్టులనూ తప్పుపట్టేలా వ్యాఖ్యలు చేశారు. సభ అనంతరం 'అతనికంటే ఘనుడు ఆచంట మల్లన్న..' అన్నట్లు విద్వేషం వెదజల్లడంలో ఆర్ఎస్ఎస్, సంఘ్‌పరివార్‌లను పవన్ మించిపోయారన్న అభిప్రాయం పలువురిలో వ్యక్తమైంది. అంతకుముందు వారాహి డిక్లరేషన్‌లో భాగంగా కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు సనాతన ధర్మంపై ఒకే గొంతు వినిపించాలన్నారు. సనాతన ధర్మ విశ్వాసాలకు భంగం కలుగచేసే చర్యలు అరికట్టడానికి దేశమంతా అమలయ్యేలా బలమైన చట్టాన్ని తక్షణం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

డీఎంహెచ్‌ఓల అసోసియేషన్ అధ్యక్షునిగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జిల్లా వైద్యారోగ్య అధికారుల (డీఎంహెచ్ఓ)ల అసోసియేషన్ అధ్యక్షునిగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఎన్నికయ్యారు. 2026 వరకు ఆయన ఈ పదవిలో కొనసాగనున్నారు. ఆయనతో పాటు ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ సుధాకర్ లాల్, కోశాధికారిగా డాక్టర్ అప్పయ్య, ఉపాధ్యక్షులుగా డాక్టర్ హరీశ్‌రాజ్, డాక్టర్ కోటాచలం, డాక్టర్ రాంకుమార్, డాక్టర్ సౌభాగ్యలక్ష్మి, కార్యదర్శులుగా డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ రాజశ్రీ, డాక్టర్ మధుసూదన్, కార్యవర్గ సభ్యులుగా డాక్టర్ రఘునాథస్వామి, డాక్టర్ శ్రీరాం, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ పద్మ, డాక్టర్ స్వరాజ్యలక్ష్మిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పుట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలో పదవీ విరమణ వయస్సును 65 ఏండ్లకు పెంచినట్టుగానే తమ రిటైర్‌మెంట్ వయసును కూడా 65 ఏండ్లకు పెంచాలని కోరారు. అదే విధంగా ఇన్నోవా వెహికిల్ సదుపాయాన్ని కల్పించాలన్నారు. త్వరలోనే వైద్యారోగ్యశాఖ మంత్రిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిపారు.

తండ్రి ఉద్యోగ విరమణ దస్త్రంపై తనయుడి సంతకం

జైపూర్ : రాజస్థాన్‌లో అరుదైన ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఒక తండ్రి ఉద్యోగ విమరణ ఉత్తర్వులకు సంబంధించిన దస్త్రంపై ఆయన తనయుడే ఉన్నతాధికారిగా సంతకం చేశారు. భరత్‌పూర్ డివిజనల్ కమిషనర్‌గా ఉన్న సీనియర్ ఐఎఎస్ సంవర్మాల్ వర్మ ఉద్యోగ విరమణ చేయగా..అందుకు సంబంధించిన ఉత్తర్వులపై ఆయన తనయుడు కార్మిక విభాగం సంయుక్త కార్యదర్శి హోదాలో కనిష్క కటారియా సంతకం చేశారు. ఈ విషయాన్ని కనిష్క సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. 2010లో జెఇఇలో 44వ ర్యాంకు సాధించిన కనిష్క ఐఐటి బాంబేలో బిటెక్ చేశారు. 2016లో దక్షిణ కొరియాలో శ్యామ్‌సంగ్ సంస్థలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశారు.

అయితే తండ్రి కోరిక మేరకు రూ.లక్షల వేతనం వదులుకుని 2018లో యుపిఎస్‌సి పరీక్ష రాశారు. తొలి ప్రయత్నంలో మొదటి ర్యాంక్ సాధించి ప్రశంసలు పొందారు. 2019 బ్యాచ్ ఐఎఎస్‌గా బికనీర్‌లో అసిస్టెంట్ కలెక్టర్‌గా పనిచేశారు. తర్వాత కోటాలోని రాంగంజ్ మండిలో ఎస్‌డిఎంగా పనిచేశారు. తదనంతరం కార్మిక విభాగం జాయింట్ సెక్రటరీగా ఉద్యోగోన్నతి పొందారు.

హైబాక్స్ యాప్ కేసులో ఐదుగురికి సమన్లు

న్యూఢిల్లీ : హైబాక్స్ మొబైల్ అప్లికేషన్ ద్వారా భారీగా పెట్టుబడి పెట్టడంతో పలువురు తీవ్రంగా నష్టపోయిన ఘటనలో ఢిల్లీ పోలీసులు గురువారం చర్యలకు ఉపక్రమించారు. ఈ యాప్‌తో పెట్టుబడులు పెట్టాలంటూ సోషల్ మీడియా ద్వారా ప్రజలపై తీవ్ర ప్రభావం చూపిన ఐదుగురు ప్రముఖ వ్యక్తులకు పోలీసులు సమన్లు జారీ చేశారు. సామాజిక మాధ్యమాల్లో లక్షలాది మంది ఫాలోయర్స్ ఉన్న యూట్యూబర్లు అభిషేక్ మల్హన్, ఎల్విష్ యాదవ్, లక్షయ్ చౌదరి, పురవ్ ఝా, ప్రముఖ హాస్యనటి భారతీ సింగ్‌కు పోలీసులు సమన్లు జారీ చేశారు. ఈ కేసులో విచారణకు హాజరుకావాలని వాంగ్మూలం ఇవ్వాలని సమన్లలో పేర్కొన్నారు.

హైబాక్స్ యాప్‌ను వీరంతా ప్రమోట్ చేసినట్లు ఫిర్యాదులందాయి. అధిక మొత్తంలో రాబడి ఎరగా వేసి హైబాక్స్ యాప్ ద్వారా రూ.500 కోట్లు పెట్టుబడులు సమీకరించి మదుపర్లను మోసం చేసినట్లు వందలాది మంది బాధితులు ఢిల్లీ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న ప్రముఖుల ప్రచారాలను నమ్మే తామంతా పెట్టుబడులు పెట్టామని, దాదాపు 30 వేల మంది మోసానికి గురైనట్లు తెలిపారు.

హమాస్ కీలక నేత రావీ ముష్తాహాను చంపేశాం

- ఇజ్రాయిల్ బలగాల వెల్లడి



గాజా : హమాస్ కీలక నేత, గాజా ప్రధానిగా వ్యవహరిస్తున్న రావీ ముష్తాహాను ఇజ్రాయిల్ బలగాలు హత్య చేశాయి. ఈ విషయాన్ని ఇజ్రాయిల్ భద్రతా దళం (ఐడిఎఫ్) గురువారం ప్రకటించింది. కొన్ని నెలల క్రితమే తాము జరిపిన దాడుల్లో ఆయన చనిపోయినట్లు పేర్కొంది. ముష్తాహాను లక్ష్యంగా చేసుకుని ఐడిఎఫ్ దళాలు మూడు నెలల క్రితం గాజాలో భీకర దాడులు సాగించాయి. ఆ దాడుల్లో ఆయనతో పాటు హమాస్ పొలిటికల్ బ్యూరో సీనియర్ నేత సమీ అల్ సిరాజ్, జనరల్ సెక్యూరిటీ చీఫ్ సమి ఒదేహ్ చనిపోయినట్లు ఐడిఎఫ్ తెలిపింది. అయితే వీరి మరణాలను హమాస్ ఇప్పటి వరకు ధ్రువీకరించలేదు.

సింగరేణిలో అధునాతన పరిజ్ఞానం అమలుకు అడుగులు

- అమెరికా, జపాన్‌లో ముగిసిన డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క పర్యటన
- ఆధునిక గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి పద్ధతుల వైపు మొగ్గు
- ప్రమాదరహిత సంస్థగా తీర్చిదిద్దే యోచన



నవతెంగాణ బ్యూరో-హైదరాబాద్

అంతర్జాతీయంగా ఉనికిలోకి వచ్చిన అత్యాధునిక గ్రీన్ ఎనర్జీ టెక్నాలజీలు, ఆధునిక మైనింగ్ విధానంలో అధిక ఉత్పత్తి సాధించే భారీ యంత్రాలను అమల్లోకి తీసుకొచ్చే దిశగా రాష్ట్ర సర్కారు అడుగులు వేస్తున్నది. అందులో భాగంగానే గత నెల 24 నుంచి గురువారం వరకు అమెరికా, జపాన్ దేశాల్లో డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి పి.రామకృష్ణారావు, ఇంధన శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ పర్యటించారు. డిప్యూటీ సీఎంతో కూడిన బృందం శుక్రవారం రాత్రి తొమ్మిది గంటలకు హైదరాబాద్‌కు చేరుకోనున్నది. విద్యుత్, బొగ్గు ఉత్పత్తిలో అధునాతమైన యంత్రాలను, టెక్నాలజీని వారు పరిశీలించారు. అమెరికాలో జరిగిన అంతర్జాతీయ మైనింగ్ ఎగ్జిబిషన్ మైనెక్స్-2024లో కోమత్సు, హిటాచి, క్యాటర్ పిల్లర్ వంటి ప్రముఖ కంపెనీలు ఉత్పత్తి చేసిన అత్యాధునిక షావెల్స్, డంపర్లు, కంటిన్యూయస్ మైనర్ యంత్రాలు, గనిలో ప్రమాదాలు జరగకుండా చూసే రక్షణ వ్యవస్థలను వారు పరిశీలించారు. ముఖ్యంగా భూగర్భ గనుల్లో వర్చువల్ రియాలిటీ ద్వారా గని వెలుపలే ఉండి లోపల బొగ్గును తవ్వే సాంకేతికత ప్రధాన ఆకర్షణగా నిలిచింది. సింగరేణి సంస్థ ఈ తరహా అత్యధిక బొగ్గు ఉత్పత్తిని సాధించే ఆధునిక యంత్రాలను సమకూర్చుకోవాలనీ, ప్రమాదరహిత సింగరేణిగా సంస్థను రూపుదిద్దడానికి ఆధునిక రక్షణ సాంకేతికతను సమకూర్చుకోవాలని ఎన్.బలరామ్‌కు డిప్యూటీ సీఎం సూచించారు. అమెరికాలో అతిపెద్ద హూవర్ జల విద్యుత్ డ్యామ్‌ను సందర్శించిన సందర్భంగా అక్కడ అమలవుతున్న జల విద్యుత్ ఉత్పత్తి విధానాలు, రక్షణ చర్యలు తెలంగాణలో కూడా అమలు జరపాలని ఆయన ఎనర్జీ కార్యదర్శి రోనాల్డ్ రోస్‌ను కోరారు. జపాన్ పర్యటనలో యమనాషీ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ కేంద్రంలో గ్రీన్ హైడ్రోజన్‌ను పెద్దఎత్తున ఉత్పత్తి చేయడానికి వినియోగించే సాంకేతికతను, సోలార్ విద్యుత్తును నిలువ ఉంచే ఫ్యూయల్ సెల్స్ టెక్నాలజీని పరిశీలించారు. రాష్ట్రంలో పెద్దఎత్తున సోలార్ విద్యుత్తు ఉత్పత్తి చేపట్టనున్న నేపథ్యంలో ఈ రెండు పద్ధతులపై దృష్టి సారించాలనీ, తెలంగాణలో గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ వృద్ధికి యమనాషీ సహకారం తీసుకోవాలని నిర్ణయించారు. అలాగే తోషిబా పరిశ్రమలను సందర్శించి అక్కడ ఉత్పత్తి అవుతున్న అత్యాధునిక ఫొటోవోల్టాయిక్ మాడ్యూల్స్ తయారీ టెక్నాలజీని పరిశీలించారు. రాష్ట్రంలో పెద్దఎత్తున సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఫొటో వోల్టాయిక్ మాడ్యూల్స్ అవసరం ఎంతో ఉందనీ, ఆర్టీసీ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే ఉద్దేశం ఉన్నందున ఫ్యూయల్ సెల్స్ ఆవశ్యకత కూడా ఉంటుందని భట్టి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉమ్మడి భాగస్వామ్యంతో కానీ, స్వయంగా గానీ ఫ్యూయల్ సెల్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని తోషిబాను ఆహ్వానించారు. అలాగే రోహ్మ సెమీ కండక్టర్ల పరిశ్రమను సందర్శించి అక్కడ జరుగుతున్న పలు రకాల సెమీకండక్టర్లు, హై ఎఫిషియన్సీ బ్యాటరీలు, ఇంటిగ్రేటెడ్ సర్క్యూట్ సెమీకండక్టర్లు వంటివి పరిశీలించారు. సోలార్ విద్యుత్‌కు ఇతర ఆధునిక పరిశ్రమలకు ఈ అత్యాధునిక సెమీకండక్టర్ల ఆవశ్యకత ఉన్నందున ఈ తరహా పరిశ్రమను తెలంగాణ రాష్ట్రంలో చేయాలని వారిని ఆహ్వానించారు. అలాగే పానాసోనిక్ కంపెనీ వారితో కూడా ఆధునిక ఎలక్ట్రిక్ మరియు ఎలక్ట్రానిక్ పరికరాలపై చర్చించారు. జపాన్ రవాణా వ్యవస్థలో కీలకపాత్ర పోషిస్తున్న బుల్లెట్ ట్రెన్‌లో ఆయన స్వయంగా ప్రయాణించారు. అత్యంత వేగంతో ప్రయాణించే ఆ తరహా ట్రెన్లను రాష్ట్రంలో కూడా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రైల్వే శాఖకు డిప్యూటీ సీఎం విజ్ఞప్తి చేశారు.

పోలీసు అధికారులపై వేటు

- ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలపై చర్యలు
- వీరిని వీఆర్‌లో ఉంచుతూ మల్టీజోన్-2 ఐజీ సత్యనారాయణ ఉత్తర్వులు
- మట్కాకుకు సహకరించేవారి పైనా కఠిన చర్యలకు ఆదేశాలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి

రాష్ట్రంలోని మల్టీజోన్-2లో ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తున్న ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్సైలకు స్థాన చలనం కలిపిస్తూ జోన్ ఐజీపీ వి. సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయంలో ఇప్పటికే ఒక సీఐ, 14 మంది ఎస్సైలను వారు పనిచేస్తున్న స్థానాల నుంచి బదిలీ చేశారు. మల్టీజోన్-2లోని తొమ్మిది జిల్లాల్లో ఇసుక, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణాను అడ్డుకోలేని పోలీసు అధికారులపై తప్పనిసరిగా చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు. అలాగే, మట్కా వంటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అండగా నిలిచే పోలీసుల పైనా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

వేటు పడిన పోలీసు అధికారుల్లో కొందరికి ఇసుక అక్రమ రవాణాలో ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఉండటంతో వారిపై శాఖాపరమైన చర్యలు ఉండనున్నాయి. త్వరలో వీరిని లూప్ లైన్ కు ట్రాన్సుర్ చేయనున్నట్టు సత్యనారాయణ వివరించారు. రాష్ట్ర నిఘా అధికారుల నివేదికలు, ఇతర ఎంక్వయిరీల ద్వారా ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. "ప్రధానంగా ఈ ఇసుక అక్రమ రవాణా ద్వారా ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతుంది. వాగులలో, నిషేధిత నది ప్రాంతాలలో ఎక్కడబడితే అక్కడ విచక్షణ రహితంగా ఇసుకను తవ్వితే పర్యావరణ సమతుల్యానికి భంగం వాటిల్లే అవకాశం ఉండటంతో ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ ఈ విషయంలో సీరియస్ గా ఉండటంతో ఈ చర్యలు తీసుకున్నాం. ఈ రోజు నుంచి ఎక్కడ ఇసుక అక్రమ రవాణా జరిగినా సంబంధిత అధికారులు భాధ్యత వహించాలి. ఇసుక అక్రమ రవాణాలో వసూళ్లకు పాల్పడిన ఒక హెూంగార్డు, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్‌లను సంబంధిత డీఏఆర్‌కు అటాచ్ చేయటం జరిగింది. తదుపరి చర్యలు పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా మీద ఉంటుంది. దీనిపై ఇప్పటికే రహస్య విచారణ జరుగుతున్నది. ఈ అక్రమ రవాణాలో స్థానికంగా చేసేవారు కాకుండా, ముఖ్యంగా అంతర్రాష్ట్రంగా చేసే ప్రధాన నిందితులను పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలి" అని ఎస్పీలను లను ఐజీ ఆదేశించారు. "పీడీఎస్ బియ్యం, ఇసుక అక్రమ రవాణా, గాంబ్లింగ్, మట్కా పూర్తిగా బంద్ కావాలి. గాంబ్లింగ్, మట్కా జరిగితే సంబంధిత పోలీసు అధికారులపై కఠిన చర్యలు తప్పవు. పేద, మధ్య తరగతి వ్యక్తులను దోపిడీ చేసే ఈ గాంబ్లింగ్ పట్ల ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉన్నది. మల్టీజోన్-2 లో గాంబ్లింగ్ వాసనే రాకూడదు. జిల్లాల్లో ఎక్కడ కూడా గాంబ్లింగ్ జరగకుండా చూసే బాధ్యత తొమ్మిది జిల్లాల ఎస్పీలదే" అని ఐజీ వివరించారు.

వికారాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ సస్పెండ్

ఒక బాలిక పై జరిగిన లైంగికదాడి కేసు లో అలసత్వం, దర్యాప్తులో అవకతవకలకు పాలుపడినందుకు వికారాబాద్ పట్టణ సీఐ ఎ. నాగరాజుపై వేటు పడింది. ఐజీ సత్యనారాయణ ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేశారు.

తల తాకట్టు పెట్టైనా

రైతు రుణం తీర్చుకుంటాం

త్వరలో రైతు భరోసా అమలుకు కృషి : వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల

- కేసీఆర్ గౌరవాన్ని కాపాడుకోవడం లేదు : మంత్రి పొన్నం ప్రభాకర్
- గజ్వేల్‌లో నూతన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం



నవతెలంగాణ-గజ్వేల్

రాష్ట్రంలో రైతు సంక్షేమానికి తల తాకట్టు పెట్టైనా నిధులు తీసుకొచ్చి, వారి రుణం తీర్చుకునేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తారని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో నూతన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ ప్రమాణ స్వీకారానికి మంత్రులు తుమ్మల, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ హాజరయ్యారు. ముందుగా ప్రజ్ఞాపూర్ నుంచి మార్కెట్ కమిటీ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి, బోనాలు, డప్పులతో మంత్రులకు ఘన స్వాగతం పలికారు.



అనంతరం నూతన పాలకవర్గం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో 28 లక్షల మంది రైతులకు రూ.18 వేల కోట్ల రుణమాఫీ చేశామని, మిగతావి త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. గత ప్రభుత్వం లక్ష రూపాయల రుణమాఫీకి ఏండ్లు పట్టిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం.. ప్రతి కుటుంబానికి రూ.2లక్షల రుణమాఫీ చేసేందుకు సంసిద్ధంగా ఉందని, ఈ విషయాన్ని సీఎం ఇప్పటికే ప్రకటించినట్టు గుర్తు చేశారు. దేశంలోనే వ్యవసాయ రంగంలో సిద్దిపేట జిల్లా అగ్రస్థానంలో ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుకుంటున్నదని, అందుకు రూ. 300 కోట్లతో వచ్చే ఏడాది ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. రైతు భరోసాను త్వరలోనే అందిస్తామని, ఇందుకు కసరత్తు జరుగుతున్నదని చెప్పారు. రాష్ట్రంలో రైతుల యాంత్రిక అవసరాలకు కావలసిన రూ600 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు.

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తాను గౌరవిస్తానని, ఆ గౌరవాన్ని కేసీఆర్ కాపాడుకోవడం లేదని అన్నారు. ఎంతో అనుభవం ఉన్న నేత రాష్ట్ర ప్రభుత్వానికి సూచనలు, సలహాలు ఇస్తారని ఆశించామని, కానీ మొత్తానికే కనిపించకుండా పోయారని తెలిపారు. రాష్ట్రంలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రూ.10 వేల కోట్లు నష్టపోగా, కేంద్రం రూ.400 కోట్లు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. రాష్ట్రం నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నా ఫలితం లేకపోయిందన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షులు నర్సారెడ్డి మాట్లాడుతూ.. ప్రతిపక్షనేతగా కేసీఆర్ ఉండాల్సింది వ్యవసాయ క్షేత్రంలో కాదని, ప్రజా క్షేత్రంలో అని హితవుపలికారు. గజ్వేల్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేసీఆర్ అందుబాటులో లేకపోవడం వల్ల పథకాల అమలు, సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే ఆయన ప్రజల్లోకి రావాలని, లేదంటే కనిపించడం లేదంటూ గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని తెలిపారు. నూతనంగా ఏర్పడిన మార్కెట్ కమిటీ పాలకవర్గాలు.. రైతు సంక్షేమానికి కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, డీసీసీబీ చైర్మెన్ చిట్టి దేవేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మెన్ నరేందర్ రెడ్డి, వైస్ చైర్మెన్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ చైర్మెన్ గాడిపల్లి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ఉద్యమం ఉధృతం

- దీక్షలో రైతు సంఘాల నాయకుల హెచ్చరిక

అమరావతి : విశాఖ స్టీలు ప్లాంటు ప్రైవేటీకరణను నిలిపివేయకపోతే ప్రజాఉద్యమం తీవ్రమవుతుందని రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. విశాఖ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రైతు సంఘాల ఆధ్వర్యాన గురువారం విజయవాడ ధర్నా చౌక్‌లో దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ 4,300 మంది కాంట్రాక్టు కార్మికులను తొలగించడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. కార్మికుల తిరుగుబాటు ఫలితంగా శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందనే భయంతో మరలా పాస్‌లు ఇచ్చారని పేర్కొన్నారు. ప్లాంట్ ప్రైవేటీకరణ కోసం ప్రభుత్వం తీసుకునే ఎటువంటి చర్యనైనా కార్మిక, కర్షక వర్గం తిప్పికొడుతుందని హెచ్చరించారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నరసింగరావు మాట్లాడుతూ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ఉత్తరాంధ్రలో ఉద్యమం తీవ్రరూపం దాల్చిందని అన్నారు.

సోనమ్ వాంగ్‌చుక్ విడుదల

- నిషేధాజ్ఞలు వెనక్కి
- కోర్టుకు విన్నవించిన కేంద్రం



న్యూఢిల్లీ : పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, ఆయన సహచరులను నిర్బంధం నుండి విడుదల చేసినట్లు కేంద్ర ప్రభుత్వం గురువారం వెల్లడించింది. ఇందుకు సంబంధించిన కేసులో విచారణ సందర్భంగా ఢిల్లీ హైకోర్టుకు ఈ విషయాన్ని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలియజేశారు. ఢిల్లీలోని వివిధ ప్రాంతాల ప్రజలు గుమిగూడడంపై, నిరసనలు తెలియచేయడంపై పోలీసులు విధించిన నిషేధాజ్ఞలను కూడా ఉపసంహరించినట్లు తెలిపారు. వాంగ్‌చుక్ ప్రభృతులను విడుదల చేయాలని, నిషేధాజ్ఞలను ఉపసంహరించాలని కోరుతూ దాఖలైన పిటిషన్లను చీఫ్ జస్టిస్ మన్మోహన్, జస్టిస్ తుషార్ రావుతో కూడిన బెంచ్ విచారిస్తోంది. రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో లడఖ్‌ను చేర్చాలని కోరుతూ రాజధానికి ప్రదర్శనగా వెళుతుండగా, వాంగ్‌చుక్‌తో పాటూ దాదాపు 120 మందిని ఢిల్లీ సరిహద్దుల్లో పోలీసులు సోమవారం రాత్రి అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. నెల రోజుల క్రితం లేహ్ నుండి ఢిల్లీ చలో పాదయాత్ర ప్రారంభమైంది. అయితే ఆయనను పోలీసులు నిర్బంధించారని, విడుదల చేసినట్టే చేసి మళ్లీ నిర్బంధించారంటూ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయనను విడుదల చేయాలని కోరుతూ ఈ పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే వాస్తవానికి పోలీసులు ఆయనను నిర్బంధించడం వాస్తవం కాదని, వారు బుధవారం రాజ్‌ఘాట్‌ను కూడా సందర్శించారని తుషార్ మెహతా అన్నారు. అక్కడ రెండు గంటల పాటు వున్నారని, కేంద్ర హోం శాఖలో కొన్ని మెమరాండాలు కూడా ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఆ తర్వాత వారు వెళ్ళిపోయారని మెహతా చెప్పారు. మెహతా వాదనతో పిటిషనర్ల తరపు న్యాయవాది ప్రశాంత్ భూషణ్ విభేదించారు. సోనమ్, ఆయన అనుచరులు జంతర్‌మంతర్ వరకు వెళ్లాలని అనుకున్నారని, కానీ పోలీసులు వారిని అడ్డుకున్నారని చెప్పారు. అక్కడికి వెళ్లకుండా వారిపై నిషేధం విధించారని చెప్పారు. వాంగ్‌చుక్‌ను ఇతరులతో కలవనివ్వకుండా విడిగా వుంచారని చెప్పారు. అయితే ఇదంతా తప్పుడు ప్రకటనలని మెహతా అభ్యంతరం వ్యక్తం చేశారు. వాంగ్‌చుక్, ఇతరుల విడుదలపై తుషార్ మెహతా ఇప్పటికే ఒక ప్రకటన చేశారని, వాంగ్‌చుక్ విడుదలయ్యారని జస్టిస్ మన్మోహన్ వ్యాఖ్యానించారు.

పోలీసు స్టేషన్‌లోకి చొరబడి ఆయుధాల లూటీ

- మణిపూర్‌లో కొనసాగుతున్న హింసాత్మక ఘటనలు

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు కొనసాగుతూనేవున్నాయి. రాజధాని ఇంఫాల్‌కు 79 కిలోమీటర్ల దూరంలో ఉక్రుల్ పట్టణంలో రెండు గ్రూపుల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలోనే ఒక గ్రూపునకు చెందిన అల్లరి మూక స్థానికంగా ఉండే పోలీసు స్టేషన్‌లోకి చొరబడి ఆయుధాలను లూటీ చేసిందని సంబంధిత అధికారులు గురువారం తెలిపారు. పట్టణంలోని వివాదాస్పద ప్రాంతాన్ని శుభ్రం చేయడంపై నాగా కమ్యూనిటీలోని రెండు గ్రూపుల మధ్య బుధవారం ఘర్షణ చెలరేగింది. దాంతో ఇరు గ్రూపుల మధ్య కాల్పులు కూడా చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ముగ్గురు మరణించారు. మరో 20 మంది పైగా గాయపడ్డారు. తాజా పరిణామాల నేపథ్యంలో ఆ ప్రాంతమంతటా అధికారులు నిషేధాజ్ఞలు విధించారు. మొబైల్ సేవలను నిలిపివేశారు. పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి అదనపు బలగాలను మోహరింపజేశారు. గతేడాది కాలంగా అల్లర్లు, హింస చెలరేగుతున్నా.. నాగా మెజారిటీ గల ప్రాంతంలో ఇలా పోలీసు స్టేషన్‌పై దాడి చేయడం ఇదే తొలిసారి అని పోలీసులు తెలిపారు.

పిడుగుపాటుకు నలుగురు మృతి

యంత్రాంగం : వేర్వేరు జిల్లాల్లో పిడుగులు పడి నలుగురు ప్రాణాలు కోల్పోయారు. కడప జిల్లాలో ముగ్గురు, బాపట్ల జిల్లాలో ఓ విద్యార్థిని మరణించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కడప జిల్లా పెండ్లిమర్రి మండలం తుమ్మలూరుకు చెందిన నందిరెడ్డి శివపార్వతి (30), ఆమె మరిది కుమారుడు నందిరెడ్డి తేజేశ్వర్‌రెడ్డి(10) తమ పశువులను మేపేందుకు గ్రామ పరిసరాలకు వెళ్లారు. అదే గ్రామంలో పగడాలపల్లి గ్రామానికి చెందిన జి మారుతి ప్రసాద్‌రెడ్డి (30), నాగాయపల్లెకు చెందిన కర్నాటి నరేష్ కుమార్‌రెడ్డి కూడా తుమ్మలూరులో వ్యవసాయ పనులకు వచ్చారు. గురువారం సాయంత్రం భారీ వర్షంతోపాటు పిడుగు పడటంతో శివపార్వతి, తేజేశ్వర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందారు. నరేష్ కుమార్‌రెడ్డి తీవ్రంగా గాయపడటంతో, సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. బాపట్ల నగరంలోని నరాలశెట్టివారిపాలేనికి చెందిన నూతక్కి తులసి (20) బాపట్ల ఎన్‌టిఆర్ ఫుడ్ టెక్నాలజీ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. దసరా సెలవులకు చీరాలలోని అమ్మమ్మ ఇంటి వచ్చిన ఆమె ఆరేసిన దుస్తులు తెచ్చేందుకు డాబాపైకి వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడడంతో అక్కడికక్కడే మరణించారు.

మారిషస్‌కు చాగోస్ దీవులను అప్పగించిన బ్రిటన్

లండన్ : చాగోస్ దీవుల సార్వభౌమాధికారాన్ని మారిషస్‌కు అప్పగిస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. దశాబ్దాల క్రితం నిర్వాసితులైన ప్రజలు తిరిగి వారి ఇళ్లకు రావడాన్ని అనుమతించేందుకు కుదిరిన ఒప్పందం మేరకు ఈ ప్రకటన వెలువడింది. అయితే డిగో గార్షియాలో బ్రిటీష్-యుఎస్ మిలటరీ స్థావరాన్ని వినియోగించుకునే హక్కును బ్రిటన్ తన వద్దే అట్టిపెట్టుకుంది. అమెరికాతో కలిసి సంయుక్తంగా నిర్వహించే ఈ వ్యూహాత్మకమైన సైనిక స్థావరం డిగో గార్షియాను ఈ ఒప్పందం పరిరక్షిస్తోందని బ్రిటన్ గురువారం తెలిపింది. డిగో గార్షియా మిలటరీ బేస్ దీర్ఘకాలిక కార్యకలాపాలు ముప్పును ఎదుర్కొనే పరిస్థితి నెలకొన్న నేపథ్యంలో నేడు కుదుర్చుకున్న ఒప్పందం, కీలకమైన సైనిక స్థావరం భవితవ్యానికి హామీ కల్పించిందని బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ ఒక ప్రకటనలో తెలిపారు.

ఈశా ఫౌండేషన్‌పై దర్యాప్తు ఆపండి

- మద్రాస్ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే

న్యూఢిల్లీ : మహిళలు సన్యాసం తీసుకునేలా ప్రేరేపిస్తున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటోన్న ఈశా ఫౌండేషన్ తాజాగా సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఫౌండేషన్‌పై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలను సమర్పించాలని తమిళనాడు పోలీసుల్ని మద్రాసు హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కింది. దీనిపై తాజాగా కోర్టులో విచారణ జరిగింది. హైకోర్టు ఆదేశాలను అనుసరించి ఫౌండేషన్‌పై తదుపరి చర్యలు తీసుకోవద్దని సుప్రీం ధర్మాసనం గురువారం తమిళనాడు పోలీసులను ఆదేశించింది. అలాగే ఆ స్టేటస్ రిపోర్టు వివరాలను తమకు సమర్పించాలని వెల్లడించింది. ఇక ఈ వ్యవహారంపై ఇద్దరు యువతుల తండ్రి దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌ను హైకోర్టు నుంచి సుప్రీం ధర్మాసనం ముందుకు బదిలీ చేసింది.

కాశ్మీర్‌లో 63.45 శాతం పోలింగ్



శ్రీనగర్ : మూడు దశల్లో కలిపి జమ్మూకశ్మీర్ శాసనసభ ఎన్నికల్లో 63.45 శాతం ఓట్లు పోలయ్యాయని, ఇది ఇటీవల లోక్‌సభ ఎన్నికల కంటే ఎక్కువని కేంద్ర ఎన్నికల సంఘం (ఇసిఐ) వెల్లడించింది. మంగళవారం నాటి తుది దశ పోలింగ్‌లో సుమారు 69.65 శాతం మంది ఓటర్లు తమ హక్కును వినియోగించుకున్నారని, వీరిలో గత 75 ఏళ్లుగా ఓటు హక్కులేనివారు కూడా ఉన్నారని ఇసి ఒక ప్రకటనలో పేర్కొంది.